# మార్కండేయ ఉపాఖ్యానము

---

మాస్టర్ కె. పార్వతీకుమార్ గారి ప్రవచనములు

గురుపూర్ణిమ, జూలై 11 – 13, 2014

భాగ్యనగరం

# మార్కండేయ ఉపాఖ్యానము

## July 11, 2014 ఉదయం – ప్రవచనం #1

శ్రీ గురుభ్యోనమః. భాగ్యనగరము, జగద్గురుపీఠం కేంద్రం, తెలంగాణా రాష్ట్రం, జయ నామ సంవత్సరము, దక్షిణాయన గురుపూర్ణిమా సందర్భంగా ప్రతి సంవత్సరం వలనే ఈ సంవత్సరం కూడా ఇనుమడించిన ఉత్సాహంతో జగద్గురుపీఠం భాగ్యనగర బృందం కార్యక్రమాలు నిర్వర్తించడానికి సంసిద్ధులై, నడుం కట్టుకుని ఉన్నారు. పొద్దుటి నుంచి చూస్తే అందరూ చాలా కార్యదీక్షాపరులుగా కనిపిస్తున్నారు. ఎవ్వరూ అంత పెద్ద relaxed గా అనిపించడం లేదు. అమ్మో! గురువుగారు చాలా ready గా ఉన్నారు, మనదే ఆలస్యం! అంచేత, ఈ గురుపూర్ణిమా సాంప్రదాయం నిజానికి మనం వాస్తవంగా చెప్పుకోవాలంటే, మనం గురుపూజలు చాలా చేసుకుంటూనే వచ్చాంగాని గురుపూర్ణిమా సందర్భంగా గురుపూజలు అనేటటువంటిది ఈ రమణీ–గోపాల్ దంపతి వాళ్ళ మూలంగా మొదలయ్యింది ఇది. ఏదో మా ఊళ్ళో గురుపూర్ణిమనాడు హోమం చేసుకునేవాళ్ళం, మంచి మాటలు చెప్పుకునేవాళ్ళం. క్రమంగా వీళ్ళు హైదరాబాద్ నుంచి రావడం మొదలుపెట్టారు. ఆ తర్వాత విజయవాడ నుంచి, హైదరాబాద్ నుంచి రావడం మొదలుపెట్టారు. ఇదేదో చాలా పెద్దదయిపోతోంది, అంచేత హైదరాబాదులో దీన్ని గురుపూర్ణిమగా ఒక గురుపూజలుగా ఏర్పాటు చేసుకుందాం, సనాతనమైన సాంప్రదాయం అనేటటువంటి భావంతో ఇక్కడ ఏర్పాటు చేసాం. ఏర్పాటు చేస్తే, సోదరులు, ఆత్మీయులు సుబ్బారావు గారు మేముకూడా ఇందులో కలిసిపోతాము, మళ్ళీ వెంటనే ఆగస్టు 4 గురుపూజలు, మళ్ళీ ఆగస్టు 11 గురుపూజలు కాకుండా ఇందులో చేరిపోతాము అన్నారు. అదీ గురుమహత్యం. సద్గురువు అన్నిటిని కలుపుకుపోయేటటువంటివాడు కదా! రెండు, మూడుసార్లు చూసారు నాయొక్క తిప్పలు వాళ్ళు. పాపం దీనికీ వచ్చి... అప్పుడు మరీ గురుపూర్ణిమ జూలై ౩౦ అలా వస్తుండేది. ఇలా వెళ్ళి, మళ్ళా అలా వస్తుంటే ఆగస్టు 4 కి, పాపం ఈ బ్రాహ్మణుడిని ఇబ్బంది పెట్టకూడదని అనుకున్నారో ఏమిటో మొత్తానికి తెచ్చి అన్నీ కలిపి ఇందులో మనం చక్కగా గురుపూజలు చేసుకుంటున్నాము గురుపూర్ణిమ సందర్భంగా.

గురుపూర్ణిమ అత్యంత ప్రధానమైనటువంటి పూర్ణిమ మనకి దక్షిణాయనంలో. ప్రతి పూర్ణిమకి ఒక ప్రత్యేకత ఉన్నప్పటికీ ఇది మరి గురుపూర్ణిమ కదా! సద్గురువు మార్గాన్ని అనుసరించి నడిచేటటువంటి వారికి గురుపూర్ణిమకన్నా మించినటువంటి మాసం మరొకటి కనపడదు. అంచేత, అలాంటి గురుపూర్ణిమనాడు చక్కగా అన్నీ అలంకారం చేసుకుని... గురుపూజలంటే మనకందరికీ తెలుసు, ఒక్కొక్కరికి ఒక్కొక్క రోజున మొదలయిపోతాయి గురుపూజలు. అది ఎప్పటి నుంచి మొదలవుతుందంటే, ఆ క్రింద చూడండి వరసగా పెట్టారు. ఆ వెనకాల ఉన్నవాళ్ళకి తెలియదు, తర్వాత ఎప్పుడయినా వచ్చి చూడండి. వరసగా కృష్ణుడు బొమ్మలు పెట్టి, వాటిన్నటినీ రకరకాల సన్నివేశాలు ఏర్పాటుచేసి, ఆ చివర నుంచి ఈ చివర వరకూ, మధ్యలోనేమో ఖాళీగా “*ఫణిమాణిక్య రంజిత శ్రీ పదాంబుజ దామోదరో*” అని మనకి ఉందిగా అలా పెట్టారు. బొమ్మలన్నీ బావున్నాయి. బహుశా అవన్నీ నిర్మల్ బొమ్మలయి ఉంటాయి. అలా ఏర్పాటు చేసారు.

వెనకాల ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా వాళ్ళ మనసులో భావించే పద్ధతుల్లో మన సద్గురువు పరంపరను ఏర్పాటు చేస్తుంటారు కదా! అంటే, ఎప్పుడూ కూడా కొంత పాత, కొంత కొత్త కలిసి ఉంటే బావుంటుంది. ఎప్పుడూ పాతగానే ఉందనుకోండి, బావుండదు. అలాగే, పాతదంతా తీసేసి కొత్తది పెట్టారనుకోండి, బావుండదు. ఎంచేత అంటే, ఓ మెట్టెక్కి అక్కడి నుంచి ఇంకో మెట్టెక్కే లోపల, ఈ మెట్టు మీద ఒక కాలు ఉంటుంది కదా! ఈ మెట్టు మీద కాలు ఆ మెట్టు మీద పెడతాం.

క్రమంగా జీవుడు కూడా ఆ విధంగానే స్వభావపరంగా వృద్ధి చెందుతూ ఉంటాడు సంవత్సరం, సంవత్సరం సాధన చేస్తూ ఉంటే. సాధన వల్ల ఉపయోగమేమిటయ్యా అంటే, క్రమంగా స్వభావం చక్కగా మార్పు చెంది, అది పశు స్వభావం నుంచి మానవ స్వభావానికి, మానవ స్వభావం నుంచి దైవీ స్వభావానికి చక్కాగా పరిణితి చెంది, సంస్కరింపబడి, మానవుడు దైవీ స్వభావంలో ఉన్నప్పుడు ఈ సృష్టిని పరిపూర్ణంగా అనుభవించగలడు. దైవీ స్వభావం కలిగినటువంటి మానవునికున్న పరిపూర్ణ ఆనందము పై లోకాల్లో వాళ్లకి కూడా లేదు. అంచేత, పుడితే మానవుడై పుట్టాలని అనుకుంటూ ఉంటారు వాళ్ళందరూ. ఎంచేతంటే, అన్ని లోకాల్లో ఉండేటి అనుభూతిని పొందగలిగేటటువంటివాడు మానవుడు. కేవలం పై లోకాల అనుభూతి ఉండేటటువంటి వాళ్ళు దేవతలు. భౌతిక లోకాల అనుభూతి వాళ్లకి ఉండదు. మనం నేల అంటీ ఉంటాం, ఆకాశం దాటీ ఉంటాం. అంతవరకూ అవకాశం ఉంది. ఎంచేతంటే, ఈ ఏడు లోకాల సృష్టి మానవుని యందు ఏర్పాటు చేసి ఉంచారు. కాబట్టి మానవుడు పరిపూర్ణ మానవుడైనాడు. సృష్టిలో మానవుడు పరిపూర్ణుడు, మానవ శరీర నిర్మాణం పరిపూర్ణం. అందులో జీవుడి ప్రవేశం అదృష్టం. మానవ శరీరంలో ప్రవేశించడం అనేటటువంటిది జీవుడు చేసినటువంటి నిర్ణయం కాదు. ప్రకృతి చేసినటువంటి నిర్ణయం, వీడికి ఇలాంటిది ఒకటి ఇచ్చి చూద్దాం అని, ఎలా దీన్ని వినియోగం చేసుకుంటాడో చూద్దాం అని.

మన వినియోగం చక్కగా సవ్యంగా సాగుతుంటే క్రమంగా లోపలి ధాతువుల్లో రావలిసినటువంటి మార్పులన్నీ వస్తుంటాయి. లేదంటే మనిషిగా ఉన్నప్పటికీ మనిషి కాకపోవచ్చు. ఇప్పుడు మనలో రాక్షసులుంటాము కదా! వాళ్ళంతా మనుషులే కదా! ఇప్పుడు రావణాసురుడైనా, ఇంకోడైనా, మరొకడయినా అసురులందరూ మానవులే. స్వభావం రాక్షస స్వభావం వచ్చేసింది. వాళ్ళకేం కోరలవీ విడిగా ఉండవు సినిమాల్లో చూపించినట్టుగా. మానవుల నుంచే పుట్టుకొచ్చాయి అన్నీ. కశ్యప ప్రజాపతి నుంచి అదితి ద్వారా, దితి ద్వారా, వినతి ద్వారా, కద్రువ ద్వారా రకరకాలుగా పుట్టుకొచ్చారు, స్వభావాలబట్టీ అవన్నీ. కొంతమంది స్వభావం చాలా తేలికగా, ఆకాశంలో ఎగిరేటట్టుగా పుట్టారు. వాళ్ళూ మానవులే! వాటన్నిటినీ పక్షులన్నారు. అట్లాగే పాక్కుంటూ, కలుగుల్లో దూరిపోయి, విషం కక్కుతూ, అందరినీ నానాబాధా పెడుతూ ఉండేటటువంటి రూపంలో కూడా మానవులే ఉన్నారు. అలాగే అందరినీ హింసించే రాక్షస స్వభావం కలిగినవారున్నారు. అందరినీ ఉద్ధరించే దైవీ స్వభావం కలిగినవాళ్ళున్నారు. అందరికీ మూలపురుషుడు కశ్యపుడే. కశ్యప ప్రజాపతి నుంచే మానవులందరూ వచ్చారు. మానవులలో వారి వారి స్వభావాలుబట్టి వారి వారి రూపాలు రావడం మొదలుపెట్టాయి. వికృతమైన రూపాలు కూడా వచ్చేస్తుంటాయి కదా! అట్లా ఒకే మానవుడు ఇన్ని రకాలుగా వైవిధ్యం చెందాడు. అందుకని, మన శాస్త్రాలు ఏం చెప్తున్నాయంటే మనిషి నుంచే అన్నీ వచ్చాయని చెప్తూ ఉంటారు. అంచేత, ఇట్లా కోతి నుంచి మనిషి

వచ్చాడు, ఈ సిద్ధాంతాలన్నీ ఇంక ముందుముందు పోతాయి. కోతి నుంచి మనిషి రాలేదు. మనిషి నుంచి కోతులు వచ్చాయి. కోతి బుద్ధి కలిగిన మనుషులు చాలా మంది ఉన్నారు కదా! క్రమంగా వాళ్ళు కోతి రూపం దాలుస్తారు పై జన్మలో. అంతకన్నా ఏం లేదు. బాగా విష స్వభావం కలిగి ఉన్నాడనుకోండి, తదనుగుణమైనటువంటి రూపం అట్లా వస్తూ ఉంటుందన్నమాట. ఇది మనకి గుప్తవిద్య చెప్పేటటువంటి రహస్యం. అందరినీ మానవులుగా సృష్టించినప్పటికీ వారి వారి స్వభావంలో ఉండే వైపరీత్యం బట్టి వారి వారికి వేరువేరు దేహాలు క్రమంగా ఏర్పరుచుకున్నారు.

అంచేత, ఈ మానవ రూపం ఉన్నదే, ఇందులో సమస్త దేవతలు ఉన్నాయి, సమస్త లోకాలు ఉన్నాయి, అంతరిక్ష దేవతలు ఉన్నారు. ఇందులో ప్రజాపతులు ఉన్నారు, ద్వాదశ ఆదిత్యులు ఉన్నారు, ఏకాదశ రుద్రులు ఉన్నారు. ఈ గణపతి ఉన్నాడు, మనం పూజ చేసాం కదా! దత్తాత్రేయుడు ఉన్నాడు. అందరినీ లోపల దర్శనం చేసేటట్టుగా ఒకటి ఏర్పాటు చేసారు. అన్నిటికీ మించి అమ్మవారి స్తోత్రం చేసాం కదా! అన్ని లోకాలు చూపించేస్తుంది లోపల. మనలో ఉండేటటువంటి మూల ప్రకృతి నుండి మనలో ఉండేటటువంటి స్థూల ప్రకృతి వరకూ తొమ్మిది రకాల ప్రకృతి, తదనుగుణమైనటువంటి స్వభావమును మనకి పరిచయం చేసేటట్టుగా ఏర్పరిచి ఉంచారు మానవ శరీరంలో.

అంచేత, ఈ మానవ రూపంలో జీవుడు... జీవుడంటే అతడిని నరుడు అంటారు. నరుడంటే నశించని వాడని అర్థం. మాములుగా వాడేసే పదాలకి, అసలు అవి ఎందుకు వచ్చినాయి, వాటి అర్థం ఏమిటో తెలుసుకోవాలి. మానవుడు, జీవుడు ఒకటి కాదు. మానవుడుగా రూపంలో జీవుడున్నాడన్నమాట. అందరూ జీవులే. జీవులందరూ నరులే. అంటే నశించనివారని అర్థం. ఈ నశించనవి ఏమయితే ఉన్నాయో ప్రజ్ఞలు, ఆ ప్రజ్ఞలు మానవ శరీరం అనే దాంట్లో ఉన్నప్పుడు వారిని మానవులు అంటారు. ఈ మానవ స్వభావం మనకి రకరకాలుగా ఏర్పడుతూ ఉంటుంది. అది రకరకాలుగా ఏర్పడడంవల్ల నష్టం ఏమిటి అంటే, నష్టం ఏంలేదు. వారి వారి స్వభావమే వారిని బాధ పెడుతూ ఉంటుంది. ఆ సృష్టిలో ఎవరూ ఎవరినీ అంత బాధ పెట్టడానికి అవకాశం లేదట. వారి వారి స్వభావమే వారిని బాధ పెడుతూ ఉంటుంది. కొంతమంది ఉంటారు, లోకాన్నే మింగేసేటటువంటి పద్ధతుల్లో ఉండేటటువంటి వాళ్ళని మన పురాణాల్లో చెప్పినట్టుగా అసురులు అంటారు. వాళ్ళందరూ మొత్తం లోకాన్నంతా బాధ పెడుతూ ఉంటారు. అది అలా ఉండగా, ప్రతి మనిషి తనకు కలిగేటటువంటి సుఖదుఃఖములు, కష్టనష్టములు, సౌకర్యాసౌకర్యములు, అన్నీ కూడా వాడి భావమయ లోకంలో ఉంటాయి. ఎలా భావన చేస్తే ఆనందగా ఉంటుంది, ఎలా భావన చేస్తే ఆనందంగా ఉండదు, ఏ ఏ భావనలను నిర్వర్తించడం వల్ల ఆనందం కలుగుతుంది, ఏ ఏ భావనలను నిర్వర్తించడం వల్ల దుఃఖములు కలుగుతూ ఉంటాయి, ఇలా ఎలా వాడుకుంటాడు అన్న దానిమీద మొత్తం కథంతా ఉంది. మానవ శరీరానికి మనస్సు, ఇంద్రియములు, శరీరం అని మూడు ఉన్నాయి. ఆ మూడింటిని ఎంత సవ్యంగా వాడుకుంటే... ఇది కాక వాక్కు ఒకటుంది. వీటిని చక్కగా నిర్వర్తించుకోవడంలోంచి ఆనందం వస్తుంది. చక్కగా నిర్వర్తించుకోలేదనుకోండి అంత ఆనందం ఉండదు. ఇప్పుడు పొద్దున్నే మనకి ఉప్మా పెట్టారు, పొంగలి పెట్టారు, ఇడ్లీ పెట్టారు, సాంబార్ ఇచ్చారు. ఇవన్నీ తినేసి మనం ఇక్కడికొచ్చి లలితా సహస్రనామం చేసామనుకోండి, మనం తిన్న మోతాదు బట్టి మనకి నిద్ర రావడం, ఇటువంటివన్నీ ఉంటాయి. చదువుతుంటే మత్తుగా ఉండడం, నిద్ర పోవడం. చాలామంది నిద్ర పోయినట్టుగా అనిపించింది, పోకపోయి ఉండొచ్చు.

ఇలా నిద్ర ఎందుకు వస్తుందండీ? ఎక్కువ తినడం వల్ల కదా! తినవలిసినదే తిన్నామనుకోండి అంత నిద్ర రాదు. ఇలా రకరకాలుగా మనయొక్క ప్రవర్తన బట్టి మనకుండేటటువంటి అనుభూతి ఉంటుంది.

ఎంతసేపూ ఈ శరీరంలోంచి ఎప్పుడు వెళ్ళిపోదామా అనుకోకూడదు. ఈ గురుపూజలకి ఇప్పుడు వచ్చామనుకోండి. ఇక్కడి నుంచి మొదలుపెట్టి ప్రతి గంటా చూసుకుంటున్నామనుకోండి, ఎప్పుడు వస్తుందా ఆదివారం మధ్యాహ్నం అని, ఇంక రావడం ఎందుకు? రావక్కర్లేదు కదా! అంటే, ఇవ్వాళ్ళ రాత్రి పడుకోవాలి, రేపు రాత్రి పడుకోవాలి, అంటే రెండు రోజులు పొద్దున్నే లేవాలి, ఇలాంటివన్నీ ఉన్నాయి కదా! ఈ మన ఊరు వెళ్ళే బండి ఎక్కేంతవరకూ ఒక రకమైన ఆదుర్దా ఉందనుకోండి, అట్లా ఈ జీవితం ఎప్పుడయిపోతుంది, ఎంత తొందరగా ఈ శరీరం వదిలేస్తాం అనుకోకూడదట. అలా అనుకుంటే, ఈ శరీరం ఎందుకురా ఇవ్వడం, కదా! ఏదయినా ఒక సౌకర్యం ఇచ్చి, దీన్ని చక్కగా నూరేళ్ళు వాడుకోరా అంటే, నూరేళ్ళు వాడుకుని దాంట్లోంచి పొందవలసిన అనుభూతి పొందడానికి ప్రయత్నం చెయ్యాలి తప్ప, ఇందులోంచి ఎప్పుడు బయటపడిపోదామా అనేటటువంటి పద్ధతుల్లో ఉంటే ప్రవేశించడమే అవసరం లేదు. ప్రవేశించిన తర్వాత దాని సారమంతా అనుభూతి చెంది, అటుపైన పరిపూర్ణమైనటువంటి పద్ధతుల్లో, "*త్రయంబకం... పుష్టి వర్ధనమ్... ఉర్వారుకమివ బంధనాన్*". బాగా పుష్టి కలిగిన తర్వాత, ఇంక చాలు, ఏ విషయంలోనైనా పొందవలసినవన్నీ నేను పొందాను. అంటే, అన్ని విషయాల్లో కూడా ఒక స్థాయి. కేవలం ఇంద్రియ సుఖములే కాదు, మనో సంబధమైనటువంటి భావములు, జ్ఞానపరమైనటువంటి భావములు, విజ్ఞాన పరమైనటువంటి విషయములు, మొత్తం జాతికంతా వినియోగపడేటట్టుగా నిన్ను నువ్వు తీర్చిదిద్దుకో.

మహాత్ములందరూ కూడా మొత్తం మానవజాతికే పరిపూర్ణంగా సేవ చేసి... ఓహో! మానవ శరీరంలో ఇంత అవకాశం ఉంది కాబట్టి, నేను అటుపైన ఈ శరీరాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు ధరించేటటువంటి స్వచ్ఛంద మరణాన్ని కోరుకుంటూ, మళ్ళీ స్వచ్ఛందంగా దేహంలోకి, మానవ రూపంలోకి రావడానికి కూడా నేను నిర్ణయం చేసుకుంటాను అనే పద్ధతుల్లో, ఆ విధంగా ఎదిగి, ఇట్లా శాశ్వతంగా సృష్టిలో మానవులకు సహాయం చేస్తూ, సృష్టికి సాయం చేస్తున్న వాళ్ళందరినీ మనం ఋషులుగా రోజూ ప్రార్థన చేసుకుంటూ ఉంటాం. ఎవరయ్యా ఋషులు అంటే మానవ శరీరంలో ఈ భూమి మీద ఉన్నటువంటి వారు. అందరూ కూడా భూమి మీద మానవ శరీరంలో ఉన్నారు. ఎందుకున్నారంటే అది ఒక మహదవకాశం కాబట్టి. అది అవకాశంగా తీసుకుని వాళ్లు అనేకానేక రకములుగా, అనేకానేక విధములుగా, అనేకానేకమైన ప్రదేశములలో జీవులకు స్ఫూర్తి ఇస్తూ ఉంటారు. మానవులని స్ఫూర్తినిచ్చి మంచి మార్గంలో నడిపించి... మంచి మార్గం అంటే వారికి శాశ్వతమైనటువంటి ఆనందం కలిగించేటటువంటి మార్గం మంచి మార్గం. ప్రతి వాళ్ళూ వాళ్ళు అనుకునే మంచి ఒకటుంటుంది. అది ఎక్కువసేపు బావుండదు ఆ మంచి. ఇప్పుడు కుర్చీ మా ఇంట్లో బానే ఉందండి. ఎంతసేపు కూర్చుంటావు ఆ కుర్చీలో? కూర్చోలేవు కదా! ట్రైన్లో బెర్త్ బావుందంటే, ఎంతసేపు ఉంటావు బెర్తులో? ఎంతసేపయినా ఉండగలినటువంటి ఒక స్థితి నీకు రావాలి కదా ఏ విషయంలోనైనా! అలాంటిదేది? అది ఇంద్రియాల ద్వారా లభించదు. ఇంద్రియాల ద్వారా లభించే తృప్తి త్వరగా వస్తుంది, త్వరగా పోతుంది. ఇప్పుడు అన్నం తిన్నాం, అప్పటికది తృప్తి. మళ్ళీ నాలుగు గంటల్లో మళ్ళీ వచ్చేస్తుంది. అప్పటికి మళ్ళీ తృప్తి. మళ్ళీ నాలుగు గంటల్లో మళ్ళీ

తింటాము కదా! తృప్తి! ఇప్పుడు పడుకుంటే తృప్తిగా ఉంటుందా? ఎన్ని గంటలు పడుకోగలవో చూడు. పడుకోలేవు. దేనివల్ల శాశ్వతమైన తృప్తి ఉంటుంది, దేనివల్ల శాశ్వతమైన తృప్తి ఏర్పడుతుంది, దేనివల్ల తాత్కాలికమైన తృప్తి ఏర్పడుతుంది అనేది గమనించి ఋషులు ఈ శాశ్వతమైన తృప్తి కలిగించేటట్టుగా... అంటే ఈ ఏడు లోకాల అనుభూతి తను నిత్యం పొందుతూ, తనకంటూ ఏమీ అవసరం లేనటువంటి ఒక స్థితి తనకి ఏర్పడిందనుకోండి, అమ్మా! ఇది చాలా బావుంది అనుకున్నారు. దానినే ఏం చెప్పారంటే బ్రహ్మానందము అని చెప్పారు. అంటే బ్రహ్మమును స్పృశించి, బ్రహ్మమునందు ప్రవేశించి, బ్రహ్మము తానే అయినప్పుడు తనకి కలిగేటటువంటి ఆనందాన్ని పరిపూర్ణమైన ఆనందంగా చెప్పారు. అంతవరకూ ఎవరూ తృప్తి చెందరు. ఋషులందరూ రాజ ఋషులు అవుతారట. రాజ ఋషులందరూ మహర్షులు అవుతారట. మహర్షులందరూ బ్రహ్మర్షులు అవ్వాలనుకుంటారట. బ్రహ్మర్షి అయితే తప్ప విశ్వామిత్రుడంతటివాడు తృప్తి చెందలేదు. వసిష్ఠ మహర్షిని చూసి ఇలా ఉండాలి మనం జీవితంలో అనుకున్నాడాయన. ఎంచేత అంటే, ఆయనికి లేనిదంటూ లేదు, మహాతృప్తిగా ఉంటాడు. కథ మీకు తెలిసే ఉంటుంది, విశ్వామిత్రుడు వసిష్ఠుడుల మధ్య, ఈ విశ్వామిత్రుడు ఏ విధంగా పరిపూర్ణత సాధించడానికి తపస్సు చేసి సాధించి బ్రహ్మర్షి అయ్యాడో. అలా చాలామంది బ్రహ్మర్షులుగా ఉన్నారు. మనం చదువుకుంటూ ఉంటాము వాళ్ళ గురించి – అగస్త్య మహర్షి, వశిష్ఠ మహర్షి, గౌతమ మహర్షి, వీరందరినీ ప్రధానంగా బ్రహ్మర్షులుగా చెప్పారు. వీరందరూ సృష్టిలో పరిణితి చెందినవారిగా ఉండడమే కాకుండా, మార్గ దర్శకులుగా ఉండడమే కాకుండా, సద్గురువులై జీవులకు మార్గాన్ని చూపించే వారిగా ఉన్నారు. వారందరూ మనకు ఆదర్శం.

అంచేత, ఈ గురుపూర్ణిమనాడు, గురుపూర్ణిమనాడంటే మాములుగా పరిణితి పెరగకపోతే, మన గురువుగారని ఒకటి పెట్టుకుని కూర్చుంటాము, ఇంతకన్నా ఏమీ లేదు, ఇదే అంతా అంటూ కదా! ఆయనకీ ఎవరిచ్చారు జ్ఞానం? ఎవరివల్ల ఆయన సద్గురువు అయ్యారు? ఆయన ఎవరి వల్ల అయ్యారు? ఆయన ఎవరి వల్ల అయ్యారు? అందుకనే "*గురుభ్యో నమః, పరమ గురుభ్యో నమః, పరమేష్ఠి గురుభ్యో నమః, సప్తర్షి గురుభ్యో నమః*". ఈ సప్త ఋషులనేటటువంటివారు ఈ సృష్టి ఆది నుంచీ వాళ్ళు బ్రహ్మర్షులే. సప్తర్షులకన్నా ఇంకా పైన ఉన్నారు. ఎవరు? సనకసనందాదులు, మానస పుత్రులు. పూర్వ కల్పంలోనే వాళ్ళంతా బ్రహ్మర్షులు. నారదుడు, ఇలాంటి వారందరూ ఎంతమంది భూమి మీద ఉన్నారో మనం గుర్తిస్తే మనకి చాలా ఆనందం కలుగుతుంది. అంతేకాదు, వాళ్ళందరూ కూడా కేవలం మన స్మరణ మాత్రచేత మనకి సాన్నిధ్యం ఇచ్చేటటువంటివాళ్ళు. అలాంటి వాళ్ళ ఆశ్రయంలో మనం జీవితం నిత్యం గడుపుతున్నామనుకోండి, వారి ఆశ్రయంలో జీవితం గడుపుతుంటే, మన భావనలో వారెప్పుడూ ఉంటే, వారి ఆశ్రయంలో మనమున్నట్టే. సద్గురువుని గూర్చిన భావన మన జీవితంలో వెంటాడుతూ ఉందనుకోండి, మనం ఏం పని చేసినా మన గురువుగారు గుర్తు ఉన్నారనుకోండి. ఇప్పుడు అట్లాగేగా తయారు చేసుకుంటున్నాం జీవితాలు? ఎంచేత అంటే, ఎన్నో కార్యక్రమాలు, ఎన్నోసార్లు కలుస్తూ ఉంటాం. అంచేత, అన్నిట్లోనూ దీన్నే చూడు అని చెప్తూ ఉంటాడు. సద్గురువు ఎవరయినా అదే చెప్పాలి. ఇంకోటి చెప్పడానికి లేదు. కొన్నిట్లో చూడు, కొన్నిట్లో వద్దని చెప్పలేడు సద్గురువు. ఎందుకంటే అంతటా వ్యాప్తి చెందిన తత్త్వం. అన్నిట్లోనూ నేను అనే తత్వాన్ని దర్శనం చేస్తూ ఉండు అని చెప్తాడు

సద్గురువు. ఇలా చెప్తున్నప్పుడు మన నిత్య జీవితంలో మనం ఏం చూసినా అదే మనకి గుర్తు రావాలి కదా! అదే కదా సాధన! సన్నివేశం ఏదయినా గుర్తు రావలసినది ఒకటే, అదే ఇది అని. అదే ఇదిగా ఉంది. ఇది అదే అని గుర్తు రావాలి. ఇలా గుర్తు వస్తే అది సాధన అండి. ఇలా గుర్తు రాకపోతే, పొద్దున్నా సాయంత్రం కాసేపు గుడుగుడు మనపించేది సాధన కాదు. అంచేత, అట్లా ఎంత నీకు గుర్తు వస్తోంది పొద్దున్నుంచి సాయంత్రం పడుకునేంతవరకూ? ఒకోక్క రోజు ఒకొక్క రకంగా గడుస్తూ ఉంటుంది కదా! అప్పుడూ గురుపూజలు. ఇలా సాధన చేసుకునేటటువంటి వారందరూ ఇక్కడ చేరి, ఒక్కసారి మనకి ఎంత గుర్తు వచ్చింది ఇంత కాలం? ఇంకా వారినీ వీరినీ చూస్తూ ఉంటే మనం నేర్చుకోవాలిసినది ఇంకా ఉంది అని తెలిస్తే నేర్చుకుంటాము. లేదూ, అందరం కలిసి సరదాగా ఇక్కడ ఒక సాన్నిధ్యంలో ఉండడానికి ప్రయత్నం చెయ్యవచ్చు. ఇలాంటివి మనం చేస్తూ ఉంటే ఏం జరుగుతుందంటే సంవత్సరం అంతా ఎదో రకంగా సద్గురువు సాన్నిధ్యంలో గడిచిపోవడం అనేది ఒకటి జీవితంలో భాగమైపోతుంది. ఇప్పుడు చూడండి, ఇప్పుడుండే బృందాలలో, మన బృందంలో వాళ్ళు చాలా కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. అది వారంవారం ఉంటాయి, నెలనెలా ఉంటాయి, సంవత్సరం అంతా ఉంటాయి. అసలీ calendar పేజీలు ఇట్లా గిరగిరా తిరిగిపోతున్నట్టు ఉంటుంది. ఎట్లా గుడుస్తుందిరా భగవంతుడా జీవితం అనేటటువంటి పరిస్థితి ఉండదు కదా! అంటే ఏం జరుగుతుందంటే, ఒక సద్గురువు అనేటటువంటి ఒక భావన, అతను ఇచ్చిన మార్గాన్ని అనుసరించేటటువంటి ఒక ప్రయత్నం, అందులో మనం జీవిస్తున్నామనుకోండి, అప్పుడు ఆ భావనే మనకి ఒక నౌకగా తయారవుతుంది. ఆ నౌకలో మనం కూర్చున్న వాళ్ళం అవుతాము. ఆ నౌకలో మనం కూర్చుంటే మన జీవితం అప్రయత్నంగా నడిచి వెళ్ళిపోతుంటుంది. ఎంచేత అంటే, చదువుతూ ఉంటాం కదా, "*అనంత సంసార సముద్ర తార. నౌకాయుధాభ్యాం గురు భక్తి దాభ్యాం.*" గురువుతో అనురక్తి చెందినటువంటి మనస్సు ఒక సముద్రమైనటువంటి జీవన యానంలో, పెద్ద సముద్రంలో ఒక పడవ ఎక్కి కూర్చుంటే ఎట్లా ఉంటుంది? అది తీసుకుపోతూ ఉంటుంది. మనం పడవలో మన కార్యక్రమాలు చేసుకుంటూ ఉంటాము, అది దాటించేస్తుంది. అలా ఒక అవకాశం మనకి సృష్టిలో ఏర్పరిచారు. అది సృష్టి ఆదిలోనే, ఎప్పుడయితే జీవులందరినీ ప్రపంచంలో వదిలారో అప్పుడే సద్గురువు పరంపర కూడా ఏర్పాటు చేసారు. సనకసనందనాదులు, నలుగురు కుమారులు, సప్త ఋషులు, మానవులు వాళ్ళందరి గురించి భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్తాడు, వీళ్ళందరి రూపంలో నేనే ఉన్నాను అంటాడు. అంటే, మొత్తం అందరి రూపంలో తానే ఉన్నా, కొన్ని విశిష్టమైన తన అవతరణాలు చెప్తాడు. అని చెప్పి, ఈ నలుగురూ, ఆ ఏడుగురు, ఈ పద్నాలుగుమంది, ఆ పదకొండుమంది నేను అనుకుంటూ వరసగా ఒక list చెప్పుకుంటూ వస్తాడు.

అలా ఇందులో మనకి ప్రత్యేకించి, ఈ గురుపరంపరలోకి దైవం చేసినటువంటి ఒక ప్రేరణవల్ల ఇందులోకి మనం వస్తాము తప్ప, మనదిగా మనం రావడం అనేటటువంటిది అవ్వదు. ఎంచేత? ఎవరు మొట్టమొదటసారి ఇందులో ప్రవేశించినా వారికప్పుడు ఆ భావం అలా కలగడానికి ఏమిటి కారణం? తను కారణం కాదు. అది అప్పుడు అలా వచ్చింది. వచ్చినప్పుడు కూడా ఇంతలా ఇందులో మునిగిపోతామని అనుకోలేదు కదా! ఒక సద్గురువుని కలిసినప్పుడు చాలా మర్యాదగా మాట్లాడుతున్నా, మనకుండే నాగరికతనుబట్టి, ఆ రోజుకి మనకేం తెలియదు కదా ఇది చాలా దూరం తీసుకుపోతుందని! ఇంతలా తీసుకెళ్ళి, ఈ పడవలో పెట్టేస్తాడు, మనని అన్నిరకాలుగా రక్షిస్తాడని అప్పుడు తెలియదు

కదా! ఆ పూటకి ఏదో మర్యాదగా మాట్లాడినట్టుగా, పరిచయంగా ఉంటుంది. ఇక అక్కడినుంచి మొదలయ్యి చాలా దూరం తీసుకెళ్ళి, దీనికన్నా మనకి ఆనందదాయకం అయినటువంటి విషయమూ లేదు, ఇంతకన్నా మనకి రక్షణని ఇచ్చేటటువంటి కవచమూ లేదు, ఇంతకన్నా పరిణితి చెందడానికి మార్గమూ లేదు అని తెలుసుకోవడం జరుగుతుంది. అలాంటి వాళ్ళంతా ఇక్కడ కూర్చుని మనం ఈ రోజున ఇలా గురుపూజలు నిర్వర్తించుకుంటుంటే మరి ఉత్సాహంగానే ఉంటుంది.

ఈ గురుపూర్ణిమ నాడు ఈ గురుసాన్నిధ్యం మనం గుర్తుతెచ్చుకుంటాం తప్ప రోజూ ఉండాల్సినదే. ఆ రోజు మరొక్కసారి చెప్పుకుంటూ ఉంటాం అంతే. ఎందుకంటే ఇంకా మర్చిపోతామేమో అని భయం మనలో ఉండడంచేత కదా! నేను మర్చిపోను అని ఎవడూ అనలేడు కదా! అదొకటి ఉంది. ఎందుకంటే సృష్టిలో ఎవరూ కూడా నేను ఇలా ఉంటాను అని అనగలిగిన మొగాడు ఎవడూ లేడు. ఎందుకని? దానికీ బోల్డు కథ ఇచ్చేస్తారు. అంటే, దేవర్షి అయినటువంటి నారుదుడే ఇలా మాట్లాడి, మాయలో పడి, ఆ తర్వాత మనం అలా అనకూడదు, మీరూ అలా అనబోకండి అని చెప్పాడు అందరికీ. ఈ మాయని దాటేసాను కదా నేను, నాకు ఇబ్బందేముంది, నువ్వు ఎప్పుడూ నాతో ఉంటావు, నేను ఎప్పుడూ నీతో ఉంటాను, అంతేకదా అని అడిగాడు. ఎవరినీ? నారాయణుడిని. అంటే, ఆయన నవ్వాడు. నవ్వితే, నవ్వులోంచే వచ్చేస్తుంది మాయ. అలా నారదుడి పూర్వజన్మలు చాలా రకాలుగా ఆయనే చెప్పుకున్నాడు. లేకపోతే ఎలా తెలుస్తాయి? మనం చెప్పుకోంగాని, మనం పడిపోయిన చోట మనం చెప్పుకోం కదా! ఇక్కడ పడిపోయాను నేను, ఈ విషయంలో పడిపోయాను నేను, పొరపాటు చేసాను అని చెప్పుకునేవాడు ధీరుడు. అలా చెప్పుకోలేని వాడు భీరుడే కదా! అంచేత, ఆయన చక్కగా గ్రంథాల్లోనే రాయించేసాడు. ఒరేయ్! ఇది రాసేయండి మిగతావాళ్ళకి పనికి వస్తుంది అని. నాకు స్త్రీ వ్యామోహం ఏమిటి స్వామీ అన్నాడు దేవుడితో. ఏమిటి నువ్వు మరీనూ! అదంతా ఎప్పుడో దాటేసాను కదా, నేను కల్పం మొదటినుంచి కూడా పరిపూర్ణంగా సిద్ధుడిని కదా అన్నట్టుగా మాట్లాడితే, నవ్వేసి ఊరుకున్నాడు నారాయణుడు. నవ్వేసి ఊరుకుంటే, ఈయన ఏదో లోకాల్లో తిరుగుతుంటే, ఒకచోట అనుకోకుండా ఒక స్త్రీ యందు ఆసక్తి కలుగుతుంది. అది చూడండి! ఏది, ఎప్పుడో అంతకముందు కల్పంలోనే స్త్రీ వ్యామోహం పోయినటువంటి వాడికి ఇప్పుడు స్త్రీ వ్యామోహం కలగడం ఏమిటండి? ఆవిడతో కాపురం. అటుపైన అరవైమంది సంతానం. ఈ సంసారాన్ని పోషించడానికి ఊరికే నారాయణ, నారాయణ, నారాయణ అంటే అవ్వదు కదా అనుకున్నాడు. అనిపిస్తుంది అట్లా. అదేమిటి అవ్వదా? అంతకుముందు అందరికీ అవుతుందని చెప్పాడు కదా! అన్నిటికీ అష్టాక్షరి చాలని చెప్పినటువంటివాడు, అన్నిటికీ ద్వాదశాక్షరి చాలని చెప్పినటువంటివాడు, ఆయన సంసారం పెరిగేసరికి, సంసారం కదా ఇవన్నీ పెట్టుకుని కూర్చుంటే అవ్వదని, ఆ మహోతిని పక్కనపెట్టి, సంసారాన్ని ఏదో చెయ్యాలనే వ్యామోహంలో పడి అక్కడినుంచి నానాబాధలూ పడి, వీళ్ళందరినీ మేపలేక నానాకష్టాల్లోకి వచ్చేస్తాడు. వాళ్ళేమో సామాన్యంగా తినరు. బాగా తింటారు, అరవైమంది కూడా! మీకు తెలియదేమో, కృష్ణా జిల్లా వాళ్ళు భోజనం చేసినట్టు చేస్తారు. నేను చూసాను, కృష్ణా జిల్లా వాళ్ళు మిగతా జిల్లా వాళ్ళు మొత్తం తిన్నది వాళ్ళు ఒక్క ముద్దకి తింటారు. అంటే, ఒక కూరకే అంత తింటారు. ఒక్క పచ్చడికి మళ్ళీ అంత తింటారు. అది వాళ్ళల్లో ఉండేటటువంటి జఠరాగ్ని అలాంటిది. అది కృష్ణ నీరులో ఉంది అది. అందుకని, ఎవరియినా

కృష్ణా జిల్లా నుంచి వస్తే కొంచెం ఎక్కువ పడేసుకుంటూ ఉండాలి అన్నం పెట్టేవాళ్ళు. అన్నం పెట్టని వాళ్లకి ఇవన్నీ తెలియవు కదా! అన్నం పెట్టేవాళ్ళకే తెలుస్తాయి. అంచేత, మరి కృష్ణా జిల్లా వాడు వాడికి కొంచెం అన్నం ఎక్కువ వండవే అని చెప్పుకోవాలి. ఎందుకంటే, వాడు ప్రతిసారి కంచం నిండా అన్నం పెట్టుకుని ఒక కూర, ఒక కంచం నిండా అన్నం పెట్టుకుని పచ్చడి, కంచం నిండా అన్నం పెట్టుకుని పప్పు, కంచం నిండా అన్నం పెట్టుకుని పులుసు, కంచం నిండా అన్నం పెట్టుకుని చారు, కంచం నిండా అన్నం పెట్టుకుని మజ్జిగ అట్లా తింటారు. అలా ఇలా ఉండదా అంటే ఉండదు. ఎందుకంటే, వాడిలో జఠరాగ్ని అట్లా ఉంటుంది. వాడు పనీ అట్లాగే చేస్తాడు. అందుకని మాస్టరుగారు బాగా పొగుడుతూ ఉండేవారు అటుపక్కవాళ్ళని. ఆ జిల్లా వాళ్ళు వేరోయ్ అంటూ ఉండేవారు. సరే అది మనకి side issue అనుకోండి. పిట్ట కథ అంటాం కదా!

అది అలా ఉండగా, ఇంట్లో అరవైమంది అట్లా తినేవాళ్ళు ఉన్నారనుకోండి, ఎంత సంపాదించాలండి? పైగా మనకి సామెత ఉంది, లేదుట అంటే ఆకలి ఎక్కువ వేస్తుంది. సామెత ఉంది, దరిద్రుడి ఆకలి ఎక్కువ అని. వీరందరినీ పోషించడంలో ఆయనకి తెమలలేదు. తెమలక, చివరికి అందరికీ ఆకలే. ఈయనకీ ఆకలి పుట్టేసింది. ఏదీ, ఆకలిదప్పులు జయించినటువంటి నారద మహర్షికి ఆకలి పుట్టేసింది. ఎవరకీ అన్నం లేదు. అందరూ ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్కళ్ళూ రాలిపోతున్నారు. భాగవతంలో ఉందీ కథ. అలా రాలిపోతుంటే, ఈయనకీ ఆకలి పుట్టేసి, ఎక్కడా ఏం దొరకకపోతే, అట్లా వెళ్తుంటే అడవిలో, చెట్టుకి ఒక పండు కనపడిందిట. ఆ పండు అందుకోవాలని పడిపోయిన పిల్లలు, భార్య శవాలను ఒకదానిమీద ఒకటి ఇట్లా పేర్చాడట. ఎందుకంటే, అది ఎక్కితేగాని ఆ పండు అందుకోడానికి వీలుపడదట. అలా అందుకునే time లో భగవంతుడు ప్రత్యక్షమై ఏం చేస్తున్నావు అని అడిగాడట. ఏం చేస్తున్నావు అంటే అప్పుడు... వీళ్ళంతా ఎవరూ లేరు అక్కడ. ఏదీ? ఆ భార్యా లేదు, ఆ పిల్లలూ లేరు, ఎవరూ లేరు. అంటే, కాళ్ళమీద పడతాడు. చాలా టూకీగా చెప్పాను. దీన్నే మనం ఒక మూడు రోజులు చెప్పుకోవచ్చు. బాగా చెప్పుకోవచ్చు. అంటే, వివరాలు మాయలో పడితే ఎలా ఉంటుంది అనేది... అందుకని, మాయలో పడకపోవడం అనేది లేదు.

ఆయనే చెప్పాడు భగవద్గీతలో "*మమ మాయా దురచ్చయా*" అని. ఎవరూ దాటలేరురా అని. అంచేత, దాటలేని వాళ్ళం కాబట్టి దాటుదాం అని ప్రయత్నం చేస్తున్నాం కాబట్టి, దాటించాలనేటటువంటి ఒక భగవత్ సంకల్పమే తనయందు నిలిచి తాను నిర్వర్తిస్తున్నటువంటి గురువు ఉన్నాడు కాబట్టి, అతడితో అనుసంధానం చెంది, క్రమంగా మనం ఏం చెయ్యాలంటే మనలో బాగా పెంచుకున్నది ఒకటి ఉంది, అది చచ్చిపోవాలి. అది చచ్చిపోతే మన కథ సులభం అయిపోతుంది. ఏమిటయ్యా అంటే అహం. అహం చచ్చిపోవాలి. అహం చచ్చి మనం ఉంటే అంతా ఆనందమే. అహం ఉంటే మనకి మనమే శత్రువు. అహం చచ్చిపోయేలోపల శరీరం పడిపోయిందనుకోండి, మళ్ళీ ఇలాగే వస్తాం. రావడం అంటే నీ ఇష్టం ప్రకారం రావు. "*బలాద్ ఆకృష్య మోహయా*" అని అహంకారం ఉన్నచోట మమకారం ఉంటుంది కదా! మనం మాట్లాడుతుంటేనే "మా" అంటాము కదా! "మా" అంటాం, "మా" అబ్బాయి అంటాం, "మా" ఇల్లు, "మా" "మా", "మా"... అంటే మాటలోనే నీకు ఉందో లేదో మమకారం తెలిసిపోతుంది కదా! అంటే, "మా" ఆవిడ అనేబదులు, ఆవిడ నా భార్య అని చెప్పారనుకోండి అదెలా ఉంటుంది. ఆ అహంకారంని క్రమంగా తీసి నీ నిజస్వరూపాన్ని

ఆవిష్కరించేటటువంటివాడు సద్గురువు. సద్గురువు తనదంటూ ఒక ప్రత్యేకమైన స్వభావం కాక, దైవీ స్వభావమే తన స్వభావంగా ఉంటుంది. అప్పుడే సద్గురువు అవుతాడు. తనదయినటువంటి విషయం ఒక్కటే ఉంటుంది. అది దైవమే. ఇంకేది తనది అనుకోడు. అతడు ఏం చూసినా అది దైవమే అని తెలిసి ఉంటుంది. ఏం చూసినా! జరుగుతున్నదంతా దైవమే అని తెలిసి ఉంటుంది. ఇలా జరగకూడదు, అలా జరగకూడదు, ఇలా ఉండకూడదు, అలా ఉండకూడదు అనడు. అంతా దివ్య సంకల్పం ప్రకారం నడుస్తోంది, జీవులు వారి వారి పరిణితిని బట్టి వారు వారు అనుభూతి చెందుతూ ఉన్నారు, క్రమంగా ఇవ్వాళ్ళ కాకపోతే రేపు తెలుసుకుంటారు అనేటటువంటి ఒక ధీమాలో ఉంటాడు. అంచేత, ఎంత మనం చూస్తున్నకొద్దీ అంత మనకి దైవమే ఈ విధంగా ఉన్నది అనేది తెలుస్తూ ఉంటే, మనకి క్రమంగా ఏం జరుగుతుందంటే మనం తగ్గి దైవం పెరగడం జరుగుతుంది. మనం దైవంతో పాటు మన్ని పెంచుకుంటున్నాం అనుకోండి... మామూలుగా జరిగేదేంటంటే ఇట్లా ఈ దైవ కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నటువంటి వాళ్ళని మనకి తెలిసినవాళ్ళు బంధుమిత్రులంతా కూడా మన్ని చాలా మర్యాదగా చూస్తుంటారు కదా! ఇట్లా స్టేషన్లకి వస్తారు, పూలదండ వేస్తారు, కారు ఎక్కిస్తారు, తీసుకొస్తారు. దేనికి చేస్తున్నారిదంతా? ఎవడి కోసం చేస్తున్నారు? ఇది ఎవరిని ఆరాధిస్తున్నారో వారి కోసం చేస్తున్నారు. అలా గుర్తులేకపోతే, వీళ్ళంతా మన శిష్యులు కదా అనిపిస్తుంది. ఇలా అలవాటయిపోతే బాగా, తర్వాత ఎవరూ రాలేదనుకోండి ఒక రోజు స్టేషనుకి, వీళ్ళందరకీ చాలా అహంకారం వచ్చేసిందనుకుంటాము కదా! అంచేత, అది ఎప్పటికప్పుడు మనకి జీవితంలో "నేను", "నాది" అనేటటువంటిది బాగా గుర్తువస్తుంటుంది. అది మాయ. అందులో పడమని ఎవరూ ఆడగలేదు నిన్ను. నువ్వు పడతావు. "నేను", "నాది". ముందు "నేను", తర్వాత "నాది". దేనికైనా ముందు ఇలా వచ్చేస్తుంటుంది. నన్ను బాగా చూసారా లేదా? నన్ను పలకరించారా లేదా? నాకు మర్యాద చేసారా లేదా? నేను ఇంతటి వాడిని కదా! ఇలాంటివన్నీ ప్రతి చిన్న పిల్లవాడి దగ్గరనుంచి ఉంటాయి, తమాషా! చిన్న పిల్లలు! మంచి చొక్కాలాగూ వేసుకుంటే పదిమందికి కనపడాలని అనిపిస్తుంది పిల్లవాడి దగ్గర నుంచి కదా! అంటే ఏమిటి? తెలియకుండానే మనలో ఇంత ఉంటుంది. అంచేత, ఇంకోళ్ళ గురించి మనకి అక్కర్లేదు గాని, మన గురించి మనం చూస్తే మనకి, తనని గూర్చిన భావన ఎక్కువ ఉందా, దైవము గూర్చిన భావము ఎక్కువ ఉందా, ఇది ముఖ్యం. తనని గూర్చిన భావన ఉన్నంతసేపూ తానే ఉంటాడు. దైవము గూర్చిన భావన ఉంటే తాను ఉండక దైవము ఉంటాడు.

అంచేత, ఎంతసేపూ దైవస్మరణ చేస్తూ ఉంటే... ఇప్పుడు మనకి సంతానం ఉందనుకోండి, కుటుంబం ఉందనుకోండి, దైవము ఇచ్చాడనుకోవడం ఒక పద్ధతి. బావుండకపోతే అనుకోవడం కాదు, బావున్నా కూడా. అలాగే వృత్తి వ్యాపారాదుల్లోనూ ఇది దైవము ఇచ్చాడు అనుకోవడం. సంఘము దైవము ఇచ్చాడు, శరీరం దైవము ఇచ్చాడు, పేరు దైవమే ఇచ్చాడు. మనకి పేరేం ఉంది? మనకి మన పేరే మనం అనుకుంటాం కదా! ఎన్ని చెప్పినా మనం పేరే మనం అనుకుంటాం. మన పేరు ఎప్పుడన్నా పేపర్లో పడిందనుకోండి, పేపరు వరకూ ఎందుకులెండి, నావాణిలో పడ్డదనుకోండి. చాలామంది వార్తలు అందులో తమ పేరు ఉందో లేదో చూసుకోడానికి నావాణి చూస్తూ ఉంటారు. వాళ్ళ బృందం వార్తలు పడ్డాయా లేదా? అందులో వాడి పేరు పడ్డదో లేదో చూసుకుంటారు. అంటే, ఎలా వస్తుందో చూసుకోండి. ఇది ఆత్మపరిశీలన. మంచి మంచి కార్యక్రమాలు మనం చేస్తున్నాం అనుకోండి, మనం చాలా బాగా చేస్తున్నాం, మనం చాలా

బాగా చేస్తున్నాం అని అనుకుంటున్నాం అనుకోండి. ఇవన్నీ మన గురించి ఆలోచించినట్లే అవుతుంది కదా! మనం రోజూ ప్రార్థన చేస్తున్నాం అనుకోండి. నేను రోజూ ప్రార్థన చేస్తున్నానని నాకు గుర్తుఉంటే ఉపయోగం ఏం ఉందండి? వీడు రోజూ ప్రార్థన చేస్తున్నాడని ఎవడనుకోవాలో వాడు అనుకుంటే మనకి ఉపయోగం కదా! ఇప్పుడు అక్కడ మనకి ఒక slogan పెట్టారు. అందరికీ తెలిసినదే. "serve until you forget you are serving" అది ఒక్క సర్వీసుకే కాదు, అన్నిటికీ apply అవుతుంది. అక్కడికి వెళ్ళి వేస్తే నన్ను తీసుకెళ్ళి పూలు వేయించారు నాచేత. వేస్తుంటే కనబడ్డది. Prayer కూడా అంతే! "Pray unil you forget your are praying". If you remember that you are praying then you are not doing the prayer. ప్రార్థన, పూజ చేస్తున్నప్పుడు నిన్ను నువ్వు మర్చిపోయి పూజ జరగాలి. అది తన్మయ స్థితి. నీకు నువ్వు ఎంత గుర్తు ఉంటే నీకు తత్–మయం అవ్వడానికి వీలులేదు. మనకి మనం ఎంత గుర్తు ఉంటే మన చుట్టూ అంత మన భావం ఒక వలయంగా ఏర్పడి మన్ని బంధించేస్తుంటుంది. మనం విడిపోతూ ఉంటాము మొత్తంతో. మన్ని మర్చిపోతే అంతా దేవుడే.

తన్ని తాను మరిచినవాడు సద్గురువు అంతే. తన్ని తాను మరచి, దైవమే తానై, తనయందు ఉంటే, ఎక్కడో ఉంటాడు తాను. కేవలం భావమాత్రం కూడా చాల తక్కువగా... దానికే హనుమంతుడిని చెప్తారు. హనుమంతుడు అసలు తన ఉనికే తనకి గుర్తు ఉండదు. అలా అని సామాన్యుడా? అంతకు మించిన యోధుడు లేడు. అంతకు మించిన జ్ఞాని లేడు. మీరు ఏదయినా చెప్పండి, అంతకు మించిన వాడు లేడు సృష్టిలో హనుమంతుడితో పోలిస్తే. అతడు ఎవరితోనూ పోల్చుకోడు. తాను ఉండదు కదా! అతనితో చాలామంది పోల్చుకుని చాలా రకాలుగా ఇబ్బందిపడ్డారు. ఎవరితోనైనా మనం పోల్చుకుంటున్నామంటే మనం ఒకళ్ళం ఉండాలి కదా! హనుమంతుడు తనకి తాను ఉండదు. మొత్తం అంతా అదే! తత్వమే తానుగా ఉంటాడు. అంచేత, ఎవరయినా మీకది తెలుసుటగా అంటే కూడా, ఆహా! అలాగా! అంటాడు.

అంచేత, మనం సద్గురువు మార్గంలో జరగవలసినదేమిటంటే అహం తగ్గి, మనలో పరం పెరగాలి. అహం బాగా తగ్గాలి. అంటే, ఏది చచ్చిపోవాలి మనలో అంటే అహం చచ్చిపోవాలి. అహం చచ్చినవాడికి మరణం లేదు. అహం చావనివాడికి మరణం ఉంటుంది. ఎందుకంటే, అది నిజానికి నువ్వు ఏర్పరుచుకున్నదే తప్ప అక్కడ లేదది. మొత్తమే నీవలె నీయందు గోచరిస్తుంటే, నేనున్నానని అనుకుంటున్నావు. సముద్రమే అలగా వస్తే, నేను సముద్రమే అనుకుంటే శాశ్వతమే అల. నేను అలగా ఉన్నాను అనుకుంటే అది శాశ్వతం కాదు కదా! మట్టే కుండగా వచ్చిందనుకోండి. మనకి తెలిసినవే ఉదాహరణలు, కొత్తవేం కాదు కదా! కుండ శాశ్వతం కాదు, మట్టి శాశ్వతం. ఆ కుండగా ఏర్పడిన మట్టి మళ్ళీ పగిలిపోయినా, లేకపోతే దీంట్లో కలిసిపోయినా ఇందులో మట్టి ఉంది కదా! మట్టిగా శాశ్వతుడవు, కుండగా శాశ్వతుడవు కాదు. సముద్రంగా శాశ్వతుడవు, అలగా శాశ్వతుడవు కాదు. ఆభరణాలుగా శాశ్వతుడవు కాదు, లోహంగా శాశ్వతుడవు కాదు. ఇట్లా ఉందిగా! అలా మనం ప్రతివాళ్ళం సహజంగా ఈశ్వరులం. నేను ఈశ్వరుడిని అనేటటువంటి భావన మర్చిపోయి మనకంటూ ఏర్పరిచిన పేరు, మనకంటూ ఏర్పరచిన కులము, జాతి, మతము, ఇవన్నీ వేరే ఒక artificial identity ఒకటి ఏర్పరచుకుంటూ ఉంటాము. ఈ artificial identify, అది artificial కదా! It is not real. అది చచ్చిపోవాలి మరణం దాటాలి అంటే. మరణం దాటాలి అనేది యోగం చాలా చేస్తున్నాము కదా ఇప్పుడు! బోల్డు

పుస్తకాలు రాసారు. పుస్తకాలు బాగా అమ్ముడుపోతాయి చావు గురించి రాస్తూ ఉంటే. ఎందుకంటే, ప్రతివాడికి చావుని దాటాలని ఆశ కదా!

ఇప్పుడు మనం క్రిందటి రెండు సంవత్సారాల నుంచి చెప్పుకుంటున్నది అదే కదా! ఒక సంవత్సరమేమో కఠోపనిషత్తు చెప్పుకున్నాం. ఒక సంవత్సరమేమో సతీసావిత్రి కథ చెప్పుకున్నాం. ఈ సంవత్సరం మార్కండేయుడి కథ చెప్పాలని. చెప్తే, ఈ మూడూ మనకి ప్రసిద్ధమైనటువంటి విషయాలు మరణం విషయంలో. మరణాన్ని దాటడానికి మూడు ప్రసిద్ధమైన గాథలు ఇచ్చారు మనకి. అందులో అత్యంత మహిమాన్వితమైనది నచికేతుని కథ. కుర్రవాడు, యముడి యొక్క ప్రశంస పొంది, యముడి ద్వారా వరాన్ని పొంది, యముడుని కోరి తెలుసుకున్నాడు మరణ రహస్యాన్ని, కదా! తనకి మరణం రాకూడదని కోరుకోలేదు నచికేతుడు. ఎలాగూ యమలోకంకే వెళ్ళిపోయాడు ఆయన. తనకోసం కోరుకోలేదు. ఇదేంటయ్యా! అందరూ చచ్చిపోతాం, చచ్చిపోతాం అంటూ భయపడిపోతారు, దీని సంగతేంటి చెప్పమని అడిగితే, అక్కడికి వెళ్ళినా తనకి తానుగానే ఉన్నాడు నచికేతుడు. అందుకని రహస్యం చెప్పాడు యముడు. ఆ రహస్యం మనం ఎలా నిర్వర్తించుకోవాలనేటువంటిది రెండేళ్ళ క్రిందట చెప్పుకున్నాం. ఏం చెప్పుకున్నా మర్చిపోతాం కదా! ఆ తర్వాత మనకి సావిత్రిదేవి. ఆవిడా తనకోసం కాదు కదా! ఆవిడకి మరణ భయం లేదు. ఒక మరణిస్తాడన్నాయనని పెళ్లి చేసుకుంది. ఆయన ఎలా మరణిస్తాడో చూస్తాను అనుకుంది ఆవిడ. ఆవిడ తన ఎలాగూ మరణం దాటినటువంటి స్థితిలో ఉన్నటువంటిది. తన భర్తకి కూడా మరణాన్ని దాటించినటువంటి కార్యక్రమం మనం కథగా చెప్పుకున్నాం. అందులో రహస్యాలను మనకి తోచినంతగా చెప్పుకున్నాం.

అలాగే మార్కండేయుడు. మార్కండేయుడు తన మరణిస్తాడని చెయ్యలేదు శివారాధన. మాములుగా కథలు రాసుకున్నప్పుడు అలా రాసుకుంటారు. తల్లిదండ్రులు చెప్పారు పదహారేళ్ళకి నీకు మృత్యువు సంప్రాప్తిస్తుంది అని. అంచేత, నువ్వు శివారాధన చేసి మృత్యువుని దాటు అని. చెప్పుకుందాం లెండి కథ. మరదే కథ మనకి ఈ సారి. ఎక్కువ లేదు కథ, చిన్న కథే. కాని మార్కండేయుడు ఏం చెప్తాడంటే తల్లిదండ్రులకి, నేను మరణిస్తానన్న బాధ లేదమ్మా, నేను మరణిస్తే ఇంత శ్రమకోరి సంతానంగా మీరు ఎందుకు పొందారు? తండ్రి చాల సుదీర్ఘమైన తపస్సు చేస్తాడు సంతానం కోసం. అంత సుదీర్ఘమైన తపస్సు ఎందుకు చేసారు? ఒక కొడుకుని కందామని. కొడుకుని కంటే, వాడేం చేస్తాడని కన్నారు? ఎందుకు కొడుకు చెప్పండి? ప్రతివాడు కొడుకు కావాలనుకుంటారు కదా! ఎందుకు కొడుకు? అంటే నాకు కూడా ఒక ఉన్నాడని చెప్పుకోడానికా? నాకు కూడా ఒక కారు ఉందని చెప్పినట్టు కాదు కదా! మీరు ఎందుకు కన్నారు నన్ను? నావలన మీకు ఉత్తమగతులు కలగాలని కదా నన్ను కన్నారు అంటాడు. మరి నేను వెళ్ళిపోతే మీకు ఉత్తమగతులు, మీరు చేసిన తపస్సు, నాకోసం పడ్డ ఆరాటం, నన్ను చిన్నతనం నుంచి పెంచినటువంటిది... అందుకని తల్లిదండ్రులుకన్నా పెద్ద దైవం ఎవరున్నారు? అంచేత, మీకు సేవ చెయ్యడం కోసం నేను బతికి ఉండాలి.

అంటే, మనకి మాములుగా ఇలాంటి ఆలోచనలు రావు కదా! ఎంతసేపూ మనం బావుంటే చాలు, అమ్మానాన్న ఎట్లా ఉంటే మనకేంటి కదా! మరీ ఈ రోజుల్లో మరీ ఘోరం. అది ఎప్పుడు పోతారా అని చూస్తూ ఉంటారు కదా! నిన్ను

కని, నిన్ను పెంచి, నీకు చెయ్యాలిసినదంతా చేసి నిన్ను తీర్చిదిద్ది, నీకు సంస్కారాలు ఇచ్చి చేసినటువంటి వారికి నువ్వు ఏం చేసావు? అందుకనే, ఋషుల కథలు చదువుకోవాలి. ఎందుకు ఋషుల కథలు చదువుకోవాలంటే, మానవుడై పుట్టినందుకు ఉండవలసినది మొట్టమొదటి కర్తవ్యం కృతజ్ఞత. అది లేనివాడు పశుప్రాయం. పశువుకైనా కృతజ్ఞత ఉంది. కుక్కకి బోల్డు విశ్వాసం. ఒక్క ఇంట్లో భోజనం చేస్తే ఆ ఇల్లు తరతరాలపాటు వృద్ధి చెందాలని కోరుకునేటటువంటి సంస్కృతి మనది. అంటే, దొరికినదంతా తినేసి గబగబా వెళ్ళిపోవడం కాదు. అంచేత, కృతజ్ఞత. తల్లిదండ్రుల విషయంలో కృతజ్ఞత అనేది చాలా చిన్న మాట. అందుకని, మార్కండేయుడు కూడా చాలా తపస్సు చేస్తాడు. పదిమంది కోసం, ఇతరుల కోసం తను బతికి ఉండాలి. అలా అనుకుంటారాండి ఎవరయినా? మనకోసం బతికి ఉండాలని అనుకుంటాడు ప్రతివాడు కదా! మనకోసం మనం బతికి ఉండాలి. మనం బతికి ఉండి యోగం చేసి మరణం దాటాలి. చాలా selfish కదా! Full selfish. ఇప్పుడు నువ్వు మరణం దాటితే ఎవరికి కావాలయ్యా? నువ్వు చచ్చిపోతే ఏం? నువ్వు ఉంటే ఏమిటి? ప్రతివాడు వాళ్ళని ఒక ప్రశ్న అడగండి – ఎరా! నువ్వు ఇప్పుడు చచ్చిపోయావనుకో ఎవరికీ నష్టం? ఎవరికీ నష్టం లేదు. అలాంటి వాడివి ఎందుకురా ఇక్కడ ఉండడం అనుకోవచ్చు కదా! వాళ్ళు బతికి ఉండడం వల్ల వాళ్ళకి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి, దివ్యమైనటువంటి ప్రయోజనాలు. అలాంటి దివ్యప్రయోజనం ఏమయినా ఉంటే ఇంకొంచెం నాకు extension ఇస్తావా అని అడిగినా అర్థం ఉంది. అంతేగాని ఇంకా నేను చూడాలిసిన సినిమాలు మిగిలిపోయాయి, నేను తిరగాలిసిన ఊళ్లు చాలా మిగిలిపోయాయి, నేను వెళ్ళాల్సిన హోటళ్ళు బోల్డు మిగిలిపోయాయి, కొత్తకొత్తవి ఏవో వస్తున్నాయి, అవన్నీ నేను కొనుక్కోవాలి, తినాలి, తిరగాలి. ఇందుకోసమా ఎక్కువ రోజులు ఉండడం? ఇలా ఎందుకు ఎక్కువ రోజులు బతికి ఉండాలి నాకు అర్థం కాదు. ఎందుకు ఎక్కువ రోజులు బతికి ఉండడం? ఒక ప్రయోజనం ఉంటే బతకాలి. వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నప్పుడు కొడుకు చచ్చిపోడానికి వీలులేదు. ఇది ఎప్పుడైనా విన్నారా? మరి కొడుకు ఆ విషయంలో చాలా అప్రమత్తుడై ఉండాలి అని మార్కండేయుడి కథ వలన మనకి తెలుస్తుంది. పదహారేళ్ళు పెంచిన పిల్లవాడు వెళ్ళిపోతున్నాడు అంటే దుఃఖంగానే ఉంటుంది కదా! అది కోరుకోవడం కూడా ఆలానే కోరుకున్నాడాయన.

అంటే, కొంచెం కథ చెప్పేస్తాను. మళ్ళీ మొదటికి వస్తామనుకోండి, మధ్యాహ్నం నుంచి వస్తాను. కథ మొదలుపెట్టు నా గురించి అన్నట్టు వచ్చేస్తోంది. ముందు ఉపోద్ఘాతము అన్నారు ఇవాళ్ళ. రెండు నిమిషాల్లో ఉపోద్ఘాతము అయిపోయింది.

మార్కండేయ మహర్షి తండ్రి పేరు మృకండ మహర్షి. వాళ్ళ నాన్నగారు విధాత. విధాత నాన్నగారు భృగుమహర్షి. భృగు, ఖ్యాతి అనేటటువంటి వారు సప్తఋషులలో ఒక జంట. భృగు మహర్షి, ఆయన కుమారుడు విధాత, రెండవ కొడుకుట. ఆ విధాతకి మరొక కొడుకు పుట్టాడు. ఆయన పేరు మృకండుడు. మృకండుడికి ఒక భార్య. ఆవిడ పేరు మనస్విని. వాళ్లకి సంతానం లేదు. సంతానం లేకపోతే, IVF కి వెళ్ళే పరిస్థితులు లేవు. ఇప్పుడు కూడా వెళ్ళకూడదు నన్ను అడిగితే. IVF లకి వెళ్ళి మనం సంతానం తెచ్చుకుంటే, ఏం వస్తుందో, ఏం జీవుడు వస్తాడో మనకి తెలియదు కదా! నీకు సంతానం ఇవ్వలేదుట అంటే నీకు కొంత కర్మ లేదు కదా! ప్రకృతి నీకు నిర్దేశించలేదు సంతానం, మహాభాగ్యం అనుకోవడమే. అంటే, సంతానం ఉంటే మాత్రం అందరూ సుఖపడ్డారా? అందులో, ఈ రోజుల్లో రకరకాలుగా చాకిరీ

చేయించేసుకుని విమానం ఎక్కి వెళ్ళిపోయే జాతులు ఉన్నప్పుడు, ఏమిటి సంతానం? మనకి ఆ కార్యక్రమం పెట్టలేదు అనుకోండి, బోల్డు free time ఉంటుంది కదా! సామాన్యం కాదు, నలుగురు పిల్లల్ని పెంచాలంటే, నలభై సంవత్సరాలు జీవితం తాకట్టు పెట్టినట్టే. అందరిదీ అవ్వాలిగా course. ఇంకా మన కర్మ బావుండకపోతే, వాళ్ళ పిల్లల course కూడా మనకి continue అవుతుంది.

అంచేత, ఇక్కడ సంతానం లేదు. ఒకటి, సంతానం లేదంటే ఎందుకు తాపత్రయ పడాలి? రెండు, ఎలా తాపత్రయ పడాలి? IVF ల చుట్టూ, దాని చుట్టూ, దీని చుట్టూ తిరిగి, artificial baby లు, tube లు అక్కర్లేదు. దేవుడు ఇస్తే పుచ్చుకో. లేకపోతే లేదు. అది పాత పద్ధతి. అప్పుడు science లేక కాదు గుర్తుపెట్టుకోండి. రకరకాలుగా పుట్టించిన కేసులు మనకి బోల్డు ఉన్నాయి. శుక్రాన్ని నేతిలో పెట్టి అట్లా కుండల్లో ఉంచేసి పిల్లల్ని పెంచిన రోజులు కూడా ఉన్నాయి, వీర్యాన్ని. లేక కాదు. ఇస్తే దేవుడివ్వాలి సంతానం. లేకపోతే, వాడు రకరకాల రోగాలతో వచ్చేస్తాడు. ఇంక సుఖమేముంది? పుట్టిన సంతానానికి అన్నీ జబ్బులే అనుకోండి, రకరకాల జబ్బులు ఉన్నాయి వాడికి, వాడు చదువుకోడు, జబ్బు. వీడికి పెళ్లి ఎట్లా అవుతుందని బాధ. రకరకాల బాధలు మొదలయ్యిపోతాయి. అంచేత, ఏం ఇస్తే అది పుచ్చుకోవడం అనేది తెలివి. అంచేత, అసలు నీకంటూ కావాలని తీవ్రంగా అనిపిస్తే, తపస్సే సరైన మార్గం. ఇంకో మార్గం లేదు. దైవాన్నే కోరాలి. అందుకనే, పూర్వకాలంలో తీర్థయాత్రలకి వెళ్ళేవాళ్ళు. ఎంచేత, వేరే కృత్రిమమైన ప్రయత్నాలు కాక, దైవము అనుగ్రహిస్తే వచ్చే సంతానం మనకి ఆనందం కలిగిస్తుంది. దైవము అనుగ్రహించడం కాకుండా మానవ ప్రయత్నంగా, రాక్షసంగా, ప్రకృతి నుంచి లాక్కున్నాం అనుకోండి – అదెలా ఉంటుందో?

అంచేత, ప్రార్థన చేసారు. చేస్తే, ఆయన ఎలా చేసాడు? శివకేశవులు ఇద్దరినీ ప్రార్థన చేసాడట. చూడండి! ఆయనకీ తెమల్లేదు! ఒకళ్ళు చాలదనుకున్నాడు. హరిహరాదులు ఇద్దరినీ ప్రార్థన చేసాడు. ఇద్దరినీ సరిసమానంగా ప్రార్థన చేసాడు. అలా చేస్తే వచ్చాడండి. కథ మధ్యాహ్నం చెప్పుకుందాం. బావుంటుంది మార్కండేయుడి కథ. ఆ పైన మనకి పరంపరాగతమైనటువంటి ఒక అనుగ్రహం మనకి ఉండడం చేత దాని వివరణ దాని పద్ధతుల్లో అది వస్తుంది. అంచేత, మనకి ఈ గురుపూర్ణిమ మార్కండేయుడి కథ. అందులో మరణం గూర్చినటువంటి విశేషాలు, దాన్ని ఏ విధంగా మనం అవగాహన చేసుకోవాలి, అందులోమనకి సాధానాపరమైన విషయం ఏమిటి, ఇలాంటివన్నీ తెలిసుకుందాం. అందులో మనకి గురుపూర్ణిమ మహత్యం కూడా చివరి రోజులో చెప్పడం పెట్టుకుంటారు. ఈ విధంగా ఈ రోజు మనం సాయంత్రం, రేపు మధ్యాహ్నం, ఎల్లుండి పొద్దున్న, మొత్తం నాలుగు ప్రవచనాలు చేసుకుంటాం.

హైదరాబాద్ కేంద్రం వారు ఎప్పుడూ కూడా ఈ గురుపూజల సందర్భంలో, క్రిందటి గురుపూజల నుండి ఈ గురుపూజల వరకూ నేను ఎక్కడెక్కడ ప్రవచనాలు ఇచ్చానో అవన్నీ record చేసి అందరికీ ఇక్కడ పంచుతూ ఉంటారు. అలాంటిది ఒక CD. దానికి ఇక్కడ, "The voice of the Master" అని Mantrams, December Call, గురుపూర్ణిమ, The king of time, Vizag Gurupuja celebrations, May Call ఇవన్నీ ఇందులో ఉన్నాయి.

ఇది మీ అందరికీ పంచుతారు. అలాగే ప్రతిసారి గురుపూర్ణిమ సందర్భంగా నన్ను అడుగుతారు నాలుగుముక్కలు చెప్పండి, అది అచ్చేసి అందరికీ ఇస్తాం అని. దానికి ఒకటి ఇచ్చాను, మొన్న గోపాల్ గారు Vizag వచ్చినప్పుడు.

The teacher is silent. He speaks in silence. A silent student can listen the whispers of the teacher. Silence is not just vocal, it is also mental. The teacher teaches by deed. He is not just a preacher. Students follow him through deeds done. Only deeds pave the way. The teacher's teaching is from within and without as well. They inspire, enlighten and guide to unfold student's conciousness. Blind and emotional following require replacement by comprehensive, clear work. The teacher guides with love, both emotional and the intelligent students. He is neutral at all times towards all. The lotus feet of the teacher offer unfailing support to all those who seek. Worship them daily in the heart. He is the friend that guides you here and here after. Be not indifferent to the teacher. The nature spares not such a one. May the light of the teacher ever be in and around.

ఇది మాములుగా పేరాలు వేసి ఉంటే ఎక్కువ emphatic గా ఉంటుంది. అది ఈ విధంగా వేసి ఇచ్చారు. అలాగే రాసి ఇచ్చాను కూడా, ఏ పేరాకి ఆ పేరా, ఈ మొత్తం ఏడు items గా ఉంటాయి. ఈ ఏడు items జాగ్రత్తగా, శ్రద్ధగా చదువుకుంటే, ప్రతిదాంట్లోనూ ఒక అవగాహన మనకి లభిస్తుందన్నమాట. అంచేత, ఈ కార్డులు మీరందరూ సద్వినియోగం చేసుకోండి. నాలుగున్నరకి మనం ఇక్కడ కలుస్తాము. ఆ తర్వాత prayer అయ్యేంతవరకూ ఉంటుంది. ప్రవచనం followed by prayer. ఆ విధంగా చేసుకుందా. మంచి విషయం, ఋషుల కథలు వింటూ ఉంటే, మనకి కూడా కొంత తప్పక కల్మషహరణం అవుతూ ఉంటుంది. అంచేత, ఆ కథ చెప్పుకుందాం.

––– స్వస్తి

# మార్కండేయ ఉపాఖ్యానము

## July 11, 2014 సాయంత్రం – ప్రవచనం #2

సోదరబృందానికి హృదయపూర్వకమైన నమస్కారములు. భారతీయ వాఙ్మయంలో మృత్యువును గూర్చినటువంటి శోధన, పరిశోధన చాలా పరిపూర్ణంగా జరిగింది. మరి ఏ ఇతర ప్రపంచ వాఙ్మయంలో మృతువు గురించి విశ్లేషణ మనకి అంతగా గోచరించదు. అంచేత, వారు తెలియని కారణం చేత దాన్ని వారు స్పృశించకపోవడం, పునర్జన్మలు ఉన్నాయనే సత్యాన్ని అంగీకరించకపోవడం, జీవ పరిణామ అనే ఒక సత్యమును, ఒక ధర్మమును, వీటన్నటినీ కూడా తోసిపుచ్చారు. భారతీయ వాఙ్మయంలో ఉపనిషత్తులు తరిచి చూసినా మృతువుని గూర్చిన విశ్లేషణ ఉంటుంది. భగవద్గీతలో మొట్టమొదటనే మృతువును గూర్చిన విశ్లేషణ ఉంటుంది. భాగవతం అనేటటువంటి గ్రంథము కూడా మృతి చెందుతాను అనేటటువంటి భావన నుంచి మేల్కొయించి, దేనికి మృతి, దేనికి మృతిలేదు అనేటటువంటి విషయాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది. మన ప్రధాన గ్రంథాలన్నీ కూడా మృత్యువుని చాలా విశ్లేషించి అది స్థితి మార్పే తప్ప మృతువు కాదనేటటువంటి విషయాన్ని ఆవిష్కరించారు. దీనికి సంబంధించినవే మనకి మూడు కథలు ప్రత్యేకంగా చెప్పుకుంటూ ఉంటారు. ఒకటి, నచికేత విద్య, లేక కఠ ఉపనిషత్తు. రెండోది, సతీసావిత్రి ఉపాఖ్యానము. మూడవది మార్కండేయుని కథ.

నిజానికి ఒక వస్తువు మరొక వస్తువుగా గోచరిస్తున్నప్పుడు మరొకటిగా గోచరించేది తాత్కాలికం అని తెలిసి మూలమైన వస్తువుని మూలంగా గుర్తించడం అనేటటువంటిది ప్రధానం అయినటువంటి విధానం మృతువు అవగాహనకి. నీరు మంచుగడ్డ అయినప్పుడు మంచుగడ్డ అనే స్థితి తాత్కాలికం. నీరు అనే స్థితి అంతకన్నా శాశ్వతం. నీరుకన్నా శాశ్వతం ఆవిరి. ఆవిరికన్నా శాశ్వతం ఆకాశము. ఇట్లా ఒకే వస్తువు అవరోహణ క్రమంలో స్థితి మార్పు చెందుతూ ఉంటుంది. మంచుగడ్డ మంచుగడ్డగా చూస్తాం, నీటిని నీటిగా చూస్తాం. మంచుగడ్డ లేకపోయినా నీరు ఉంటుంది. నీరే మంచుగడ్డగా ఏర్పడింది. మళ్ళీ మంచుగడ్డే నీరుగా ఏర్పడుతుంటుంది. మంచుగడ్డ ఏర్పడినప్పుడు మంచుగడ్డ పుట్టిందని, మంచుగడ్డ నీరుగా మారినప్పుడు మంచుగడ్డ చచ్చిపోయిందని అనుకోవడం ఒక పద్ధతి. నీరే మంచుగడ్డగా అయ్యింది తాత్కాలికంగా, మళ్ళీ నీరే అవుతుందని అనుకోవడం ఒక పద్ధతి. ఒకటి స్థితి మార్పు చెందిన సందర్భంలో ఇది మార్పు చెందినది తాత్కాలికమే అనే భావన మనలో స్థిరంగా ఉంటే మార్పుని అంగీకరించినా, మార్పుకి లోబడకుండా ఉంటాం. మార్పుని అంగీకరించి మార్పుకి లోబడిపోతే, మార్పునే తానుగా భావించడం చేత, అది తాత్కాలికం అయ్యిఉండడం చేత, మళ్ళీ అది మార్పు చెందినప్పుడు అది పుట్టిందని, అది పోయిందని చెప్పుకుంటూ ఉంటాం. దీని గురించి బాగా ఆలోచించుకోవచ్చు.

అంచేత, సృష్టిలో మార్పు అనేటటువంటిది సహజం. అన్నీ మారుతూ ఉంటాయి. సృష్టిలో మార్పు సహజం. ఈ మారుతున్న వాటిలో మారనిది గమనించడం అనేటటువంటిది మనం నేర్చుకుంటూ ఉండాలి. మార్పు జరుగుతున్నప్పుడు ఈ మార్పుకి మూలమైనటువంటి వస్తువు ఏముందో అది మారదు. అది ఎప్పుడూ అలానే ఉంటుంది. మార్పు చెందే వస్తువు మార్పు చెందుతూ ఉండగా, ఈ మార్పు చెందడానికి, ఈ మార్పు చెందే వస్తువు ఏర్పడడానికి ఆధారంగా ఉండేటటువంటి వస్తువు ఎప్పుడూ అట్లాగే ఉంటుంది. అంచేత, మార్పు చెందని వస్తువుతో మనం అనుసంధానం చెంది ఉంటే, మార్పులు ఎన్ని జరుగుతున్నా దాన్ని చూచి, ఓహో! ఇలా మార్పు చెందుతోంది అని తెలుసుకోవచ్చు. మార్పు చెందని వస్తువుతో మనం అనుసంధానం చెందకపోతే ఈ మార్పుల్లో ఏదో మనకి జరుగుతున్నట్టుగానూ, ఇంక ఎక్కడా లేనట్టుగానూ, దీనివల్ల మనం ఏదో నశిస్తున్నట్టుగాను ఏవో ఇలాంటి కొన్ని కొన్ని భావనలు మనలో ఆందోళన, భయమూ కలిగిస్తాయి. అది మృతువు విషయంలో చాలా ఎక్కువగా కనిపిస్తుంది. మార్పు చెందని వస్తువు ఒకటి ఆధారంగా రకరకాలుగా అన్నీ మార్పులు జరుగుతూ ఉంటాయి. ఇందులో ఏది నేను అనే ప్రశ్న ప్రధానం.

ఇప్పుడు మనమంతా ఇక్కడ కూర్చున్నవాళ్ళం మన పసితనం మనకి గుర్తు ఉంది కదా! అటుపైన చదువు అన్నాము. అందరూ ఏదో కిందామీదా పడుతూ పెరిగాము. యువకులు అయ్యాము. ఆ చదువు కూడా ఎదో రకంగా పూర్తిచేసి, నెమ్మదిగా వృత్తో, వ్యాపారమో, ఉద్యోగమో సంపాదించుకున్నాం. ఆ తర్వాత వివాహం చేసుకున్నాం. ఆ తర్వాత పిల్లల్ని కన్నాం. మధ్యవయస్కులమయ్యాము. ఇవన్నీ జరుగుతున్నప్పుడు, ఇవన్నీ జరుగుతున్నదిగా మనం చూస్తూనే ఉంటాము గాని, అది అయిపోతూ ఉంటుంది. అంటే, ఉదాహరణకి చెప్పాలంటే, చదువుకుంటుంన్నప్పుడు విద్యార్థి అవుతాము. ఆ తర్వాత ఉద్యోగస్తులో, ఏదో వృత్తి నిర్వహించేవాడో, వ్యాపారస్తుడో అవుతాడు. ఉదాహరణకి నన్ను తీసుకుంటే charted accountant అయ్యాడంటారు. Charted accountant అవ్వడం అంటే అంతకుముందు charted accountant అవ్వకముందు మనిషికి తర్వాత మనిషికి peripheral changes తప్ప లోపలి వాడే ఉన్నాడు. ఆపైన పెళ్లి చేసుకుంటాడు, గృహస్తు అవుతాడు. ఆ తర్వాత పిల్లల్ని కంటాడు, తండ్రి అవుతాడు. అంతకుముందు భర్త కాదు. ఎప్పుడయితే వివాహం అయ్యిందో అప్పుడు భర్త అయ్యాడు. భర్త అవ్వడం అంటే ఏమిటి? అసలు మనిషి అలాగే ఉన్నాడు కదా! భర్త అయినవాడు అటుపైన సంతానాన్ని కంటే తండ్రి అయ్యాడు కదా! ఆ తర్వాత ఆ పనులూ, ఈ పనులూ చేస్తుంటే ఊళ్ళో వాళ్ళు ఎదో కొంత గౌరవిస్తూ ఉంటే మరొక పేరు పెడతారు. ఇవన్నీ మనం కాదు కదా! ఇందులో ఏది నువ్వు? నువ్వు భర్తా? నువ్వు తండ్రా? నువ్వు charted accountat వా? ఇంకొంచెం మనం ఇప్పుడు అరవైతొమ్మిదేళ్ళు వస్తే వార్ధక్యం వస్తోంది, ముసలివాళ్ళు అవుతున్నారంటారు. ముసలి వాళ్ళవుతున్నట్టుగా ఎవరూ గుర్తించలేరు. ఎందుకంటే పసివాడు యువకుడు అయినప్పుడు... మనం date of birth ఒకటి వేసుకుంటూ ఉంటాం కదా! అ రోజు చాలా గొడవ చేసేస్తూ ఉంటాం మనం. పసివాడి నుంచి ఒక పసిబాలుడు అయ్యావనుకో, అప్పుడు ఆ date ఉండదు కదా! యువకుడు అయ్యావు. ఎప్పుడు అయ్యావు? date ఉందా? లేదు కదా! అక్కడి నుంచి మధ్యవయస్కుడివి అయ్యావు. ఎప్పుడు అయ్యావు? date ఉందా? లేదు. మధ్యవయస్కుడు నుంచి ముసలితనం వస్తోంది. దానికి ఏమన్నా తారీఖు ఉందా? ఈ రోజు నుంచి నీకు ముసలితనం అని ఏమన్నా గుర్తించే విధంగా ఉందా? లేదు కదా!

ఇట్లా ఈ మార్పులన్నీ మనలో జరుగుతున్నా మనం మారుతున్నాం అనుకోము కదా! రోజూ అద్దంలో చూసుకుంటూ ఉంటాం. మనకేం తెలుస్తోందా మార్పు? తెలియదు. కానీ ఒక స్నేహితుడో, ఒక పరిచయస్తుడో ఒక నాలుగైదేళ్ళకో, ఆరేళ్ళకో చూసినప్పుడు కనిపిస్తుంది. రోజూ చూసుకునే వాడికి నీకు కనిపించదే మార్పు! ఎంచేత? నువ్వు మారవు కాబట్టి.

నేను అనే ప్రజ్ఞకి మార్పు లేదు. నేను అనేటి తత్వానికి మార్పు లేదు. దానికి ఎప్పుడూ మార్పు లేదు. అందుకనే, ఎంతమంది చచ్చిపోతున్నా చూసినా నేను చచ్చిపోతానన్న భావన కలగదు. అది ఒక రహస్యం. ఎంచేత అంటే, చావము కాబట్టి. మనం కూడా చచ్చిపోతాము కదా అనుకుంటే తొందరగా దానివైపు నడిచి వెళ్ళడం ఉంటుంది. అలా అనుకోదు. వాడేదో పాపం అలా అయిపోయింది, మనం కొంచెం జాగ్రత్తగా ఉందాం అనుకుంటాం. జాగ్రత్తగా ఉన్నా ఆ time ప్రకారం అది వస్తుంది. కాని ఈ మార్పులన్నీ ఏ విధంగా జరిగిందో ఆ మార్పు కూడా అలాగే జరుగుతుంది అని చెప్పగలిగినటువంటి ఏకైక వాఙ్మయం ఋషి ప్రోక్తమైనటువంటి వాఙ్మయం. నువ్వు ఎప్పుడూ పోవు అని చెప్తుంది. నువ్వు పోవు, నువ్వు పోయేవాడివి కాదు, పోతావన్న భ్రమ ఏమిటి? నువ్వు ఎప్పుడు పిల్లవాడిగా చచ్చిపోయి యువకుడిగా అయ్యావు? ఎప్పుడు యువకుడిగా చచ్చిపోయి మధ్యవయస్కుడు అయ్యావు? ఎప్పుడు మధ్యవయస్కుడిగా చచ్చిపోయి ముసలివాడివి అయ్యావు? అవ్వలేదు కదా! అన్నీ నువ్వు ఉండగా నీమీద మార్పులన్నీ జరుగుతూ ఉన్నాయి. దానికే శ్రీకృష్ణుడు ఏం చెప్పాడంటే, నీ చుట్టూ మార్పులన్నీ నువ్వు రోజూ మార్చుకునే దుస్తుల్లాగయ్యా. మార్చుకుంటూ ఉంటావు కదా! ఆ రకంగా ఒక జీవితకాలంలో ఎన్నో మార్పులు వస్తాయి కదా! చాలా కాలంగా ఆరోగ్యంగా ఉంటావు, తర్వాత అనారోగ్యం వస్తుంది కదా! అనారోగ్యం వస్తే ఏమయ్యింది నీకు? దాంతోపాటు నువ్వు కూడా మారిపోతుంటే నీకు బాధ తప్ప నాకు కాదు. శరీరానికే అనారోగ్యం అనుకుంటే దానియొక్క ప్రభావం అంత నీమీద ఉండదు. దేనికొచ్చింది రోగం? నాకు కాదు. ఇట్లా నేను అనేటటువంటి తత్వం ఉందే, ఆ నేను అనేటటువంటి తత్వాన్ని నువ్వు దేనితో నిర్వచించుకుంటున్నావు నిన్ను అనేటటువంటిది ముఖ్యము. నేనెవరూ, నేనవరూ అంటూ ఉంటాం కదా! ఈ నేను అని మనం అనేదానికి పేరు పుట్టిన తర్వాత పెట్టారు కదా! మనందరికీ తెలుసు పుట్టినప్పుడు పెట్టారని మనకీ పేరు అని. అంతకుముందు నీ పేరేంటి ఎప్పుడయినా ఆలోచించావా? ఈ పేరు పెట్టకముందు నేనెవరు అనే ప్రశ్న పుట్టిందా ఎప్పుడయినా? అంత taken for granted గా, modified situation ని accept చేసి దానితో identity పెంచుకోవడం వల్ల, అక్కడినుంచి మనకన్నీ అట్లా modifications అయిపోతుంది. Total modification! అంతా modification కదా!

అందుకని, మనకి మనం పుట్టినప్పుడు, మానవ శరీరంలో పుట్టాం కదా! నేను మానవుడినా? మానవ శరీరం నీకు ఇచ్చారు తప్ప నువ్వు మానవుడివని ఎక్కడుంది? ఇది ఈ విషయాలనే కాస్త తెలుసుకుంటూ ఉండాలి అప్పుడప్పుడూ. తత్వవిచారం అంటారు దీన్ని. నేను అనేటటువంటి తత్వం. పొద్దునే లేవంగానే నేను పాపరాజు, నేను తెలుగువాడిని, ప్రస్తుతం చెన్నైలో ఉంటుంన్నాను, ఈ బ్యాంకు ఉద్యోగం చేసుకుంటుంన్నాను, ఎప్పుడెప్పుడు ఇదైతే బావుంటుంది, ఇట్లా అనుకుంటూ ఉన్నాం అనుకోండి. అట్లా ప్రతివాడు ఏదో మన గురించి మనం అనుకుంటున్నదంతా తాత్కాలిక సత్యమే.

అంతా! నీ పేరు, నీ ఊరు, నీ కులమూ, నీ జాతి, నీ మతం, నీ దేశం, ఇవన్నీ నీమీద ఆపాదించబడిన సత్యాలు తప్ప నువ్వు కాదుగా! ఇంక పదవులు, వాటిల్లోనూ ఉంటే ఇంకా ఎక్కువ మార్పులు వచ్చేస్తుంటాయి. ప్రతివాడు నేను IAS అనుకుంటాడు కదా! ఆ పేరు పక్కన IAS అలవాటు అయిపోతుంది. పేరే అనవసరం అంటే, పేరు పక్కన IAS అలవాటు. IAS retire అయిపోయావు, అయినా IAS retired అని పెడతావు. అదెందుకు? అంటే ఎంత మనకి మారుతున్నటువంటి ప్రకృతి. అది నిత్యం మారుతూ ఉంటుంది. దేనితో నీ identity? నువ్వు దేనితో నిర్వచించుకుంటున్నావు? అసలు నేనవరు? నేను మనిషినా? కాదు. పశువా? కాదు. పురుషుడివా? కాదు. స్త్రీనా? కాదు. తత్వానికి స్త్రీ ఏమిటి, పురుషుడు ఏమిటి, జంతువేంటి, చెట్టేంటి? ఏమీ కాదు కదా! అవన్నీ దాని చుట్టూ ఏర్పడినటువంటివి. ఈ నేననే ప్రజ్ఞను గురించి రోజూ బాగా ఆలోచించాలి.

ఈ "నేను" ఎప్పుడూ ఉంటుంది. ఈ నేను చుట్టూ రకరకాలుగా పొరలు ఏర్పడుతుంటాయి. పొద్దునే లేవగానే నేను శరీరంలో మేల్కొన్నప్పుడు, అప్పుడు నువ్వు... చూసావా బయటకెళ్ళేటప్పుడు ఏ విధంగా ఆ hanger కి ఉన్న చొక్కానో, బనీనో వేసుకుని ముందు ఇంట్లోంచి బయటకి వస్తావు. ఇంకొంచెం బయటకు వెళ్ళాలంటే ఇంకొంచెం వేసుకుంటూ ఉంటావు. అట్లా అన్నీ తొడుక్కుంటూ ఉంటావు. పేరు తొడుక్కుంటావు. శరీరం కూడా పొద్దున్నే అందులో ప్రవేశిస్తాము మనం. రాత్రి నిద్రపోయేటప్పుడు శరీరంలోనే నిద్రపోము మనం. ఎంత మంచి ఇల్లు కట్టుకున్నా ఇంట్లో కూడా ఉండవు. ఈ ఇంట్లోనే ఉండవు, ఆ ఇంట్లో ఏం ఉంటావు? కాకపోతే ఎక్కడికి వెళ్తున్నావో తెలియదు. మళ్ళీ తెల్లవారేసరికి వచ్చేస్తావు. మధ్యమధ్యలో మెలుకువ వచ్చినప్పుడు వచ్చేస్తావు. దానికి నిదర్శనం స్వప్నావస్థ. స్వప్నంలో నువ్వు బయటకి వెళ్తున్నావు కదా! వేరే ఊరు వెళ్తుంటావు. వేరే మనుషులని కలుస్తూ ఉంటావు. తెలియని చోట్లకి వెళ్తావు, తెలిసిన చోట్లకి వెళ్తావు. అన్నిటికీ వెళ్తూ ఉంటావు. ఎలా వెళ్తున్నావు? ఇక్కడే ఉన్నావు కదా! మరవన్నీ ఎలా వచ్చాయి నీకు అనుభూతి? స్వప్నం ఏం చెప్తుందంటే నువ్వు నిద్రలో శరీరంలో అలా ఉండిపోవు అని చెప్తుంది. నీవు అలా విహరిస్తూ ఉంటావు. ఏ రూపంలో విహరిస్తూ ఉన్నావు? నీ రూపం నీకు కనబడదు. చాలా తక్కువ మందికి స్వప్నంలో వాళ్ళ రూపం కనిపిస్తుంది. మీరే ఆలోచించుకోండి. యోగవిద్యలో ఉన్నటువంటివారికి, ఇప్పుడుగాని, పూర్వజన్మలోగాని, వాళ్లకి స్వప్నంలో తమ రూపం తమకి కనిపిస్తుంది. అది ఒక పెద్ద సిద్ధి. తాము ఉంటారు తప్ప, తన చుట్టూ అన్నీ కనిపిస్తాయి తప్ప, తాము ఎలా ఉన్నాము? ఎందుకంటే, శరీరం అక్కడ మంచం మీద ఉంది కదా! అంచేత నీకేం తెలుస్తుంది? కనీసం ప్రజ్ఞగా నువ్వు బయటకు వెళ్లినట్టు తెలుస్తుంది. ప్రజ్ఞగా నువ్వు బయటకు వెళ్ళినప్పుడు ఏ రూపంతో ఉన్నావు? కనీసం ఈ మంచం మీద పడుకున్నటువంటి పాంచ భౌతికమైనటువంటి శరీరం కాదు. అలాంటి దానితో నువ్వు బయటకి వెళ్ళిపోతున్నావు. ఎలా వెళ్తున్నావు? నీకు తెలిసి వెళ్ళడం లేదు. ప్రకృతి ఏర్పాటు చేస్తోంది. యోగంలో అదే తెలిసేటట్టుగా ఏర్పాటు చేస్తారు. యోగవిద్యకి నిద్రావిద్యకి తేడా ఏమిటంటే నిద్రలో తెలిసీ తెలియక ప్రకృతి ఆధారంగా వెళ్ళిపోతూ ఉంటాము బయటకి. యోగంలో స్పష్టంగా తన ఆధీనంలో తాను ఉండి, స్వాధీనంతో బయటకెళ్ళి, తనకు అందింపబడినటువంటి కార్యక్రమాలు నిర్వర్తించుకుని, మళ్ళీ తనకు తాను తెలిసి శరీరంలో ప్రవేశిస్తాడు.

ఏది ఏమయినప్పటికీ ఈ శరీరం నువ్వు కాదని ఒకటి గుర్తు ఉండాలి. అంచేత, మనం ఆడ, మగ, అవన్నీ కాదు. నేననే ప్రజ్ఞకి ఇవన్నీ ఏమీ లేవు. అది ఎప్పుడూ ఉంటుంది. అదే నేను, అదే నువ్వు. ఎప్పుడు ఎవరు నేను అన్నా అది అని గుర్తు రావాలి. దానికి చుట్టూ ఏర్పడిన ఆవరణలు ఉన్నాయే, ఆ ఆవరణలు రకరకాల సంబంధాలు ఉన్నాయి. మిత్రవర్గాలు ఉన్నాయి, శత్రువర్గాలు ఉన్నాయి, తటస్థవర్గాలు ఉన్నాయి, విదేశీవర్గాలు ఉన్నాయి, స్వదేశీవర్గాలు ఉన్నాయి. ఇంక అక్కడి నుంచి రకరకాల ఆవరణలకి సంబంధించినవి ఉన్నాయి తప్ప తనకి లేవు. అందుకనే, మీకు భాగవతంలో పద్యము భగవంతుడిని గురించి చెప్తూ గజేంద్రుడు పాడుతున్నట్టుగా ఒక పద్యం ఉంటుంది. "*స్త్రీ నపుంసక పురుష మూర్తియునుగాక, తెలియ గమన నారాది మూర్తియునుగాక వెనుకనుండియు తానుల్ విభూజలించు*" అని. స్త్రీ కాదు అది, పురుషుడు కాదు, నపుంసకుడు కాదు, తిరిగేవి కాదు, తిరగకకుండా ఉండేవి కాదు, ఏమీ కాదు. కానీ అన్నిట్లోనూ అది నిండి ఉంది. అంచేత, అలాంటి తత్వం నేను అనేటటువంటిది మన గురించి మన identity మనం ఒకటి ఏర్పాటు చేసుకోవాలి. అక్కడి నుంచి నాకిది పెట్టిన పేరు తప్ప ఇది నేను కాదు అనేది స్పష్టంగా తెలుస్తూ ఉండాలి. నేను నిత్యుడిని. నేను ఎప్పుడూ ఉంటాను. నాకు ఇలాంటి పేర్లు ఎన్నో ఇదివరకూ వచ్చాయి. ఇంకముందు కూడా వస్తాయి కానీ అవి నేను కాదు అని తెలిసి ఉండాలి. అలాగే ఈ రూపం నేనా? కాదు. నీ రూపం నువ్వు చూస్తుండగానే మారిపోతూ వస్తోంది కదా! ఇప్పుడు పదేళ్ళక్రితం చిత్రపటం, ఇవ్వాళ్ళ చిత్రపటం చూస్తే తేడా ఉంటుంది కదా! ఎంచేత? శరీరానికి మార్పు అనేది సహజం. శరీరం మారుతున్నా నేను మారుతున్నానని అనుకోడు కదా ఎవడూ! ఎంతసేపూ ఎదుటి వాడు చెప్పాల్సిందే, నీకు పొట్ట వచ్చింది, నీకు పొట్ట తగ్గిందని. మనకేం తెలియదు. ఎప్పుడు తెలుస్తుంది? బెల్టు వాడుకుంటే తెలుస్తుంది! లుంగీలు కడితే ఏం తెలియదు. అలాగే వాళ్ళు చీరలు కడితే ఏం తెలియదు.

మార్పులన్నీ జరుగుతుంటే తెలియకుండా జరిపించే గొప్పదనం ప్రకృతిలో ఉంది. మార్పు జరుగుతూ ఉంటుందిగానీ జరుగుతున్నట్టుగా తెలియదు. అది ఎప్పుడూ గమనం ఉంది ప్రకృతిలో. కానీ గమనం లేనట్టుగా కనిపిస్తుంది. అందుకనే, నాగతత్వం ప్రకృతికి చెప్తూ ఉంటారు. "గ" అంటే గమనము. "ఆగ" అంటే గమనము లేకుండుట. "న" "ఆగ" అంటే గమనము లేనట్లుగా నడిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు భూమి తిరుగుతోంది. ఇరవైనాలుగు గంటల్లో ఒక round కొట్టేస్తుంది. ఏం తెలుస్తోంది మనకి? శిరోభవ, వరదోభవ... ఇక్కడ చాలా standard గా, stable గా ఉన్నాం అనుకుంటాం కదా! ఇంత వేగంగా తిరుగుతుందని మనకేం తెలియదు కదా! తిరుగుతున్నా తెలియకుండా తిప్పుతోందే ఆ తత్వం ప్రకృతి. పెరుగుతున్నా పెరుగుతున్నట్టు తెలియదు మొక్క. చాలా బాగా గమనిస్తూ ఉన్నా ఆ మొక్క ఎప్పుడు అలా బయటకి వచ్చిందో తెలియదు అందులోంచి. ఇప్పుడు విత్తనం వేసాం. అదలా వచ్చేస్తుంటుంది. రోజూ కొన్ని లక్షల మార్పులు జరుగుతూ ఉంటే అది అలా పెరుగుతూ ఉంటుంది. గమనించే వాడికి మార్పు తెలుస్తుంది. గమనించని వాడికి మార్పు తెలియదు.

ఎవరికి మార్పు తెలుస్తుంది? ఎవరికి మార్పు తెలియదు? మారని తత్వమునందు తాను ఉంటే మారుతున్న తత్వాన్ని గమనించగలడు. మారని తత్వంగా తాను ఉంటే మారుతున్న ప్రకృతిని గమనించగలుగుతాడు. లేకపోతే గమనించలేడు. అలా గమనిస్తూ ఉంటే ఏం తెలుస్తుందంటే... అందుకనే, చిన్నతనం నుంచి ఒక reivew వేసుకోవాలి.

మన గురించి మొట్టమొదట నీకు జ్ఞాపకం ఎప్పుడు వచ్చింది నీ జీవితం ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే? అందరూ యాభై పైన పడే ఉంటారు కదా, నలభై పైనో... మొట్టమొదట, what is your first event you remember in life? ఈ జీవితంలో? వెనక్కి తర్వాత వెళ్ళవచ్చు. ఈ జీవితంలో మొట్టమొదట గుర్తువచ్చేది ఏ సంవత్సరంకి సంబంధించినది ఉంది? అక్కడినుంచి ఒక్కొక్కటీ ఒక్కక్కట్టీ ఎలా మారుకుంటూ వచ్చాయి నీలో? ఆ మారుతున్నవన్నీ మారుతూనే ఉన్నాయి కదా! అలా కష్టపడి సంపాదించి ఒకాయన నలుగురు పిల్లలికి నాలుగు bedrooms, తనకీ తన భార్యకి ఒక bedroom, తన తల్లిదండ్రులకి ఒక bedroom, ఆరు bedrooms తో ఒక ఇల్లు ఒకటి కట్టుకున్నాడు, రెండు అంతస్థులు. కొంతదూరం వెళ్ళేసరికి ఏమయ్యింది? పిల్లలు చదువుకోవడం, పెళ్ళిళ్ళు చేసుకోవడం, వేరే ఊళ్లు వెళ్ళిపోవడం, ఒక్కొక్కళ్ళు. మధ్యలో తల్లిదండ్రులు కదా! చివరికి ఇద్దరు మిగిలారు, ఆరు bedrooms మిగిలాయి. ఆ తర్వాత ఈ రెండిటిలోనూ ఒకటి వెళ్ళిపోతుంది కదా! ఇట్లా ఈ జరుతున్న మార్పులన్నీ ఒక అరవైయేళ్ళకి కథ వేసుకున్నాం అనుకోండి, ఎన్ని మార్పులు జీవితంలో వచ్చినాయి? ఈ మొత్తంలో ఎప్పుడన్నా నువ్వు మారావా? నేను నేనుగానే ఉంటావు కదా! నేను చుట్టూ ఇన్ని మార్పులు జరుగుతుంటే నీ జీవితమే నీకు ఒక సినిమాలాగా కనిపిస్తుంది. ఈ సినిమాలో ఈ మారుతున్నవి మనం అయిపోయాము అనుకోండి, అది మనం ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడిలాగా అయిపోతుంది.

పిల్లవాడు చదువుకున్నాడు. వాడిని బాగా చదివించాలని కష్టపడి చదివించాం. Tuitions పెట్టించాం, donation కూడా కట్టాం, వాటిలోనూ వీటిలోనూ చేర్పించాము. వాడు ఎట్లాగో అట్లా కిందామీదా పడి మన బాధ పడలేక బాగా చదువుకుని, వాడికి ఉద్యోగం వచ్చేసింది. పెళ్లి చేసుకుని అమెరికా వెళ్ళిపోయాడండి. ఊరికే ఉదాహరణ. అంటే వాడితో మనం పట్టిన కుస్తీ ఎక్కడి నుంచి ఉంటుంది? ఎడో క్లాసు నుంచి ఉంటుంది. అక్కడి నుంచి పదో క్లాసు వరకూ – అదో నాలుగేళ్ళు. ఇంటర్ రెండేళ్ళు. ఆ తర్వాత వాడు BE చదువు – ఇంకో నాలుగేళ్ళు. మొత్తం పదేళ్ళు. ఆ తర్వాత అవీ ఇవీ చదివించి ఎదో ఒక పదకొండేళ్ళ, ఒక పుష్కర కాలం వాడితో నానాకుస్తీలు పడతాం. వాడు తయారవుతాడు, readymade product అప్పుడు. అవ్వంగానే ఆ product కొనుక్కోడానికి ఎవరో ఒకళ్ళు వస్తారు కదా! అంతే కదా! ఆ product తీసుకుని వాళ్ళలా వెళ్ళిపోయారనుకోండి. నీకు ఏమయ్యింది పన్నెండేళ్ళు? నువ్వు చాకిరీ అనుకుంటే చాకిరీ. అనుభూతి అనుకంటే అనుభూతి. ఈ అమెరికా వెళ్ళిపోయినవాడికి రోజూ ఫోన్లు చేసుకుంటూ ఎంతకాలం బతుకుతావు? ఇప్పుడు అమెరికా వెళ్ళిపోయినవాడికి, అనకాపల్లి వెళ్ళిపోయినవాడికి, పక్క ఊరు వెళ్ళిపోయినవాడికి, లేకపోతే పక్క ఫ్లాటులోకి వెళ్ళిపోయినవాడికి, ఇట్లా మనం సాగుతామా? సాగితే బాధ కదా! ఇలా వాళ్ళంతా అంతకుముందు లేరు కదండీ! వీళ్ళు ఎప్పుడు వచ్చారు? నీకు పెళ్ళయిన తర్వాత కదా వచ్చారు! నీకు పెళ్ళి కాకముందు వీళ్ళు ఏరీ? నలుగురు పిల్లలు, వారి పెళ్ళాలు, వాళ్లకీ పిల్లలు, వీళ్ళందరూ ముందునుంచీ ఉన్నారా? నువ్వేగా వచ్చావు! “*ఏకో నారాయణో హరి*” అని చెప్పారు. అంటే, నారాయణుడొక్కడే హరిగా దిగి వచ్చి ఇంతమందిగా ఏర్పడుతాడు. ప్రతి ఒక్కళ్ళూ తాను నారాయణుడికి సంబంధించినవాడని గుర్తులేక, ఈ చుట్టుపక్కల తన చుట్టూ ఏర్పడిన వాటన్నిటితోనూ పెట్టుకున్నారనుకోండి. పెట్టుకోవచ్చు. అనుబంధం వేరు, సంబంధం వేరు, బంధం వేరు. బంధానికి అనుబంధానికీ తేడా ఏమిటంటే, బంధానికీ సంబంధానికీ తేడా ఏమిటంటే, బంధం అంటే వాడున్నా లేకపోయినా వాడి గురించి ఎప్పుడూ

ఆలోచిస్తూ ఉంటాము. ఎదుటగా ఉన్నవాడి సంగతి మర్చిపోయి లేనివాడి గురించి ఆలోచిస్తూ ఉంటారు. ఇట్లా గురుపూజలకి వాళ్ళూ వీళ్ళూ వచ్చారనుకోండి, ఆయన వస్తే ఆవిడ రాలేదా అని అడుగుతారు కదా! ఆవిడ వస్తే ఆయన రాలేదా అని అడుగుతారు. రాని వాడికోసం... ఉన్నవాడితో సవ్యంగా ప్రవర్తించకుండా రానివాడి గురించి ఆలోచిస్తున్నావే అదేం మనసండీ? అట్లాగే జీవితంలో ఉన్న వాటియందు సంబంధం పెట్టుకోకుండా లేని వాటియందు తాపత్రయ పడుతూ ఉంటుంది మనసు ఎప్పుడూ. ఏంలేదో చూపిస్తూ ఉంటుంది. దరిద్రం అది. Negative mind అంటారు దాన్ని. లేనివి చూపించి నిన్ను ఏడిపించేది నీ మనస్సు ఎట్లా అవుతుందండీ? అది నీ శత్రువే కదా! ఉన్నవేవో చూపించి ఆనందం ఇచ్చేటటువంటి మనస్సు కావాలిగాని, లేనివి చూపించి దుఃఖం కలిగించే మనసు మనకెందుకు?

అంచేత, ఈ మనచుట్టూ అలా వచ్చి ఇలా వెళ్ళిపోయే వాళ్ళుంటారే, ఇలా వచ్చి అలా వెళ్ళిపోయేవాళ్ళు ఎంతోమంది ఉంటారు జీవితంలో. చిన్నప్పుడు స్నేహితులు ఇప్పుడు ఉన్నారా? Elementary school లో వాళ్ళని తర్వాత వదిలేస్తాం. వాళ్ళూ వదిలేస్తారు మనని. High school లో వాళ్ళు college కి వచ్చిన తర్వాత వదిలేస్తాం. college వాళ్ళని university లో వదిలేస్తాం. University నుంచి జీవితాల్లోకి రావడం. ఎక్కడో ఎప్పుడో కలిస్తే గుర్తు ఉండీ ఉండనట్టుగా గుర్తు వస్తూ ఉంటుంది. అవన్నీ గుర్తు పెట్టుకోవడం... వాళ్ళందరూ నీకు ఎలాగూ కనబడరు కదా! ప్రస్తుతం జరుగుతున్న జీవితంలో నువ్వు రసం అనుభూతి చెందాలంటే అవన్నీ నీకు backdrop గా mind నిండా నిండి ఉంటే ఎదురుగుండా ఉండేది కనిపించదు. అంచేత ఎప్పుడూ ప్రస్తుతం జారిపోతూ ఉంటుంది.

అంచేత, ప్రతినిత్యం యోగ సాధకుడు, తత్వ సాధకుడిగా కూడా బాగా విచారణ చేస్తూ ఉండాలి. అలా మనకి చేసుకోకపోతే ఏం జరుగుతుందంటే మనం ఎవరు అన్న విషయం మర్చిపోతాం. ఇట్లా ఉపన్యాసాలు చెప్తూ ఉండడమే కదా చెప్పండి నా పని జీవితం అంతా! నాకెప్పుడూ పొద్దునే ఏ గురుపూజల్లో అయినా ఈ ప్రశ్నే వస్తుంది. ఈ ఉద్యోగం ఎప్పటినుంచి వచ్చింది? 1977 నుంచి వచ్చింది. అంతకుముందు ఉపన్యాసాలు చెప్పే ఉద్యోగం లేదు. అది క్రమంగా 1984 కి అంత చాలా పెద్ద promotion ఇచ్చేసారు. అంటే పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుని దేశానికి ప్రెసిడెంటుని చేసినట్టుగా అయిపోయింది. అంచేత, ఉపన్యాసాల కోసమే బతుకున్నట్టుగా ఉంటావా? ఉపన్యాసాలు ఇస్తూ ఉంటే నిన్ను చాలా రకరకాలుగా వాళ్ళు దృష్టి పెట్టుకుని చూస్తుంటే అది నువ్వా? ఇలాంటి ప్రశ్నలను, బాగా bottom line అంటారు కదా, అక్కడకి వెళ్ళిపోవాలి రోజూ పొద్దునే. What are you? నేను ఎవరు? నాకు పేరు లేదు. నేనే కాదు, మీకూ పేరు లేదు. ఉందని మీరు అనుకుంటున్నారు. నీ పేరు నీకు పనికి రాదు. ఊళ్ళో వాళ్ళకి పనికి వస్తుంది. అంచేత, నేను నా పేరూ కాదు, నా ఊరూ కాదు. నా చుట్టూ చేరిన వాళ్ళందరూ కాదు. ఇప్పుడు మనం ట్రైనులో బయలుదేరి వచ్చాం. బోల్డుమంది ఎక్కారు మన పెట్టిలో మనతోబాటూ కదా! విశాఖపట్నంలో బయలుదేరిన వాళ్ళకి విశాఖపట్నంలో ఎక్కిన వాళ్ళుంటారు, అనకాపల్లిలో ఎక్కిన వాళ్ళుంటారు, ఎలమంచిలిలో ఎక్కిన వాళ్ళుంటారు, తునిలో ఎక్కిన వాళ్ళుంటారు. కొంతమంది ఎక్కుతూ ఉంటారు, కొంతమంది దిగుతూ ఉంటారు. నువ్వు అట్లా ప్రయాణం చేసావు కదా! ఇట్లా నీ జీవితం అనే ప్రయాణంలో నువ్వు ఒక్కడివే బండి ఎక్కావు. తర్వాత మిగతా వాళ్ళంతా ఎక్కారు. నువ్వు ఎక్కేటప్పటికే బండిలో కొంతమంది ఉన్నారు. మన ఊళ్ళో మనతో start కాలేదు కదా బండి! మనం పుట్టినప్పటికే మన చుట్టూ చాలామంది

ఉన్నారు కదా! వాళ్ళందరూ ఇప్పుడు లేరు. మారారు. కొంతమంది కొత్తవాళ్ళు వస్తుంటారు, కొంతమంది పాతవాళ్లు వెళ్ళిపోతూ ఉంటారు. అలా సాగుతూ ఉంటే, కొంత కొత్త వస్తుంటుంది, కొంత పాత వెళ్ళిపోతూ ఉంటుంది. ఇలా సాగుతూ ఉన్న ప్రయాణంలో నువ్వు ఒక్కడివే అక్కడ. మిగతావన్నీ నీ చుట్టూ మారిపోతాయి. అలా జీవితంలో మనం మొదలు పెట్టినప్పటినుంచి ఇవాళ్టి వరకూ చూసుకుంటే నువ్వు ఒక్కడివే, మిగతావన్నీ వచ్చిపోతుంటాయి. దీన్ని ఒక్క పదంలో చెప్పేసాడు – "*ఆగమా పాయనః*". అన్నీ వచ్చిపోయేవేరా brother అన్నాడు. ఈ కనబడుతున్నటువంటి రాజులందరూ కూడా వస్తారు, వెళ్తారు. వచ్చినదంతా వెళ్లిపోవాలసిందే. ఎప్పుడూ ఉండేది ఉండిపోతుంది.

అంచేత, ఈ నేను అనేటటువంటి తత్వానికి నిన్ను నువ్వు నిర్వచించుకోవడం ఎంత ఎక్కువగా జరుగుతుంటే అంత నీకు! దానికి మార్పు లేదు. ఇలా నువ్వు ఒక్కొక్కటీ ఒక్కొక్కటీ జరుగున్నది చూస్తూ, నీకు ప్రపంచం ఏం పేర్లు పెట్టినా అది నువ్వు కాదని గుర్తు ఉండాలి. ఇది యోగవిద్యలో దీన్ని yoga philosophy అంటారు. Yoga philosohpy ఒకటి ఉంటుంది అభినివేశము అని. అభినివేశము అంటే వేషం వేసుకున్నట్టే. వేషం నువ్వు కాదు అని తెలిసి ఉండడం. లేకపోతే, అందులో దూరావంటే అది నువ్వు అయిపోతావు. ఇప్పుడు వేషం వేస్తూ ఉంటారు. రంగం మీదకి వస్తాడు, డైలాగులు చెప్తాడు, దిగి వెళ్ళిపోతాడు, వేషం తీసేస్తాడు కదా! అందుకనే నాటకాలు ఇచ్చారు మనకి. పెద్ద కళ, పెద్ద విద్య అది. ఒక పాత్రధారణ చేస్తే అది కేవలం రంగం మీదకి వచ్చి, అది నటించి, ఆ పద్యాలు పాడి, ఆ సంభాషణలు చేసి, రంగంమీద ఉండేవాళ్లతో అలా ప్రవర్తించి, మళ్ళీ రంగం దిగేసి దుస్తులు, వేషం తీసేస్తే అంతకుముందు నువ్వు రంగంలో కలిసిన మనుషులతో నీకుండే సంబంధం అలా ఉండదు కదా! నాటకరంగం అనండి, లేకపోతే సినిమా అనండి. నువ్వు ఒక వేషం వేస్తావు. పోనీ తక్కువ ఎందుకు? హీరోనే అనుకుందాం! అట్లాగే ఒకావిడ హీరోయిన్ వేషం వేసింది. మీ ఇద్దరూ ప్రేమించుకున్నట్టుగా చాల రక్తికట్టించేటట్టుగా చూపిస్తారు. ఈ scene అయిపోయిన తర్వాత, బయటకెళ్ళిన తర్వాత ఆ సంబంధం ఉందా? ఆవిడకి ఒక మొగుడు ఉంటాడు, నీకూ ఒక పెళ్ళాం ఉంటుంది. కుదరదు కదా! అది కేవలం నాటకరంగానికే కదా పరిమితం! రాముడు వేషం వేసినంతమాత్రాన బయటకు వెళ్ళి వాడు బీడీలు తాగకూడదనేం ఉంది? రాముడు పాత్రధారి బయటకెళ్ళి బీడీలు తాగితే రాముడు బీడీలు తాగుతున్నాడు అనం కదా! ఇలా మనం రోజూ పాత్రధారణ చేస్తూ ఉంటాం. ప్రతినిత్యం పాత్రధారణ చేస్తూ ఉంటాం. ఆ పాత్రధారణ ఎంత బాగా చెయ్యాలి? రక్తికట్టించేటట్టుగా చెయ్యాలి. రక్తికట్టించేటట్టుగా ధరించి పాత్రధారణ మనం చేస్తున్నప్పటికీ అది నటనే అనే సత్యం ఎవడికయితే తెలిసి ఉంటుందో వాడే నిజమైనటువంటి నటుడు. నువ్వు ఎంత బాగా పాత్రధారణ చేసినా ఊరంతా ఆ పాత్రతోనే ఎక్కువ identify చేసినా నువ్వు అది కాదని నీకు తెలుసుగా! మన తెలుగువాళ్ళకి రాముడన్నా, కృష్ణుడన్నా ఒకడే కదా! ఎన్టీవోడు అంటూ ఉంటారు కదా! బయటకొచ్చిన తర్వాత నేను రాముడంటే ఒప్పుకుంటారా? కృష్ణుడంటే ఒప్పుకుంటారా? కాదు కదా!

అలా ప్రతీదీ పాత్రధారణే. ఈ గురువనేది ఒక పాత్రధారణ. ఈ గురువు అయిపోకూడదు. అట్లాగే శిష్యుడనేది ఒక పాత్రధారణ. వాడూ జీవుడే. అందుకనే, "*సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై*", "*అవతుమామ్ అవతువక్తారం*". అదేంటండీ, మా గురువుగారికి నేను protection కోరడం ఏమిటండి అని అడగచ్చు కదా! వాడికీ

protection కావాలి. నీకెంత protection కావాలో వాడికీ అంత protection కావాలి. ఆ స్థితిలో అందరూ జీవులే. ఏమిటి గురువు పరిస్థితికి శిష్యుడు పరిస్థితికి తేడా? మార్పు చెందని తన సహజ స్థితిలో ఉంటే గురువు. లేకపోతే గురువు అని ప్రపంచం పిలిచినా వాడు కాకపోవచ్చు. ఎందుకంటే, ప్రతిదానికీ కంగారు పడుతున్నాడనుకోండి. అయినదానికీ కానిదానికీ కంగారు పడేవాడిని గురువు అంటే ఎట్లా? ప్రతి చిన్న విషయానికీ తొట్రుపాటు, భయం, ఆందోళన, అరుపులూ, ఇట్లా వచ్చేసాయనుకోండి. అంటే ఏమిటి? సన్నివేశంలో వీడు మారిపోతున్నాడనేగా అర్థం? ఎలాంటి సన్నివేశంలో కూడా మారకుండా స్థిరమైన ప్రజ్ఞ కలిగి ఉంటాడో... వాడు ఎందుకలా స్థిరమైన ప్రజ్ఞ కలిగి ఉన్నాడు? మిగతావాళ్ళు ఎందుకలా గందరగోళ పడుతున్నారు? ఎందుకు స్థిరంగా ఉన్నాడంటే, మార్పుని గమనిస్తూ, మార్పు లేనివాడిగా ఉంటే నువ్వు అప్పుడు స్థిర ప్రజ్ఞుడివి అంటారు. స్థిరము చెందినటువంటి ప్రజ్ఞ అది. అలాంటి ప్రజ్ఞ నేను అనేటటువంటిది రోజూ గుర్తు చేసుకోవడం వల్ల మాత్రమే అది క్రమంగా నిలబడుతుంది. లేకపోతే నిలబడదు.

మనలో కొంతభాగం మార్పు చెందనిది, శాశ్వతమైనది ఉంది. అది మనమే. మనలో కొంత భాగం మార్పు చెందేది, శాశ్వతం కానిది ఉంది. అది మన చుట్టూ ఏర్పడింది. అది మనం కాదు. అది తెలియాలి ముందు. ఇది తెలియకుండా ఎన్ని ఉపన్యాసాలు విన్నా, ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా, ఎన్ని తీర్థాలు మునిగినా, ఎన్ని వ్రతాలు చేసినా, అభిషేకాలు చేసినా, హోమాలు చేసినా, పూజలు చేసినా, ఏం చేసినా, ఈ నిత్య-అనిత్య వస్తు వివేకం లేకపోతే ఏదో గుడ్డెద్దుచేలో పడ్డట్టుగా అట్లా దశాబ్దాలు పాటు అందులో పడి తిరుగుతూ ఉంటాం.

“నేను”, “నాది”, “నావి” అని చెప్పారు. నాది, నావి వాటియందు మనకి కర్తవ్యం ఉంటుంది. నాది నేను కాదు. నా పిల్లవాడంటావు, నీ మాట వినడు కదా! మా ఆవిడంటావు, పెళ్ళాం మాట వినదు కదా! గట్టిగా మాట్లాడితే నా కాలు అంటే అదే వినదు ఒక్కోసారి, లేవదు కదా! ఈ నాది, నీది కాదు. అది బాగా గుర్తుపెట్టుకోవాలి. అది నాది, నాది, నాది అంటూ దానితో బాగా చచ్చిపోతూ ఉంటామే, ఎంత నువ్వు చచ్చిపోతుంటే అంత నీకు బాధ తప్ప, అదలాగే ఉంటుంది. అది తెలిసినాయనకి పక్షవాతం వచ్చిందనుకోండి. అదేం సార్, మీకలా పక్షవాతం అంటే, నాకు పక్షవాతం లేదు, అది లేవట్లేదు అంటాడు. అంతే! అది లేవట్లేదు, ఇన్నాళ్ళు లేచింది, ఇప్పుడు లేవట్లేదు. మీరు మహాత్ములతో సంచరిస్తే వాళ్ళ మాటలు వినాలి, బావుంటాయి. ఈ శరీరాన్ని చూపించి “ఇది” అంటూ ఉంటారు. మనకి ఇది ఏమిటి? ఇది అయిపోయి, ఇది నేను అనుకుంటూ ఉంటాం కదా! నాకు జ్వరం వచ్చింది, నాకు తలకాయ నొప్పి వచ్చింది, నాకు ఆకలి వేస్తోంది, నాకు అజీర్తి చేసింది. అంతా నాకు, నాకు, నాకు. నాకు కాదు కదా! నా శరీరానికి ఆకలి వేసింది అని తెలిసినవాళ్ళు ఉన్నారు. వాళ్ళు ఇప్పుడేం దొరకదు, కాసేపు ఆగు అని చెప్తే, ఆగుతుంది తెలుసా! ఎప్పుడూ? నీవు, నీది — ఈ రెండిటికీ మధ్యా ఉండే ఉల్లిపొర దాదాపు బాగా గుర్తించినప్పుడు. ఈ రెండూ ఒకటే. అదీ ఇదీ కలిసిపోతే, పెడా-బెల్లం కలిసిపోయినట్టుగా ఉంటుంది. అలా కలుపుకు పోకూడదు యోగ సాధకుడనుకునే వాడు, భక్తుడనుకునే వాడు, జ్ఞాన సముపార్జన చేస్తున్నాననుకునే వాడు. బట్టమీద సిరా పడితేనే ఒంటిమీద పడిపోయినంత బాధ పడిపోతారు కదా! బట్టమీదే కదా పడ్డది? పోనీ ఒంటిమీదే పడ్డది. ఏమిటట?

నువ్వు ఎవరు అనే ప్రశ్నకి నీకు బాగా సమాధానం దొరికేంత వరకూ నీకు ఎప్పటికీ పరిష్కారం రాదు. అందుకని, **what is is permanent, what is impermanent? What is eternal? What is transitory?** ఏది ఎప్పుడూ సత్యం, ఏది ఎప్పుడూ నిత్యం అనేటటువంటిది తెలుసుకోడానికి ప్రయత్నం బాగా జరుగుతూ ఉండాలి ఒక పక్క. ఎన్నో జరుగుతూ ఉంటాయి, ఎన్నో వస్తూ ఉంటాయి, ఎన్నో వెళ్ళిపోతూ ఉంటాయి. అలాగే ఇట్లా ఈ శరీరం నుంచి పుట్టి అలా నత్తకి నత్తగుల్ల ఏర్పడట్టుగా ఏర్పడిపోతుంది ఇదంతా కదా! నత్త నుంచి ఎట్లా ఒక స్రవించి నత్తగుల్ల ఏర్పడిపోయి, దాన్ని మోసుకుని తిరుగుతూ ఉంటుంది కదా నత్త! మనం అదేగా! శరీరం మోసుకుని తిరుగుతూ ఉంటాం, దేవుడా! అని ఈడ్చుకుంటూ పోతూ ఉంటాం కదా! ఎందుకిలా అయ్యింది? ఇది నేను అనుకోవడం వల్ల. ఇది కాకపోతే ఇంకోటి, మన నుంచి వచ్చిందే కదా! ఇది కాకపోతే ఇంకోటి అనే ధైర్యం ఉందా? నా నుంచి వచ్చింది కదా! మన్నుంచి వచ్చినవాటి వెంట మనం పడ్డామనుకోండి, అంతకన్నా అపహాస్యం ఇంకోటి లేదని చెప్తారు. బ్రహ్మదేవుడు తన నుంచి వచ్చిన వాక్కు వెంటబడి వెళ్ళిపోయాడండి. ఋషులందరూ పకపకా నవ్వరాట. నీ నుంచి పట్టుకొచ్చిన దాని వెంట నువ్వు పడితే ఇంతకన్నా ఏముందయ్యా, ఇంక సృష్టి ఎవరు చేస్తారు? నువ్వు కూర్చుని స్థిరంగా ఉండి, నీ నుంచి అన్నీ పంపిస్తే సృష్టి ఏర్పడుతుంది తప్ప, నీ నుంచి వచ్చిన సృష్టిలో నువ్వే పరిగెడుతూ ఉంటే ఇంక ఆ సృష్టి ఎంత అవకతవకగా ఉంటుంది అని చెప్పారు. అలాగే మన నుంచి పుట్టినటువంటివి బోల్డు ఉంటాయి కదా! మన నుంచి పుట్టినవాటిమీద మనకి స్వామిత్వం ఉండాలి. అది ఏదయినా కావచ్చు. అది ఉద్యోగం కావచ్చు, వ్యాపారం కావచ్చు, సంతానం కావచ్చు. నీ నుంచి వచ్చిన వారందరి మీదా నువ్వు ఆధారపడుతుంటే, క్రమంగా జీవితం బానిస జీవితం అయిపోతుంది. నీ నుంచి వచ్చినవి నీ మీద ఆధారపడి ఉన్నాయి.

నేను స్థిరంగా ఉంటే నా చుట్టూ ఉండేవి స్థిరంగా ఉంటాయి. నేనే స్థిరంగా లేకపోతే, foundation స్థిరంగా లేకపోతే... మనకి foundation ఎక్కడుంది? నీ spinal column బాగాలేదనుకోండి, ఇంక ఆ శరీరం ఏం పని చేస్తుంది? చిన్న తేడా చాలదూ? ఏమిరా రాలేదే అంటే పడుకున్నాడంటాడు. ఎందుకంటే, వెన్నుముక నెప్పి అంటాడు. పూస జారిందంటాడు, పూస అరిగిందంటాడు. పూస అరగదు. పూసకీ పూసకీ మధ్య ఉండేవి అరుగుతాయి. మరీ వార్ధక్యం వస్తే పూసలు కూడా అరిగిపోతాయిలెండి. ఇట్లా ఇవన్నీ జరుగుతున్నాయనుకోండి, నీ foundation దెబ్బతింటే, ఇంక నువ్వు దెబ్బ తిన్నట్టే కదా! కానీ మనిషికి foundation ఏది? "నేను" అనే ప్రజ్ఞ. ఈ "నేను" ఎప్పుడూ ఉంటుంది అని చెప్తాడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో. ఈ "నేను"గా నేను శాశ్వతుడను. నీవు కూడా "నేను"గా శాశ్వతుడవు అని చెప్తాడు కృష్ణుడు. ఇంక మిగతావన్నీ అశాశ్వతము అన్నాడు. ఇప్పుడు నేను మీకు ఇవ్వాళ్ళ చెప్పదలుచుకున్నదేమిటంటే అసలు ముందు "నేను"ను "నాది"తో విడదీసెయ్యండి. అంటే అవగాహనకే! తెంపెయ్యండి ఈ కత్తెర తీసుకుని! అది అవగాహన. "నేను", "నాది". నేనుగా నా భావాలు చూస్తూ ఉండండి. నేనుగా నిలబడి నా భావాలు చూస్తూ ఉంటే క్రమంగా ఆ భావాలన్నీ నీ నుంచి పుట్టేవేగా! నీకు వాటియందు పెద్ద ఇష్టం లేకపోతే అవి అంత పుట్టవు. కాని నేనుగా నిలబడి నీ భావాలు గమనించాలి. మనం నేనుగా నిలబడకుండా భావంగా భావాలని గమనించాలని చూస్తూ ఉండడంచేత భావాలూ భావాలూ కలిసిపోయి, ఇలా గింగిరాలు కొట్టించేస్తుంది, తలనొప్పి వస్తుంది. ఏమిటో

meditation చేస్తేనండి headache వస్తుందంటూ ఉంటాడు. వస్తుంది! కొంతమందికి headache వస్తుంది, కొంతమందికి నిద్ర వస్తుంది, కొంతమందికి గురకలు వస్తాయి, కొంతమందికి దురదలు వస్తాయి. అంటే తమాషాగా ఉంటుంది. మనం చేయ్యట్లేదనుకోండి meditation, మిగతా వాళ్ళంతా ఎలా చేస్తున్నారో చూస్తూ ఉండొచ్చు కదా! వీడు గోక్కుంటున్నాడు, అటూఇటూ చూస్తున్నాడు, వీడు నిద్రపోతున్నాడు, ఇవన్నీ కనిపిస్తూ ఉంటాయి కదా!

అంచేత, "నేను" – అది ఎన్ని మార్పులైనా అది "నేను"గానే ఉంటుందండి. ఈ "నేను"ని బాగా అర్థం చేసుకోవడం మన పెద్దలు తత్వవిచారం అని చెప్పారు. అంటే, "తత్ వమ్" అని, "అది నీవే" అని. "తత్" అంటే అది. దాని గూర్చినటువంటి అవగాహన. రెండు రకాల అర్థాలు చెప్పారు. ఇది లేకుండా మనం ఊరికే ఎదో CVV అని, లేకపోతే ఇంకోటని, మరొకటని, బోల్డు చేస్తూ ఉంటాము కదా! వంట అవ్వదు. ఎదో అన్నీ పోగేసుకుంటాము. నువ్వు అనుకునే విధంగా వంట కాదు. అందుకని, "నేను" స్థిరంగా నిలబెట్టి, "నాది" వాటిని కావాలంటే సర్దుబాటులు చేసుకోవచ్చు. "నేను", "నావి" కలిపేసుకున్నవారికి ఏ సర్దుబాటులు జరగవు. అంచేత మన వాఙ్మయం ముందు "నేను"ని ఆవిష్కరిస్తుంది. "నేను"ని ఆవిష్కరించడంలోనే నీకు సగం పరీక్ష అయిపోతుంది.

"నేను నేనైన నేను". ఇది విన్నారు కదా మీరు! ఇది ఎక్కడినుంచి వచ్చింది? ఈ నేను ఏర్పడడానికి కథ ఉంది. ఒకే ఒక తత్వం మూడు గుణముల ద్వారా ఒక్కొక్క నేనుగా వస్తుందండి. ఒకే నేను మూడు గుణముల ద్వారా అనేక నేనులు అవుతూ ఉంటుంది. ఒకే నేను – ఒకే పిండి రకరకాల పదార్థాలుగా తయారయినట్టు, ఒకే లోహం రకరకాల ఆభరణాలుగా తయారయినట్టు. ఏమిటి వీటికి ఆధారం అంటే త్రిగుణములు అన్నారు. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు, లేక సత్వ రజస్సు తమస్సు గుణములు. వీటి ద్వారా మొట్టమొదటి మార్పు నేనుకి జరుగుతుంది. అంతటా వ్యాప్తి చెందినటువంటి నేను సమస్తమునకూ ఈశ్వరుడైన నేను ఒక త్రిగుణముల ద్వారా దిగివచ్చినప్పుడు నేనుగా గుర్తు ఉంటే ఈశ్వరుడివే నీవు. గుణములు దాటి మనమందరమూ ఈశ్వర తత్వమే. మొత్తం వ్యాప్తి చెందిన తత్వాన్ని నేనే అంటారు. ఈ మూడు గుణములకి లోబడి ఏర్పడిన వాళ్ళని జీవులంటారు. మూడు గుణములకి లోబడక, మూడు గుణములలో ఉన్నటువంటివాడిని ఈశ్వరుడు అంటారు. మనకి పదాలు చాలా ఉన్నాయి. ఆ పదం, ఒక్కొక్క పదం ఒక్కొక్కసారి ఎందుకా విధంగా వాడారు అనేది తెలియకుండా... ప్రతిదానికీ ఒక re-searching mind ఉండాలి. అంటే నీవు దానియొక్క లోతుల్లోకి ప్రవేశించి ఎందుకీ పదం ఇలా ఇచ్చారు అని. "*ఈశ్వర సర్వ భూతానామ్*" అంటారు. అన్ని భూతములయందు ఈశ్వరుడున్నాడు. వాడే జీవుడవుతాడు. ఎప్పుడో తెలుసా? తాను ఈశ్వరుడని మర్చిపోతే జీవుడవుతాడు. జీవుడయితే ఇతరములైనటువంటి నిర్వచనములని తానుగా భావిస్తూ ఉంటాడు. తాను కానిది తానుగా భావిస్తూ ఉంటాడండి. అందరం ఒకే ఈశ్వర తత్వంలోంచి దిగివచ్చినటువంటి వాళ్ళం. ఈశ్వరులుగా రకరకములుగా అధిష్ఠించి అనుభూతి పొందడానికి ఏర్పరిచిన సందర్భంలో ఈశ్వరుడని మర్చిపోయి జీవుడిగా మేల్కొనడం జరుగుతుంది. ఇప్పుడు మనం చేస్తున్న కార్యక్రమం అంతా దేనికి ఉద్దేశ్యించి చేస్తున్నామో తెలుసా? జీవుడిగా నిద్రపోతున్నటువంటి ఈశ్వరుడు మేల్కోవాలని, జీవుడిగా నిద్రపోతున్నటువంటి దేవుడిని తెలపాలని. అది ఎన్నిసార్లు తెలిపినా జీవుడిగానే ఉంటాడు కదా! అందుకని, తెలిపితే ఒక్కటే ఉపయోగం. తెలియపరచడం గుర్తుచెయ్యడం లాంటిది. దానికో గురువు.

గుర్తుచేసేవాడు గురువు. ఈ గుర్తు చేసింది గుర్తుపెట్టుకుని చక్కగా దాన్ని ప్రతినిత్యం గుర్తుతెచ్చుకుంటూ ఉండేటటువంటివాడు సాధకుడు. అది ఎప్పుడూ గుర్తుండిపోతే వాడు సిద్ధుడు. ఇట్లా మనకి పదాలు ఉన్నాయి.

అంచేత, నేను ఎవరు అన్న ప్రశ్న పొద్దున్నే పుట్టి, అతడే నేను, ఈశ్వరుడే జీవుడైనాడు, జీవుడిగా వేషం ధరించాను, ఈ రోజు నావంతు కర్తవ్యం, కాలమును బట్టి, దేశమును బట్టి నావద్దకు వచ్చేటటువంటి సన్నివేశముల యందు ధర్మాన్ని అనుసరించి నా కర్తవ్యాన్ని నిర్వర్తించి ఈ పూటకి తలదించేస్తాను అనుకోవాలి. అదీ కథ. Everyday the curtains are lifted up. And you play your role. At the end of the day the curtains fall. రోజూ నాటకం వేస్తున్నా, ప్రతిరోజూ కడుక్కుంటూ ఉంటాడు కదా వేషం వేసినవాడు! కడుక్కుని, వాడుగా బయటకొస్తాడు. మళ్ళీ మర్నాడు వేషం వేస్తూ ఉంటాడు. అది రోజూ మనం చేస్తున్నాం. ప్రతిరోజూ వేషం వేసుకోస్తాము. లేవంగానే వేషం వేసుకోస్తాము. అప్పుడు ఏమిటి? మనకి ఎదురుగుండా ఇంకో పాత్ర వస్తుంది. మనమూ పాత్ర ధరించాము, వాళ్ళూ పాత్ర ధరించి వచ్చారు. భార్య అనే పాత్ర కదా ముందు చూస్తాడు భర్త! భర్త అనే పాత్ర కదా భార్య చూస్తుంది! ఇద్దరూ పాత్రధారులే. ఇంకపోతే ఇంట్లో తల్లిదండ్రులు ఉండొచ్చు. లేదా పిల్లలుండొచ్చు. అన్నీ పాత్రధారులే. ఇలా గుర్తు ఉందనుకోండి, ఇహ వాడికి... అలా గుర్తున్నంత మాత్రాన బాగా నటిస్తున్నాడా, బాగా నటించట్లేదా? బాగా నటించేటటువంటి వాడు వివిధ సన్నివేశాల్లో రక్తికట్టిస్తాడు. అంటే, చెయ్యవలసినది సంపూర్ణంగా, ఆనందం కలిగించేటట్టుగా రసోపేతంగా చేస్తాడు. కాని దానికి తగులుకోడు. అది కావాలి. ఇప్పుడు పాత్రధారణ చేసామండి, ఒక హరిశ్చంద్రుడు, కాటిక scene అనుకోండి. ఓ! వేదాంతం పద్యాలు బోల్డు చదువుతూ ఉంటాడు కదా! అవన్నీ అలా చదివేసి, “మాయామేమి జగంబు నిత్యమని నా ఇల్లాలు నా కుమారుడు అటులుచున్”. ఇట్లా పద్యాలు పాడేసి, ఆ తర్వాత అయిపోయింది దిగమన్నారనుకోండి. దిగి, ఇంక అదే mood లో ఉంటాడా చెప్పండి? ఈ రంగం దిగి బయటకొచ్చిన తర్వాత అట్లాగే ఏడుస్తూ ఉంటాడా హరశ్చంద్రుడు వేసిన వాడు? ఏడవడే! Scene మారింది కదా! ఒరేయ్! ఓ gold flake పట్టుకురా అంటాడు, ఊదుతాడు. అంతే, అయిపోయింది! ఇంతసేపూ ఏడ్చింది ఎక్కడా! అదేంటిరా అంటే అది నాటకం అంటాడు కదా! ఇదీ అంతే. అందుకనే మన పెద్దలు ఇది కల అన్నారు. కలలో తోచినవన్నీ సత్యములా అని ఒక పద్యం ఉంది భాగవతంలో. ఎందుకని? లేవంగానే పీడకలలైతే, ఓహో! కలేగా అనుకుంటాం కదా! అంత భయంకరమైన crisis సందర్భంలో మెలుకువ వచ్చేసిందనుకోండి, అమ్మో! కల కదా అని దణ్ణం పెట్టుకుని, ఒకసారి ఆంజనేయస్వామిని గుర్తు తెచ్చుకుని పడుకుంటాడు. అయిపోయింది! ఇది కూడా అలాంటి కలే! ఎప్పటికప్పుడు scene లు మారుతూ ఉంటాయి. మారిన scene లో ఆ scene కి నువ్వు ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించడమే తప్ప నువ్వు అది అయిపోకూడదు. వాడు హరిశ్చంద్రుడూ అయిపోకూడదు. అలాగే ఏ పాత్రధారీ బయటకొచ్చిన తర్వాత వేసుకు తిరిగితే కుదరదు కదా! హనుమంతుడి వేషం బాగా వేసినాయన stage దిగి వెళ్ళిన తర్వాత హనుమంతుడిలాగా ఊరిలో తిరిగితే ఒప్పుకుంటారాండి? తోక పెట్టుకుని నేను హనుమంతుడిని అంటే ఒప్పుకుంటారా? ఒప్పుకోరు.

అంచేత, ఈ మొత్తం అంతా కూడా నువ్వు ఒక పాత్రధారి అని తెలియాలంటే నేనెవరు అనేటటువంటిది ప్రతినిత్యం గుర్తు తెచ్చుకోవాలి. Who am I? నేను ఇప్పుడు వెలిగింపబడ్డ ఒక స్థితిలో ఉన్నట్టు, పొద్దున్నే లేచిన

ప్రతివాడు, వాడికి తెలివి వచ్చింది అంటాము కదా! వెలిగింపబడ్డ స్థితిలో ఉన్నాడు. అప్పుడు బొమ్మలు పడతాయి. వెలిగింపబడకపోతే బొమ్మలే పడవు కదా! TV screen, cinema screen అది వెలిగితేనే కదా దానిమీద cinema, TV program! అది వెలగకపోతే కథ లేదు. మనకి వెలుగుతుంది పొద్దునే. మనం వెలిగించుకోము, అదే వెలుగుతుంది. Switch వేసేసరికి ఇంక బొమ్మలు పడతాయి. ఇందులో నువ్వు కూడా ఒక పాత్రధారివే కదా! అంచేత, నీ పాత్రపోషణ నువ్వు చేస్తే, మళ్ళీ నిద్రలోకి వెళ్ళిపోతే ఇవన్నీ ఏం లేవు కదండి రాత్రి నిద్రలో. నిద్రలో నేను charted accountant కాదు, teacher కాదు. ఏం ఉండవు కదా! ఇంకో లోకంలో ఉంటుంది. ఈ లోకం ఉండదు. ఈ లోకం లేచినప్పుడు ఉండే లోకం. పడుకుంటే ఈ లోకం లేదు. స్వప్నంలో ఇంకో లోకం ఉంటుంది. మెలుకవలో ఒక లోకం ఉంటుంది కదా! ఈ రెండూ కాక అసలు నీ లోకం ఏమిటి? ఇలాంటివన్నీ ఆలోచించొద్దండీ? అలాగా ఏమీ ఆలోచించకుండా అవుతుందా? అవ్వదు.

అంచేత, ఇలా రోజూ నేను, నా నుంచి ఇది పుట్టింది, దీనిమీద మిగతావన్నీ సంబంధాలు పుట్టినాయి అనుకోవాలి. అన్నీ దేహ సంబంధాలే. ఆత్మ సంబంధాలు కూడా ఉంటాయి. ఆత్మపరమైన సంబంధాలు కొన్ని ఉంటాయి. దేహపరమైనవి చాలా ఉంటాయి. ఆత్మపరమైన సంబంధాలు మనతో జన్మజన్మలు కలిసి వచ్చేవి ఉంటాయి. అవి గురుశిష్య సంబంధాలు. అలా కాకుండా దేహపరంగా బాగా చాలా సంబంధాలు ఉంటాయి. ఈ దేహానికి వాళ్ళు. ఈ దేహం లేకపోతే వాళ్ళు లేరు. అలా ఉంటాయి. అంటే, ఇందులో కూడా Vizag లో ఎక్కిన వాళ్ళు అనకాపల్లిలో దిగిపోయే వాళ్ళు కొంతమంది ఉంటే, హైదరాబాదు వరకూ వచ్చేవాళ్ళు కొంతమంది ఉంటారు. అలా అన్నమాట. అంటే, terminal to terminal వచ్చే travellers ఉంటారు. మధ్యలో ఎక్కి మధ్యలో దిగిపోయే వాళ్ళుంటారు. ఇది అంతా గమనిస్తూ ఉండాలండి. గమనించడం అంటే జీవితం మొత్తం అనుక్షణం, ప్రతినిత్యం జరుగుతున్న సన్నివేశాన్ని గమనించడమే. యోగ సాధకునికి యోగం సిద్ధించడానికి మూలమైన మంత్రము ఇదే. దానితో కలిసిపోయామనుకోండి దాన్ని అభినివేశము అంటారు. అంటే ఊసరవెల్లి చూడండి, ఏ చెట్టుమీదకి వెళ్తే ఆ చెట్టు రంగులో కలిసిపోతుందండి. ఎవరితోబడితే వాళ్లతో అప్పుడు అట్లా ఉంటుంది, మారిపోతూ ఉంటుందిగాని తాను తానుగా ఉండదు. “ఆకులో ఆకునై, పిందెలో పిందెనై, రంగులో రంగునై” అట్లా అయిపోతుంటే, మాటిమాటికీ మారిపోతుంటే నీకు చావు కూడా ఒక మార్పు కింద భయంకరంగా చచ్చిపోతున్నాడనిపిస్తుంది. అదీ గోల! అమ్మో! చచ్చిపోతున్నాను, ఇంకేం ఉందేమనిపిస్తుంది. అందుకని ఇంత సామెత చెప్పాల్సి వచ్చింది! ఏది గంటసేపు!

చావు కూడా ఒక మార్పే అని ఎప్పుడు తెలుస్తుందంటే... చావు దేనికి? శరీరానికి. నీకు కాదు. నువ్వు ఎప్పుడూ ఉంటావు. ఈ శరీరం లేకపోతే కూడా నువ్వు ఉన్నావు. ఉండబట్టే నీకు అది వచ్చింది. నువ్వు లేకపోతే ఇది రాదు. నువ్వు లేకుండా నీ శరీరం రాదు. నేను అనే ప్రజ్ఞ ఆధారంగా పుట్టిన శరీరం, అది పోతే ఇంకోటి వస్తుంది. రాదూ? ఓ బొమ్మలు తయారుచేసేవాడు, ఓ బొమ్మ పాడయిపోతే ఇంకో బొమ్మ వేస్తాడు. ఆ బొమ్మ చచ్చిపోతే వాడు చచ్చిపోడు కదా! ఇప్పుడు ఎన్ని బొమ్మలు వేసామో, ఎన్ని బొమ్మలు పుట్టించుకున్నామో కదా! ప్రతివాడు ఎన్నో రకాల దేహములు ధరించినటువంటి వాడే జీవుడు. అంటే ఈ దేహం వెళ్ళిపోతుందని తెలియడం ఒక జ్ఞానం. ఎందుకనీ? ఇది వచ్చింది కదా! వచ్చినవన్నీ

వెళ్ళిపోతాయని తెలిసినప్పుడు... భయంగా ఉందా? ఎందుకంటే, బోల్డు వస్తాయి, వెళ్ళిపోతుంటాయి. మరి వస్తే బాగా చేటంత మొహం అయిపోతుంటుంది. వెళ్ళిపోతే మొహం చిన్న మరచెంబులా అయిపోతుంది కదా! మనకి ఇల్లు వచ్చిందనుకోండి జీవితంలో, శాశ్వతమా చెప్పండి. అది ఇల్లుగాని, ఇంకోటిగాని, వచ్చినవన్నీ వెళ్ళిపోవాలని గుర్తుపెట్టుకున్నవాడు ధీరుడు. ఇది కూడా అప్పుడు అలా వచ్చింది, వెళ్ళిపోతుంది, నేను ఉంటాను, వెళ్ళిపోయింది మళ్ళీ వస్తాయి. ధీరులు ఈ విధంగా ఉంటారయ్యా అని చెప్తాడు మొట్టమొదటి అధ్యాయంలోనే శ్రీకృష్ణుడు. ఆయనేమో అక్కడ ఒణిగిపోయి, కాళ్ళు నిలబడక కిందపడిపోయాడు అర్జునుడు. "*అనార్యాజుష్టం అకీర్తికరం అర్జునా*" అన్నాడు. ఇదేంటి ఇలా అయిపోయావు candidate వి? నీకు బోల్డు అపకీర్తి వస్తుంది. ఇది ఆర్యులకు ఉండాల్సిన ఆచారం కాదు. ఎంచేత? నావారనే వారిచేత ముడి వేసుకోవడం చేత. వాళ్ళంతా నావాళ్ళు కదా! అంతకుముందు యుద్ధంలో వాళ్ళని చావగొట్టాడు. ఎన్నో యుద్ధాలు చేసాడు. ఇప్పుడు ఎదురుగా ఈ మమకారం వల్ల అట్లా అయిపోయాడు. మనకి మమకారం అనేటటువంటిది ఒకటి సహజంగా ప్రకృతి ఏర్పరుస్తూ ఉంటుంది. దాన్ని కాదనక్కర్లేదు కాని, దాని నిజస్వరూపం తెలిసి ఉండాలి. ఛీఛీ వీళ్ళెవరూ కాదు అనకూడదు. వాళ్ళు కూడా అలా అనేస్తారు నిన్ను, అయిపోతుంది! ఛీఛీ వీడు నా మొగుడేంటి అని రేపటి నుంచీ అన్నం పెట్టడం మానేస్తే ఏమవుతుంది? అలా కాదు. ఇచ్చింది చక్కగా అనురక్తిగా అనుభూతి చెందుతూ ఉండాలి. కాని సత్యం తెలిసి ఉండాలి.

సత్యమెరిగి, కాలమెరిగి, దేశమెరిగి ప్రవర్తించేటటువంటి వాడు బుద్ధిమంతుడు అని చెప్తుంది భాగవతం. అంచేత ఇది ఒక పక్క గుర్తు ఉండాలి. Under current ఇది ఉంటే, అలాంటి వాడికి ఎన్ని మార్పులు జరిగినా అన్ని మార్పులనీ అంగీకరించుకుంటూ, మరణించే సందర్భంలో, దానిని గమనించే స్థితిలోకి వస్తాడు. ఏది మరణిస్తోంది? నువ్వు కాదు కదా! ఇలా మన మరణాన్ని మనం గమనించేటటువంటి స్థితిలోకి నువ్వు వస్తే అప్పుడు నువ్వు యోగివి. అంతే కాదు. నువ్వు మరణించకముందే ఈ శరీరంలోంచి బయటకొచ్చేసి ఈ శరీరం నేను కాదు అని తెలిసి ఉంటాడు. శరీరం నేను కాదు, శరీరం నేను ధరించి ఉన్నాను అని తెలిసి ఉంటాడు. అది ముందే జరిగిపోతుంది. జరిగిపోవడం వల్ల మనం కారులోంచి ఎలా బయటకొచ్చేస్తామో పని అయిపోయిన తర్వాత అట్లా శరీరంలోంచి ప్రతి రాత్రీ బయటకొచ్చేస్తున్నాడనుకోండి, అది ఒక practice చెయ్యాలి. ఎప్పుడూ కారులోనే పడుకుంటే కారులోంచి బయటకు తీసినా ఏడుస్తాడు కదా! కొత్తగా బూట్లు వేసుకున్న పిల్లవాడు వాడు బూటుతోనే పడుకుంటాడు. బూటు తీస్తానంటే ఏడుస్తాడు కదా! వాడు పడుకున్న తర్వాత ఆ బూటు, ఆ socks తీసేసి పడుకోబెట్టేస్తుంది. అట్లానే మనం నిద్రపోయిన తర్వాత తీసేస్తుంటుంది ఇందులోంచి. మరణం కూడా అంతే. చాలామందికి స్పృహ పోతుంది. స్పృహ పోవడం అంటే anasthesia state అదే. ఆ స్పృహ పోయిన సందర్భంలో తీసెయ్యండిరా అంటే తీసేస్తారు, అయిపోతుంది! మళ్ళీ అందులోకి లేవడానికి ఉండదు. అలా ఎందుకు? మనకి అది shock కదా! ఇప్పుడు మనం ఇందులో ఉంది పడుకుని లేచేసరికి, ఇందులో కాక ఎక్కడో ఉన్నామనుకోండి, ఆ shock లేకుండా ఉండడానికి యోగం ఏం చేస్తుందంటే ముందునుంచీ ఇందులోంచి బయటకెళ్ళి దీన్ని చూడడం నేర్పుతుందండి. అది పెద్ద విషయం కదా! ఇవన్నీ ఉన్నాయని యోగంలో చేరమంటారు. అవన్నీ ఉన్నాయని తెలియకుండా, వాడు దణ్ణం పెట్టాడని వీడు, వీడు దణ్ణం పెట్టాడని ఇంకోడు

దణ్ణం పెడుతున్నారు తప్పు, ఎవడూ యోగం యొక్క స్వరూప స్వభావాలు తెలిసి నిర్వర్తించుతున్నట్టుగా గోచరించదు. Process అదే. ఇదివరకూ మూడు రోజుల్లో జరిగేది, ఇప్పుడు గంటలో అయిపోతోంది. Fast. Aquarian age contributes to speed, gaining time, gaining space. అంటే speed తప్ప యోగం అది.

అంచేత, పైగా తను దగ్గర ఉండి నిర్వర్తింపచేస్తానని ఒక వాగ్ధానం ఉంది. అదలా ఉండగా మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే ఇందులో మనం ప్రవేశించిన వాళ్ళం, ఇందులోంచి వచ్చేస్తాము. ప్రవేశించి నేను రాను అంటే vacate చేయించేస్తారు. అంతే మరి, simple. ఇప్పుడు tenent ఇంట్లోంచి వెళ్ళనంటే? ఈ court లు, గీర్పులు, time తీసుకుంటుంది పన్నెండేళ్ళు, ఇరవైయేళ్ళు, ఫరవాలేదు ఈ లోపల మనం కాలం వెళ్ళబుచచ్చు అనుకుంటే, గుండాలు పట్టుకొచ్చేస్తాడు వాడు. గూండాలే కదా యమదూతలంటే! గుండాలు పట్టుకోచ్చేస్తే భయానికి బయటకొచ్చేస్తావు. అంచేత, ఈ బయటకి రావడం అనేది చూడడానికి అప్పటికప్పుడు వీలు పడదు కదా! మరణిస్తున్నప్పుడు గమనిస్తూ ఉండడం అనేది అప్పటికప్పుడు వీలు పడదు. అందుకని, ఈ గంటన్నర చెప్పిన ఉపోద్ఘాతం అంతా చాలా అవసరం ఉంది. ఏమిటి? ఇది నేను ధరించి ఉన్నాను కానీ ఇది నేను కాదు. ఇవేవి నావి కాదు. ఇవి నా చుట్టూ చేరినాయి. నేను వచ్చిన తర్వాత ఇవి వచ్చినాయి. నేను వెళ్ళేటప్పుడు ఇవేవి రావు నాతో. అందుకనే కదా మనకి ముసలమ్మలందరూ పాడుతూ ఉండేవారు, నెత్తిమీద తెల్ల గుడ్డలేసుకుని ఉండేవారు ఇదివరకూ. ఇప్పుడు లేరు వాళ్ళు కదా! వాళ్ళు పాడుతూ ఉండేవారు గీతాలు "వస్తా వట్టిదే పోతా వట్టిదే" అని. అప్పటికే బోడిగుండు అయిపోయింది. కాబట్టి ఇంక వెళ్ళిపోవడం తప్ప ఏముంది? అందుకని తత్వంలో పాడతారు పిచ్చి వేషాలు వెయ్యకుండా.

అందుకని, వచ్చిన వాడు ఒకడే వస్తాడు. వెళ్ళిన వాడు ఒకడే వెళ్తాడు. వాడే సరిగ్గా పట్టడట వెళ్ళే ద్వారంలో. ఇంక ఇవన్నీ ఏం మోసుకుపోతాడని బోల్డు చెప్పారు. ఇది ఈ జ్ఞానం ఒకటి మనం బాగా దిమ్మేసా కొట్టుకుని ఉండాలండి. రెండోది, ప్రతినిత్యం శరీరంలోంచి బయటకెళ్ళిపోతూ ఉంటాం నిద్రపోయేటప్పుడు అని తెలిసి ఉండాలి. మూడు, "నేను", "నాది" ఆ వ్యత్యాసం తెలిసి ఉండాలి. నువ్వు "నాది"తో ఎంత బాగా అతుక్కుపోతూ ఉంటే అంత నీకు అహంకారం పెరుగుతూ ఉంటుంది. నేను నాదితో కలిసిపోకుండా ఉండడానికి ఇంకో సుళువు ఏం చెప్పారంటే, నువ్వు ఎక్కడినుంచి పుట్టావో వాడితో పెట్టుకో. నీ మూలంతో నువ్వు ముడిపడి ఉంటే, "ఆత్మ మూలుడు" అంటాడు గజేంద్రుడు. "*ఆత్మమూల నర్థినరంతున్*" అంటాడు. నాకు మూలమైన వాడిని నేను పట్టుకుంటాను తప్ప, నేను మూలమైన వాటిని మనం పట్టుకుంటే ఎట్లాగండి? తేడా ఉంది కదా! అంటే, మన assistant లు, మన బంట్రోతులు వాళ్ళమీద మనం ఆధారపడిపోడం కాకుండా మనకి ఆధారమైన వాడిని పట్టుకో. ఎవరు తెలివైనవాడు? నీకింద వాళ్ళని నువ్వు పట్టుకుని ఏడుస్తుంటే, నీ పైవాడు నిన్ను తీసేయచ్చు కదా! నీ పైవాడిని నువ్వు పట్టుకుంటే, నీకింద వాళ్ళు నిన్ను పట్టుకుని ఉంటారు. ఎప్పుడూ అంతే. నీ పైవాడి మాట నువ్వు వినకపోతే నీకింద వాళ్ళు నీమాట వినరు. ఎందుకంటే, నువ్వే example వాడికి. అంతే కదా! Teaching by demonstration అది. మన పై ఆయనని మనం ధిక్కరిస్తున్నామనుకోండి, ఓహో! మనం కూడా ధిక్కరించవచ్చు అనుకుని మన కిందవాడు మన్ని ధిక్కరిస్తూ ఉంటాడు. మన పైవాడితో మనం చాల వినయవిధేయలతో అప్రమత్తులై ఉన్నామనుకోండి, మన కిందవాళ్ళూ మనతో అలాగే ఉంటారు. You are a teacher

**though not consciously.** తెలుసో తెలియకో మనమే నేర్చుకుంటూ ఉంటాము. మా అబ్బాయి నా మాట వినలేదు మాస్టారు అంటే ఒకటే సమాధానం ఎప్పుడూ మాస్టారు దగ్గర, నువ్వు మీ నాన్న మాట విన్నావా అని టక్కున అడిగేవారు. అంతేగా! ఎంత చురుకుగా అడిగావారో! చచ్చిపోయే వాళ్ళందరూ! మీ నాన్న విషయంలో నువ్వు గాడిదలాగా ప్రవర్తిస్తే నీ విషయంలో నీ కొడుకు గాడిదలాగా ప్రవర్తిస్తాడు. **As above so below** కదా! అందుకని, మనకన్నా ముందు ఉన్న వాళ్ళని, "పదాచార్య పురోగమే" కదా! నీకన్నా ముందు నడిచిన వాళ్ళని నువ్వు ధిక్కరిస్తే నిన్ను ధిక్కరించేవాళ్ళు నీకు తయారవుతారు. నీకన్నా ముందు నడిచినవాళ్ళని నువ్వు అనుసరిస్తే నిన్ను అనుసరించేవాళ్ళు తయారవుతారు. అంచేత, నీ నుంచి పుట్టుకొచ్చినవి నిన్ను బంధించకుండా ఉండాలంటే నువ్వు ఎవరి నుంచి పుట్టుకోచ్చావో వాడితో నువ్వు అనుసంధానం చెందు. అదీ సాధన. ఎన్ని ఉన్నాయో చూడండి సాధనలో. నీ మూలంతో నువ్వు అనుసంధానం చెందుతూ అదే నీకు శాశ్వతమైన బంధంగా గుర్తుపెట్టుకుని నీ నుంచి పుట్టుకొచ్చిన వాటి యందు నువ్వు క్రమంగా వాటికి ఒక రకమైన రక్షణ, ఆశ్రయం ఇవ్వడమే తప్ప వాటికి నీ యందు దుర్వినియోగంగాని, వాటి యందు అతి మచ్చికగాని, వాటితో కలిసిపోవడంగాని, ఇటువంటివన్నీ చెయ్యొద్దని పెద్దలు చెప్పారు మనకి. శరీరము, ఇంద్రియములు మనసు మాట వినాలి. మనసు బుద్ధి మాట వినాలి. బుద్ధి నేను అనేటటువంటి అహంకార ప్రజ్ఞ మాట వినాలి. నేను అనేటటువంటి అహంకార ప్రజ్ఞ నేను అనేటటువంటి ఈశ్వర ప్రజ్ఞ మాట వినాలి. నేను అనే ఈశ్వరుడు, నేను అనే అహంకారం, నేను అనే బుద్ధి, నేను అనే మనస్సు, మనకి ఒక పూసకి ఎక్కించినట్టు ఉన్నాయనుకోండి, కథ ఒకటి ఉంటుంది. ఇందులో క్రింది పూస రాలిపోతుంటే భయం ఏం లేదు. ఎందుకనీ? ఈ క్రిందవి మళ్ళీ తయారుచేసుకోవచ్చు. అంచేత, ఏది ఉంటే మిగతావన్నీ మళ్ళీ మళ్ళీ తయారుచేసుకోవచ్చో అదిగా మనం ఉండాలి.

అంటే, దీనికంతటకీ ఒకటే మాట చెప్పాలి – నీ **true identity** నీకెప్పుడూ గుర్తు ఉండాలి. నీ **identity** కి **source** ఏముందో దానితో అనుసంధానం చెంది ఉండాలి. నీనుంచి పుట్టుకొచ్చిన భావములు దగ్గర నుంచి, శరీరం దగ్గర నుంచి, మనుషుల దగ్గర నుంచి, ఆస్తిపాస్తులు దగ్గర నుంచి, వీటన్నిటి యందు నీ కర్తవ్యమే తప్ప వాటి యందు నీకెటువంటి ఆకాంక్ష అక్కర్లేదు. ఆకాంక్ష నీకు మూలమైన వాడి గూర్చి ఉండాలి. అలా ఉంటే ఇప్పుడు ఇవన్నీ ఏదయితే మనం చాల అద్భుతం అనుకుంటామో అవన్నీ చాలా చిన్న విషయాలుగా తోస్తాయి. ఈ మరణం దాటడం అంటే అర్థం ఏమిటంటే నేను శాశ్వతుడిని అని తెలిసి, నిరహంకారి అయి ఉన్నప్పుడు, తనలో జరుగుతున్న సమస్త ప్రక్రియ మార్పు తనకి కనబడుతూ ఉంటుంది. దాన్ని దర్శిస్తూ ఉండొచ్చు. అందుకని, ఎప్పుడు నువ్వు మరణం దాటగలవంటే, ఎప్పుడు నీ స్వభావం నీకు అనుసంధానం చెంది నీలో కలిసిపోతే అప్పుడు. ఎలా కలిసిపోతే అంటే ఇప్పుడు నీరు ఉందనుకోండి, కలత బారిన నీరు సూర్య కిరణాలను ప్రతిబింబింప చెయ్యదు. కలత బారక స్థిరంగా ఉన్న నీరు మొత్తం అంతా పారదర్శకంగా ఉంటుంది. అట్లా స్వభావంలో పారదర్శకత వచ్చి, ఆ స్వభావంలో వెలుగే ప్రతిబింబిస్తున్నప్పుడు నీకు అహంకారం అనేటటువంటి ప్రజ్ఞ చాలా తక్కువగా ఉంటుంది. నేను అనే ప్రత్యేక భావం ఉండదు. అలా లేనప్పుడు నీకు ఈశ్వర దర్శనం జరుగుతూ ఉంటుంది – లోపలా బయటా కూడా. అలా ఈశ్వర దర్శనం జరుగుతున్న వాళ్ళని ఎవరూ ముట్టుకోడానికి వీలు లేదని ఒక శాస్త్రం ఉంది సృష్టిలో. అది యముడికి శివుడు బోధ చేస్తాడు మార్కండేయ ఉపాఖ్యానములో. ఎవరయితే

సమస్తమునూ నేనుగా దర్శిస్తూ తమ జీవితాన్ని నిర్వర్తించుకుంటున్నారో వారు ఇంక నాకీ శరీరం అక్కర్లేదు అని వాళ్ళు నిర్ణయం చేసుకున్నప్పుడు తీసుకెళ్ళిపో ఆ శరీరాన్ని, అంతవరకూ ముట్టుకోడానికి వీలులేదని చెప్తాడు. వారు కోరినప్పుడే వారిని తీసుకెళ్ళాలి సుమా, వారు ఇంకా ఉండి ఏదో దివ్యప్రయోజనాలు నిర్వర్తిస్తూ ఉండేటటువంటి ఆకాంక్ష ఉంటే నువ్వు తీసుకెళ్ళడానికి లేదు, ఇది నా శాసనం అని చెప్పి శివుడు యమధర్మరాజుకి చెప్పినటువంటి కథ మార్కండేయ ఉపాఖ్యానం. దానికి మార్కండేయుడు ఏ విధంగా సంసిద్ధుడయ్యాడనేటటువంటి కథ రేపు మనం చెప్పుకుందాం. అంటే ఈ మార్కండేయ ఉపాఖ్యానం పొద్దున్న మొదలుపెట్టుకుందాం అనుకున్నాం. అదేదో రాబోయింది, మళ్ళీ తత్వంలోకి వచ్చాము. రేపు పొద్దున్న మళ్ళీ కథ వస్తుందనే ఆశించాలి మనం. ఎంచేత అంటే రేపు కథలోకి వెళ్ళి, అందులో ఉండేటటువంటి రహస్యాలు.... రహస్యం అంటే ఏంలేదు, అక్కడే ఉంటాయి వాక్యాలు. మనం ఎక్కువ highlight చేసి చెప్పుకుంటే మనకి బాగా అందుతాయి. అలాంటి వాక్యాలంటే పుస్తకం ఏంలేదు నాదగ్గర, కథే ఆధారం. ఈ కథలోంచి ఆధారంగా మనం చక్కగా కొన్ని విషయాలు బాగా గుర్తు తెచ్చుకుంటే మనం చేసుకునే సాధనకి ఇది వినియోగపడుతుంది. అంచేత, ఆ విధంగా మనం నిర్వర్తించుకుందాం. ఒక పది నిమిషాల విరామం తీసుకుని, మళ్ళీ ప్రార్థనకి మనం ఉద్యుక్తులవుదాం.

––– స్వస్తి

# మార్కండేయ ఉపాఖ్యానము

## July 12, 2014 ఉదయం – ప్రవచనం #3

శ్రీ జయ నామ సంవత్సర ఆషాఢ పౌర్ణిమ, గురు పౌర్ణిమగా ప్రసిద్ధి కెక్కినటువంటి ఈ పర్వదినం నాడు సోదరబృందానికి సద్గురువు యొక్క సాన్నిధ్యము స్పష్టముగా నిలిచి ఉండాలని ప్రార్థన చేస్తూ, గురుపూర్ణిమ సందర్భంగా సద్గురువుకి మనం చేరువ అవ్వడానికి చేసే ప్రయత్నంలో భాగంగా కొంత సద్భాషణం నిర్వర్తించుకుందాం. సద్గురువు సాన్నిధ్యము ప్రార్థన ద్వారా మన యందు ఆహ్వానింపబడి స్థిరపడడానికి ప్రార్థన చేస్తూ ఉంటాం. అతడు మన యందు వసించి ఉన్నాడనే ఒక దృఢమైనటువంటి భావం మనలో ఏర్పడాలి. మనం కనబడడానికి ఒక్కళ్ళుగానే కనబడతాం గాని మనం ముగ్గురం అని తెలుసుకోవాలి. Man is a triple అంటారు. మనిషి, అతని యందు దైవము ఉన్నాడు లేక నారాయణుడు ఉన్నాడు. అతడు నరుడై ఉన్నాడు. అతడికంటూ ఒక స్వభావం ఏర్పడి ఉంటుంది అతడి ప్రవర్తన ద్వారా. ఇట్లా ముగ్గురు ఉంటారు – నారాయణుడు, నరుడు, అతడి స్వభావము. నారాయణ స్వరూపంగానే మనం సద్గురువుని ఆరాధన చేసుకుంటూ ఉంటాము. సద్గురువు అంటే ఏ తత్త్వం అయితే ఈ సృష్టికి ఆధారంగా ఉందో, ఏ తత్త్వం జనించి నవవిధ ప్రకృతులుగా ఏర్పడి ఉందో, ఏ మూల ప్రకృతి నుంచి త్రిమూర్తులుగా మూడు ప్రజ్ఞలు – ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా – ఏర్పడినాయో, ఏ ప్రకృతి నుంచి ఇతరములైన ఎనిమిది ప్రకృతులు ఏర్పడినవో, వీటన్నటికీ మూలమైనటువంటి తత్త్వాన్ని నారాయణుడు అంటారు, పరమ శివుడు అంటారు, పరమ గురువు అంటారు, పరమాత్మ అంటారు, పరబ్రహ్మ అంటారు, పరాశక్తి అంటారు, పరము అంటారు, beyond అంటారు. అందులోంచే అన్నీ పుట్టుకొచ్చాయి. అందులోకే అన్నీ చేరిపోతుంటాయి. అలాంటి తత్త్వము ఒకటి మనయందు ఉన్నది. అది ఆధారంగానే మనం ఉన్నాము. అంచేత, అంటే మనకి చేరువగా రావడానికి మార్గాలు తెలుసుకుని, ఆ మార్గాలు మనకి అందిస్తున్నటువంటి వారిని మనం పరమగురువులుగా భావిస్తూ ఉంటాము. అంచేత, పరతత్త్వమే గురుతత్వమని మనం గుర్తుపెట్టుకుంటూ ఉండాలి. పరతత్త్వమే గురువుగా మన దగ్గరకి వస్తుంటాడు. అది వేరే ఇంకో శాల్తీ కాదు. ఏ విద్యుత్తు అయితే దీపాల ద్వారా మన దగ్గరకి వస్తూ ఉంటుందో, ఈ దీపాలు లేకపోతే ఆ తత్వం మన దగ్గరికి రావడానికి అవకాశం తక్కువగా ఉంటుందో, సృష్టిలో అలాంటి గురుతత్వం ఒకటి ఏర్పాటు చేసారు. జీవులని ఏర్పాటు చెయ్యడం కన్నా ముందుగానే గురుతత్వం ఏర్పాటు చేసారు. ముందు teachers ని ఏర్పాటు చేసారు. ఆ తర్వాత school పెట్టుకున్నారు. School పెట్టుకుని teachers వెతుక్కోకుండా.

అంచేత, అలాంటి తత్త్వం ఒకటి మనం ప్రతినిత్యం మనలోకి ఆవాహన చేసుకుంటూ ఉంటే దాని సమక్షంలో మనము, మన స్వభావము రెండూ కూర్చోవాలి. ఎందుకు రెండూ కూర్చోవాలంటే, మన స్వభావం మన మాట వినదు కాబట్టి. మన స్వభావము ఆ తత్వం నుంచి వచ్చిన ప్రకృతి నుంచి వచ్చినదే కాబట్టి ఆ గురుతత్వం మాట వింటుంది స్వభావము. మన మాట వినదు. మనమేదో ఇలా చేద్దాం, అలా చేద్దాం అంటే ఏడిసావులే అన్నట్టుగా, అది కాకుండా

ఇంకోటి చేయిస్తూ ఉంటుంది మన చేత. ఇలా మాట్లాడుదాం అనుకుంటాం కాని అలా మాట్లాడలేము. ఇలా ఒక దినచర్య ఏర్పరుచుకుని దాని ప్రకారం జీవిద్దాం అనుకుంటాం కాని అలా ఉండలేము. ఈ విధంగా మనం ఆహార వ్యవహారాదులు, విహారాదులు ఏర్పాటు చేసుకుందాం అంకుంటాం కాని అలా జరగదు. ఎందుకు జరగదంటే, మన స్వభావము మన స్వాధీనంలో లేక ఉంటుంది. అలాంటి స్వభావంలో మనం ఉంటూ ఉంటాం. అంటే, మనం మన స్వభావానికి లోబడిపోయి ఉంటాము. అంచేత, అది ఏమీ లొంగి మనకి అనుకూలంగా ప్రవర్తించదు. ఎందుకంటే, ఈ స్వభావం ప్రకృతికి సంబంధించినది. ప్రకృతి పురుషునికి సంబంధించినది. అంచేత, దీన్ని తీసుకెళ్ళి మనం సద్గురువుకి సమర్పణ చేస్తే, మనతో బాటు మనము, మన స్వభావము గురువుగారి దగ్గర కూర్చున్నట్టు అన్నమాట. చూడండి, కొంతమంది మాములుగా రకరకాలుగా ఉండేవాళ్ళు సద్గురువు దగ్గరికి రాగానే చాలా వినయంగా ఉంటారు కదా! వాడి గురించి తెలిసినవాడు ఇంకోడు దూరం నుంచి చూస్తే, అబ్బా! ఎంత బుద్ధిమంతుడిలాగా కూర్చున్నాడో చూడరా వాడు అక్కడ, మాములుగా ఎలా ఉంటాడు అనుకోడు! బయట రకరకాలుగా నానాభీభత్సం సృష్టించే వాళ్ళు కూడా వెంకటేశ్వరస్వామి గుళ్ళోకి వెళ్ళాడనుకోండి. ఏమిటో ఎక్కడలేని భక్తి ప్రవత్తులన్నీ వాడికి తెలియకుండానే వాడిలో చేరిపోయి వంగివంగి దణ్ణాలు పెట్టుకుంటూ నిలబడిపోతాడు కదా! బయటకొస్తే మళ్ళీ మామూలే. "వెనకటి గుణమేలమాను వినరా సుమతీ". అంచేత, ఆ సానిధ్యంలో అలాంటి మహత్యం ఉంది. అంచేత, ఆ గురువు సానిధ్యంలో మనం రోజూ బాగా కూర్చుటుంన్నామనుకోండి – అంటే పొద్దున్నా, సాయంత్రం కూర్చోవడం కాదు. ఎప్పుడూ దానితోనే కూర్చున్నామనుకోండి, అప్పుడు ఏం జరుగుతుంది? స్వభావానికి తనదైనటువంటి వికృతమైనటువంటి ప్రవర్తన తగ్గిపోయి, ప్రకృతి సిద్ధమైనటువంటి ప్రవర్తన దానికి ఏర్పడుతుంది.

మనకి కావలిసినదల్లా మన స్వభావంలో మార్పే. మనం ఎలాగూ దైవాంశులమే. జీవులందరూ దైవాంశ సంభూతులే. ఏమిటిరా తేడా అంటే స్వభావంలో తేడా. అంచేత, ఈ స్వభావం మన చేతుల్లో, అది చెయ్యదాటిపోతుంది. మన చెయ్యదాటిపోయిన వాడిని మనం ఏం చెయ్యాలంటే, అందరికీ మూలమైన దాన్ని పట్టుకోవాలి. అంచేత, అది ప్రతినిత్యం ప్రార్థన ద్వారా మన హృదయంలోకో, మన ఫాలభాగంలోకో ఆవాహన చేసి, నేను, నా స్వభావము నీకు సమర్పణ చెందుతున్నాము, నన్ను ఉద్ధరించుకో, నా స్వభావాన్ని సరి చెయ్యి, లేకపోతే నేను ఇందులో ఉండలేకపోతున్నాని చెప్పాలి. స్వభావం ఇల్లు లాంటిది. అందుకనే, కర్కాటక మాసం, నాలుగవ రాశి మన గృహ సంబధమైన విషయాలు చెప్తూ ఉందంటూ ఉంటారు. వీడికి శుభ్రమైన ఇల్లు ఉంటుందా అంటే నాలుగవ రాశి చూసుకోవాలి. Fourth house అంటారు. అసలు శుభ్రమైన ఇల్లు అంటే ముందు స్వభావమే. జీవుడు ఉండే స్వభావమే అన్నిటికన్నా ముందు, అది మొదటి ఇల్లు. అది దైవీ స్వభావంగా ఉండొచ్చు, మానవీ స్వభావంగా ఉండొచ్చు, పశు స్వభావంగా ఉండొచ్చు. మూడు రకాల ఇళ్ళు. దైవీ స్వభావం ఉంటే మంచి కాంతివంతంగా ఉంటుంది. కొన్ని ఇళ్ళల్లోకి వెళ్తుంటే అబ్బా! ఎంత బావుంది అనిపిస్తుంది, ఎంత ప్రశాంతగా ఉంది అనిపిస్తుంది. మంచి గాలీ, వెలుతురూ, వాసనా అన్నీ ఉంటాయి. కొన్ని ఇళ్ళల్లోకి వెళ్తే గూభ్యమల్లే ఉంటుంది కదా! చీకటి. పగలే lights వేసుకుని ఉండాలి, ఇలా ఫాన్లు పెట్టుకుని కూర్చోవాలి. గాలి రాదు, వెలుతురు రాదు, వాసన వస్తుంటుంది. అన్నీ అవతవకగా ఉంటాయి. ఇంట్లో విషయాలన్నీ కదా! అది మన

నాలుగవ ఇల్లు అంటే మన స్వభావము. స్వభావానికి ప్రతీకే మన ఇల్లు. మన స్వభావానికి ప్రతీకే మన శరీరం. ఇది ఒక ఇల్లు. ఎన్ని ఇళ్ళు ఉన్నాయో మనకి! ఇల్లు లేదా అంటే లేదనబోకండి. బోల్డు ఇళ్ళు ఉన్నాయి. తీరి కూర్చుని దైవీస్వభావాన్ని ఏర్పాటు చేసుకుంటే దివ్యమైన గృహంలో ఉన్నవాడిగా ఉంటావు. అంచేత, స్వభావాన్నిబట్టి ఉంటుంది అందరికీ వారివారి భావన. భావపరంపర స్వభావాన్నిబట్టే. దేహ బాధలు – అది మనకి సమకూలిస్తోందా, ప్రతికూలిస్తోందా, ఏడిపిస్తోందా, ఆనందంగా ఉంచుతోందా? ఇలాంటివన్నీ ఉంటాయి కదా! వేరే ఏం కావాలి మన్ని ఏడిపించడానికి, మన శరీరం చాలు కదా! ఇది ఒక ఇల్లు మనం కట్టుకుంటూ ఉంటాము కదా! అది ఒక ఇల్లు. ఇవన్నీ అద్దె ఇళ్ళు అని గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే ఇచ్చేయాలి. ఇచ్చిన ఇల్లు సవ్యంగా ఉంచుకుంటే బావుంటుంది. లేకపోతే ఇంకో రకంగా ఉంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో పెద్దలు ఏం చెప్పారంటే నీ స్వభావం బావుంటే నీకు సుఖంగా ఉంటుంది. కాబట్టి నువ్వు, నీ స్వభావము నాకు అర్పణ చేసుకో. దైవ ప్రార్థనకి ఉండేటటువంటి మూలమైన ప్రయోజనం ఏమిటయ్యా అంటే నేను, నా స్వభావము నీ చెంతన కూర్చుని ఉంటాము. అలా కూర్చుని ఉంటే నువ్వు నాకివ్వాలిసిన జ్ఞానం నాకు ఇవ్వు. ఈ స్వభావం ఉందే దానికి ఏ సర్దుబాటులు చెయ్యాలో, ఏ సర్దుబాటు చేస్తే నాకు శ్రేయస్సో అది చేస్తూ ఉండు అని చెప్పుకోవాలి గురువుగారికి. ఇప్పుడు దైవానికైనా అదే చెప్పుకోవాలి. ఇంకా ఏదో అది కావాలి, ఇది కావాలి, ఇంకోటి కావాలి, మరొకటి కావాలి అని అడుగుతూ ఉంటే తటస్థంగా ఉంటుంది తత్త్వం ఎప్పుడూ. గుర్తుపెట్టుకోండి, తత్త్వం తటస్థంగా ఉంటుంది. నాకేం కావాలో కూడా నాకు తెలియదు, నువ్వే నిర్ణయం చేసి ఇవ్వు, నీ ప్రకారం నేను నడుస్తాను అని అనుకున్నావో అది శ్రేయస్సు. మనం కోరామనుకోండి. చాలామంది చాలా రకాలుగా కోరి ఇబ్బందులు పడినవాళ్ళు ఉన్నారు కదా! అంచేత, కోరడం వల్ల ఉపయోగం ఏమీ లేదు. అదీ స్వభావం మళ్లీనూ! నీకు తెలియని మంచి, నీ శ్రేయస్సు నీకన్నా ఇంకోళ్ళకి ఎక్కువ తెలుసుట అంటే వాడిని నువ్వు నాకిలా చేస్తే బావుంటుంది, అలా చేస్తే బావుంటుంది అని అడిగావనుకో, అలా అడిగితే నువ్వు ఎలా కోరితే అలా చేస్తాడు, కర్మ నీది. నాకేం తెలియదు, నువ్వు ఏం చేస్తే నాకు మంచిదో అది నీకే తెలుసు కాబట్టి నువ్వు ఆ విధంగా నాకు నిర్వర్తించు స్వామీ అని అడగడం ఒకటి. మనకిలా చాలా బాధలు ఉన్నాయి.

మంచి కథ, సులభంగా అర్థమయ్యేది ఒకటి చెప్తాను. మంచి చదవు చదువుకున్నాడు. మంచి ఉద్యోగం వచ్చింది. కారు కొనుక్కునాడు అప్పు చేసి. ఉద్యోగం రాగానే అప్పు చెయ్యొచ్చు. అది కదా ఇప్పుడు! ఇంకా జీతం బాగానే ఉంది కాబట్టి ఇల్లు కూడా అప్పుకి – ఒక EMI ఇల్లు, ఒక EMI కారు. చూసేవాడికి అనిపిస్తుంది వాడికి ఇల్లూ ఉంది, కారూ ఉంది అని. పిల్లవాడు బాగా చదువుకున్నాడు. కాబట్టి పెళ్లి కదా! వాడికి పెళ్లి అవ్వడం లేదు. అది చూడండి! అలా అవ్వాలని ఏం ఉంది? సరే, ప్రార్థన చేసాడు, నాకు ఒక మంచి పెళ్ళాన్ని ఇమ్మని. మంచి స్త్రీని నాకు వివాహం అయ్యేటట్టుగా నువ్వు ఇవ్వవా అని అడిగితే... ఈ కథ ఎప్పుడో మా చిన్నప్పుడు చూసిన కథే! తత్వపరంగా చెప్పుకుంటున్నాము అంతే. మాములు కథలు కూడా చూస్తే తత్త్వం కనిపిస్తుంది. తత్వం లేనిది ఏముంటుంది? అంటే, మంచి పెళ్ళాం అడిగాడు కదా అని దేవుడు కనిపించి, అదిగోరా, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకో అన్నాడు. సరే వాళ్ళే వచ్చి ఈయన్ని అడిగారు. అది కదా దేవుడంటే! మీ అమ్మాయిని నాకిస్తావా అంటే ఎవరు ఇస్తారు? అందుకని, వాళ్ళే వచ్చి మా అమ్మాయిని చేసుకుంటావా అని అడిగితే, చూపించాడు కదా దేవుడు చేసుకున్నాడట. చేసుకుంటే, పెళ్లి అయిన తర్వాత

తెలిసింది అమ్మాయికి వాక్కు లేదు అని. వాక్కు లేని భార్య, కానీ గుణవతి, సౌందర్యవతి. అన్నీ ఉన్నాయి, మాట లేదు. మాట లేని పెళ్ళాన్ని ఇచ్చావా అని ప్రార్థన చేసి ఏడిపిస్తే, ఎందుకురా అట్లా ఏడుస్తావు, నువ్వు మంచి పెళ్ళాం అడిగావు కదా, అందుకని అలా ఇచ్చాను అంటాడు. అంటే, అలా కాదు, మాటుంటే బావుంటుంది కదా! అన్నీ ఉన్నాయి, మరి మాటాడే పెళ్ళాం ఉంటే బావుటుంది. సంఘంలో మరి social గా పార్టీలు, వీటికీ వెళ్ళినప్పుడు, అదేంటయ్యా, మూగదాన్ని చేసుకున్నావా అంటారు కదా! Socialization ఉండాలి, నలుగురితో కబుర్లు చెప్పాలి, ఇంటికి అతిథులు వస్తే బాగా చూసుకోవాలి, ఆ దృష్టితో ఏదో కొంచెం మాట ఉంటే బావుంటుంది గురువుగారూ అని అడిగాడు. సరే కానీ, నువ్వు అలా కోరావు కాబట్టి మాట ఇస్తానని మాట ఇస్తాడు. ఇంక అక్కడి నుంచి క్రమంగా మాట్లాడుతుంటే ఆవిడ, వీడికి పిచ్చెక్కిపోవడం మొదలుపెట్టింది. ఎన్నెన్ని మాటలు, ఎన్నెన్ని మాటలు మాట్లాడేస్తోందో. ఇంక మరి వంట్లో తేళ్ళు, జర్రులు పాకుతున్నంత కంపరం వచ్చేస్తోంది. అట్లా మాట్లాడేస్తోంది. మాట్లాడారా! మనిషికి మాట ఇస్తే వాడు ఏదయినా మాట్లాడేస్తాడు. మళ్ళీ ప్రార్థన చేసాడట, మాట్లాడే పెళ్ళాం వద్దని! అంటే, మాట్లాడే పెళ్ళాం ఉంటే ఎట్లా ఉంటుందో నాకు తెలుసు కాబట్టి నేను మొదట్లోనే ఆలోచించి నీకు ఇలాంటి పెళ్ళాని ఇస్తే, నువ్వు లేనిపోనిది కోరి ఇప్పుడు మాటలడిగి, ఇప్పుడు వద్దంటే కుదరదని చెప్తాడు. ఊరికే ఈ కథ ఎందుకు చెప్పానంటే, చిన్నప్పుడు ఎప్పుడో "పెళ్లి చేసి చూడు" అని ఒక సినిమా ఉంది. ఆ సినిమాలో "బ్రహ్మయ్యా, బ్రహ్మయ్యా" అని ఒక పాట పాడతాడు. మూగపిల్లని ఇచ్చావా బ్రహ్మయ్యా అంటాడు. అదే మంచిదిరా అంటాడు. కాదూ కూడదని అడుగుతాడు. మళ్ళీ వద్దంటాడు. ఇవన్నీ చూపించేవాళ్ళు.

ఇందులో తత్త్వం ఎమిటంటే, మనకేం కావాలో మనకేం తెలియదు సరిగ్గా. దేని వలన మనకి శ్రేయస్సు కలుగుతుందో అది దైవానికి, గురువుకి మనకన్నా ఎక్కువ తెలుసనే కదా ఆయన్ని ఆరాధన చేస్తున్నాం. మనకన్నా అతడు ఎక్కువ తెలిసినవాడు అని కదా, నాకన్నా జ్ఞానవంతుడు అని కదా చేరావు. అందుకని అలా వదిలెయ్యడం మంచిది. అంచేత, నాకేది శ్రేయస్సో నువ్వే నిర్ణయం చెయ్యి, నేను నీకు సమర్పణ చెందుతున్నాను. అలాగే నా స్వభావంలో ఏం మార్పులు మంచిదో, నా వల్ల ప్రపంచానికి మంచిదో అలాంటిది కూడా నువ్వే సర్దుబాటులు చెయ్యి. ఇప్పుడు చూడండి మనం ఇంగ్లీషులో అంటూ ఉంటాం కదా! Masters own adjustments అంటాము. ఏమిటి adjustments? స్వభావానికి. మన ఎదుటివారిలో అన్నీ adjustments చేసి, మనకి వాళ్ళు అనుకూలంగా ఉండాలని కాదు కోరేది. మనలో జరగవలసిన adjustments అన్నీ సవ్యంగా జరిగితే, మనం ఈ శరీరంలో ఉన్నందుకు సుఖంగా ఉండొచ్చు, ఆనందంగా ఉండొచ్చు. పదిమందికి వినియోగపడేటట్టుగా ఉండొచ్చు. మన జీవితానికి ఒక ప్రయోజనం ఏర్పడుతుంది. ఎప్పుడూ గుద్దుకుంటూ, తన్నుకుంటూ, తిట్టుకుంటూ, అరుచుకుంటూ, బాధ పడుతూ, ఘర్షణ పడుతూ, ఇట్లా ఎన్నాళ్ళు ఉంటావు ఇందులో? అలా ఉంటే పోదామని అనిపిస్తుంది కదా! ఇంక ఎందుకులే, పోతే బావుండునని అనిపిస్తుంది కదా! అలాంటి పరిస్థితి లేకుండా ఎన్నాళ్ళు ఉన్నా, "*సౌదామినిం బోలు గృహంబు*" అన్నాడు భాగవతంలో. అంటే, అన్ని వైభవాలు ఉంటాయండి అలాంటి స్వభావం ఉండాలి. స్వభావమే ఇల్లు. అలాంటి స్వభావం మనకి ఎవడు ఇవ్వగలడు? ఎవడయితే మొత్తం అంతా చేసాడో వాడినే అడుగుతున్నాం, ఒక medium ద్వారా. ఇప్పుడు దీపం ద్వారా వెలుగుని ఎట్లా

అనుభూతి చెందుతున్నామో, ఒక సద్గురువు ఆ తత్వానికి ప్రతీకగా ఉంటాడు. అందుకనే, "గురు దైవంబని తెలియక తిరిగే మూఢుడిని అయితిని రామా" అని పాడుకుంటాడు రామదాసు. అంటే, గురువుగారు వేరు, దేవుడు వేరు అనుకున్నాడు. కాదు ఒకటే అని తెలిసింది చివరికి. అంచేత, మన భారతీయ తత్వంలో గురుశిష్య సాంప్రదాయం చాలా ఎక్కువ. ఆ సాంప్రదాయం అనుసరించే మనకి మార్గం కూడా సులభంగా ఇవాళ్టికి కూడా అందుబాటులో ఉంది. దైవం చేరేటటువంటి మార్గం, పరమపదం చేరేటటువంటి మార్గం ఎప్పటికయినా మానవజాతికి ఇవ్వగలిగేది భారతదేశమే. ఏం సందేహం లేదు అందులో. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా భారతీయులే అందరికీ జ్ఞానాన్ని పంచుతూ ఉన్నారు. నిన్న చెప్పాను కదా, వారి వాఙ్మయంలోనే లేదు మరణం అనేటటువంటిది ఒకటి. దాని స్వరూప స్వభావాలు తెలిసినటువంటి వాఙ్మయం లేదు ఎక్కడా కూడా. కేవలం ఇక్కడే ఉన్నది.

అంచేత, అలాంటి గురుతత్వాన్ని మనం ఆశ్రయించడం అనేటటువంటిది ఎందుకోసమో తెలిసి ఆశ్రయించాలి. తాను శాశ్వతుడే. తాను తన యొక్క నిజ స్వరూపాన్ని మరవడం చేత అశాశ్వతుడిగా భావిస్తూ ఉంటాడు తన్ని తాను. అంచేత, తాను, తన ప్రకృతి – తాను, తన స్వభావము. నేను, నాది అని నిన్న చెప్పాను కదా! ఈ నాది అనేటటువంటిది చేరినప్పుడు నేను అనేటటువంటివాడు మార్పు చెందకూడదు. అంటే, నేను నేనుగానే ఉండాలి. నేను పార్వతీకుమార్ అనేటటువంటిది ఒక తాత్కాలిక సత్యం. నేను పురుషుడిని అనేటటువంటిది మరొక తాత్కాలిక సత్యం. నేను ఆంధ్రుడిని అనేది మరొక తాత్కాలిక సత్యం. నేను భారతీయుడిని కూడా అలాంటిదే. నేను మానవుడిని అనేది కూడా అలాంటిదే. నేనుకి నిర్వచనం లేదు. ఈ నేనే నేనుగా దిగి వచ్చింది. ఆ నేనే ఈ నేనుగా మూడు గుణములుగా దిగి వచ్చేసరికి జీవుడయ్యాడు. దేవుడే జీవుడు అవుతాడు. మూడు గుణాల్లోంచి బయటకొచ్చేసరికి మరో రకంగా కనిపిస్తాడు. అదొక రకమైనటువంటి స్థితి కలుగుతుంది. అదే నిన్న చెప్పాను మంచుగడ్డ అవ్వడం – మంచి నీరు మంచుగడ్డ అయ్యింది. మంచుగడ్డ మంచి నీరు కన్నా వేరుగా కనిపిస్తుంది కదా! మంచుగడ్డకి మంచి నీరు కన్నా వేరే కొన్ని కొత్త గుణాలు వస్తాయి. మంచి నీరు అట్లా మొహం మీద జల్లితే ఎవడూ బాధ పడదు కదా! మంచుగడ్డ అట్లా మొహం మీద కొడితే బాధ పడతాడు. అది గడ్డ అవ్వడం వల్ల దెబ్బ తగులుతుంది. నీరు అవ్వడం వల్ల ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఎంత తేడా వచ్చింది? స్థితి బేధం చేత అలా కొన్ని గుణాలు మనకి ఆపాదించబడుతూ ఉంటాయి.

అంచేత, ప్రతినిత్యం నీరే మంచుగడ్డగా అయ్యాను అని గుర్తు ఉందనుకోండి. అతడే నేనుగా తయారయ్యాను, అతడే నేనుగా ఉన్నాను అని సర్వకాల సర్వావస్థల యందూ గుర్తు ఉన్నటువంటి వాడు గురువండి. అతడే నేనుగా ఉన్నానని మర్చిపోయి, నేను పార్వతీకుమార్, నేను తెలుగువాడిని, నేను భారతీయుడిని, నేను ఇది, నేను అది, ఇట్లా అనుకుంటూ ఉన్నామనుకోండి, అది మంచుగడ్డగా అయిపోయినట్టు. మంచుగడ్డ అవ్వొచ్చు, మట్టిబెడ్డ అవ్వొచ్చు. ఏదయినా అవ్వొచ్చు కదా! ఒకసారి మారడం అంటూ జరిగితే అలా ఏదయినా అయిపోతుంది. వికారం చెందుతుంది. నీవు ఇలా మార్పు చెందినప్పటికీ మార్పు చెందని వాడిగా నీ స్థితిని నువ్వు గుర్తిస్తూ ఉండడం అనేటటువంటిది సాధన. ఆ సాధన యందు సిద్ధి పొందినటువంటి వారికి కనిపిస్తున్నదంతా విలాసంగా కనిపిస్తుంది. ఒకే నాటకంలోగాని, ఒకే సినిమాలోగాని, ఒక నటుడు రకరకాల పాత్రలు వేస్తే, వీడే వేషం వేసాడని మనం అనుకోమండి? ఐదుసార్లు, ఆరుసార్లు, ఏడుసార్లు,

ఎనిమిదిసార్లు, తొమ్మిదిసార్లు, పదిసార్లు, ఇలా రకరకాలుగా దశావతారాలు అంటూ ఉంటాం కదా! నవరాత్రులు సినిమాలు వచ్చినాయి. అంటే, ఒకే నటుడు ఇన్ని వేసాడు. ఇట్లా మనం రోజూ ఎన్నో నటనలు ఉంటాయి. ఇన్ని నటనలూ మనం చేస్తున్నప్పటికీ మూల వస్తువుతో ముడిపడి ఉంటే నర్తనం అవుతుంది. మూల వస్తువుతో ముడి పడకుండా చేస్తూ ఉంటే జారిపోతుంది. జారిపోవడం, ఇరుక్కుపోవడం ఇవన్నీ వస్తాయి. అంటే, భార్య కనపడగానే భర్తగా నటిస్తావు కదా! నువ్వు భర్తవి అవుతావు నీకు తెలియకుండానే. నీ permission లేకుండానే నువ్వు భర్తవి అయిపోతావు. కొడుకు కనపడగానే తండ్రి అయిపోతావు. అలాగే భార్యకి భర్త కనపడగానే భార్య అవుతుంది. ఎప్పుడూ భార్యగా ఉండదు కదా! ఎప్పుడూ భర్తగా ఉండవు కదా! ఊళ్ళో తిరుగుతూ నేను భర్తని అనుకోలేవు కదా! ఎప్పుడు భర్త అవుతావు? నీ భార్య కనపడినప్పుడు భర్త అవుతావు. నీ కొడుకు కనపడినప్పుడు తండ్రి అవుతావు. Generally నేను father ని అనడానికి వీలు లేదు కదా!

అలాగే, నీకు చెప్పేటటువంటి విద్యలు నేర్చుకునేవాడు కనిపిస్తే నువ్వు గురువు అవుతావు. లేకపోతే, గురువు ఎప్పుడూ గురువుగా ఉండడం అనేటటువంటిది మరో వ్యామోహం. చాలామంది గురువుగా ఉండిపోతారు అట్లా. అట్లా గురువుగా ఉండిపోవడం ఏమిటి? అన్నం తిన్నప్పుడు ఏమిటి నువ్వు? గురువా? భోక్తవి కదా! అన్నం తింటున్నప్పుడు భోక్తవి. ప్రయాణం చేస్తుంటే ప్రయాణికుడివి. గురువు అనకూడదు. మీరు ఏమిటండి అని అడిగితే చాలా కష్టం సమాధానం చెప్పడం తెలుసా? నువ్వు ఏమిటి? ప్రస్తుతం ప్రయాణికుడివి అని చెప్పాలి పక్కన వాడు అడిగితే. అంతే! నువ్వు ఏమిటి చెప్పు? ఎవడో ఒకడు కనబడితే వాడికీ నీకూ ఉండేటటువంటి సంబంధాన్నిబట్టి ఒక నిర్వచనం తాత్కాలికంగా ఏర్పడుతుంది, శాశ్వతమైనది కాదు. శాశ్వతమా? మీరు ఎవరండి అంటే, నేను ఆఫీసరుని అన్నాడనుకోండి. అంటే, ఆఫీసురుగా మారిపోయాడంతే. ఇంక వాడు మనిషని కూడా గుర్తు ఉండదు. అది వేరే ఇంకో జాతి అది. ఈ ఆఫీసుర్లు, మంత్రులు, మినిస్టర్లు ఉంటారే, అది వేరే జాతి. నేను మినిస్టర్ అంటే, నువ్వు మినిస్టర్ కాదు. మనిషివి కదా ముందు! అందుకనే, మా గురువుగారి దగ్గరకి ఒకడు వచ్చి మినిస్టరు గారు అక్కడ బంగళాలో దిగారు, ఒకసారి మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. వారికి కొంచెం అత్యవసరంగా ఔషదం కావాలట అని చెప్తే, మినిస్టర్ గారు అంటే ఏమిటని అడిగారు ఈయన. అంటే ఏం చెప్తారండి? అందరికీ అర్థమయ్యే భాష కదా అది! మినిస్టర్ గారు సార్ అన్నాడు మళ్ళీ. అదేనోయ్, మినిస్టర్ గారు అంటే ఏమిటి అని అడిగారు ఈయన మళ్ళీ. మంగళగిరిలో జరిగింది ఇది. మినిస్టర్ గారు సార్ అన్నాడు వాడు మళ్ళీ కళ్ళు పెద్దవి చేసి. అదేనయ్యా అడుగుతున్నాను, మినిస్టర్ అంటే ఏమిటి అని అడిగారు. మనిషా, పశువా, ఇంకోటా అని అడిగారు. అది ఏమిటి మనిషేనా అని అడిగారాయన. ఆ మనిషే సార్ అన్నాడు వాడు. మరి ఆ మాట చెప్పు, మినిస్టర్ అంటే నాకు అర్థం కాదు అని చెప్పారాయన. నాకు మినిస్టర్ కాదు ఆయన. నీకు మినిస్టర్ ఏమో. నాకు కాదు కదా! మనిషి అంటే నాకు అర్థం అవుతుంది, మినిస్టర్ అంటే అర్థం కాదు నాకు అని చెప్పారు. ఇంక వాడు మాట్లాడలేదు కదా పాపం! వాడేదో బిళ్ళజవాన్ వస్తాడు, వాడికేమీ తెలుసు? పుచ్చుకోవడాలు, అదో వాడి గోలలో వాడు ఉంటాడు కదా! సరే, వస్తారా సార్ అంటే, రానన్నారు. ఆయనకి నాతో పనుంటే ఆయన నా దగ్గరకి రావాలి. ఎలా ఉందో చూడండి! నాకు పనుంటే మీ మినిస్టర్ గారు నా దగ్గరకు వస్తారా అని అది అడిగారు. అలా ఆయనకి పనుంటే,

నేను ఆయన దగ్గరకి ఎందుకు రావాలన్నారు. అంటే, వచ్చిన బిళ్ళబంట్రోతుకి... పక్కన మా అందరికీ జ్ఞానోదయం, వినే వాళ్ళందరికీ, చుట్టూ ఉంటాం కదా! అవీ ఇవీ అనుకుంటూ ఉంటారు. అంచేత, ఇట్లా అయిపోతూ ఉంటాం. అభినివేశము అంటాము దీన్ని. ఇది అభినివేశము ఎక్కువ. మనం గురువు కదా అనుకుంటే, వాడంత పతనం చెందినవాడు ఇంకోడు ఉండడండి. నేను గురువుని కదా అని పొద్దున్నే నిద్ర లేచాడనుకోండి, వీడు పశువు అని తేలుస్తారు. పశువు కూడా అట్లా అనుకోదు పాపం కదా! అంచేత, మనం ఇలా మారిపోతూ ఉంటాం కదా! లేచీ లేవగానే, ఇది తాత్కాలికం కదా! నువ్వు భర్త కాదు, నువ్వు తండ్రి కాదు. నువ్వు ఉద్యోగం చేస్తుంటే, ఉద్యోగం చేస్తున్నప్పుడు ఉద్యోగస్తుడివి.

నేను నిన్న చెప్పాను ఇవన్నీ కదా! ఎందుకు చెప్తున్నానంటే మళ్ళీ చక్కగా మర్చిపోతాం మనం! మరుపే మృత్యువు. ఎందుకని? అసలు వస్తువు తానే నేను. అది నేను. "*ఇతి ఏ తత్*" అన్నారు ఉపనిషత్తులో. ఇది అదే. ఇట్లా modify అయ్యింది గాని అదే ఇది. ఒకే ఒక మూల తత్త్వం ఇన్ని రకాలుగా మార్పు చెంది ఇందులో ఒక నాటకం నడుస్తోంది. ఇది తెలిసినవాడు గురువు. ఇది తెలియడం చేత అతనికి ఇంక ఏ ముడులూ లేక, సామరస్యంతో జీవితం గడుపుతూ, అమితమైన ఆనందం అనుభూతి చెందుతూ, తన వంతు కర్తవ్యం, ఉన్నందుకు చేస్తూ ఉంటాడు, ఏదో ఒకటి. ప్రత్యేకించి ఏమీ ఇలా చెయ్యాలని చెప్పి నిర్ణయం చెయ్యాల్సినవి, ఎవరూ బంధించాల్సినవి కూడా ఏమీ ఉండవు. ఈ మూడు లోకాల్లో నేను చెయ్యాల్సినవి పనంటూ ఏమీ లేదని చెప్తాడు కృష్ణుడు. నాకేదో సరదాకి చేస్తున్నాను తప్ప, నేను చెయ్యకపోతే అడగడానికి ఏంలేదని చెప్పాడు. ఎందుకు చెయ్యాలి? ఈ రథం తోలడం నాకు సరదా తప్ప, not obligated. సద్గురువు యొక్క పరిస్థితి ఏమిటంటే, he is not obligated, yet he serves. అటువంటి బంధములు లేని స్థితిలోకి వెళ్ళిపోయాడు. He cannot be bound by anything. ఎంచేత? ఎవరి దగ్గర నుంచీ ఏమీ ఆశించినవాడు కాదు. అలాంటి స్థితిలో ఉన్నటువంటి వాడు అలాంటి స్థితిలోకి అందరూ వస్తే ఎంత బావుటుందో అని తాపత్రయ పడతాడు. ప్రేమ చేత. అది ఒక్కటే కారణం. వాత్సల్యం ఒక్కటే కారణం. చూడండి, మంచి ప్రదేశానికి వెళ్ళి, అద్భుతమైనటువంటి అనుభూతి మనం పొందామనుకోండి, చాల ఆహ్లాదంగా ఉందనుకోండి. వెంటనే ఏమనిపిస్తుంది? అయ్యో! మన వాళ్ళని కూడా తీసుకొస్తే బావుటుంది కదా అనిపిస్తుంది. ఎందుకని అనిపిస్తుంది? వారి యందు నీకుండే ప్రేమ చేత అనిపిస్తుంది. అలా మొత్తం మానవజాతి యందు ప్రేమ చేత, ఈ పరమ గురువులందరూ ఈ భూమి మీద ఉండిపోయారు ఎప్పటికీ. ఇంత అనుభూతి ఈ భూమి మీద అనుభవించొచ్చు కదా! ఇది వీళ్ళందరూ పొందితే బావుంటుంది కదా అని వేచి ఉంటారు. ప్రచారం చెయ్యరు. అది కావాలనుకునే వారికి అది ఇవ్వడానికి వేచి ఉంటారు. అలాంటి వాళ్ళందరికీ దారి చూపించేటటువంటి సద్గురువుని ఈ రోజు ప్రత్యేకంగా ఆరాధించుకోవడం అనేది ఉంటుంది. అలా ఆరాధన చేసుకుని క్రిందటి సంవత్సరంకన్నా ఈ సంవత్సరం ఇంకా బాగా చేసుకుంటాను గురువుగారు అని అనుకోడానికి.

ఎప్పుడూ ఇంతకన్నా బావుండాలని కోరుకోవడం అనేటటువంటిది సహజం జీవుడికి తెలుసా? ఆనందమును అన్వేషించువాడు అనేటటువంటి ఒక నిర్వచనం ఉంది జీవుడికి. మరొక నిర్వచనం ఏమిటంటే స్పందనాత్మక చైతన్యుడు అనేటటువంటిది ఒక నిర్వచనం. మనం ప్రాణము, ప్రజ్ఞ కలిగినటువంటి వారము. అది ఎప్పుడూ ఉంటుంది. ఈ దేహం వదిలేసిన తర్వాత, ఆ ప్రజ్ఞతో పాటు, సూక్ష్మ ప్రాణము ఉంటుంది. ప్రజ్ఞ కూడా సూక్ష్మంగా ఉంటుంది. ఎక్కడికీ పోదు.

ఎప్పుడూ ఉంటుంది. అది సూక్ష్మంగాను, ఇంకా సూక్ష్మంగాను, ఇంకా సూక్ష్మంగాను, స్థూలం నుంచి నాలుగు స్థితుల్లో ఉంటుంది. అది ఎప్పుడూ ఉంటుంది. ఎప్పుడూ ఉండేవాడు ఇట్లా శరీరాలు ఎందుకు ధరిస్తాడంటే, అనుభూతి కోసం, ఆనందం కోసం. ఈ అనుభూతి, ఆనందం పొందాలనేటటువంటి ప్రయత్నంలో రకరకాలుగా ఇరుక్కుపోతూ ఉంటారు. ఇలా ఇరుక్కుపోయి బాధపడుతున్న వారికి జ్ఞానాన్ని ఇవ్వడానికి, మార్గాన్ని చూపించేవాడు సద్గురువు.

అలాంటి సద్గువురుని ఈ ఒక్కరోజే ఆరాధన చేస్తే సరిపోతుందా చెప్పండి? కాదు. ప్రతిరోజూ లేవగానే ముందు మనం ఆవాహనం చేసుకున్నామనుకోండి, మనం ముగ్గరం అవుతాము. నేను, నా గురువుగారు, నా స్వభావము. ఇద్దరయితే కష్టం. ఇద్దరుండకూడదు. ఇద్దరివల్ల ఏ పనీ కాదండి. ముగ్గరండాలి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గరుంటేనే సృష్టి. ఈ ముగ్గరిలో ఎవరు లేకపోయినా సృష్టి లేదు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు మూడూ ఉంటేనే పని ఫలించడం. లేకపోతే ఫలించడం ఉండదు. కేవలం ఇచ్ఛ ఉంటే సరిపోదు. ఇచ్ఛా, జ్ఞానం ఉన్నా చెయ్యకపోతే అవ్వదు. అవుతుందా? పోనీ చెయ్యడం చేత అవును గాని, కోరిక ఉంది, ఇచ్ఛ ఉంది, చెయ్యడం చేతవును. కానీ ఎలా చెయ్యాలో తెలియదు. ఇచ్ఛా, క్రియలుండి, జ్ఞానం లేకపోతే ఇబ్బంది పడిపోతావు. ఈ మూడిటిలో ఏ రెండు ఉండి, మూడోది లేకపోతే అది పండదు కదా! అందుకనే, మొత్తం సృష్టి అంతా త్రిభుజం ఆధారంగా చేసారు. అందుకనే, అమ్మవారిని కూడా త్రిగుణాత్మిక, త్రిగోణిక, త్రిగుణాంబ ఇట్లా అంటూ ఉంటాము. త్రి, three అంటే ఇంగ్లీషులోనూ, సంస్కృతంలోనూ కూడా మూడే. అంచేత, ఈ త్రిగుణముగా మనం ఏర్పడ్డాము కాబట్టి మళ్ళీ మనం సవ్యంగా పరిపూర్ణంగా ఉండాలంటే మన యందలి త్రిగుణాలని మనం గుర్తించాలి. ఆ త్రిమూర్తి తత్వాన్ని మనం గుర్తించాలి. నేను, నా స్వభావము – ఈ రెండూ దేనిలో ఉన్నాయి? దైవంలో ఉన్నాయి. దేవుడు, జీవుడు, స్వభావము. ఆ దేవుడే మనకి రూపం దాల్చి మనకి మార్గాన్ని ఇస్తాడు. అతడే గురువు. అందుకనే మనం "*గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః, గురుస్సాక్షా త్పరంబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః*" అంటే అర్థం ఏమిటంటే పరబ్రహ్మము, మహేశ్వరుడు, విష్ణువు, బ్రహ్మ. అంటే ముందు పరతత్త్వము. అది త్రిభుజంగా నా గురువుద్వారా వస్తున్నాడని అర్థం. మా గురువుగారే బ్రహ్మ, మా గురువుగారే విష్ణువు, మా గురువుగారే శివుడు అంటే ఇంకోడు మా గురువుగారో అంటాడు కదా! నీ గురువుగారే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అంటే మా గురువుగారేంటి అన్న ప్రశ్న వస్తుంది మనస్సుకి. అది కాదు దానికి సమన్వయమైన అర్థం. సమమైన అర్థం ఏమిటటంటే ఎప్పుడూ కూడా పరతత్వమే బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా గురువు నుంచి సాక్షాత్కరిస్తూ ఉంటారు. నీవు ఎవరు గురువు అనుకుంటావో అతడి నుంచి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, పరతత్వమూ అన్నీ నిన్ను స్పృశిస్తాయి. అది వాహిక. అంచేత, నా గురువు నుండి వీరందరూ ఈ విధంగా నన్ను స్పృశిస్తున్నారు అన్న భావం ఉన్నప్పుడు నీలో ఉండేటటువంటి ప్రకృతి, నీవు, నీలో ఉండే దైవము, ఈ మూడింటి మధ్యా అనుసంధానం జరుతుంది.

ఈ త్రిభుజం రోజూ నిర్మాణం చేసుకున్నావనుకో, then there is manifestation. త్రిభుజం లేకుండా ఏదీ manifest కాదు. The whole creation is a triangle of forces అన్నారు. మూడు forces – ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు. అందుకని, ముగ్గరు కలిపి చేస్తే ఎంత మహాత్కార్యమైనా చెయ్యొచ్చు అని చెప్తారు. ముగ్గరు కలవడం కష్టం. ఇద్దరు కలుస్తూ ఉంటారు. అదే వాళ్ళ క్రైస్తవమతంలో Father in the heaven, Holy Ghost, Son

అన్నారు. ప్రకృతి, పురుషుడు, అందునుంచి వచ్చిన విరాట్ పురుషుడు అనుకోండి. అంచేత, చెప్పవచ్చిన విషయం ఏమిటంటే మీరు ఎక్కడికి వెళ్తున్నా, ముగ్గురు వెళ్తున్నారని గుర్తుపెట్టుకోండి. మీరు ఏం చేస్తున్నా, ముగ్గురున్నారని గుర్తుపెట్టుకోండి. You are one in three and three in one. నాలో నేను, నా గురువుగారు, నా స్వభావం. ఎంచేత? స్వభావం ద్వారానే పని చెయ్యాలి. ఇంకో విధంగా చెయ్యలేము పని. నీకు నీ స్వభావము నీ వాహిక. వాహిక లేకుండా పనేం చేస్తావు. జీవుడుకి స్వభావం కావాలి. దాని పనిముట్లు మనసు, ఇంద్రియాలు, శరీరం. అంచేత, నీకెంత తెలిసినా నీ స్వభావం సహకరిస్తేనే కదా అది చక్కగా వ్యక్తమవుతూ ఉంటుంది! అంచేత, ఈ స్వభావాన్ని చక్కగా తయారు చేసుకోవాలంటే, పంచ కళ్యాణీ గుర్రంలాగా, ఓ గాడిద నుంచి పంచకల్యాణి గుర్రం వరకూ మార్పు చెయ్యగలడు సద్గురువు. ఆయనంటూ చేసేదేమీ ఉండదు. ఆయన సాన్నిధ్యంలో మారిపోతూ ఉంటాయి అంతే. తోడు పెడితే పాలు పెరుగుగా ఎట్లా అయినాయో అట్లా మారుతూ ఉంటుంది. అది ఆయన వల్ల జరుగుతోందని శిష్యుడికి తెలుస్తూ ఉంటుంది. గురువుగారు మాత్రం తాను చేస్తున్నాడని అనుకోడు. ఎందుకంటే, అది అంతే! అదలా జరుగుతూ ఉంటుంది. అన్నీ బానే ఉన్నాయి, ఏం ఫరవాలేదు అని చెప్తూ ఉంటాడు. నీకెందుకు, నువ్వు ప్రార్థన చేసుకుంటూ ఉండు, అన్నీ బావుంటాయి అని చెప్తూ ఉంటాడు. ఎందుకంటే, ప్రార్థన చేస్తుంటే సాన్నిధ్యం ఉంటుంది. సాన్నిధ్యం ఉంటే స్వభావంలో మార్పులు వస్తూ ఉంటుంది. స్వభావంలో మార్పు వస్తూ ఉంటే జీవితంలో వికాసం ఏర్పడుతూ ఉంటుంది. స్వభావంలో మార్పు రాకుండా జీవితంలో శుభమైన మార్పులు రావు. గాడిద గాడిదగానే ఉంది కదా! అది గుర్రం అవ్వాలి, అది పంచకల్యాణి గుర్రం అవ్వాలి.

ఈ మార్పులన్నీ ఈ సాన్నిధ్యం వల్ల జరుగుతాయి కాబట్టి ఈ గురు సాన్నిధ్యాన్ని నాలో పెంచుంకుంటాను అనేటటువంటి దీక్షను మరలా గ్రహించడానికి ఈ పౌర్ణిమను మనవాళ్ళు కేటాయించారు. వ్యాసపూర్ణిమ అంటారు దీన్ని, గురుపూర్ణిమ అంటారు. ఎందుకనీ? ఈ కలియుగానికి వ్యాస భగవానుడిని మార్గం ఇచ్చే గురువుగా ఏర్పాటు చేసారు. శ్రీకృష్ణుడు మైత్రేయుడిని ఏర్పాటు చేసాడు. రెండు రకాలు. అంచేత, ఇది కాకుండా దత్తాత్రేయుడు. అసలు సృష్టి మొదలునుంచీ గురువు ఆయనే. ఇంతమంది గురువులు ఉన్నారా అంటే, ఇంతమంది గురువుల్లోంచి ఒకడే. ఇన్ని దీపాలు ఉన్నాయా అంటే, ఉంటాయి. ఎన్ని దీపాలయినా ఉండొచ్చు. అది వెలిగితే అది దీపం. కాకపోతే కాదు కదా! వెలగకపోతే వెంటనే తీసేస్తాం కదండి! అట్లాగే ఎవరినుంచి ఈ తత్త్వం అంతా వ్యక్తమవుతూ ఉంటుందో అతడు గురువుగా భాసిస్తూ ఉంటాడు. అలాంటి వాడిని మనం లోపల ఎంత పెంచుకుంటూ ఉంటే అంత మన తోక సరి అవుతూ ఉంటుంది. తోక అంటే స్వభావము. నీ ముందు రూపం నీ గురువు. నీ వెనక రూపం నీ స్వభావము. నీ మధ్య రూపం నువ్వు. "ఆచార్యః పూర్వరూపం అంతేవాస్యుతరరూపం" అంటాము కదా! "మిధ్యా సంధి".

అంచేత, నేను, నా స్వభావము, నా గురువుగారు. ఇందులో ఆ మూడూ ఉన్నాయనుకోండి అక్కడ అంతా manifestaions. ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులు చేరితే ఏ విధంగా manifestations అవుతూ ఉంటాయో, అలాగే ఈ మూడూ కలిసి ఉన్నచోట సంకల్ప సిద్ధి ఉంటుంది. ఎంచేత? దివ్యసంకల్పం సద్గురువు ద్వారా శిష్యుడికి వచ్చి, శిష్యుడి స్వభావం ద్వారా నిర్వర్తింపబడుతూ ఉంటుంది. అంచేత, ఈ త్రిభుజం మనం గుర్తించామనుకోండి, అప్పుడు మరి చాలా

అవసరం సద్గురువు యొక్క సాన్నిధ్యంలో ఉండడం. మనము, మన సద్గురువు, మన స్వభావము – ఈ మూడూ కలిసి ఉండాలి ఎప్పుడూ కూడా. అది ఎప్పుడూ అంటే, ఇట్లా ఈ గురుపూర్ణిమ నాడు, మళ్ళీ దానికి దీక్ష తీసుకుని, రోజూ మనలో సాన్నిధ్యం పెంచుకుంటూ వెళ్తాము. ఈ పెంచుకుంటూ వెళ్ళడం రోజూ అంటే, రోజూ ప్రార్థన చేస్తేనేనా? కాదు. ప్రతిక్షణం, అనుక్షణం ఈ ముగ్గురం ఉన్నామనుకోండి... అనుక్షణం నేను, నా గురువుగారు వెళ్తున్నాం అనుకోవాలి, స్వభావాన్ని అధిష్టించి. నీ స్వభావాన్ని అధిష్టించి నువ్వు, నిన్ను అధిష్టించి నీ గురువుగారు ఉంటారు మాములుగా ఎప్పుడు సద్గురువు నీ యందు ఉన్నా. నీవు సద్గురువుతో అనుసంధానం చెంది ఉంటే నిన్ను అధిష్టించి ఆయన ఉంటాడు, నీ స్వభావాన్ని అధిష్టించి ఉంటావు. నువ్వు సద్గురువుని నీ నుంచి దింపేసావనుకో, అప్పుడేం జరుగుతుందంటే, నీవు నీ స్వభావాన్ని అధిష్టించి ఉండడం కాకుండా, నీ స్వభావమే నిన్ను అధిష్టించి ఉంటుంది. అంటే, గుర్రం రౌతు మీదకి ఎక్కుతుంది. గుర్రం పైన, నువ్వు క్రిందా అయిపోతుంటావు.

అదే మనకి కథ ఇచ్చారు – రథము, కృష్ణుడు, అర్జునుడు. రథమెవరిది? అర్జునుడికే కదా ఇచ్చారు రథం! అగ్ని దేవుడు ఇచ్చాడు. నడిపేదవరు? కృష్ణుడు కదా! రథము నీదనుకుంటున్నావు. నీది కాదు నిజానికి. నీకు ఇవ్వబడింది, దేవదత్తం. దైవంచే నిర్మాణం చెయ్యబడి ఇవ్వబడినటువంటి శరీరంలో నీవు ఉన్నావు కాబట్టి నీదనుకోకూడదు ముందు. అర్జునుడి రథం అర్జునుడిది కాదు. అగ్ని దేవుడు కృష్ణుడికి ఖాంథవ దహనం అప్పుడు ఇద్దామనుకుంటే, నాకెందుకురా, నేనేం చేసుకుంటాను అన్నాడు. ఆయనకి ఏం కావాలన్నా ఉంది కదా! వాడికివ్వు, వాడికి అవసరం ఉంది. అందుకని అర్జునుడికి ఇచ్చాడు. మన శరీరం మనదే అనుకుంటాం కదా! అందులో కదా యుద్ధం చేస్తాడు. దాన్ని రోజూ repair చేసేది కృష్ణుడే రాత్రిపూట. ఆయన యుద్ధం చెయ్యగానే రాత్రి... మనం కూడా రోజంతా యుద్ధమే కదా జీవితం! సాయంత్రం వరకూ సంగ్రామమే. అడుగుతూ ఉంటాము, "*సంగ్రామే సర్వకార్యేషు నజాయతే*". పొద్దున్న లేచిన దగ్గర నుంచి మన జీవితమే ఒక సంగ్రామంగా నడుస్తూ ఉంటుంది కాబట్టి అలాంటి సంగ్రామంలో విఘ్నాలు లేకుండా కోరుకుంటూ ఉంటాము. ఈ సంగ్రామం అంతా అయిపోయిన తర్వాత సాయంత్రం తీసుకెళ్ళి ఈ రథానికి నట్లన్నీ బిగించి, మళ్ళీ పొద్దున్నే మనం లేచేసరికి fresh గా ఉండదండీ శరీరం? రాత్రి పడుకునేడప్పుడు ఏమిటి మన దేహం పరిస్థితి? పొద్దున్న లేచేటప్పటికి పరిస్థితి ఏమిటి దేహంది? ఎవరు దాన్నింత ఇలా తయారు చేసింది? ఎప్పుడన్నా ఊహించారా? నిద్రపోయి లేస్తే ఎందుకంత హాయిగా ఉంటుంది మళ్ళీ శరీరంలో జీవుడికి? నిద్ర లేదనుకోండి ఎలా ఉంటుంది? అలాగా మనం సంగ్రామం చేసి, చేసి, ఎక్కడో అక్కడ అదే పడిపోతుంది కదా! నిద్రలో ఏమిటి, ఎవరు చేస్తారు ఈ మార్పు? ప్రకృతి. అలా కృష్ణుడు రథాన్ని చక్కగా రాత్రి నట్లు బిగించి, గుర్రాలకన్నీ బాగా ఆహారం వేసి, ఉత్సాహపరిచి, నీళ్ళు ఇచ్చి, వాటికి సేవ చేసి, పొద్దున్నకల్లా మళ్ళీ పంచకల్యాణిలాగా తయారుచేస్తాడు గుర్రాలని. అదే కదా మన ఇంద్రియాలు! Fresh గా ఉంటాయి, మళ్ళీ వినడానికి, తినడానికి, చూడడానికి. అట్లా తయారుచేసి పట్టుకొచ్చాడు కదా! పద్దెనిమిది రోజులూ పట్టుకొచ్చేస్తాడు. అంతా అయిపోతుంది. యుద్ధం అయిపోయిన తర్వాత అర్జునుడన్నాడు కృష్ణుడితో, రోజూ నాకన్నా ముందే రథం ఎక్కుతున్నావు, నాకన్నా తర్వాత రథం దిగుతున్నావు కదా! రథం వేసుకుని వచ్చి, ఈయన్ని ఎక్కించుకుని యుద్ధం చేయించి, దింపేసి, రథాన్ని తీసుకెళ్ళి ఆయనేదో చేసుకుంటున్నాడు రథం. ఆయనేం చేస్తున్నాడో

వీడికి తెలియదు. మన పరిస్థితి కూడా అదే. అంచేత, ఆ రోజన్నాడు అయిపోయింది కదా యుద్ధం కృష్ణా, అందుకని మర్యాదకి అంటాడు, ముందు నువ్వు దిగు రథం, నేను తోల్తానులే అంటాడు. అంటే కృష్ణుడు అంటాడు, మామూలు మన భాషలో చెప్పాలంటే, ఏడిసావులే అంటాడు. నవ్వుతాడు. నవ్వి, అలా కాదులే, నువ్వు ముందు రథం దిగు. నేనుండగా నువ్వు రథం దిగాలి. నేనుండగా నువ్వు రథం ఎక్కాలి. అది పద్ధతి. నేను లేకపోతే నువ్వు ఎక్కినా అది శవమే. నేను దిగితే అందులో నువ్వు చచ్చిపోతావు. అంటే కాదూ కూడదంటాడు. కాదూ లేదు, గీదూ లేదు, నువ్వు ముందు దిగు రథం అని చెప్తాడు కృష్ణుడు. ఏం నువ్వు ముందు ఎందుకు దిగకూడదు అని అడుగుతాడు అర్జునుడు. మనలాంటి వాడే కదా, నరుడు కదా! అంటే, అలాగే నేను దిగుతాను చూద్దువుగాని అంటే అర్జునుడు రథం దిగుతాడు. కొంచెం దూరంగా వెళ్ళమంటాడు అర్జునుడిని. వెళ్తాడు. తర్వాత కృష్ణుడు రథం దిగుతాడు. వెంటనే అగ్ని అంటుకుని రథం కాలిపోతుంది. అగ్ని దేవుడు యుద్ధం కోసం ఇచ్చాడు రథం. నువ్వు రథంలో ఉంటే ఏమయ్యి ఉండేవాడివి, ముందు నన్ను దిగమన్నావు కదా అంటాడు కృష్ణుడు. నేను ముందు దిగి, నువ్వు రథంలో ఉంటే నీకు కలిగేది మరణం. నేను ముందు దిగి నువ్వు రథంలో ఉంటే దానితోపాటు కాలిపోయేవాడివి. నిన్ను దింపి నేను దిగుతాను. నిన్ను ఎక్కించుకుని, నీ చేత పని చెయ్యించి, నిన్ను దింపి, నేను దిగుతాను. అది శాస్త్రం. అది సత్యం. అందులో ఉంది రహస్యం అంతా. అట్లాగే జీవుడికి సద్గురువు అలా చేసి పెడతాడు. నీ రథం నడపడమే కాక, నీ స్వభావంలో మార్పు తెచ్చి, నీకు మరణం లేకుండా నిన్ను చక్కగా రథం దింపిస్తాడు. నువ్వు చూస్తూ ఉంటావు నీ రథాన్ని కాలుస్తుంటే. అందులో చచ్చిపోయామనుకోండి? అందులో చచ్చిపోకూడదు.

అంచేత, ఇలా మనకి అనునిత్యం సాన్నిధ్యం సద్గురువుది ఉండడంవల్ల అనేకానేకమైనటువంటి ఉద్ధారణలు మనలో జరుగుతాయి. అంచేత, పొద్దున్నా, సాయంత్రం ఎదో కాసేపు గుడుగుడుమనిపించి ఇహ మిగతా time లో మనమే ఉన్నామనుకోండి, అంతంతమాత్రంగా ఉంటుంది జీవితం. మనమే ఉంటే ఏం బావుండదు, ఏం శోభ ఉండదు. వాడితో కూడి మనం ఉంటే మనకి శోభ. వాడకి శోభ కూడా అక్కర్లేదు. మనకి శోభ. ఎందుకంటే, తనదే శోభ అంతా కూడా. మనకి శోభ కోరేటటువంటివాడు, మనకి విజయం కోరేటటువంటివాడు, మనకి వైభవం కోరేటటువంటివాడు సద్గురువు. మన్ని శపించేవాడు కాదు సద్గురువు. మనం పాడయిపోవాలనుకునేవాడు కాదు. అంచేత, అలాంటి వాడు ఎప్పుడూ మనతో ఉండాలి కదా! ఎప్పుడూ ఉండాలంటే? అనన్య చింతన ఉండాలి. "*అనన్యాస్ చింతయంతో మామ్*" అన్నాడు. పరి ఉపాసన ఎప్పుడూ జరుగుతూ ఉండాలి. నిత్య అభియుక్తత ఉండాలి. ఈ శ్లోకం భగవద్గీతకి మణిపూస లాంటిది. అది మనం పూజలో పెట్టుకున్నాం, మాస్టరుగారు అలా ఏర్పాటు చేసారు. "*అనన్యాస్ చింతయంతో మామ్ ఏ జనా పరి ఉపాసతే ఏషామ్ నిత్య అభియుక్తానామ్ యోగక్షేమం వహామ్యహమ్*".

అంచేత, ఎప్పుడూ మనతో ఉండాలిసినదేమిటంటే credit card, pruse లో currency కాదు. ఎప్పుడూ అది లేకపోతే జరగదు కదా అనుకుంటూ ఉంటాం కదా! అది జేబులో లేకపోయినా జరుగుబాటు అద్భుతంగా జరుగుతుంది, చూడండి కావాలంటే. జేబులో ఏం ఉండక్కర్లేదు. మీకు ఆ విశ్వాసం ఉండాలి తప్ప, మీ జేబులో ఏం పెట్టుకోకుండా మీరు ఇక్కడినుంచి వెళ్ళిపోవచ్చండి ఏ ఊరయినా. అన్ని ఏర్పాట్లు అంత బాగా చేసి పెడతాడు. నువ్వు పరీక్ష చేద్దాం అనుకుంటే

తోలు తీసేస్తాడు. నీకు విశ్వాసం ఉంటే రక్షిస్తాడు. Never try to test the teacher. మహిమ చూపిస్తే నమ్ముతానంటాడు ఒకడు బుద్ధుడితో. ఏ మహిమ చూపించమంటే, ఇప్పుడు నా కళ్ళ ఎదురుగా ఇట్లా బంగారు తీగ ఆకాశంలోంచి వ్రేళ్ళాడి ముందు నిలబడాలంటాడు. ఏముంది, మనసు రకరకాల వికారాలు కదా! అంటే, అలాగే అన్నాడు బుద్ధుడు. కళ్ళు మూసుకో అన్నాడు. కళ్ళు మూసుకునే కాదు, కళ్ళు తెరిచి చూడాలన్నాడు. అలాగేరా, కళ్ళు మూసుకో అన్నాడు. కళ్ళు మూసుకున్నాడు. తెరు అన్నాడు. తెరిచేసరికి ఎదురుగుండా బంగారు తీగ ఉంది. ఆశ్చర్యపోయాడు. దణ్ణం పెట్టాడు. ఇప్పుడు మీ శిష్యుడిగా ఉండడానికి పరిపూర్ణంగా నాకు అంగీకారం అయ్యింది, నన్ను మీరు అంగీకరించండి అంటే, అలా ఎడం చేత్తో దారి చూపించాడు బుద్ధుడు. చూపించి వెళ్ళిపో అన్నాడు, get lost అన్నాడు బుద్ధుడు. అంచేత, పరీక్ష పెట్టవద్దు. ప్రయత్నించి చూడండి. అంచేత, ఆ విధంగా జరుగుతాయి. అంచేత, ఈ గురుపూర్ణిమనాడు గురువునంటూ ఆశ్రయించిన ఒక స్థితిలో ఇక్కడ చేరినవారందరూ ఉన్నారు కాబట్టి గురుసాన్నిధ్యాన్ని ఎంత అనునిత్యం చేసుకోవాలో అంత అనునిత్యం చేసుకుంటూ ఉండాలి. అది ఒక్కటే మార్గం. అది ఈ పూట చెప్పుకోవాలి తప్పదు. మనం ఎంత మార్కండేయ కథ చెప్పుకుందామన్నా ఇలా దాని ముందు చాలా వచ్చేస్తున్నాయి.

అంచేత, ఇప్పుడు మనం మార్కండేయ పురాణంలోకి వెళ్తాము. ఈ మార్కండేయుడు అంటే Mark. మార్కండేయుడు అనేటటువంటి మహాత్ముడు, మహాపురుషుడు, చిరంజీవి. అందుకనే, మనం అందరం కూడా, “మార్కండేయ ఆయుష్యమస్తు” అంటూ ఉంటాం. అంటే, ఇప్పటికీ ఉన్నాడు. ఎప్పటికీ తనకు తాను తెలిసి ఉన్నాడని అర్థం. అలాంటి వాళ్ళని చిరంజీవి అంటారు. హనుమంతుడు చిరంజీవి. ఆశ్వద్ధామ చిరంజీవి. ఇట్లా చిరంజీవులు ఉన్నారు. ఈ చిరంజీవుల కోవలోకి వచ్చిన వాళ్ళందరూ ఏమిటంటే, ఎన్ని శరీరాలు మార్చినా వాళ్ళకు వాళ్ళెవరో తెలిసి ఉంటారు. సప్త ఋషులందరూ కూడా అలాగే ఉంటారు. సనకసనందనాదులు కూడా అలాగే ఉంటారు. వీరందరూ మనలాగే భౌతిక శరీరంలో భూమి మీద ఉన్నటువంటి వారు. మనం పూజ చేసుకునే గణపతి, హనుమంతుడు, వీరందరూ కూడా భూమి మీద ఉన్నారండి మనకోసం. తన కోసం కాదు. వాళ్ళుండాలిసిన అవసరం లేదు భూమి మీద. ఎందుకయ్యా ఇక్కడున్నారు అంటే, అంతకన్నా అద్భుతమైన లోకాలు ఉన్నాయి కదా అంటే, ఎదో వీళ్ళ కోసం. అదీ కరుణ. అలాంటి వాళ్ళ కథల్లో మార్కండేయుడి కథ చాలా ముఖ్యం. మనకి సంబంధించిన కథ అది. ఎంచేత అంటే, గణపతి మృత్యువుని దాటడం అనేది వినాయక చవితి నాడు జరిగిపోతుంది. తల తీసి తల పెడతాడు కదా వాళ్ళ నాన్నగారు! అప్పటికే ఆయనకి అయిపోతుంది. దత్తత్రేయుడికి పుట్టుకతోనే అవతారమూర్తి ఆయన. అంచేత, ఆయనకీ మరణం లేదు. ఇట్లా మరణిస్తున్నాము అనుకునేటటువంటి వాడు మరణింపక నిలబడిన కథ మనకి బాగా ఎక్కువ relevent కదా! మనమంతా చచ్చిపోతామని మనకి బాగా రూఢీ ఉంది కదా! ఎదో రోజు చచ్చిపోతామని కదా అనుకుంటూ ఉంటాము. సామాన్యంగా ప్రతి మనిషి రోజూ గుర్తు రాకపోయినా ఎదో వాళ్ళూ వీళ్ళూ పోయినప్పుడు, మనం కూడా పోతాము అని అనుకుంటాడు కదా! ఈ మనం పోయే లోపల అని చెప్పి పనులు చేసుకుంటూ ఉంటారు. Death oriented గా plans అన్నీ ఉంటాయి చాలామందికి. అంటే, ఒక అరవైయేళ్ళు వచ్చినాయి అనుకోండి, అక్కడినుంచి ఇంకేం చేసినా మనం పోయే లోపల అనుకుంటూ ఉంటాడు. మనం పోయే లోపల ఈ పని చేసేద్దాం, మనం పోయే

లోపల ఆ పని చేద్దాం, మనం పోయే లోపలే వీలునామా రాసేద్దాం అనుకుంటాడు కదా! అదేమిటది మనం పోయే లోపల? మనం పోయే లోపల అంటే నీకు తెలియదు కదా ఎప్పుడు పోతావో? ఎవడికీ తెలియదు కదా! **If you are able to mark the date of your departure, you are called Markandeya.** అది గుర్తుపెట్టుకోండి. ఈ **Mark** అనేటటువంటి ఇంగ్లీషు పదమూ, మార్క అనేటటువంటి సంస్కృత పదమూ ఒకటే. మార్క నుంచి **Mark** వచ్చింది. అందుకనే, తమాషాగా **Master CVV** గారు **"Mark the end"** అన్నారు. అప్పుడు మార్కండేయుడివి అవుతావు అన్నారు. మార్కండేయుడు ఎప్పుడూ ఉన్నాడంటే, అదే శరీరంలో ఉన్నాడని కాదు. **He knows when to depart, when not to depart.** అది తెలిసి ఉండాలి. అందుకనే యోగం.

నీవు ఇందులో మరణించని వాడిగా ఏ విధంగా దైవమే తానుగా ఉన్నాడో ప్రతివాడికీ తెలిసేంతవరకూ వాడు ప్రయత్నం చేసుకుంటూ ఉన్నట్లయితే ఈ శరీరాన్ని ఇది ఈ లోపల పడిపోకుండా దీన్ని యొక్క **span** ని **extend** చేసుకుంటూ ఉండొచ్చు. ఈ **facility** ఉంది సృష్టిలో. నీవు చేసేటటువంటి పని జీవుడికి ఉద్ధారణ కలుగుతున్నటువంటి కార్యక్రమం జరుగుతూ ఉంటే, అంత త్వరగా యముడు చెప్పినట్టుగా అ **time** ప్రకారం పట్టుకుపోడు. అది ఒకటి ఉంది. అలా ఒక ఏర్పాటు జరిగింది సృష్టి కథలో. అది మార్కండేయుడి కథ. అది మనందరికీ **relevent.** ఎందుకంటే మనసులో బతికుండేవాళ్ళం అయుండడంచేత మనసుకి హెచ్చుతగ్గులు, హానివృద్ధులు అన్నీ ఉన్నాయి కాబట్టి అది అమావాస్యకి మరణిస్తుంది, పూర్ణిమ నాటికి పూర్ణంగా విచ్చుకుని ఉంటుంది. అంచేత, మరణం ఉన్నదని భావిస్తూ ఉంటాం మనం. అంచేత, ఈ మరణం ఉన్నదని భావించేటటువంటి వాళ్లకి మరణాన్ని మనయొక్క కార్యక్రమములను పరిపూర్ణం గావించేంత వరకూ కూడా అలా ఉండు, నేను పండనీ. నేను పండిన తర్వాత నేనే వదిలేస్తాను. ఈ లోపల నువ్వు వచ్చి నువ్వు తీసుకెళ్ళిపోవక్కర్లేదు అని చెప్పేటటువంటి ఒక విధానం ఈ ప్రాణంలో ఉంది. అంటే, నీవు ఒక దివ్యమైనటువంటి ప్రయోజనానికి జీవిస్తున్నప్పుడు నిన్ను మరణం వెంటనే వచ్చి అకస్మాత్తుగా, అకాల మృత్యువు కలిగి నువ్వు మరణించకుండా ఉండే విధానం. అది ఎలాంటిదంటే తన్ని తాను పరిణామం కలిగించుకుంటూ ముందుకు సాగుతున్నటువంటివాడు, ఒక దివ్యమైన ప్రయోజనం కోసం అనునిత్యం తన జీవితాన్ని సమర్పిస్తూ జీవిస్తున్నటువంటివాడు, వాడికి ఈ దేహం కొంతకాలం ఉండవలసిన అవసరం ఉంటే ఈ **time** ప్రకారం తీసేయ్యాల్సినటువంటిది లేకుండా పని అయిపోయిన తర్వాత వదిలేసేయ్యవచ్చు. అది మన్ని వదిలేసి వెళ్ళిపోకుండా, మనమే దాన్ని వదిలేసి వెళ్ళిపోవడం అనేటటువంటి ప్రధానమైన సూత్రం.

గుర్రం మీద మనం ఎక్కి ప్రయాణం చేస్తున్నాం. దారిలో గుర్రం మన్ని పడేసి అది వెళ్ళిపోకుండా మన ప్రయాణం అయిన తర్వాత, మనం గుర్రం దిగిన తర్వాత, మనం గుర్రాని వదలడం. మనం దేహాన్ని వదలడం. మన్ని దేహం వదలడం కాదు. మామూలుగా అందరినీ దేహమే వదిలేస్తుంది. ఈ వెధవతో నాకేం అన్నట్టు! ఎందుకని? మనం చేసే పనుల్లో ఉండేటటువంటి నాణ్యతనిబట్టి ఉంటుంది అది. అంచేత, దేహం నిన్ను అకాలంగా... సగం దారిలో బండి **fail** అయ్యింది అనుకోండి, అప్పుడు మళ్ళీ బండి తెప్పించుకుని, మళ్ళీ బండి ఎక్కేదానికన్నా, ఇంటికొచ్చాకా **break down** అయ్యిందనుకోండి, అది వేరే సంగతి. దారిలో **break down** అయితే చాలా తిప్పలు కదా! అలాగే జీవుడికి ఈ వాహనం

దారిలో break down కాకూడదు. ఇది వాహనం కదా! ప్రయాణం అయ్యిన తర్వాత, తను దిగిన తర్వాత, దాన్ని ఎక్కడయినా park చేయొచ్చు. కొత్తల్లో నేను practice పెట్టిన కాలంలో నాకు ఒక second hand అంబాసిడర్ కారు ఉండేది. అది ఒక పుష్కర కాలం వాడాను. అప్పటికే దానికి పన్నెండేళ్ళు, ఇంకో పన్నెండేళ్ళు నేను వాడాను. ఆ రోజుల్లో మామూలుగా మనకుండే ride లకి, రోడ్లకి, మనకుండే కారు టైర్లుకి మాటిమాటికీ puncture లు పడ్డం, వాటికి puncture లు వేయించుకుంటూ ఉండడం, ఇవన్నీ దినచర్యలో ఒక భాగం అది. అంటే ఎప్పుడూ ఈ puncture లు వేసేవాళ్ళవి కూడా బోల్డు కొట్లు ఉండేవి. ఇప్పుడు ట్యూబులే లేవనుకోండి. అప్పుడు tube లు ఉండేవి, tube లు puncture అవుతూ ఉండేవి. రోడ్ల మీద ఉండే మేకులు దిగిపోతూ ఉండేవి, puncture లు అవుతూ ఉండేవి. నా కారు అది ఎంత మంచి కారో ఎప్పటికీ మర్చిపోలేను. అది ఎన్నిచోట్ల తిరిగినా, ఎప్పుడు ఎక్కడికెళ్ళినా కార్లోనే వెళ్ళేవాడిని, బెజవాడ వెళ్ళినా, హైదరాబాదు వెళ్ళినా, మరో చోటకి వెళ్ళినా, ఇంటికొచ్చి గేటు దగ్గరకి వచ్చిన తర్వాత puncture అయ్యేదండి అది! ఎప్పుడూ దారిలో puncture అయ్యేది కాదు. ఎన్నిసార్లు జరిగిందో. అబ్బా! ఎంత మంచి కారో అనుకునేవాడిని. అలా మనకి దారిలో puncture అయిపోకూడదు. సగం దారిలో puncture అయితే చాలా ఇబ్బంది జీవుడికి. మళ్ళీ మొదలుపెట్టి చేసుకోవాలి ఒక శరీరం పోతే సగం దారిలో, సగం సగం పనుల్లో. అందుకనే "*అకాల మృత్యు హరణం*" అంటూ ఉంటాము తీర్థం పుచ్చుకుంటూ. "*సర్వవ్యాధి నివారణం సమస్త పాపక్షయకరం విష్ణు పాదోదకం పావనం శుభం*" అంటూ తీర్థం పుచ్చుకుంటూ అంటారు. ప్రతివాళ్ళు అది ఒక్కటీ భక్తిగా పుచ్చుకుంటారు మిగతావి ఎలా ఉన్నా. ఎందుకని? చచ్చిపోతామనే భయం చేత కదా! ఈ చావు అనేటటువంటిది నీ పనులు అయ్యేంతవరకూ అది ఉండేటట్టు. నీ పనులంటే ఏమిటి? పాడు పనులు కాదు. నువ్వు ఏది ఉద్దేశ్యించి ఈ శరీరంలోకి వచ్చావో ఆ ఉద్దేశ్యాని సిద్ధి పొందేంతవరకూ ఇది నీకు తోడ్పాటు అవ్వడానికి పరమశివుడు మానవజాతికి ఒక వరం ఇస్తాడు. దానికి మార్కండేయుడు మనకి మాధ్యమము అయ్యాడు. He is the medium. అతడు కారణంగా వచ్చింది. అంచేత, మార్కండేయుడి కథ మనకి ప్రధానమైన కథ.

మృకండు మహర్షి అని ఒక మహర్షి ఉండేవాడు. వాళ్ళ నాన్నగారి పేరు నిన్న చెప్పానుగా, విధాత. ఆయన తండ్రి పేరు భృగువు. భృగు మహర్షి సప్త ఋషులలో ఒకడు. చతుర్ముఖ బ్రహ్మ సప్త ఋషులను ఏర్పాటు చేసాడు ఉపాధ్యాయులుగా. అంతేకాదు, ప్రజాపతులుగా కూడా ఇంకో ముగ్గురిని చేర్చి వాళ్ళనే వినియోగించాడు. పదిమంది ప్రజాపతులు. అందులో ఏడుగురు సప్త ఋషులుగా మన సప్త కేంద్రాల్లోనూ వ్యాప్తి చెంది సప్త లోకాలలోనూ ఉంటారు. వాళ్ళందరూ ఆయా లోకములలో వారి వారికందరికీ కూడా మార్గదర్శకత్వం వహించి ఉంటారు. అందుకని, ఏడు కేంద్రాల్లోనూ సద్గురువులు వ్యాప్తి చెంది ఉన్నారు. ఏడు లోకాల్లోనూ వ్యాప్తి చెంది ఉన్నారు. అలా భృగు మహర్షి అంటే మన భ్రూమధ్యానికి సంబంధించినటువంటివాడు, లేకపోతే అజ్ఞా కేంద్రము. ఆంగీరస మహర్షి విసుద్ధి కేంద్రము, వసిష్ఠ మహర్షి హృదయము, పులస్త్య మహర్షి నాభి, పులహుడు స్వాధిష్టానము, క్రతు మహర్షి మూలాధారము. ఇట్లా ఏడుగురు. అత్రి మహర్షి పైన మరీచి మహర్షి అని అతడు కాంతివంతమైన aura గా మన పైన ఉంటాడు. అలాగే దక్షుడు మనలో మన యొక్క ability గా ఉంటాడు. ఆయనో ప్రాజాపతి, దక్షత్వం. ఇలా ప్రజాపతులు ఉన్నారు.

ఈ ప్రజాపతుల్లో భృగు మహర్షి, ఆయనకి ధాత, విధాత అని ఇద్దరు కుమారులు. ప్రజాపతులుగా వారి పని ఏమిటంటే ప్రజాసర్గము – అంటే జీవులకి సృష్టి జరిగే సందర్భంలో ఈ జీవులందరికీ దేహ ధారణము కలగడం కోసం ప్రజోత్పత్తి కోసం పదిమందిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పదిమందీ అట్లా ఇబ్బడిమొబ్బడిగా సంతానం కంటూ ఉంటారు. అందుకనే, ten times ten అంటూ ఉంటారు. ఒరేయ్! ఒక్కొక్కళ్ళూ ఓ పదిమంది చొప్పున కనండిరా అని! ఇప్పుడు జర్మనీలో పరిస్థితి అదే! బాబు బాబు, పిల్లల్ని కనండి కాస్త అంటున్నారు. ఎందుకంటే, అక్కడ పిల్లలు అసలు లేరు. ఒక తరం లేదక్కడ. ఈ సృష్టి ప్రారంభంలో ఎంత అవసరం ఉంటుంది? ఎంతోమంది జీవులు దేహదారణ కోసం వేచి ఉన్నారు. వారందరికీ దేహాలు కలిపించాలంటే ఈ పదిమంది ప్రజాపతులని పూనుకోమన్నారు. అంతకుముందు నలుగురు కుమారులు చతుర్ముఖ బ్రహ్మ నుండి వస్తారు. ఒరేయ్! మీరు కూడా సృష్టి కర్మలో భాగం పంచుకోండి అంటే, మేము అందుకు రాలేదు అంటారు వాళ్ళు. వచ్చిన వాళ్లకి మార్గం చూపించడానికి, నాలుగు వ్యూహాలు ఏర్పరచడానికి వచ్చాము తప్ప, ఈ ప్రజాతంతు పెంచడమనేది మా పని కాదని చెప్తారు వాళ్ళు. ఆ తర్వాత రుద్రులు వస్తారు. వాళ్ళు లోకాలన్నీ ఏర్పాటు చేసి, అందరిలోనూ తరంగములుగా అంటే vibrations గా ఉంటామంటారు. ఆ తర్వాత ప్రజాపతులు. ఈ ప్రజాపతుల్లో ఈ భృగువు నుండి విధాత, ధాత వస్తే, విధాతకి మృకండు అనేటటువంటి...

ఈ మృకండు నామం కూడా మార్కండు అను నామం నుంచి అది మృకండు అయ్యింది. మీరు సంస్కృతం dictionary చూస్తే మృకండు అన్న పదం కనపడదు. మార్కండు అని ఉంటుంది. ఎందుకంటే, మనం ఏం చదువుకున్నా, పురాణాల్లో ఆ నామంలోనే రహస్యం ఉంటుంది. ఏ పేరుకయినా సరే. వ్యుత్పత్తి అర్థం కలిగినటువంటి భాష సంస్కృత భాష. అంటే, దాని యొక్క స్వరూప స్వభావాలన్నీ కూడా నామంలో ఉంటాయి. ఆ మార్కండు అనేటటువంటి మహర్షి కుమారుడు కాబట్టి మార్కండేయుడు అన్నారు. ఈ మృకండు మహర్షి మనస్విని అనే ఒకామెను వివాహం చేసుకుంటాడు. వివాహం చేసుకుంటే, వారిద్దరూ కలిసి దాంపత్య జీవితం. దాంపత్య జీవితం చేస్తుంటే ఎన్నాళ్ళు దాంపత్య జీవితం గడిపినా సంతానం కలగదు. సంతానం కలగకపోతే, అప్పుడు ఆ రోజుల్లో సంతానం కలగడం చాలా అవసరం ఉంది. ఎందుకంటే, ఇంకా సృష్టి జరుగుతూ ఉన్న సందర్భాలు. వివాహం యొక్క ఉద్దేశ్యమే సంతానం. "*ప్రజాతంతుమ్ మా వ్యవస్త్సేత్సీ*" అని చెప్పి మనకి ఉపనిషత్తు వాక్యం ఒకటి ఉంది. నీకు దేహం ఇచ్చారు కాబట్టి నీ తల్లిదండ్రులు, నీవు ఇంకొకరికి దేహం ఇచ్చేటటువంటి బాధ్యత నీకు ఉన్నది. నీవు ఏదయితే పొందావో అది నువ్వు ఇతరులకి కూడా ఇస్తూ ఉండాలి, అప్పుడే నీ ఋణం తీరుతుంది. మనం పొందినవన్నీ ఇంకోళ్ళకి ఇస్తే మన ఋణం తీరుతుందండి. మనం పొందినవి మనం ఉంచుకుని ఇంకోళ్ళకి ఇవ్వకపోతే ఋణం పెరుగుతూ ఉంటుంది. అంచేత, మనం తల్లిదండ్రుల నుంచి దేహం పొందిన వాళ్ళం కాబట్టి మనం మళ్ళీ మరి కొంతమంది జీవులకి దేహాన్ని ఇవ్వాలి. అది ఒక కర్తవ్యం. ఆ కర్తవ్యంలో భాగంగా జీవిస్తూ ఉంటారు వారిద్దరూ సంతానం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటారు. సంతానం కలగదు.

సంతానం కలగకపోతే ఏం చెయ్యాలి? సంతానం కలగకపోతే దైవాన్ని ప్రార్థన చెయ్యాలి. ఇంకోటేదీ లేదు. దైవాన్ని ప్రార్థన చేసినా సంతానం కలగలేదనుకోండి, మనకీ కర్తవ్యం ఈ జన్మకి లేదనుకోవాలంతే. అది నిన్న చెప్పాను కొంచెం. కొంతమందికి సంతానం కలగదు. ఋణం ఉంటే సంతానం ఉంటుందండి. ఋణం లేకపోతే సంతానం

ఉండదు. చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్తులు అన్నారు. క్రిందటి జన్మలో బాగా ఎంతోమందికి బాకీ పడిపోతే, ఆ బాకీ తీర్చకుండా ఎగ్గొట్టడానికి చచ్చిపోయామనుకోండి. బాకీ తీరలేదు. వాడు వదిలేస్తాడా? ఎవడయినా అప్పు ఇచ్చిన వాడు వదులుకుంటాడా? ఫోన్లు చేస్తుంటాడు, మనుషులని పంపిస్తూ ఉంటాడు. ఈ రోజుల్లో అయితే గుండాలని కూడా పంపిస్తాడు కదా! సృష్టిలో ఎలా ఉందంటే అలా ఎవరయినా తప్పించుకున్నారనుకోండి మరణించి. మరణించడం కూడా చేసిన అప్పులు తీర్చకుండా చచ్చిపోతే, పై జన్మలో వడ్డీతో సహా తీర్చాలంటుంది కర్మ శాస్త్రం, కర్మ సిద్ధాంతం. నువ్వు ఎవరికీ బాకీ పడకుండా నువ్వు వెళ్ళిపోతే నీకు తేలికగా ఉంటుంది పై జన్మ. బాగా బాకీలు పడ్డామనుకో, బాగా చాకిరీ ఉంటుంది. ఏం సందేహం లేదు. మరీ ముక్కు పట్టుకుని చేయించుకుంటారు నీచేత పిల్లలు కదా! ఎవరో చదువుకోవాలట, ఒక వెయ్యి రూపాయలు ఇమ్మంటే, రేపురా, ఎల్లుండిరా అంటాము. నీ కొడుకే MBBS లో చేరాలంటే ఏం చేస్తావు? యాభై లక్షలు అయినా కడతావు, కోటి రూపాయలు అయినా కడతావు. కొడుకు కదా! కొడుకనేటటువంటి వ్యామోహం నీలో ఏర్పాటు చేసి, నీ కొడుకు కోసం నువ్వు ఎన్ని చేస్తావు? ఎందుకని చేస్తావు? బాకీ! కొంతమంది కొడుకులు ఫీజులు కూడా కట్టించుకోకుండా scholarship లు తెచ్చుకుని చదువుకుని పైకొచ్చేస్తారు కదా! అంటే ఏమిటి? వాడికి నువ్వేం బాకీ లేవు. కొంతమంది కొడుకులు ఉంటారు, అట్లా for life dependents. ఉంటారు కదా! Seat రావడం లేదు, నాన్న donation కట్టొచ్చు కదా అని అమ్మకి చెప్తాడు కదా! నాన్నకి చెప్పడు. ఏం ఉందిగా, సంపాదించాడుగా, కట్టొచ్చుగా, రోగమా అన్నట్టుగా చెప్తాడు కదా! అంతేకాదు, వాడే చెప్తాడు ఎక్కడ seat అయితే బావుంటుందో కదా! ఏం నన్ను business school లో చేర్పొచ్చు కదా అంటాడు వాళ్ళమ్మతో. ఆవిడింక అలా బరికేస్తూ ఉంటుంది రోజంతా! ఈ బాధ పడలేక అప్పో, సొప్పో చేసి ఎక్కడో business school, లేకపోతే మణిపాల్, లేకపోతే మరొకటి. ఏవో ఉన్నాయి కదా రకరకాల కాలేజీలు, బోల్డు కాలేజీలు. చచ్చీచెడి కడతావు కదా! ఏమిటిదంతా? బాకీ!

అందుకని, భగవంతుడు ఇస్తే సంతానం అందుకోవడం. ఇవ్వలేదు, ఊరుకో. అలా కాకుండా నువ్వు చాలా పట్టుపట్టి గట్టిగా తెచ్చుకున్నావనుకో ఏదయినా, అది ఏం వస్తుందో తెలియదు. చాలా జరిగినాయి. సంతానం లేనివారికి సంతానం లేదంటే, ఈ జన్మకి ఆ కార్యక్రమం పెట్టలేదు, దాని గురించి బాధ చెందకండి అని చెప్తూ ఉంటాను నేను అందరికీ. కొంతమందికి కొన్నికొన్ని ఉండవు. కొన్ని కార్యక్రమాలు ఉండవు. కొంతమందికి ఈ రోజుల్లో కాదు కాని, పెళ్లి అయ్యేది కాదు. CVV గారు మాత్రం వాగ్దానం చేసారు, నన్ను స్మరించావంటే నీకు పెళ్లి తప్పకుండా అవుతుంది అని. అప్పుడు కదా నీ రోగం కుదురుతుందని! మన కర్మ తియ్యాలంటే ఒక పెళ్ళామో, ఒక భర్తో ఉండాలి కదా! అంతకన్నా ఇంక! అంచేత, వివాహము. సంతానము కలగలేదనుకోండి, ఈశ్వరాజ్ఞ అనుకోవడం. అంగీకరిస్తే సుఖం అండి, లేదా నీకే లోపల బాగా అనిపిస్తే ఏం చెయ్యాలి? దైవప్రార్థన చెయ్యి. విపరీత ప్రయత్నం వద్దు. విపరీత ప్రయత్నం చేస్తే అందులోంచి పుట్టుకొచ్చేది ఏమిటి? ఎలాంటిది పుట్టుకొస్తుందో తెలియదు. మానవాకారమేగాని అందులోంచి ఎలాంటి స్వభావం కలిగిన వాళ్ళు వస్తారో మనం చెప్పలేము. ప్రకృతి నీకు సహజంగా ఇవ్వనది నువ్వు పుచ్చుకుంటే, ఆ వచ్చేవాడు ఎలా ఉంటాడో మనం చెప్పలేము.

అలాంటి కథలు జరిగినాయి బోల్డు. నాకు కొంచెం horizon ఎక్కువ కదా, రకరకాలుగా చూస్తూ ఉంటాను, ఇవన్నీనూ! అలా తెచ్చుకున్నాడు ఒకాయన అమెరికాలో. వద్దురా అని చెప్పాను. నీకెందుకయ్యా, ఇవ్వలేదు కదా, హాయిగా ఉండడి అని చెప్పాను. ఏదేదో చేసి, ఎట్టాగోఅట్టా ఓ పిల్లవాడిని తెచ్చారండి. తెస్తే ఏమిటి? వాడు congential diabetic. ఇంక ఏమిటి వాడు? వాడికి జీవితం లేదు. వీళ్ళకీ సుఖం లేదు. ఏమీ తినకూడదు. తోటి పిల్లలతో ఆడుకుంటే, వాళ్ళు రకరకాలు తింటూ ఉంటారు, రకరకాలు తాగుతూ ఉంటారు. వాడేం చెయ్యకూడదు. వీణ్ణి చూస్తుంటే తల్లితండ్రులకి బాధ. అలా ఇంకో సందర్భం. ఇట్లాగే విపరీత ప్రయత్నాలు చేస్తే, సంతానం కలిగి భార్యకి భయంకరమైన వ్యాధులన్నీ వచ్చేసినాయి. అందులో భాగంగా uterus based sicknesses అన్నీ వచ్చి ఆవిడ మరణావస్థలోకి వచ్చేసింది. ఎందుకు అక్కర్లేనిది? Natural గా వచ్చేది ఒకటి. నువ్వు తెప్పిస్తే ఇంకోటి. అలా ఉంటుంది. దైవప్రార్థన చెయ్యి. దైవప్రార్థన చేస్తే పదేళ్ళు, పన్నెండేళ్ళు తర్వాత కూడా సంతానం కలిగిన సందర్భాలు ఉన్నాయి. అది సహజము. అంటే, సహజమైన పద్ధతుల్లో కాకుండా అసహజమైన పద్ధతుల్లో ఎంతంతో డబ్బులు ఖర్చుపెట్టి, ఇప్పుడు ఎట్లాగో అట్లా సంతాన్నాని తెచ్చుకునేటటువంటి ఒక రాక్షసమైనటువంటి, అసురమైనటువంటి ఒక చర్య బాగా ప్రపంచం అంతా వ్యాప్తి చెంది ఉంది కదా! అలా తెచ్చుకుని వాటితో తర్వాత, post birth వాళ్ళ కథేమిటో ఎవరూ follow అవ్వరు. ఎలాంటి వాళ్ళు వచ్చారు? ఏం జరిగింది? చూస్తే, ఎక్కువ భాగం అసంతృప్తే ఉంటుంది. అటు పుట్టిన వాడయినా అస్తవ్యస్తంగా ఉంటాడు. లేకపోతే, అలా పుట్టించడంవల్ల తల్లికి కలిగినటువంటి హానివల్ల ఆమె ఆరోగ్యం పాడయిపోవడం అన్నా... జాతకం చూసి, ఓ జాతకంలో పాతికేళ్ళ క్రితం, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు కావాలని తాపత్రయ పడుతున్నాడు. వద్దు అని చెప్పాను. నీకు జాతకం ఉన్న పరిస్థితి ప్రకారం ఇంకోకసారి కనుక నీకు సంతానం కలిగితే నీ భార్య శాశ్వతంగా అస్వస్థురాలవుతుంది అని చెప్పాను. అయినప్పటికీ సంతానాన్ని కన్నాడండి. ఆ భార్య అప్పటినుంచి అలా నీరసించి, నీరసించి, రకరకాల జబ్బులతో ఇప్పుడు రేపోమాపో పోయేటట్టుగా ఉందావిడ. ఎందుకు?

అందుకని మృకండు మహర్షికి సంతానం లేదన్నప్పుడు ప్రార్థన చేయ్యమని చెప్పారు. మనం కూడా అదే చెయ్యాలి. ఏదయినా మనకి ఒకటి లోటు అనిపిస్తే, ఆ లోటు గురించి దైవాన్ని ఆరాధన చేసుకువడం అనేటటువంటిది ఉత్తమోత్తమమైనటువంటి మార్గం. వీడినీ వాడినీ అడుక్కు తినడడం మార్గం కాదు. నీకేదయినా లోటు అనిపించి నిన్ను అది బాధ పెడుతుంటే, ఎవరికీ చెప్పుకుంటావు? ఊళ్ళో వాళ్ళకి చెప్పుకుంటే వెలితి అయిపోతావు కదా! నీకు మూలమైన వాడికి చెప్పకో. అది ఆర్యుల మార్గం. అదే Master CVV గారు మళ్ళీ మనకి యోగం పేరున ఆ నియమం ఇచ్చారు. ఊళ్ళో అడుక్కుని తినక, ఏమయినా అడుక్కుని తినాల్సిన పరిస్థితి వస్తే నన్నే అడుక్కుతిను. రోజూ ప్రార్థనలో ఎంత begging కావాలంటే అంత begging చెయ్యి. నీ గౌరవ ప్రతిష్టలకు లోటు రాదు నన్ను అడిగితే. ఎవరిని అడుగుతావు? తండ్రిని అడుగుతావు. ఇంకేవరిని అడుగుతావు? నన్ను అడుగు, ఇంకెవరినీ అడగక అని చెప్పారు. ఇవి ఆర్యుల ధర్మంలో ఒక ప్రధానమైన ధర్మం. ఆర్యుడనేటటువంటి వాడు ఇలా (చెయ్యి చాపి) ఉండడు. ఇలా (ఇస్తూ) ఉంటాడు. అప్పుడే వాడు ఆర్యుడు. ఇలా ఉంటే అనార్యమే అది. అంచేత, దైవప్రార్థన చెయ్యి. తత్ఫలితంగా ఏమి కలిగితే అలా కలుగుతుందని చెప్తారు. చెప్తే, మృకండ మహర్షి, హరిహరాదులు ఇద్దరినీ బాగా ప్రార్థన చేస్తాడు. హరిహరులు ఇద్దరినీ. ప్రార్థన చెయ్యడం

అంటే ఆ రోజుల్లో వాళ్ళు ప్రత్యక్షమయ్యేవరకూ ప్రార్థన చెయ్యడమే. మనలాగా watch చూసుకుంటూ ప్రార్థన చెయ్యడం కాదు. పావుగంట అయ్యిందా, కళ్ళు విప్పి చూడొచ్చా? పక్కవాళ్ళు విప్పరా లేదా కళ్ళు. వాడు మూస్తే మనం కాసేపు మూసుకుని, ఇలా సాగుతూ ఉంటుంది కదా మన ప్రార్థనలు!

అలా మృకండు మహర్షి ప్రార్థన చేసాడు. ఇలాంటి వాళ్లకి ఏమి జరుగుతుందంటే, వాళ్ళ పూర్వీకులు పుణ్యం, వాడిలో సంస్కారంగా ఉంటుంది కదా! తండ్రి విధాత, తాత భృగు మహర్షి, ముత్తాత చతుర్ముఖ బ్రహ్మ. ఎక్కడి పోతుంది? అంటే, మనమే అనుకుంటాం కదా! కాదు. మన పూర్వీకుల చరిత్ర మనలోంచి కూడా నడుస్తూ ఉంటుంది. మన పెద్దల పుణ్యమే మనం ఈ రోజు పెంచాలి, వాడేసుకోకూడదు. పెంచి, తర్వాత తరానికి ఇస్తూ ఉండాలి. రామాయణం చెపుతుందీ మాట. నీ యందు మూడు తరాల పుణ్యము, పాపము, నువ్వు ఇప్పుడు అనుభవిస్తూ ఉంటావు. నువ్వు దానికి జత కలపడం, ఏమి add చేస్తావో నువ్వు చూడు. Additions to the assets, or additions to the liabilities? అది వాడుకోవడమా? అది వాడుకోవడం ఉంటే పితామహుల యొక్క పుణ్యమును వాడుకోవడం అనేటటువంటిది ఉంటుంది. వాడు మధ్యస్తుడు. అదే భతృహరి చెప్తాడు. “నిజభుజ శక్తి చేత గణించు ధనంబు బుజించు ఉత్తమంబు జనకునార్జితంబగు ధనంబు భుజించుట మధ్యమంబు” అంతటితో ఆపేద్దాం! మిగతావి ఇంక వద్దులెండి మనకి. అంటే, వాడిదీ వీడిదీ తింటే అధమంట, ఆడవాళ్ళ డబ్బు తింటే మరీ ఇహ అంతకన్నా నీచం ఇంకోటి లేదని చెప్తాడు భతృహరి. అంచేత, మనం పుణ్యం ఒకటుండగా, పెద్దల పుణ్యం మరొకటి ఉంటుంది. తపస్సు చేస్తున్నావట అంటే నీ పూర్వీకులందరూ నీకు సహకరిస్తారు. వాళ్ళు ఎలాంటి వాళ్ళు? మంచి పని చేస్తున్నాట్ట అంటే, తండ్రి సంతోషిస్తాడు కదండి. ఏమిటి మంచి పని? దైవము గూర్చి తపస్సు. అలా చేసాడండి. హరిహరులు ఇద్దరినీ తపస్సు చేసాడు. అది చూడండి తమాషా.

సృష్టి ఆదిలో ఈ హరిహరుల బేధాలు ఏం లేవు. తర్వాత తర్వాత మన మనస్సు బాగా గట్టిపడిన కొద్దీ బేధాలు చాలా వచ్చేసాయి. అది చేస్తే ఇది చెయ్యకు, ఇది చేస్తే అది చెయ్యకు. హరిహరులు ఇద్దరినీ ఆరాధన చేస్తున్నాడట. ఎలా ఆరాధన చేస్తున్నాడట అంటే శివుడు ఆరాధన చేస్తుంటే శివుడు హృదయంలో విష్ణువుని చూస్తూ ఆరాధన చేస్తున్నాడట. విష్ణువుని ఆరాధన చేస్తుంటే విష్ణువు హృదయంలో శివుడిని చూసి ఆరాధన చేస్తుంటాడట. అది విధానం. పురాణాలు చదువుకుంటే ఇవన్నీ తెలుస్తాయి. పార్వతీదేవి అడిగిందట శివుడిని, నువ్వే కదా అంతా, మళ్ళీ నువ్వేంటి కళ్ళు మూసుకుని కూర్చుంటావు అని. అంతా నువ్వే అయినప్పుడు నువ్వు కళ్ళు మూసుకుని ఎవరిని గురించి ధ్యానం చేస్తున్నావు అని అడిగితే నవ్వుతాడు. నవ్వితే ఎట్లా, చెప్పమంటుంది. ఊరుకుంటుందేమిటి నవ్వితే! రహస్యం అంటే ఇంకా ఎక్కువ ఉత్సుకత ఉంటుంది తెలుసుకోవాలని కదా! ఏదో చేస్తుంటానులే అన్నాడు. అంటే, అలా కాదు చెప్పాలి అంది. అలా కాదు చెప్పాలంటే, ఇంక ఎవరి గురించి చేస్తాను నేను, నారాయణుడి గురించి తపస్సు చేస్తాను అన్నాడు. అంటే, అక్కడ ఓ scene ఉంటుంది కదా! ఆయన అలా తలగడి మీద అలోవోకగా పడుకుని కళ్ళు మూసుకొని ఉంటాడు, సగం కళ్ళు తెరిచి, సగం కళ్ళు మూసుకుని. అలా ఉంటే, లక్ష్మీదేవి అడుగుతుందట, ఎవరి గురించి తపస్సు చేస్తున్నారు మీరు ఎప్పుడూ, సగం తెరిచి చూసీచూడనట్టుగా ఉంటారు, సగం పరధ్యానంగా ఉంటారు. పరధ్యానం అంటే ఏమిటి? పరుని

గూర్చి ధ్యానమే పరధ్యానం. మనకి పరధ్యానం అంటే ప్రస్తుతంలో లేకపోవడమే మనకి పరధ్యానం. అంచేత, అడిగితే చెప్పాడు, నేను ఇంకెవరి గురించి చేస్తాను, దేవుళ్ళందరికీ దేవుడు మహాదేవుడు శివుడు, ఆయన గూర్చి. వీళ్ళందరూ బానే ఉన్నారు ఒకళ్ళతో ఒకళ్ళు కదా! కాశీలో మరణిస్తే ఏం చేస్తాడట శివుడు? మరణించిన ప్రతివాడి ఎడంచెవులోనూ రామశబ్దం చెప్పి పంపిచేస్తాడట, పూర్తిగా చచ్చిపోయేలోపల. వాడికి జీవుడికి చెప్పి పంపించేస్తాడు కదా! అందుకనే కదా, "*సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే*" అన్నాడు పరమశివుడు. ఇలా మనకి ఒకరి హృదయంలో ఒకరుంటారు. "శివస్య హృదయం విష్ణుః, విష్ణువస్య హృదయం శివః" అని మనకి ఒక శ్లోకం కూడా ఇచ్చారు. అంచేత, ఈయన ఆ విధంగా ఆరాధన చేసాడటండి. శివుడి హృదయంలో విష్ణువుని చూస్తూ ధ్యానం చేసాడు. ఎంచేత? శివుడు కళ్ళు మూసుకుని అలా చిరునవ్వు నవ్వుతూ ఉంటాడు కదా! దేనివల్ల చిరునవ్వు? లోపల విష్ణు దర్శనం జరుగుతూ ఉంటే, వాళ్ళూ వాళ్ళూ మాట్లాడుకుంటూ ఉంటారు. అలాగే విష్ణువు చిరునవ్వుతూ అక్కడ కళ్ళు మూసుకుంటే, శివుడితో మాట్లాడుకుంటూ ఉంటాడన్నమాట. ఇదీ కథ! అంచేత, ఒకళ్ళలో ఒకళ్ళు ఉంటారు. ఒకరియందు ఒకరు ఉంటారు. అది ఎప్పటికీ ఉండేటటువంటి సంబంధం అది.

అంచేత, ఆ విధంగా ఒకరి యందు ఒకరిని దర్శిస్తూ ఆరాధన చేసి, చేసి, చేసి, ఆ ఆరాధన చెయ్యడంలో ఏం జరుగుతుందంటే, బాగా ఆరాధన చేసేవాళ్ళకి తన్మయత్వం వచ్చేస్తూ ఉంటుంది. తన్మయత్వం వస్తే ఏం జరుగుతుందంటే ఆరాధన బాగా సాగుతూ ఉంటుంది. ఇందుకోసం, ఆరాధన అనేది మర్చిపోవడం జరుగుతుంది. మనం అంతగా ఆరాధన చెయ్యం కాబట్టి దేనికోసం ఆరాధన చేస్తున్నామో మనకి గుర్తు ఉంటూ ఉంటుంది. ఇంత గుర్తు ఉన్న వాళ్ళు కూడా తిరుపతి వెళ్తే, వెంకటేశ్వరస్వామి దర్శనానికి పడే తిప్పల్లో, ఎట్లాగో అట్లా మనకంటూ ప్రవేశం దొరికింది, అమ్మాయా! అనుకుని లోపలకి వెళ్తే, అలా మూర్తిని చూస్తూ, వాడూ వీడూ నెట్టుతుంటే, దాన్ని చూడడంలో ఉండే ఆనందంకి అదే ఏకాగ్రత పెట్టుకుని తీరా ఆయన మూర్తి ముందు నిలబడ్డప్పుడు చెప్పుకోవాలసినవి చెప్పుకోకుండా బయటకొచ్చేసిన వాళ్ళు బోల్డు మంది కదా! ఎంచేత? అలాంటి ఆకర్షణ. అమ్మమ్మా! అమ్మమ్మా! మర్చిపోయాము అంటారు. మళ్ళీ దర్శనం అంటే మళ్ళీ ఎంత ప్రయత్నం అండి? మనకి తపస్సే ప్రస్తుతం తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనమే! అలా తయారయిపోయింది అది. అలా ఏర్పాటు చేసాడాయన. అంతా joke ఆయనకి! మహా విలాసంగా ఉంటుంది. తిరుపతిలో దేవుడితో, if you are to take as a play, you can see how much he plays with your ego. ఎక్కడికక్కడ ego సమం చేస్తూ ఉంటాడు. కొంచెం పెరిగితే మారుస్తారు అక్కడ. రకరకాలుగా ఉంటాయి లెండి.

ఈ తపస్సు చేసేవాడికి రుచి పెరిగిన తర్వాత ఏం జరుగుతుందంటే, దేనికోసం చేస్తున్నాడో మర్చిపోయాడు. తపస్సు సాగిపోయింది. ఆ తపస్సు తన్ను మరచినట్టు ఉండే స్థితి. వాళ్ళు మిగిలిపోయారు, తన్ని మర్చిపోయాడండి. అదే జరుగుతుంది బాగా అనురక్తి చెందినచోట. అనురక్తి చెందిన చోట మనం ఉండం, కాలమూ ఉండదు. రెండూ ఉండవు. బాగా మంచి సంగీతం వింటున్నామనుకోండి, వింటున్నామని గుర్తు ఉండదు, సంగీతమే ఉంటుంది. పాడుతున్నవాడూ గుర్తు ఉండదు. ఎందుకంటే, కళ్ళు మూసుకుపోతాయి. సంగీతం వినేవాడు కళ్ళు తెరిచి వినడు. పాడేవాడూ కూడా కళ్ళు మూసుకుని పాడితే మంచిది. ఎందుకంటే, లోపల నృత్యం చేస్తూ ఉంటుంది నాదం. అది రకరకాలుగా నృత్యం చేస్తుంది.

అది ఎలా ఉంటుంది ఆ నృత్యం? అది వెలుగు నృత్యం. అది వెలుగంటే మామూలు వెలుగు కాదు. అది మెరుపులతో కూడిన వెలుగు తీగ ఒకటి అలా రకరకాలుగా నృత్యం చేస్తుంటే, నాదం వినబడుడూ ఉంటే, అందులో తన్మయత్వం చెందడమనేది సంగీతం. వినేవాడికి కూడా అదే జరగాలి. ఇద్దరికీ కళ్ళు మూసుకుపోతాయి. చెవులు మాత్రమే! పంచేంద్రియాలకి చెవు ఒక్కటే ఉంటుంది. అంటే, ఐదు ఇంద్రియముల బలం చెవి ద్వారా పని చేస్తుంది. లోచెవితో వింటూ ఉంటాడు. అప్పుడు తన్మయత్వం వస్తుంది. అలా మంచి పాట విన్నా, మంచి మాట విన్నా, ఆ మూర్తితో ఆ విధంగా నువ్వు చేసేటువంటి అనుసంధానంలో నీకు కలిగినటువంటి పరిస్థితుల్లో నువ్వు లేక వాళ్ళు ఉంటారు. నువ్వు దేన్ని గూర్చినటువంటి ఆరాధన ఉందో, ఆ వస్తువు ఎక్కువ అయిపోయి, నువ్వు తక్కువ అయిపోతావు. క్రమంగా నువ్వు లేనటువంటి పరిస్థితి వచ్చేస్తుంది. అలా అయితే దాన్ని తన్మయత్వం అంటారు. తత్ మయము అయిపోతావని. తత్ అంటే అది. ఏది? నువ్వు దేన్ని ఉద్దేశ్యించి చేస్తున్నావో ప్రయత్నం దాని మయం అయిపోతావు. అయిపోవడం చేత తాను లేక వారుంటారు.

మృకండ మహర్షి ఎవరిని గూర్చి చేసాడు? హరిహరాదులు ఇద్దరినీ చేసాడు కాబట్టి హరిహరాదులు ఇద్దరూ వచ్చారండి. ఇద్దరూ ప్రత్యక్షమయ్యారు. ప్రత్యక్షమైతే, మాములుగా తపస్సు చేస్తున్నటువంటివారు వాళ్ళు లేనటువంటి స్థితి వస్తుంది కాబట్టి వాళ్ళు స్పృశిస్తే మళ్ళీ వాళ్ళు వస్తారు అక్కడికి. అంటే, వాళ్ళు localize అవుతారు. లేకపోతే, ఏం జరుగుతుందంటే, they get absorbed. నీవు ఆరాధన చేస్తున్నటువంటి దేవతామూర్తిలో నువ్వు లీనమైపోతావు. అప్పుడే అది ఆరాధన అవుతుంది. లీనమైపోవడం వల్ల మళ్ళీ బయటకు రావడానికి కొంత సమయం పడుతుంది. అంచేత, వాళ్ళు స్పృశిస్తే, మృకండ మహర్షి మళ్ళీ తానుగా ఏర్పడితే, మాములుగా ఏం చెయ్యాలండి? మనకి గుర్తు ఉంది మృకండ మహర్షి ఎందుకు తపస్సు చేస్తున్నాడో, కానీ మృకండు మహర్షికి గుర్తు ఉండదు. అది సహజం. తపస్సు చేసిన వాళ్ళకి తమకి ఏం కావాలో గుర్తు ఉండడం అనేది నిజమైన తపస్సులో జరగదు. అప్పుడు దైవమే గుర్తు చేస్తాడు. నీకు ఏం వరం కావాలి అని అడుగుతాడు కదా! అన్ని కథల్లోనూ అదే ఉంటుంది కదా! నరుడా ఏమి నీ కోరికా అన్నట్టుగా! నీకు ఏం వరం కావాలని అంటాడు. మొట్టమొదట ఏం కోర బుద్ధి కాదు. నీకు అసలీ స్వభావం ఉంటే తప్ప ఏం కోర బుద్ధి కాదు. ఎందుకంటే, ఆ దర్శనం అయ్యిన తర్వాత ఇంక మిగతావి ఉంటే ఏమిటి, లేకపోతే ఏమిటి అన్నట్టుగా ఉంటుంది. అంచేత, ఈయన ఏమీ మాట్లాడడు. మళ్ళీ అడుగుతారు. అప్పుడు గుర్తు వస్తుంది. గుర్తు వచ్చి సుపుత్రుడిని, సంతానం అంటాడు. సంతానం కలిగించమని అంటాడు. అప్పుడు కదా చిక్కుకున్నాడు. అని కోరితే శివుడు కొంచెం త్వరపడి వరాలు ఇచ్చేవాడు, భోళాశంకరుడు అంటారు కదా! అంచేత, వెంటనే గుణవంతుడైన ఒక కుమారుడిని ప్రసాదిస్తున్నాను అంటాడు. అంటే, మృకండు మహర్షి మహాప్రసాదం అంటాడు. అక్కడ పక్కన ఉండేటటువంటి హరి అంటాడు, అదేమిటి? గుణవంతుడైనటువంటి కుమారుడిని ఇచ్చాడాయన, బావుంది. గుణవంతుడైతే సరిపోతుందా? ఆయుష్మంతుడు కావాలి కదా! గుణవంతుడై ఆయుష్మంతుడు కాకపోతే దుఃఖమే కదా! గుణవంతుడైన కుమారుడిని నీకు ఇచ్చానంటే ఆయుష్మంతుడిని కూడా ఇవ్వు ప్రభూ అని ఎందుకు అడగలేదని అడుగుతాడు. పైగా శివుడు గుణవంతుడైన కుమారుడిని ఇచ్చాడంటే అర్థం ఏమిటంటే అలాంటి గుణవంతుడైన కుమారుడికి పదహారేళ్ళే ఉంటుందిట వయస్సు.

అభిమాన్యుడిని సోమలోకం నుంచి శివుడి అనుగ్రహంగా తెచ్చుకుంటాడు అర్జునుడు. అలాంటి వాళ్ళు రారు కదా ఓ పట్టాన! సోమలోకం నుంచి భూలోకానికి ఎందుకు రావాలి? సోమలోకం అంటే ఇంక అంతకన్నా రసోపేతమైన లోకము లేదు. శివానుభూతి అనునిత్యం ఉండేటటువంటి లోకం. ఆ లోకంలో స్థిరపడిన వాడిని ఏరా భూలోకానికి వెళ్తావా అంటే, నేను వెళ్ళను అంటాడు. అందుకే, వాడిని పంపిస్తానంటే, ఎక్కువ రోజులు వెళ్ళమంటే వెళ్లరు. ఎక్కువ రోజులు వెళ్ళమంటే అసలు వెళ్లరు. పోనీ ఓ పదహారేళ్ళురా అంటే వెళ్తారు. అట్లా పదహారేళ్ళకి ఇస్తాడు అభిమన్యుడిని శివుడు. అట్లా పదహారేళ్ళ మహాగుణవంతులకి ఆయుర్థాయము. అది దానికి అల్పాయువు అంటే పదహారేళ్ళు అని ఒక నిర్వచనం ఉంది సంస్కృతంలో. అల్పాయువు అంటే పదహారేళ్ళు. పదహారేళ్ళకి పదహారు కళలు పూర్తి అయిపోతే, ఇహ మళ్ళీ... చంద్రుడి కళలు కూడా పదహారే కదా!

అందుకని హరి ఏం చేస్తాడంటే, విష్ణుమూర్తి ఒరే! ఓ చిన్న మోసం జరిగిపోయింది. నువ్వు సంతానం అడిగావు, ఆయనేమో పుత్రుడిని, గుణవంతుడిని ఇస్తానన్నాడు. ఆయుష్మంతుడు కాదు కదా! అంచేత, శివుడు చెప్పిన దాంట్లోంచి నాకేం అర్థం అవుతోందంటే నీకు అల్పాయుష్షుతో ఉన్న కుమారుడు కలుగుతాడు. ఎప్పుడూ కూడా సంతానం కోరే వారందరూ కూడా గుణవంతుడే కాదు, ఆయుష్మంతులు కూడా కోరాలి అంటారు. ఎంచేత అంటే, ఆయుష్షు ఉంటే అతను నిర్వర్తించవలసిన కార్యక్రమాలన్నీ పరిపూర్ణంగా నివర్తించడానికి వీలుపడుతుంది. ఒక పదహారేళ్ళు ఉండే పిల్లవాడు నీకుంటే మరి నీకు వార్థక్యం వచ్చేసరికి వాడుండడు. మళ్ళీ నీకు మామూలే. నీకు వాడేం ఉపయోగపడడు కదా! నీ తల్లిదండ్రులుకు నువ్వు ఉపయోగపడినట్టుగా నీ పిల్లవాడు నీకు ఉపయోగపడాలంటే వాడు నీకు ఉండదు కదా! పైగా అసలు దారి లేని వారు, అట్లా వచ్చి మెరుపల్లే మనకి ఆనందం ఇచ్చి, మళ్ళీ మాయమయిపోతే దుఃఖం ఎక్కువ కదా! అసలు లేనే లేదంటే అదొక గోల. ఏదో సరిపెట్టుకుంటాం నెమ్మదిగా. వచ్చి పోయాడట అంటే అది ఎక్కువ బాధ కదా! వచ్చి చూపించి పోతే అంత ఆనందాన్ని? చాలా బాధ. అదే చెప్తూ ఉంటాను, ధనం రాకపోతే సుఖం తప్ప, వచ్చిపోతే ఎక్కువ బాధ. మనకి ఒక పది లక్షలు వచ్చి అది ఎవడయినా అప్పు తీసుకెళ్ళిపోయాడనుకోండి, ఎక్కువ వడ్డీ ఇస్తానని. ఈ పది లక్షలు లేనప్పుడు మనం సుఖంగానే ఉన్నాం. పది లక్షలు వచ్చి వడ్డీ ఇస్తాననడం చేత, వాడు ఇవ్వడూ, వడ్డీ రాదు. మనకి ఎంత బాధ అది? పది లక్షలు లేనిదానికన్నా ఎక్కువ బాధ వస్తుంది. అంటే, ఉండిపోతే ఎక్కువ బాధ ఉంటుంది. ఎందుకంటే, ఒక రుచి చూపించి, తీసేసినట్టు అవుతుంది. అట్లా పిల్లవాడు వచ్చి, వెళ్ళిపోతే నీకు దుఃఖం కదా! ఇప్పుడు ఉన్నదానికన్నా ఎక్కువ దుఃఖం కదా! మరి కానీ, వచ్చింది అలా నీకు వరం అని చెప్తాడండి విష్ణుమూర్తి. జ్ఞానమూర్తి కదా! ఈ పక్కన ఉన్నాయన ఉన్నాడు చూసావా, ఆయన ఎంతయినా ఇవ్వగలడు ఆయుస్సు కూడా. ఎంత అయినా ఇవ్వగలడు. కానీ నువ్వు ఇలా అడిగావు, అలా జరిగింది, సరే కానియ్యి. గుర్తుపెట్టుకో, వీడు అల్పాయుష్షు అని చెప్తాడు. ఉపకారమే కదా! విష్ణుమూర్తి bad news అయినా, it is a great value. He had a great value. ఎందుకంటే, పిల్లవాడు అల్పాయుష్షుడు అని తెలిసి ఉండదు మంచిది కదా!

అల్పాయుష్కుడు అని తెలిసి ఉంటేనే కదా ప్రయత్నం చేసుకోవచ్చు, ఆయుష్షు పెరగడానికి. అది తెలియలేదనుకోండి, ఇంకో ఇబ్బంది. మా నాన్నగారికి ఇట్లా జాతకాల పిచ్చి ఉండేది. నేను ఆయనకి మూడవవాడిగా

పుట్టాను. పుడితే, ఎదో చెప్పారు వీడు అల్పాయుష్షు అని. అలా చెప్తే ఎలా ఉంటుందండి? వీడు అల్పాయుష్షు అని తెలిసి ఉండడం చేత ఆయనేం చేసారు, దైవ భక్తి ఉండడం చేత, వీడికి పదహారేళ్ళు అయిన తర్వాత భద్రాచలంలో ఉపనయనం చేస్తానని పెట్టుకున్నారాయాన. అంటే, ఎదో hook. అంటే, రాముడికి ఒక hook వేసి ఉంచారాయన. అట్లా ఎదో మనకి చేసుకోవచ్చు కదా! చెప్పడం వల్ల ఉపయోగం ఉంది కదా! తెలియలేదనుకో? పద్నాలుగేళ్ళకి పోవాల్సిన పరిస్థితి వచ్చి, పోకుండా బయటపడ్డాను. అది వేరే సంగతి. అంచేత ఇవన్నీ... అంటే, కథలు చదువుతున్నప్పుడు, ఇది మనకి చాలా ముఖ్యమైనటువంటి సత్యాలుగా గమనించాలి. అంచేత, ఇతను అల్పాయుష్షు అన్నాడు విష్ణుమూర్తి.

పిల్లవాడు పెరుతున్నాడు. రకరకములైనటువంటి సద్గుణములు అతనిలో కనిపిస్తున్నాయి. చక్కగా విద్యలు నేర్చుకుంటున్నాడు. కానీ ఉండడు కదా అని ఒక బాధ, భయం కదా! దగ్గర పడుతున్న కొద్దీ భయం పెరుగుతూ వచ్చింది. అంతకంతటికీ పిల్లవాడికి వయస్సు వస్తున్న కొద్దీ, పదిహేనేళ్ళు వచ్చేసరికి బాగా దుఃఖంగా కనిపించాడు తండ్రి. దుఃఖంగా కనిపిస్తూ వస్తే, ఎందుకు నాన్నా మీరు చాలా దుఃఖంగా ఉంటున్నారు? అమ్మ చూడబోతే అలా ఉంది. మీరు చూడబోతే ఇలా ఉంది. ఎందుకు ఇంత దుఃఖ పడుతున్నారు? మీ దుఃఖానికి కారణం ఏమిటి అని అడుగుతాడు మార్కండేయుడు. అని అడిగితే అప్పుడు చెప్పక తప్పదని చెప్తారు. ఈ విధంగా నీకు నిర్ణయం అయినట్టుగా నేను శ్రీహరి ద్వారా విన్నాను నాయానా. అంచేత, పదహారేళ్ళే నీకు జీవితం. పదహారేళ్ళ తర్వాత నువ్వు మా నుంచి వెళ్ళిపోతావు. అది మేము భరించలేక, ఆ బాధ తట్టుకోలేక, అది మాటిమాటికీ గుర్తు వస్తుండడం చేత ఈ విధంగా ఒక కృశింపు జరుగుతోంది, కృంగిపోతూ ఉన్నాము అని చెప్తారు. చెప్తే అప్పుడు మార్కండేయుడు చెప్తాడు. ఏం చెప్తాడంటే, నేను తప్పక ఈ మరణాన్ని దాటుతాను. ఏదయితే విధి చేత లిఖించబడి ఉన్నదో, ఈ లిఖించబడి ఉన్నటువంటి ఈ మరణ శాసన్నాని నేను దాటుతాను తండ్రి. ఈ విషయంలో మీరు దుఃఖ పడొద్దు. నేను శివారాధన చేస్తాను. ఏ శివుడు వరం ఇవ్వడం వల్ల నేను పుట్టానో ఆ శివుడినే నేను ఆరాధన చేస్తాను. దేనికీ? నేను బతికి ఉండాలని కాదు. నేను బతికి ఉండాలని నాకు ఇచ్ఛ లేదు. మీకోసం బతుకుతాను. నా తల్లిదండ్రులకు నా వలన కలుగవలసినటువంటిది ఆనందము, ఉత్తరోత్తరా ఉత్తమోత్తమైన లోకములు. అలా కలిగించని ఈ జన్మ నాకెందుకు?

చూడండి, మనకోసం మనం బతకాలని తాపత్రయ పడడం కోసం కాదని మార్కండేయుడు చూపించినది. మనకోసం మనం బతకాలనుకోవడం అనేటటువంటిది వ్యామోహం. అలా అనుకునే వాళ్ళు... అలాంటి వాళ్లకి ఈ ధర్మం వర్తించదు. ఒక మహత్తరమైన ప్రయోజనాన్ని ఉద్దేశ్యించి... అందులో ప్రత్యక్షమైనటువంటి దైవమే తల్లిదండ్రులంటే. శ్రీరాముడికి చెప్తారు దైవం గురించి. చెప్తే, నాకు దైవం ఎవరో కాదు, నా తల్లిదండ్రులే. వాళ్ళు ప్రత్యక్షమైన దైవాలు. ప్రత్యక్ష దైవాలను అనుసరించడం, వారి మాట నేను పాటించడం నాకు ముఖ్యం గాని, పరోక్షంగా ఉండే దైవం గురించి నాకు అనవసరం అని చెప్తాడండి రాముడు. చాలా బాగా చెప్తాడు. అంటే, రాముడంటే ఎంత practical లో మనకి చూపిస్తాడు. కనబడుతున్న దేవుళ్ళని వదిలేసి, కనబడని దేవుళ్ళ గురించి... కనబడుతున్న దేవుళ్ళు నా తల్లిదండ్రులు. కాబట్టి నా తండ్రి, అతడు ఉత్తమోత్తమ లోకాలకి వెళ్ళాలన్నా, అతడు శాశ్వతంగా కీర్తి పొందాలన్నా, అతడు నా పినతల్లికి ఇచ్చినటువంటి మాటను నేను నిర్వర్తించాలి. ఇంకొక మాట వేరే వీలే పడదని చెప్తాడు.

అంచేత, ఇక్కడ మార్కండేయుడు కూడా ఏం చెప్తాడంటే, ఎంతో తపస్సు చేసారు సంతానం కోసం, నేను కలగడం వల్ల మీకు దుఃఖం కలగకూడదన్నాడండి. తల్లిదండ్రులు బాధ పడ్డారంటే అలాంటి కొడుకు పుట్టడం, కొడుకయినా, కూతురయినా, అలాంటి సంతానం వ్యర్థం. మన వల్ల మన తల్లిదండ్రులు దుఃఖ పడుతున్నారట అంటే అలాంటి జీవి చాలా వ్యర్థమైన జీవితం జీవిస్తున్నట్టే లెక్క. అందుకని, మార్కండేయుడు చాలా దుఃఖ పడతాడు. మీకు ఇంత దుఃఖం నావల్లా? నేను కారణంగా మీరు నిజానికి పొందవలసినది మహత్తరమైన ఆనందం. దానికి వ్యతిరేకంగా దుఃఖం కలుగుతోంది, అంచేత నేను మీకీ దుఃఖం నుంచి విముక్తి కలిగిస్తాను. నేను మార్కండేయుడుని కదా! ఒక Mark ఉంది అక్కడ. లిఖితమైనటువంటి వాక్యం ఒకటి ఉంది, విధి వ్రాత. దాన్ని మారుస్తాను. మార్కండేయుడు విధి లిఖితమైనటువంటి మరణ శాసనాన్ని నేను మారుస్తాను అంటాడు. Marking అంటూ ఉంటాము చూసారా? సరిగ్గా తమాషా. ఈ Mark, ఆ మార్కు ఒకటే అర్థం. కావాలంటే dictionary చూసుకోండి.

అందుకని, నేను తపస్సుకి వెళ్తాను తండ్రి, మీరు అనుజ్ఞ ఇవ్వండి. మీరు ఆశీర్వదిస్తే నా తపస్సు ఫలిస్తుందని చెప్తాడు. ఎప్పుడూ పెద్దల ఆశీర్వచనంతో పనులు చేస్తూ ఉంటే, పనులు అవుతూ ఉంటాయి. పెద్దల ఆశీర్వచనం... ఇంట్లో పెద్దవాళ్ళకి ఏం చెప్పకుండానే చేస్తాం కదా పనులు ఈ రోజుల్లో! ఇంట్లో పెద్దవాళ్ళంటూ ఉంటే వాళ్లకి చెప్పాలి ఏం చేస్తున్నా ఓ మాట. వాళ్ళేదో చేస్తారని కాదు. ఆశీర్వచనం. అంచేతే కదా ఏదయినా మంచి కార్యం చేసే ముందు, మంచి కార్యం తలపెట్టేముందు దైవాన్ని ఆరాధించడం, గురువులను ఆరాధించడం, పెద్దలను ఆరాధన చెయ్యడం ఆర్య ధర్మము. మనకి మనమే పెద్దవాళ్ళం అనుకునే వాళ్ళు మూర్ఖులు. ఏం సందేహం లేదు. అంచేత, తల్లిదండ్రులు యొక్క ఆశీర్వచనం పరిపూర్ణంగా కోరి తపస్సుకి వెళ్తాడు. మనంకూడా breakfast కి వెళ్దాము. ఆయన తపస్సు చేస్తుంటే మనమేం చేస్తాము? అంచేత, మనం breakfast చేసుకుందాం! మళ్ళీ వచ్చి, ఆయన తపస్సు ఎలా చేసాడు, ఏం జరిగింది మనం కథ చెప్పుకుందాం.

ఇందులో నేను కథ పొడిగించడంలో ఉద్దేశ్యం ఏమిటంటే చాలా కీలకమైనటువంటి అంశాలు ఉన్నాయి. అవి మనకి చాలా ముఖ్యము. కేవలం wish to live cannot be fulfilled. Your wish to live should be in relation to something very valuable to the life here. అలా ఉంటే yes, లేకపోతే no. ఎందుకంటే, దేవతలు కర్కసులు కాదు. వారు నడిపిస్తూ ఉంటారు ధర్మం ప్రకారం. కాని అవసరమైనచోట adjustments చేస్తారు. మనకన్నా దయామయులు కదా! మనమే చిన్న చిన్న adjustments చేసేస్తూ ఉంటాం rules కి అవసరం బట్టి. మనకి ఎక్కడయినా వాత్సల్యం ఉంటే, కొంత rules adjust చేసేస్తూ ఉంటాం. మరి మనకే ఈ బుద్ధి ఉందంటే, మన్ని పుట్టించిన వాళ్ళు, వాళ్ళకుండదా? Depending upon the situation, అవసరాన్ని బట్టి. అది సృష్టిపరంగా, లోకపరంగా, జీవపరంగా అది అవసరమా, దాని బట్టి adjustments. అంచేత, ఆ విధంగా నేను తపస్సు చేసి, శివుడిని మెప్పించి, నేను ఆయువుని పెంచుకుని వస్తాను తండ్రి అని చెప్పి, మాట ఇచ్చి తల్లిదండ్రులకి, ఆయన తపస్సుకి వెళ్తాడండి. తర్వాత program లో మళ్ళీ చెప్పుకుందాం, 8:30 అయ్యింది.

**--- స్వస్తి**

# మార్కండేయ ఉపాఖ్యానము

## July 12, 2014 సాయంత్రం – ప్రవచనం #4

సోదరబృందానికి హృదయపూర్వకమైన నమస్కారములు. మార్కండేయుడు తల్లితండ్రులను దుఃఖం నుండి విముక్తి చెయ్యడానికి, వారికి పరిపూర్ణమైనటువంటి ఆనందమును కలిగించడానికి, వారు వార్ధక్యమునందు ఉన్నప్పుడు వారిని పరిపూర్ణంగా సేవించుకోడానికి, వారియందు తన కర్తవ్యాన్ని పూర్తి చేసుకోవడానికి, తాను లేకపోవడం అనేటటువంటి స్థితి వారికి కలగకుండా ఉండాలని, ఇలాంటి ఆశయములన్నీ మనసులో దృఢపరుచుకుని పొద్దున్న తపస్సుకి వెళ్ళాడు కదా! ఉదయం మనకి ప్రవచనం అక్కడ ఆగింది. తనయుడు తల్లిదండ్రుల యొక్క ఋణమును తీర్చుకోవడం అనేది ఒక యోగము. అంచేత, తానే తల్లిదండ్రులకన్నా ముందే నిష్క్రమిస్తాడు అనేటటువంటి విషయం తల్లిదండ్రులకి ఎంత దుఃఖం కలిగిస్తోందో అతడు దర్శించి చాలా బాధ చెందుతాడు. అది కారణం ఆయన తపస్సుకి వెళ్ళడానికి. సత్పులసంజాసులైనటువంటి వారు ఎవరూ కూడా తాను మరణిస్తానని బాధ పడరు. తాను మరణించడం వలన తాము ఎవరికైతే కర్తవ్యం నివర్తించవలసి ఉంటుందో వారికి ఆ కర్త్యవ్యములు తాను నిర్వర్తించకపోవడం వలన కలిగేటటువంటి ఒక అసంపూర్ణత, అసంతృప్తి, కష్టము, నష్టము, దుఃఖము, ఇలాంటివి కలగకూడదని భావిస్తారు. అంచేత, ఎప్పుడయితే తండ్రి నుంచి తన యొక్క అల్పాయుష్షు విషయం శ్రీమహావిష్ణువు తెలిపినట్టుగా తెలియబడిందో అప్పుడతను శివుడు గురించి తపస్సు చెయ్యడానికి ప్రధాన కారణము తాను మరణించకూడదు అనేటటువంటి భావన కాకుండా తనపై ఆధారపడినవారు దుఃఖపడకూడదు అనేటటువంటి భావనమీద తపస్సు ప్రారంభం చేస్తాడు.

తపస్సుకి ఎప్పుడూ కూడా తన కోసం తపస్సు చెయ్యడం ఒక పద్ధతి. ఇతరుల కోసం తపస్సు చెయ్యడం ఒక పద్ధతి. లోకశ్రేయస్సుకి తపస్సు చెయ్యడం ఒక పద్ధతి. ఇట్లా మూడు పద్దతులు ఉంటాయి. తమ కోసం తపస్సు చేసినవాళ్ళు, తమకు మరణం ఉండకూడదని కోరుకున్నవాళ్ళు, ఇలాంటి వాళ్ళ కథలు మనం చాలా విన్నాము. హిరణ్యకశిపుడు, రావణాసురుడు, భస్మాసురుడు, వీళ్ళందరూ తమకు మరణం రాకూడదని కదా తపస్సు చేసారు! మరణం దాటే విషయంలో వాళ్ళు ఎందుకు సఫలీకృతులు కాలేదు, మార్కండేయాది మహర్షులు ఎందుకు సఫలీకృతులయ్యారు? వాళ్ళూ మరణం దాడడం కోసమే కదా తపస్సు చేసారు? వీరెందుకు కృతకృత్యులయ్యారు, వారెందుకు కృతకృత్యులు కాలేదు అంటే కారణం ఒకటే. తమ కోసం చేసిన తపస్సు తమను రక్షించదు. అది స్వార్థం. తమ కోసం అవీ ఇవీ కావాలనట్టుగానే తమ కోసం దివ్యమైనటువంటి విషయాలు కావాలనుకోవడం. తమ కోసం పూజలు చేసుకునే వాళ్ళు, తమ కోసం యాత్రలు చేసుకునే వాళ్ళు, అంతా తమ కోసమే అన్న భావన ఎక్కడుంటుందో అది సృష్టికి వ్యతిరేకం. పదిమంది యొక్క శ్రేయస్సు కోసం, పదిమంది యొక్క ఉద్ధారణ కోసం, అలాగ ఏ పని చేసినా అది యజ్ఞార్థం అవుతుంది. అలాకాక తమ కోసం అనుకున్నప్పుడు అది స్వార్థం అవుతుంది.

అంచేత, ఏ పని చేసినా ఒక్కటే చూడాలి – ఇందులో కారణం ఏమిటి అని – లోక శ్రేయస్సా, స్వశ్రేయస్సా? శ్రేయస్సు మన్ని ఉద్దేశ్యించినది అయితే దానికి అంత విలువ లేదు. ఎంచేత అంటే నీకు శ్రేయస్సు కలగడం వలన లోకానికేమిటి అనే ప్రశ్న పుట్టాలి. లోక శ్రేయస్సు ఎవరి నుంచి జరుగుతుందో వారికి శ్రేయస్సు కలిగించడం అనేది ప్రకృతి ధర్మం. లోక కంటకమైన వాళ్ళకి ఎలాంటి శక్తులు ఉన్నా అవి క్రమంగా ప్రకృతి హరింపచేస్తూ ఉంటుంది. మన కథలన్నీ తరిచి చూసుకుంటే ఈ విషయం ఒకటి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. అంచేతనే శ్రీకృష్ణుడు అర్జునుడికి "*యజ్ఞార్థం కురుకర్మాణి*" అంటాడు. నీ జీవితం యజ్ఞార్థంగా నడిస్తే అది వికసిస్తుంది, వికాసం చెందుతుంది, వ్యాప్తి చెందుతుంది. తద్వారా ఎంతోమందికి నీవలన ఉపయోగం ఉంటుంది, వారికి ఉద్ధారణ కలుగుతుంది, రక్షణ కలుగుతుంది, ఆనందం కలుగుతుంది. కేవలం నీ కోసం నువ్వు జీవించేవాడి కోసం ప్రకృతి సహకరించడం అనేది ఉండదు.

అంచేత, మహర్షి వంశంలో వస్తున్నటువంటివాడు భృగు మహర్షి కుమారుడు విధాత. విధాత కుమారుడు మృకండుడు. మృకండుడి కుమారుడు మార్కండేయుడు. అంటే, సరాసరి సప్తఋషుల్లో అజ్ఞా చక్రమును పరిపాలించేటటువంటి ఒక మహర్షి మునిమనవడన్నమాట. అందుకని, భావనలు తమ కోసం జీవించడం అని ఉండవు అతనికి. ఎక్కడ ఋషిప్రోక్తమైన జీవితం ఉంటుందో అక్కడ తమ కోసం జీవించడం అనేది ఉండదు. ఇతరుల కోసం తాను బతికి ఉండాలి. అందుకనే, భగవంతుడు సైతం ఒక మాట అంటాడు, నా శ్రేయస్సు నేనెప్పుడూ కోరను. మీ అందరి శ్రేయస్సు కోరుతుంటాను అని. అంచేత, భగవత్పదమునందు నడిచి వెళ్ళేటటువంటి జీవులు వారి శ్రేయస్సు కాక అందరి శ్రేయస్సు కోరుతుంటారు. వారికి దేహం భగవంతుడు లేక ప్రకృతి ఏర్పాటు చేసినప్పుడు, మనసు ఏర్పాటు చేసినప్పుడు, ఇంద్రియములు ఏర్పాటు చేసినప్పుడు... ఇవన్నీ ఏర్పాటు చెయ్యబడ్డవే మనకి. అందుకనే, మనసేంద్రియ శరీరం దైవదత్తం అంటారు. ఈ దేవదత్తమైన శరీరాన్ని సృష్టి యజ్ఞంలో భాగంగా దాన్ని వినియోగించి నిర్వర్తింప చెయ్యడం అనేది సద్బుద్ధి. అలాంటి బుద్ధి ఉన్నచోట కార్యములు సిద్ధిస్తూ ఉంటాయి. సిద్ధించడం ఒక పక్క జరుగుతూ ఉంటే, రెండో పక్క జీవుడు పరిణితి చెంది, వికాసం చెందుతూ, వ్యాప్తి చెందుతూ ఉంటాడు. అది రెండోది. అంచేత, తన పరిణితి, తన వ్యాప్తి, తన వికాసం అని భావన చేసిన వాడికి జరగదు. అందుకనే, మీరు బాగా తరిచి చూసుకుంటే పురాణాలన్నీ కూడా తమ కోసం అని చేసుకున్నవాళ్ళకి అది అంతంత మాత్రంగానే ఫలించాయి. పదిమంది కోసం చేసినవన్నీ కూడా బాగా లోకానికీ వినియోగపడ్డాయి, తమకూ వికాసాన్ని కలిగించాయి. అంటే, ఇతరుల బాగోగుల కోసం మనం పనిచేస్తున్నప్పుడు మనకి వికాసం కలుగుతుంది. అది ప్రకృతి కలిగిస్తుంది. మన వికాసం కోసం మనం పనిచేసుకుంటూ ఉంటే, అదేదో వచ్చినట్టే వచ్చి వెళ్ళిపోతూ ఉంటుంది.

అందుకని ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని ఉపన్యాసాలు విన్నా, మళ్ళీ మన ప్రవర్తన ఎదో ఇట్లాగే ఉంటుంది, ఇంకో రకంగా ఉండదు. కారణం ఏమిటంటే ఈ ఒక్క రహస్యం ఉంది – "*యజ్ఞార్థం కురుకర్మాణి*". అంచేత, పదిమంది కోసమా, నా కోసమా? కారణం ఉందా ఏ పని చేసినా? నీకు వ్యక్తిగతమైన కారణం ఉంటే అందులోంచి నీకే వికాసం రాదు. ఎంచేత అంటే, **you are at the recieving end.** మనం పుచ్చుకుంటున్నకొద్దీ దక్షిణ ధృవం వైపు, **south pole** వైపు వెళ్ళిపోతాము. అంటే, మూలాధారం వైపు వెళ్ళిపోతుంది ప్రజ్ఞ. మనం ఇచ్చుకుంటూ వెళ్తుంటే **north pole**

లేక సహస్రారానికి చేరుతూ ఉంటుంది. అందుకని, "త్యాగేనహి కేన అమృత మానస సహో" అంటారు. ఎంత నీవు ఇతరుల కోసం నీ మనసేంద్రియ శరీరములు, నీకుండేటటువంటి మేధస్సు, నీకున్న వనరులు నీవు వాడుతుంటావో, అంత నీ యందు ప్రజ్ఞ ఊర్ధ్వముఖం చెందుతూ ఉంటుంది సహజంగా. ఎంత నీ కోసం చేసుకుంటావో అంత ప్రజ్ఞ అధోముఖం చెందుతూ ఉంటుంది సహజంగా. అది సృష్టిలో ఉండేటటువంటి అమరిక అది. ఈ అమరిక వలన మనం తపస్సులు చేసుకున్నా, ఏవో రకరకాల భక్తి కార్యక్రమాలు చేసుకున్నా, అది మన కోసం అన్న భావం ఉండడం చేత, మన పుణ్యం కోసం అనే భావన ఉండడం చేత, అది అంతంత మాత్రంగా ఫలించినట్టుగా ఊరికే మురిపించి వెళ్ళిపోతూ ఉంటాయి. ఈ రహస్యం ఋషులకి తెలుసు. జ్ఞానం ఉన్నవారందరికీ ఈ రహస్యం తెలుసు. ఇలాంటి జ్ఞానం ఉన్న తర్వాత జీవితాన్ని నిర్వర్తించుకోవడం కూడా అందుకే నిర్వర్తించుకోవాలి. ఏ పని చేసినా ప్రతిపనిలో కూడా ఇతరులకి ఉద్దేశ్యింపబడినది ఒకటి ఉంటుంది. ఆ ఇతరులకి ఉద్దేశ్యింపబడిన పనిని నువ్వు పరిపూర్ణంగా, ఆనందంగా, సమర్పణ బుద్ధితో నిర్వర్తిస్తూ ఉండాలి. అందులోంచి నీకు లభించే దాని యందు నీ దృష్టి లేక నీవు చేయవలసిన దాని యందు నీ దృష్టి ఉండాలి. ఇలా దృష్టి ఉన్నవాడికి క్రమంగా వికాసానికి అవకాశం ఏర్పడుతుంది.

అంచేత, కుర్రవాడు మరణిస్తాడని తల్లిదండ్రులు చింతిస్తూ ఉంటే, తల్లిదండ్రులు చింతిస్తున్నారని కుమారుడు చింతిస్తాడండి. తల్లిదండ్రుల చింత ఎవరి గూర్చి? తన గూర్చి చింత. అంటే, తన కారణంగా దుఃఖ పడుతున్నారే, అంచేత వీరి దుఃఖాన్ని బాపవలసిన బాధ్యత నాకున్నది కదా! పైగా సంతానం లేక సంతానం కోరి, అది ధర్మమై ఉండడం చేత తపస్సు చేసి, శివకేశవులు ఇద్దరినీ మెప్పించి, తన్ని వరంగా పొందినప్పుడు తండ్రి, అలాంటి తండ్రికి తాను అర్థాయుష్షు, అల్పాయుష్షుగా, అంటే పదహారేళ్ళకే మృతి చెందితే వారు చేసిన తపస్సుకి ఫలమేముంది? వారికి వృద్ధాప్యంలో వారిని చూసుకునే వారెవరు? నేను ఈ విధంగా దిగి రావడం అనేటటువంటిది తండ్రి తపస్సు వలన జరిగింది. నాకు శరీరం అతడు ఏర్పరిచాడు. అలాంటి వాడికి నేనేం చెయ్యాలి అనేటటువంటి ప్రశ్న? ఆ ప్రశ్నకి అతనికే సమాధానం దొరుకుతుంది, మార్కండేయుడికే. తల్లిదండ్రులను పిలిచి, ఇద్దరికీ పాదనమస్కారం చేసి, మీరేం చింతించవద్దు అని చెప్తాడు. నేను మీ వలెనే, మీ ఆశీర్వచన బలంతో తపస్సు చేస్తాను. తపస్సు చేసి, మృత్యుంజయుడైన శివుని యొక్క ఆశీర్వచనం పొందుతాను. పొంది, అతని యొక్క వరంగా దీర్ఘాయుష్షు తెచ్చుకుంటాను. మళ్ళీ తిరిగివచ్చి మీకు పరిపూర్ణంగా సేవ చేసి మీకు అన్ని విధములుగా పరిపూర్ణమైన ఆనందం కలిగించి, మీరు నా కుమారుడు నాకు అన్ని విధాలా నన్ను సంరక్షించుకున్నాడు అనేటటువంటి మీకు తృప్తి కలిగేటట్టుగా చేస్తాను. మీరు తృప్తి పొందితే, మీ పితరులు, వారి పితరులు అందరూ తృప్తి పొందుతారు.

చేసే ప్రతి పనిలోనూ మూడు తరాలూ తృప్తి పొందుతాయని రాముడు రామాయణంలో చెప్తాడు. మూడు తరాలు తృప్తి చెందడమో, మూడు తరాలు అసంతృప్తి చెందడమో ఉంటుంది. అలాగే ముందు మూడు తరాల్లో నువ్వు చేసే పని యొక్క నాణ్యత అలా కొనసాగుతూ ఉంటుంది. మొత్త ఏడు తరాల కథ మనది. ప్రతి జీవిది ఏడు తరాల కథ అని రాముడు రామాయణంలో స్పష్టంగా చెప్తాడు. ఇంక ఫరవాలేదు, నువ్వు సింహాసనం ఎక్కేసెయ్యి, నీకేమి అడ్డు లేదు, భరతుడు నాకు అక్కర్లేదు అని అంటున్నాడు, మంత్రులందరూ కూడా రమ్మంటున్నారు కదా, ఇంకేమిటి అభ్యంతరం అంటే రాముడు

చెప్తాడు, తండ్రి తల్లికి ఇచ్చిన మాట. అది నిర్వర్తింపబడనప్పుడు తండ్రి అసత్యవంతుడవుతాడు, అసత్యభాషణుడు అవుతాడు. అలా తండ్రి అసత్యభాషణుడు అయినప్పుడు అతని తండ్రికి, అతని తండ్రికి, అతని తండ్రికి కూడా దానివల్ల లోటు వస్తుంది. అంతే కాదు, నా నుండి రాబోయే మూడు తరాల్లో కూడా లోటు వస్తుంది. ఎంచేత అంటే, ఏడు తీగల వీణలో ఒక తీగ సరిగ్గా లేకపోతే సంగీతం సరిగ్గారాదు. అందులో ఏడు తీగల వీణలో నాలుగోవ, మధ్యస్థమైన తీగే చాలా ముఖ్యమైనటువంటి తీగ. అది చాలా చక్కగా శ్రుతి చెయ్యబడి ఉండాలి. ఎక్కువ సంగీతం దాని మూలంగానే నడుస్తూ ఉంటుంది. అలాగే మనకి మూడు తరాలు ఉన్నాయి, తర్వాత మూడు తరాలు ఉన్నాయి. మన వలన వాటి నాణ్యతలో తేడా రాకూడదు, ఒకటి. వీలుంటే వాటి నాణ్యత పెంచగలగాలి. మనం పుట్టినందుకు మన ముందు వాళ్ళకి ఇంకొంచెం నాణ్యత పెంచేటట్టుగా జీవించవచ్చు. అలాగే నీ తర్వాత మూడు తరాల వాళ్లకి కూడా మార్గదర్శకంగా ఒక qualitative life with humanistic values, ధర్మాన్ని అనుసరించి జీవించేటట్టుగా జీవించవచ్చు. ఇందులో ఏ ఒక్కటీ నువ్వు బాగు చెయ్యకపోయినా, కనీసం దాన్ని పాడుచెయ్యకు. ఇంత కథ ఉంది.

అంచేత, మార్కండేయుడు ఆ విధంగా పూనుకుంటాడు. ముందు తరాలకి హాని జరగకూడదు కదా! అంచేత, పెద్దలేం చెప్తుంటారంటే ఎప్పుడూ కూడా దీర్ఘాయుష్షు కోరమని చెప్తారు. ఎందుకంటే దీర్ఘాయుష్షు కోరుకోవడం, ఎక్కువ కాలం బతికి, ఎక్కువ కాలం అంటూ ఎక్కువ కాలం తిరగడానికి కాదు. ఎక్కువ కాలం తన కర్మ యొక్క పరిపాకం ఒకటి ఉంటుంది, దాన్ని పరిపూర్తి గావించుకుంటూ ఉండొచ్చు. ప్రతివాడికీ సంచిత కర్మ అని ఒకటి ఉంటుంది. అంటే, ప్రారబ్ధం. సంచితం అంటే మనకి ఇంతవరకూ పోగై వచ్చినటువంటి పాపపుణ్యముల యొక్క రసాయనము అది, పాకం. ఈ పాకం బట్టి ఈ జన్మలో వచ్చేవన్నీ వస్తూ ఉంటాయి. ఈ వచ్చేవాటిని మనం నిర్వర్తించుకుని, అందులో ఎంత పూర్తి చేసుకుంటూ ఉంటే అంత ఉత్తీర్ణులమవుతాము కదా! మొత్తం సంచిత కర్మంతా కూడా ఈ జన్మలో ఇచ్చేయరు. ఇస్తే చచ్చిపోతారు. అందులో sample కి ఒక్కొక్కదాంట్లోంచి ఒక్కక్కటీ తీసి ఇస్తారు. ఇది వీడు సరిగ్గా రాస్తే ఈ పరీక్ష, మొత్తం పుస్తకం అంతా రాయక్కర్లేదు కదండి exam లో. అందులోంచి వాడు objective questions ఇచ్చినట్టుగా అందులోంచి కొన్నికొన్ని items, ప్రతి దాంట్లోంచి assortion తీసి వీడికి పడేస్తారు. అందుకని, సంచింతం నుంచి ప్రారబ్ధం అని వస్తుంది. దాని యొక్క representative sample ఇస్తారన్నమాట. దాన్ని ఎలా నిర్వర్తిస్తుంటారనేది అంతరిక్షం నుంచి చూస్తూ ఉంటారు. వాళ్ళు చాలా చిత్రంగా account maintain చేస్తారట. వాళ్ళంతా చిత్రగుప్తుడి సైన్యం అంటారు మనవాళ్ళు. All that we do is recorded in the akash. Akashic records ఉన్నాయి. అందులో మనం మాట్లాడిన మాట, చేసిన భావము, మన చేసిన చేత అన్నీ record అయిపోతూ ఉంటాయి automatic గా. వాడెవడో మనం ఏం చేస్తున్నా అన్నీ తెలిసిపోయేటట్టుగా ఏర్పాటు చేసాడు కదా! మన internet లు, మన mobiles, వీటన్నిటి నుంచి మన సమాచారం అలా తీసేయొచ్చు వాళ్ళు. భూమిమీదే జరుగుతోంది ఇప్పుడు.

అంచేత, నీవు చేసే పని నాణ్యత ఎలా ఉండాలంటే నాణ్యత పెంచేదిగా ఉంటే, నీకూ ఒక పక్క కర్మ క్షాళనం అయిపోయి, నీవు బంధము లేని స్థితిలో జీవించేటట్టుగా తయారవుతావు. జీవితంలో బంధింపబడి జీవించడం ఒక పద్ధతి, jail లో ఉండడం ఒక పద్ధతి. Jail అంటే ప్రతీది obligation కదా! ఇలా చెయ్యాలి కదా! అలా చెయ్యాలి కదా! ఒక

యోగి అయినటువంటి వాడు ఈ విధంగా తెలుసుకుని కర్తవ్యాన్ని నిర్వర్తించి, తనని ఎవరూ బంధించని ఒక స్థితిలోకి వచ్చేస్తాడు. నాకీ మూడు లోకాల్లో బంధం లేదురా అని చెప్తాడు కదా శ్రీకృష్ణుడు. అయినప్పటికీ చేస్తూ ఉంటాను. అది స్వచ్ఛందంగా చేసేది. స్వచ్ఛందంగా చేసేది వేరు, కర్మ వశాత్తు చేసేది వేరు. అంచేత, కర్మ వశాత్తు అనేటటువంటి పరిస్థితి దాటాలంటే దీర్ఘమైన ఆయుష్షు కావాలి, ఒకటి. దీర్ఘమైన ఆయుష్షు ఉంటే రెండోదేమిటంటే ఎంత దైవ చింతన చెయ్యగలిగితే అంత దైవచింతన చెయ్యవచ్చు. దైవ చింతన చెయ్యడానికి శరీరం యొక్క ఆరోగ్యంతో సంబంధం లేదు. మనసుతో సంబంధం కదా! అందుకని, రెండు ప్రయోజనాలు ఆర్యులు మనకి చెప్పారు దీర్ఘాయుష్షు ఉండాలని. ఏమిటంటే, ఇది వరకూ పడ్డ బాకీలన్నీ తీర్చుకోవడానికి నీకు time ఎక్కువ ఉంటుంది. అది ఒకటి. లేదూ ఇది మళ్ళీ postpone అయ్యి, పై జన్మకి వచ్చి, ఇంకొంచెం దానికి బరువు పెరుగుతూ ఉంటుంది. అంచేత, కర్మము నుండి విముక్తి చెందడానికీ దీర్ఘాయుష్షు కావాలి. దైవస్మరణ బాగా చేసుకోవడానికీ దీర్ఘాయుష్షు కావాలి. ఎందుకంటే, మనం దైవం దగ్గిరికి చేరేటటువంటి కార్యక్రమం. అందులో భాగంగా ఉత్తమ లోకాల్లోకి, ఇంతకన్నా బావుండే లోకాల్లోకి ప్రవేశించడం ప్రజ్ఞతో. ఎక్కడున్నావనేది point కాదు. ఇక్కడుండి కూడా వేరే లోకాల్లో మనం వసిస్తూ ఉండవచ్చు. ప్రజ్ఞే!

ప్రజ్ఞకి ప్రయాణం ఉన్నది. అంచేత, మామూలుగా మనం చేసే ప్రయాణాలే మనం తిథి, వారం, నక్షత్రం, అన్నీ చూసుకుని, అవతల పక్క మనం ఎక్కడికెళ్తున్నామో వాళ్లతో contact ఏర్పాటు చేసుకుని, ఫలానా train కి వస్తున్నామో చెప్పుకుని, అక్కడ మన కోసం వాళ్ళు వచ్చేటట్టు, లేకపోతే కారు పంపించేటట్టు ఏర్పాటు చేసుకుని వెళ్తాం కదా! Common sense కదా! మామూలుగా చేసే ప్రయాణాలకే... ఇప్పుడు మనమంతా హైదరాబాద్ వస్తున్నామంటే ముందుగా ఇక్కడ మనం హైదరాబాద్ వస్తున్నట్టు సమాచారం చెప్పడం, వాళ్ళందరూ మన్ని వచ్చి స్టేషన్లో receive చేసుకోవడం, వాహనాలు ఎక్కించుకు వెళ్ళడం, ఇక్కడ వసతులు ఇవ్వడం చెయ్యలేదూ? మన ఊరు వస్తే మనం చెయ్యమా? చెయ్యని వాళ్ళకి చెయ్యబడవు అలాంటివి కదా! అంచేత, ఈ ప్రయాణం ఎలాగో, ఇది కూడా ప్రయాణమే! ప్రయాణకాలే అని చిట్టచివరికి ఒకటుంటుంది. ప్రతివాడూ ఇది వదిలి వెళ్ళాలి కదా! వెళ్ళేటప్పుడు ఎక్కడికి వెళ్తున్నావో తెలియద్దూ? ఎక్కడికి కొన్నారు టికెట్? తెలియకపోతే ఎలా? You should know where you are going. Common sense కాదా అది? Should we not know where we move eventually as we drop this body? As we drop the body కాకపోతే as the body drops, ఏదయినా కావొచ్చు కదా! ఎక్కువ భాగం అది మన్ని వదిలెయ్యడమే ఉంటుంది. దాన్ని మనం వదలంగా! మనం దాన్ని పట్టుకని ఇట్లా వ్రేళ్ళాడుతూ ఉంటాము గబ్బిలాల్లా. ఛీ! పో! అని తోసేస్తుంది అది. అది మామూలుగా జరిగేది. ఏదో మహాత్ములు, యోగులు వాళ్ళందరికీ శరీరానికి కృతజ్ఞతలు చెప్పుకుని బయటకొచ్చేస్తుంటారు. మామూలుగా ఉన్నప్పుడే వాళ్ళు రోజూ బయటకెళ్ళి వస్తూ ఉంటారు. ఎప్పుడూ ఇంట్లో కూర్చోరు. అంచేత, వాళ్లకి ఆ రోజు final గా వెళ్ళిపోతారు కాబట్టి ఒకరికొకరు వీడ్కోలు చెప్తారు, ఒకరికొకరు హారతులు ఇచ్చుకుంటారు. దూరప్రయాణం అంటే హారతులు ఇస్తారు కదండి! ఇస్తారా? మరి అవన్నీ ప్రయాణాలే కదా! మరి ఈ ప్రయాణానికి కూడా నువ్వు అంత జ్ఞానం సంపాదించుకోవాలంటే నీకు దీర్ఘాయుష్షు కావాలి. ఎక్కువ కాలం బతికితే ఇంకా కొడుకులతోనే కాకుండా, మనవలతోనే కాకుండా, మునిమనవలతో కూడా

ఆదుకుందామని అనుకోడానికి కాదు. వాళ్ళ schools, వాళ్ళ fees, వాళ్ళకి donations, వాళ్ళ పెళ్ళిళ్ళు, ఇవన్నీ మనమే plan చేసుకుంటూ బతకడానికి కాదు ఎక్కువ కాలం. ఇందుకూ దీర్ఘాయుష్షు. అసలు దీర్ఘాయుష్షు ఎందుకు కోరుకుంటారంటే సదాచార సంపన్నులు ఇందుకు కోరుకుంటారు. ఒకటి, కర్మలు వీలున్నంత వరకూ పరిపూర్తి గావించి బంధ విమోచనలు అవ్వడానికి. రెండవది, తన తర్వాత చెయ్యవలసిన ప్రయాణానికి దారి ఒకటి. తన గమ్యమేమిటి, ఆ గమ్యమునందు ఎలాంటి పరిచయస్తులు తనేకేర్పడతారు, ఆ ప్రదేశం ఎలా ఉంటుంది ఇవన్నీ తెలుసుకోవద్దండీ? Internet కొట్టి ఆ ఊరు చూసి, ఆ హోటల్ చూసుకుని, ఆ హోటల్లో facility లు చూసుకుని, అక్కడ breakfast ఇస్తారో లేదా అని ఇన్ని చూసుకుంటున్నారే, మరి ఇంత ప్రయాణం చేసి లోకమే దాటి ఇంకో లోకంలోకి వెళ్తున్నప్పుడు, అక్కడ ఎవరు వస్తారు? ఎవరు వస్తే బావుంటుంది? ఊరు దాటి ఊరు వెళ్ళి ఈ ప్లాట్ఫారం మీద దిగంగానే పోలీసులు వచ్చారనుకోండి, బావుండదు కదా! ఇద్దరు కానిస్టేబుళ్ళు వచ్చారనుకోండి, తమరి పేరు ఇదేనా అంటే? అవునంటే, అయితే పదండి పోదామని, సంకెళ్ళు వేసి పట్టుకుపోయే వాళ్ళు వచ్చారనుకోండి అదొక పద్ధతి. మన్ని సాదరంగా ఆహ్వానించి, ఓ పూలదండ వేసి తీసుకెళ్లారనుకోండి, అదొక పద్ధతి. ఈ dimension ప్రతివాడికి ఉందిగా జీవితంలో?

ఈ సంఘటన తప్పదు కదా ఎవరికైనా! దాన్ని గూర్చి నువ్వేం చెయ్యాలి? కేవలం భారతీయమైనటువంటి ఋషులు ఒక్కరే దానికి మార్గం చూపించారు. ఇంక ఎక్కడా ఎన్నయినా తెలుసు తప్ప ఇది మాత్రం తెలియదు. ఇది ఇక్కడే తెలియాలి. ఎందుకంటే, వాళ్ళ main subject ఇదే మొదటి నుంచీ కూడా! ఏమిటంటే, ముందు as we enter we should know where do we exit. ఇందులోకి వచ్చాము, ఎటు వెళ్ళాలో బయటకు తెలియకుండా వచ్చేస్తే ఎట్లాగండి? నిర్గమం తెలియకుండా మనం ప్రవేశించామనుకోండి, in gate చూసుకున్నప్పుడే out gate కూడా చూసుకోవాలి. సినిమా హాళ్ళలో కూడా చీకటిగా ఉన్నా కనబడడానికి వీలుగా exit board radium గా పెడుతూ ఉంటారు కదా! Radium light తో exit పెడతారు, చీకటిలో తన్నుకు చచ్చిపోకుండా. As you enter the next step is only exit. దేహంలో ప్రవేశించిన ప్రతివాడు నిష్క్రమించక తప్పదు. కాబట్టి ఎక్కడ ఉంది exit door? ఏ door లోంచి నువ్వు వెళ్తే బావుంటుంది? ఒక్కో door open చేస్తే slums లో పడిపోతావు. ఒక్కొక్క door open చేస్తే చాలా మంచి ఉద్యాన వనాల్లోకి వెళ్తావు. మరొక door open చేస్తే దేవాలయంలో, సరాసరి గర్భగుడిలో కూర్చుంటావు. దీంట్లో తలుపులు అలా ఉన్నాయి లోపల. అంచేత, ఎటు exit అవ్వాలి? అటు exit అవ్వాలంటే ఏం చెయ్యాలి? ఇలాంటి కథలు ఇచ్చారు వాళ్ళు.

అంచేత, మనకి ఇది నిర్వర్తింపబడాలంటే మనకున్న కర్తవ్యములు, అంటే మన ప్రారబ్ధం నిర్వర్తించుకుంటూ... If you have set your things in order by forty nine years అది A grade. If you have completed every obligation by fifty six years, అది B grade. Sixty three years, అది C grade. ఇహ మిగతావన్నీ fourth grade. ఎనభైనాలుగేళ్ళు ఇది బాగా పని చేస్తుందిట. సహస్రపూర్ణిమలు నీ మేధస్సు చక్కగా పనిచేసేటటువంటి ఏర్పాటు ఈ మానవ నిర్మాణంలో ఏర్పాటు చేసారు ఈ కలియుగంలో. ఇతర యుగాల్లో, ద్వాపరలో దీనికి రెండింతలు, త్రేతలో మూడింతలు, కృతలో నాలుగింతలు ఉండేది. నాలుగు వందల ఆయుః పరిణామము, మూడు

వందలు, రెండు వందలు, వంద – కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్లో అట్లా ఏర్పాటు చేసారు. ఇలా ఏర్పాటు చేసిన ఈ యుగంలో ఆయుః పరిణామం వంద ఉన్నప్పటికీ మన ప్రవర్తన వలన, కాలము, దేశము, ఆచారము, కాలుష్యము, వీటన్నిటినీ పెట్టుకుని, ఎనభైనాలుగేళ్ళు... It is a very conservative estimate. ఇప్పుడు budget వేసేటప్పుడు conservative గా వేసుకుంటూ ఉంటాం కదా! అంచేత, ఆ విధంగా మనం ఎనభైనాలుగేళ్ళు ఇది బాగా పని చేస్తుందటండి. ఇక అక్కడినుంచి మరుపు వచ్చేస్తుంది. ఇప్పుడు మరుపు ముందే వచ్చేస్తోందిగా! అది చూడండి. ఏం జరుగుతోందండి ముందు వస్తోందంటే? మనిషి క్షీణిస్తున్నాడు అని అర్థం. అసలు మరుపే మృత్యువు అని చెప్పారు. సనత్ సుజాతంలో దృతరాష్ట్రుడుకి సనత్ సుజాతుడు మర్చిపోవడమే మృతువు అని చెప్తాడు. అంచేత, ముప్పైయేళ్లకే మర్చిపోయే వాళ్లు... చిన్నపిల్లల దగ్గిర నుంచి మర్చిపోయే వాళ్ళే ఎక్కువ ఇప్పుడు. ముందుముందికి వెళ్తే ఇంక... ఇప్పుడు చూడండి Alzheimer's అని style గా పలుకుతూ ఉంటారు. ఏం లేదు, మతిమరుపు పెరిగితే Alzheimer's. పక్కన వాడెవడో కూర్చుని ఉంటాడు, వాడెవడో తెలియదు. మొగుడే! అట్లాగే ఆయనకీ ఆవిడ తెలియదు – పెళ్ళాం, పిల్లలు ఎవరూ తెలియరు. ఉంటారు, తింటారు, ఏమీ relate అవ్వడానికి ఇది ఉండదు. ఇది పడిపోయే లోపల దీనితో వెళ్లిపోవాలి. ఇది పడిపోతే? ఇది, అదీ అంటే ఈ వినే వాళ్ళు బాధ పడతారు. అంచేత, మెదడు పోయి, ప్రజ్ఞ పోయి, శరీరం ఉందనుకోండి. ప్రజ్ఞ పోయి, ప్రాణం ఉందనుకోండి. మొన్నామధ్య, అంటే, పాతికేళ్ళ క్రితం కోపడ్డారు ఒకళ్ళు – మీరు ఇలా ఇదీ అదీ అని, ఇక్కడా అక్కడా అని భాగాలు చూపిస్తే, మేము ఎక్కడో cassettes వేసేవాళ్ళం, మేము ఏం అనుకోవాలి మాస్టరుగారు అని అడిగారు. బుద్ధి వచ్చిందిరా, ఇంక అప్పటి నుంచి అట్లా చెప్పను అని చెప్పాను. మనం ఎదురుగుండా వాళ్ళతోనే మాట్లాడుతున్నామా? కాదుగా! ఎంతోమంది ఎన్నో చోట్ల వింటూ ఉంటారు.

అంచేత, నీకు ప్రాణం ఉండగా ప్రజ్ఞ ప్రయాణం చెయ్యాలి. ప్రజ్ఞ మరుగున పడిపోయి ప్రాణం ఉందనుకోండి, వాళ్ళందరూ కాబేజీల్లాగా ఉంటారు. పాశ్చాత్య దేశాల్లో అదే సమస్య. వాళ్ళని ఉంచాలా, తీసేయ్యాలా తెలియదు. తీసేద్దామంటే ప్రాణం ఉంది. ప్రాణం ఉందిగాని వాడికేం తెలియదు. పెడితే తింటాడు ప్రాణం ఉంది కాబట్టి. వాడివల్ల వాడికీ ఉపయోగం లేదు, ఇతరులకీ ఉపయోగం లేదు. అలాంటి సమస్యలు ఇప్పుడిక్కడ కూడా వస్తున్నాయి. మన పెద్దలు ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రాణం ఉండగానే ప్రజ్ఞ శరీరం నుంచి బయటకు ఏ విధంగా వెళ్ళవచ్చో దానికి సాధనా మార్గాలు ఇచ్చారు. ఎనాడయితే తనకి పనయిపోతుందో... మనకి ఇక్కడ కర్తవ్యాలు లేవనుకోండి, ఎందుకిక్కడ? రేపు మధ్యాహ్నానికి ఇక్కడంతా మూసేస్తారండి. అప్పుడు ఇక్కడెందుకు మనం? గురుపూజా ప్రాంగణం రేపు మధ్యాహ్నం భోజనాలు పెట్టేసి, అందరికీ పొట్లాలు కూడా చేతికిచ్చి పంపించేస్తారు కదా! ఇంక ఇక్కడుండి ఏం చేస్తావు నువ్వు? వెళ్ళాలా? అలా ప్రతివాడికీ వాడి జీవన ప్రయోజనం అనేటటువంటిది నిర్వర్తింపబడిన తర్వాత అక్కడుండి ఏం చేస్తావు వ్రేళ్ళాడుతూ? అన్నం కూడా ఎవడూ సరిగ్గా పెట్టడు కదా! వ్రేళ్ళాడే వాడికి అన్నం ఎవరు పెడతారండి? పోరా! అని చెప్తారు. అందుకనే కదా చాలామంది పెద్దవాళ్ళు అలా ఉండిపోతూ ఉంటే, వీళ్ళు వెళ్ళిపోతే బావుండు అని అనుకోరు? అంచేత, అలాంటి పరిస్థితి ఎందుకు? అలా రాకుండా ఉండకుండా ఉండడానికి, అంటే అసలు నిజమైన సమస్యలకి

పరిష్కారాలు ఋషులు ఇచ్చారండి. నిజమైన సమస్యలు అవి. అంచేత, వాళ్లకి కార్యక్రమం అవ్వగానే వానప్రస్థం అన్నారు. అక్కడ తపస్సు చేసుకోమన్నారు. తపస్సు ఒక్కటే మార్గం. ఇంకేం మార్గం లేదు.

రామాయణం ప్రారంభం అవ్వడమే తపస్సు అన్న పదంతో ప్రారంభమవుతుంది. "*తపస్స్వాధ్యాయ నిరతం*" అని మొదలవుతుంది. తపస్సు, స్వాధ్యాయము చేసుకునేటటువంటి వాల్మీకి మహర్షికి ఎప్పుడూ తపస్సులో ఉండేటటువంటి నారద మహర్షి కనబడ్డాడు అని. అంచేత, శ్రీకృష్ణుడు కూడా చిట్టచివరికి భగవద్గీతలో యజ్ఞము, దానము, తపస్సు అంటాడు. చివరికి మిగలాలిసింది తపస్సు అందరికీ. అది ఎంత తొందరగా జీవితంలో మొదలుపెడితే అంత మంచిది. ఎంత తొందరగా మొదలుపెడితే అంత తొందరగా గమ్యం చేరుకోవచ్చు కదా! Start early reach safely అని పెడుతుంటారు కదా బోర్డులు! Late గా start అయితే accidents అయిపోతాయి, speed గా చేద్దాం అనుకుంటే. అంచేత, early గా start అయ్యి early గా పూర్తి చేసుకో. అందుకని, చిన్నతనం నుంచి పెట్టారు.

అదృష్టవశాత్తు మార్కండేయుడికి ఒక సన్నివేశం వచ్చింది. అతడు దీర్ఘాయుష్షు ఉండేటటువంటి ఉపయోగములన్నీ గుర్తించాడు. ఒకటి, తల్లిదండ్రులకి సేవ. రెండు, తాను ఈ దేహం నుంచి బయటకొచ్చేటటువంటి విధానం. మూడు, తనకి జ్ఞాన సముపార్జన, తత్ కారణంగా లోక శ్రేయస్సు. ఇన్ని విధాలుగా మనకి ఎక్కువ ఆయుర్దాయం ఉండడం మంచిది. అంచేత, మనకి ఆశీర్వదించినప్పుడు కూడా ఆయుష్షు, ఆరోగ్యం అంటారు. ఐశ్వర్యం మూడవది. "ఆయురారోగ్య ఐశ్వర్యమస్తు" అంటారు కష్టపడి సంస్కృతంలో, పలకదెవరికీ! ఇంగ్లీషులో పలికే నాలుక సంస్కృతం పలకలేపోతోంది. అంచేత, "ఆయురారోగ్య ఐశ్వర్యమస్తు" అంటే? ముందు నీకు ఆయుష్షు ఉండాలి. ఉంటేనే, ఆరోగ్యం మాట అలా ఉంచి ఈశ్వరత్వాన్ని సాధించడానికి వీలుపడుతుంది. అందుకనే, ఉత్తారాదిలో, అంటే హిమాలయ ప్రాంతాలకి వెళ్తే, అక్కడ వాళ్ళు జరాయురస్తు అని ఆశీర్వదిస్తారు. మనం చిరాయురస్తు అంటాం కదా! చిరకాలం జీవించి ఉండమని అడగడం చిరాయువు. "పాపీ చిరాయువు" అని అంటూ ఉంటాం మనం. చిరాయువు అంటే చాలా కాలం అని. జరాయువు అంటే బాగా వార్ధక్యం వచ్చేంత వరకూ కూడా శరీరంలో ఉండు అని. ఎందుకుట? అంత పాపం నిర్మూలనం చేసుకోవచ్చు. దైవ స్మరణ చేసుకుంటూ, కర్మలు పరిపూర్ణంగా శిధిలం గావించవచ్చు. అది ప్రధానమైన ఉద్దేశ్యం.

అంచేత, ఈ ఉద్దేశ్యాలన్నీ బాగా తెలిసినవాడైన మార్కండేయుడు తల్లిదండ్రులని ఉద్దేశ్యించి తపస్సు చేస్తాడు. వారిని సంతోషపెట్టడమే తన కర్తవ్యము అని. తల్లిదండ్రులు, నేను వారిని కృతకృత్యులని చెయ్యాలి, వారి జన్మకి సార్ధకత కలిగించాలి అనేటటువంటి ఒక దివ్యమైనటువంటి, యజ్ఞార్థమైన సంకల్పంతో తపస్సు మొదలుపెడతాడు. శివుడి గురించి తపస్సు చేస్తాడు. తపస్సు అంటే ఎప్పుడూ ముక్కు మూసుకుని కూర్చోరు సినిమాల్లో చూపించినట్టుగా. తపస్సు అంటే ఏమిటంటే మనం కనులు మూసుకున్నా, కనులు తెరిచినా, జ్ఞప్తికి రావలసినటువంటిది దైవమే. అది తపస్సు. అందుకనే, కన్నులు తెరిచి చేసిన తపస్సులు ఉన్నాయి. కన్నులు మూసుకుని చేసిన తపస్సులు ఉన్నాయి. కళ్ళు మూసుకుని స్థిరంగా కూర్చో, తపస్సు చెయ్యి అంటే స్మరణ చెయ్యి దైవాన్ని. కన్నులు తెరిచావనుకో, ఎదురుగా ఉన్నది కూడా దైవమే అని గుర్తు ఉండాలి. ఇదంతా మాయ, అలాంటి సిద్ధాంతాలు ఋషులు చెప్పలేదు. కనబడుతున్నదంతా దైవమే, "*విశ్వం విష్ణుః*".

విశ్వమే విష్ణువు. విశ్వం రూపంలో ఉంటాడు విష్ణువు. కాబట్టి కనబడుతున్నదంతా దైవమే. నువ్వు కనులు మూసుకుంటే కనబడుతున్న దానికి ఆధారమైనటువంటి వెలుగుందే అది కూడా దైవమే. అంచేత, నువ్వు బాహ్యంలోకి చూసినా, అంతరంగంలోకి చూసినా, నీకెప్పుడూ దైవ స్మరణ పరిపూర్ణంగా సిద్ధించాలండి. అదే చెప్తారు, "*పానీయంబులు త్రావుచున్, కుడుచుచున్, హాసనిద్రాదులు చెయ్యుచున్, సతతము శ్రీహరినామ స్మరణ*" చేస్తూ ఉండేవాడు ప్రహ్లాదుడు. ఏం చూసినా ఇది దైవమే అని ఉండాలి. అదే చెప్తూ ఉంటుంది ఉపనిషత్తు కూడా. నిన్న కూడా చెప్పాను. అది ముఖ్యమైనటువంటి వాక్యం, "*ఓం ఇతి ఏ తత్*" అంటారు. ఇదంతా అదే అని. "ఇతి" అంటే ఇది. "ఏ తత్" అంటే అదే ఇది అని. అదే ఇదిగా వచ్చింది. అదే ఇదిగా వచ్చినప్పుడు ఇది కూడా అదే అని ఎందుకు భావన చెయ్యవు? ఎందుకు చెయ్యవంటే అట్లా చెప్పలేదు ఎవరూ. చెప్పకపోవడం వల్ల ఇది కాదు అని పెట్టుకుని, అదేదో ఉందని చూస్తూ ఉంటారు. రెండూ దొరకవు. రూపాయి బిళ్లలో బొమ్మా, బొరుసూ రెండూ ఉంటాయి. బొమ్మ రూపాయా? బొరుసు రుపాయా? రెండూ కలిపితే రూపాయి. "*సత్యంచ అనృతంచ సత్యమభవత్*" అని చెప్తుంది వేదం. అంటే, నువ్వు ఏది కాదనుకుంటున్నావో, నువ్వు ఏది అనుకుంటున్నావో, ఆ రెండూ కలిపి నేను అని చెప్పారు. అలాగే, నీకు కొన్ని ఇష్టం లేని వాళ్ళు, కొన్ని ఇష్టం ఉన్నవాళ్ళు, రెండిటిలోనూ ఉన్నాడు కదా! నీకు ఇష్టమైనవి, ఇష్టం లేనివి రెండూ ఉన్నాయిగా! రెండిటిలోనూ ఉన్నాడు. దేంట్లో లేడు? అది లేనిదంటూ లేదు. అది లేక ఏదీ ఏర్పడదు. ఏర్పడినదల్లా దానివల్లే ఏర్పడింది. అలా ఏర్పడిన దాన్ని, కనబడుతున్న దాంట్లోనూ, కనబడక ఉన్న దాంట్లోనూ, దాన్నే స్మరిస్తూ ఉంటే, అది అనన్య చింతన అవుతుంది. అలాంటి చింతన రావాలి. అంటే ఎవడిని చూసినా ముందు అది గుర్తింపబడాలి.

వచ్చినవాడే నారాయణుడు అని మనకి ఒక సామెత ఉంది కదా! ఎవడో తెలియని వాడు వస్తే అనుకుంటాడు అలా. ఎందుకంటే వాడి పేరు తెలియదు కాబట్టి. వచ్చిన వాడి పేరు తెలియకపోతే వాడు నారాయణుడు అనుకోవడం సులభం. వచ్చింది మన అమ్మాయి అనుకోండి, నారాయణుడు ఉండడు కచ్చితంగా. మన అబ్బాయి అనుకోండి, నారాయణుడు ఉంటాడా? లేకపోతే, ఎప్పుడో రెండేళ్ళక్రితం అమెరికా వెళ్ళిపోయిన మన పిల్లలొచ్చారనుకోండి, నారాయణుడు గుర్తు వస్తాడా? In familars we dont see him. మామూలుగా బాగా పరిచయం ఉన్న వాళ్ళలో వారి స్వభావములే మనకి గుర్తు ఉంటాయి తప్ప, ఆ స్వభావముల వెనక వసించి ఉన్నటువంటి వాసుదేవుడు గుర్తురాడు. మనం ముందు స్వభావాన్ని చూస్తాం. దాంతో మనకుండే చుట్టరికాన్ని చూస్తాం. అప్పుడు దైవాన్ని చూచినట్టు కాదు. కనులు మూసుకున్నా అందుకనే ఇవే గుర్తు వస్తూ ఉంటాయి. ఇటు చూసి అటు చూడాలి. ఇటు చూడక అటు చూడడం కుదరదు. కనబడుతున్న దైవాన్ని చూడలేనివాడు కనబడని దైవాన్ని ఎట్లా చూస్తాడు? ఏడో క్లాసే తప్పాడట అంటే, ఇంక tenth పాస్ అవుతాడాండి అంటే ఏం చెప్తారండి? Tenth ఏమిటి, EAMCET rank అనుకోండి, రాదుగా! Entrance పరీక్ష మూడుసార్లు తప్పాను సార్, CA లో చేరమంటారా అంటే ఏం చెప్తాం? Entrance తప్పినా CA లో చేర్చుకుంటారు. ప్రయత్నం చేసి చూడు అంటాం అంతే కదా! అలాగే ఇటు చూడకుండా అటు చూస్తే లాభం లేదు.

ప్రకృతి రూపంలో దైవమే ఉన్నాడు. ప్రకృతే దైవము యొక్క రూపము. లేకపోతే దైవము కనబడడు. అంచేత, కనబడే సృష్టి యందు సమస్తమునూ దైవంగా చూడడం అనేది ఒకటుంది. అది చూడకుండా ప్రహ్లాదుడికిగాని,

ధృవుడికిగాని, ఎవ్వరికీ దైవము పరిపూర్ణ దర్శనం కాలేదు. మనం శ్రద్ధగా చదువుకోవాలి. పచ్చిక బయలు చూస్తే అలా పచ్చని కేశములు కలవాడుగా, "*హరికేశాయోపవీతినే*" అంటాము కదా! "*పుష్పానాం పతయో నమః*". హరికేశములు అంటే గడ్డి పూసములే హరి కేశములు. అట్లా పెట్టారు నమకం, చమకంలో ప్రతీది. "*జేష్ఠాయచ కనిష్ఠాయచ*" అంటే ఏమిటి? పెద్దవాడిని చూసినా శివుడే, చిన్నవాడిని చూసినా శివుడే. "*మధ్యమాయచ*", మధ్యస్థులను చూసినా కూడా శివుడే. ఏమి చూసినా శివుడే, శివుడే, శివుడే అని మనం సంస్కృతంలో పలకుతాము. అంచేత మనకేమీ తెలియదు కదా! ఏం లాభం? కనిష్ఠాయచ అని శివుడిని అంటూ చిన్నపిల్లవాడు కనబడితే ముక్కచివాట్లు పెట్టామనుకోండి! వాడు అన్ని రూపాల్లో ఉన్నాడు కదా! కనిష్ఠులని లెక్కపెట్టం, జేష్ఠులని లెక్కపెట్టం! ఇంకేముంది శివారాధన? లేదు కదా! గిరిశాయచ – ఈ చెట్లూ, పుట్టలూ, కొండలూ, నదులూ అన్నీ చెప్పేసారండి. మీకు మాములుగా ఎప్పుడూ కనబడేవన్నీ చెప్పేసారు, ఇవన్నీ శివుడు అన్నారు. అలాగే విష్ణుసహస్రనామం కూడా. ప్రతీదీ అదే. అంతా అదేరా అని చెప్తే ఒక పద్ధతి. అది చెప్పినప్పుడు చాలా క్లుప్తంగా ఉంటుంది. ఉపనిషత్తులో అట్లా చెప్పేస్తారు. పురాణం అనేసరికి దాన్ని బాగా పరుస్తారు. పరిచి, ఈ కళ్ళజోడు డబ్బా నువ్వే, ఈ డబ్బాలో ఉండేటటువంటి గుడ్డ నువ్వే, కళ్ళజోడు నువ్వే, ఇట్లా చెప్తారన్నమాట. ఈ కళ్ళజోడుకుండే నలుపు రంగు నువ్వే, దీనిమీదుండే design నువ్వే, ఇలా బాగా detailed గా... అంటే, ఏం తెలియాలంటే బుద్ధిమంతుడుకి, ఒరే! అన్నీ వాడే అని తెలియాలి. మరి మనం ఎంత యోగసాధన చేస్తున్నాం అనుకున్నా, నిత్యజీవితంలో ఎంత చూస్తున్నాం దైవాన్ని? దైవంతో యోగం చెందుతున్నామా? దేనితో యోగం చెందుతావు నువ్వు? భావంలోనే కదా యోగం చెందాలి! ఇది దైవమే అని భావం ఉండాలి. భగవద్గీత అంతా చదువుకోవచ్చు, బట్టీ పట్టొచ్చు. "*వాసుదేవ సర్వమితి*" అంటుంది భగవద్గీత. అంటే ఈ మొత్తం అంతా వాసుదేవుడి యొక్క రూపం. అందరిలోనూ వసించి ఉన్నవాడు వాసుదేవుడే. మరి చూసినప్పుడు వాసుదేవుడు కనిపిస్తున్నాడా, ఇంకోటేదయినా కనిపిస్తున్నాడా?

ఈ సుళువు తెలిసినవాడు మార్కండేయుడు. ఈ సుళువులు తండ్రితాతల వలన తెలిసినవాడవడం చేత అదృష్టం. చిన్నప్పటినుంచే ఇంట్లో చాలా ఆస్తిక్యబుద్ధి ఉన్న తండ్రి, తాత ఉన్నారనుకోండి. నువ్వు చిన్నతనంలోనే చాలా విషయాలు వాళ్ళు మాట్లాడుకుంటుంటే, ఆ చెవినా, ఈ చెవినా పడి కొంత లోపల మనకి వికాసం వస్తూ ఉంటుంది. ఇంట్లో ఎప్పుడూ పోట్లాడుకోవడాలు, డబ్బులు లెక్కపెట్టుకోవడాలు, ఇంక మిగతా విషయాల్లోనూ ఉన్నారనుకోండి, డబ్బులు గురించి discuss చెయ్యడాలు... అవ్వే ఉంటాయి మనలో కూడా. అంచేత, నువ్వు దేన్ని దర్శిస్తూ ఉంటావు? జబ్బులో కూడా దర్శించవచ్చు. అది కూడా ఇచ్చారు నమకంలో "*అవ్యాధినేభ్యో*" అని. ఇదీ అదీ కాదు, ప్రతీదీ అదే. జబ్బు వచ్చింది. ఏమిటి జబ్బు? అదే! నీకు ఆరోగ్యం అయితే ఒకటే ఉంటుంది కదా! జబ్బులయితే బోల్డు ఉంటాయి. అందుకనే, ఎవరినయినా మీరు ఎలా ఉన్నారు సార్ అంటే, బావున్నానండి అంటే వాడేం మాట్లాడడు కదా! అలా కాక ఎదో చెప్పాం అనుకోండి, ఆ ఎదో ఈ మధ్య sugar వచ్చిందండి అన్నామనుకోండి. BP గురించి అడుగుతాడు. BP గురించి చెప్పామనుకోండి, ఇంకోటి అడుగుతాడు. అది కూడా చెప్పాం అనుకోండి, ఇంకోటి అడుగుతాడు. అన్నీ అయిన తర్వాత మన్ని భయపెట్టి వెళ్ళిపోతాడు వాడు, BP కూడా ఉందా సార్, heart కొంచెం జాగ్రత్తగా చూసుకోండి అని. ఏమిటి నువ్వు చూసుకునేది? ప్రవర్తన వలన బావుంటాయి తప్ప ఇంకో రకంగా బావుండవు. Heart వచ్చింది, BP వచ్చింది,

suger వచ్చింది, అంటే మరి kidneys జాగ్రత్తగా చూసుకోండి అంటాడు. ఏమిటి నువ్వు చూసుకునేది? Kidneys జాగ్రత్తగా చూసుకోవడం అంటే దానికి extra తీసి పెట్టుకోవడమే! అంతే! అంతకన్నా విప్పి చూసుకోలేము కదా! ఎందుకొచ్చింది, బావున్నాను అంటే పోలేదు!

అంటే, బావున్నారా అని ఎవరిని అడిగాడు? నిన్ను అడిగాడు, నీ శరీరాన్ని కాదుగా అడిగాడు! నేను బానే ఉన్నాను అనుకోవడం అనేటటువంటి దానిలో తృప్తి, ఆరోగ్యం ఉన్నంత మాత్రాన ఉండదు. ఎన్ని జబ్బులు ఉన్నా బావుంటారట ఋషులు. ఋషులకి బోల్డు జబ్బులు ఉన్నాయటండి. వాటి జోలికే పోలేదు వాళ్ళు. జబ్బులు ఉండనియ్యి, వాటి దారి వాటిది, పని వచ్చినప్పుడు వాటి పని అవి చేస్తూ ఉంటాయి. రామకృష్ణ పరమహంసకి గొంతులో, విశుద్ధి చక్రంలో వచ్చింది cancer. ఓ తెగ దగ్గుతున్నాడు గురువుగారు. దగ్గుతుంటే మందులన్నారు శిష్యులు. ఆయన చెప్పారు, ఒరై! ఇది నన్ను పట్టుకుపోవడానికి వచ్చింది. నా పని అయిన తర్వాత దీని ఆధారంగా నేను వెళ్ళిపోతానని చెప్పారాయన. There should be a means to exit. ఎక్కడో పద్ధతుండాలి కదా వెళ్ళిపోడానికి! అందుకని, ఇది నన్ను పట్టుకుపోడానికి వచ్చి నాలో నివసిస్తున్నది. అంచేత, నా work అయిపోయిన తర్వాత ఇది ఆధారంగా నేను వెళ్ళిపోతాను, నువ్వు మందులు వేస్తే తగ్గవు ఇవి అని చెప్పారు. అయినప్పటికీ ఊరుకుంటారా శిష్యులు? ఊరుకోరు కదా! అలా కొంతమంది అనారోగ్యం వస్తే వాటిని కూడా స్నేహితులవలె, మీరు కూడా ఉండండి, ఫరవాలేదు అని చెప్తారు. ఎంతోమంది ఉన్నారు నాతో, మీరు కూడా ఉండండి అన్నట్టుగా ఉంటారండి. ఎప్పుడు? నీవు జీవ ప్రజ్ఞగా, నిన్న చెప్పానే, అభినివేశం చెందక, నీవుగా ఉన్నావనుకో. అప్పుడు నీ చుట్టూ ఎన్ని ఉన్నా నీకు ఇబ్బంది లేదు.

మా ఊళ్ళో ఎప్పుడూ చెప్తుంటాను మాస్టరుగారు చూపించిన ఒక చక్కని రహస్యం. రహస్యం వ్యక్తం చేసారు ఒకటి, దానితో చక్కగా ఆనందంతో బతికేసాడు ఒకాయన. మా ఊళ్ళో మాకు గోపాలకృష్ణారెడ్డిగారని vice chancellor ఉండేవారు. ఇప్పుడు లేరు. లేరంటే దేహంలో లేరు. ఆయన ఒక రోజు మాస్టరుగారి గదిలోకి అకస్మాత్తుగా ప్రవేశించారు. ఏమిటోయ్ ఇలా వచ్చావు అని అడిగారు మాస్టరుగారు. అడిగితే, నాకు sugar ఉందన్నారండి డాక్టరుగారు అన్నారు. నాకు sugar వచ్చిందిట. అది నిజంగా మనకేమయినా వస్తే మనకి తెలియదండి? Sugar వచ్చిందిట అంటే, రానీ దానికేముంది అన్నారు మాస్టరుగారు. అది నిన్నేం చేసింది, అది నిన్నేం చెయ్యదు అన్నారు. Sugar నీకు కాదు, నీ శరీరానికి. ఉండనియ్యి, అది నిన్నేం చెయ్యదు, నీ పని నువ్వు చూసుకో అన్నారు. అట్లాగే చెప్పారు. ఆయనకు కొండంత బలం వచ్చేసింది. అంటే, ఆయన మొట్టమొదటి కాఫీ, రెండో కాఫీ, మూడే కాఫీ ఎప్పుడూ పంచదారతోనే తాగేవారు. డబ్భైఎనిమిదేళ్ళు బతికారు. ఎప్పుడయినా కాఫీలో పంచదార వెయ్యమంటారా మాస్టారు అంటే, వెయ్యండి సార్, నాకు మాస్టరుగారు చక్కని మార్గం ఇచ్చారు, అది నన్నేం చెయ్యదు, నా పనులు అయిపోయిన తర్వాత... ఎవడికయినా వాడి పనులు అయ్యిన తర్వాత వెళ్లిపోవాలి కదా! అంటే హాయిగా బతకడం sugar పెట్టుకుని. నాకు sugar, నేను ఇది తినను, నేను అది తినను, అని మాటిమాటికీ దాని గురించి discuss చేసుకుంటూ ఏడుస్తూ ఉంటేవాళ్ళు బోల్డుమంది ఉంటారు.

వాడికి sugar కాదు, వాడి శరీరానికి sugar. వాడికి BP లేదు, వాడి శరీరానికి BP. అట్లా నేను, నాది విడదీసుకుంటే అది నిన్నంతగా ఏమీ చెయ్యదు. ఇదీ అదీ కలిసిపోతే అది ఏడిపిస్తుంది. సాంగత్యదోషం వల్ల బాధ తప్ప, ఆ సాంగత్యం లేదనుకోండి. రోగ సాంగత్యం వల్ల రోగం. రోగమా గీగమా, మన దారిన మనం పని చేసుకుపోదాం అంటే అది కూడా వీడు మన మాట వినేటట్లులేదు, సరే కానిద్దాం, ఉండాల్సినంత కాలం ఉండి తర్వాత పట్టుకుపోదాం అని wait చేస్తూ ఉంటాయి. దీన్నే ఈ రోజుల్లో psychology అని చెప్పుకుంటున్నారు ప్రపంచం అంతా. Common sense ని ఒక పెద్ద subject గా తయారు చేసారు. ఎందుకంటే common sense పోయింది కాబట్టి! బొత్తిగా పోయింది common sense. అందుకని, ఒక science, ఒక specialist. ఆ psychologist, psychriatrist, వాళ్ళకే qualitative life లేకపోవడం వల్ల, they become psychical patients. చాలామంది psychiatry doctors, psychiatric patients అయిన ఉదంతాలు నాకు తెలిసి అరడజను ఉన్నాయి. ఎందుకంటే, ఎదుటివాడి psychiatry నువ్వు బాగా examine చేస్తూ చేస్తూ, అదంతా వీడు పుచ్చేసుకుంటూ ఉంటాడు. వీడూ ఒక patient అయిపోతాడు. ఇదేమిటిరా! doctor patient అవ్వడమేమిటి? Patient doctor అవ్వాలి.

సరే, ఏది ఏమయినప్పటికీ కథేంటంటే, కనపడుతున్నదంతా లోపలా, బయటా, భావనలో, బాహ్యమునందున. ఎంత బాగా చెప్పారండి? పాట పాడేస్తాం, "భావములోను బాహ్యమునందున" అంటూ పాడేస్తాంగా! ఊరికే పాడక, ప్రయత్నం చెయ్యి. భావనలోను, బాహ్యమునందున అన్నమాచార్యులవారికి కనపడడం మొదలుపెట్టినప్పుడు ఆయన రాసుకున్నాడు. మనం ఊరికే పాడేస్తే అయిపోతుందండి? పాట పాడితే, బాగా పాడారు, బాగా ఉందండి కంఠం, మీరు కొంచెం సంగీతం నేర్చుకుంటే బావుటుందంటే, ఉన్న పని మానేసి అందులోకి వెళ్ళిపోతూ ఉంటాము. ఏమి? మనకి వికారాలు ఎక్కువ.

అలాంటివి లేకపోవడం వల్ల మార్కండేయుడు సమస్తమునందు శివ దర్శనం చేస్తూ వచ్చాడండి. ఇలా చెయ్యడంలో ఏమవుతుందంటే కనబడుతున్న దాంట్లోనూ... కొన్ని ఎక్కడయినా జరగోచ్చు. ఏదయినా, ఎక్కడయినా ఉండొచ్చు. ఎక్కడున్నా వాడితోనే ఉన్నావు. ఏం చేస్తున్నా వాడితోనే చేస్తున్నావు. ఇంక అంతకన్నా ఏం కావాలండి? గుళ్ళో అయితే ఉంటాడు, స్మశానంలో ఉండడని అనుకుంటున్నారా? అదేం లేదు. నీ మనసులో నువ్వు limit చేస్తున్నావు దేవుణ్ణి గుళ్ళోకిను, ఇంట్లో పూజగదిలోకి. Bathroom లో కూడా ఉంటాడు దేవుడు. సర్వవ్యాప్తి అయినటువంటివాడు నేను సర్వవ్యాప్తిని, bathroom లోను, అటువంటి వాటిలోనూ నేను ఉండనని అనడు కదా! లేకపోతే, హైదరాబాదులో ఉండను, విశాఖపట్నంలోనే ఉంటాను అని అంటాడా దేవుడు? అనడు కదా! ఈ ప్రదేశంలో ఉండడనేది లేదు కదా దైవానికి! ఈ కాలంలో ఉండను అనేది కూడా లేదు దైవానికి. దేశము, కాలము, ఈ పేరుతో అయితేనే పలుకుతాను అనేదేం లేదు. అన్ని పేర్లు ఒకటే. ఈ రూపంగా అయితేనే కనిపిస్తాను అనేదేం లేదు. నామము, రూపము, దేశము, కాలము, ఈ నాలుగిటికి అతీతమై నాలుగిటి యందు నిండి ఉన్నటువంటివాడు దైవము అని తెలియాలి ముందు. ఆ దైవం ఎక్కడ లేదు? ప్రతిక్షణం ఉన్నాడు. అందుకనే, ప్రతిక్షణం నువ్వు చేస్తున్న పనులన్నీ సాక్షీభూతంగా చూస్తూనే ఉన్నాడు. నీ లోపలనుంచే చూస్తూ ఉన్నాడు అని చెప్తూ ఉంటారు కదా! నీ లోపల నుంచే చూస్తాడో, నీ బయట నుంచే చూస్తాడో...

నువ్వు వాడిలో ఉంటున్నావు, వాడు నీలో ఉంటున్నాడు. అంత inseperable association. దాన్ని గమనించడం వల్ల మార్కండేయుడికి కళ్ళు తెరిచినా, కళ్ళు మూసినా శివుడే. తపస్సులో కూర్చున్నా శివుడే. స్నానం ఆచరిస్తున్నా శివుడే. అంతా శివుడే. పరిపూర్ణంగా శివమయమే. ఎంత శివమయం అయ్యిందంటే, పొద్దున్న చెప్పానే తన్మయత్వము. శివుని యొక్క భావన యందు తన్మయత్వం చెంది, తాను లేక శివుడు ఉండేటటువంటి స్థితికి వచ్చేస్తాడు. అదే తపస్సు, అదే సమాధి. నువ్వు ఏ వస్తువుని ఉద్దేశ్యించి ధ్యానము చేస్తున్నావో ఆ వస్తువుని దర్శించుకుంటూ, దాన్ని చూస్తూ, దానికి సమీపంగా వెళ్తూ, దానితో కలిసి ఉండి, అది అయిపోవడం అనేటటువంటిది ఇలా నాలుగు స్థితుల్లో జరుగుతుంది తపస్సు. సాలోప్యము – ముందు చూస్తావు. తర్వాత సామీప్యము – దానికి దగ్గరగా వెళ్తావు. సాయుధ్యము – దానితో కలుస్తావు. సారూప్యము – అది అయిపోతావు. సాలోక్య సామీప్య సాయుధ్య సారూప్యము అనేటటువంటి పద్ధతుల్లో నడుస్తుంది. ఈ ప్రేమించే పిల్లలు కూడా అట్లాగే అయిపోతారు తెలుసా? "నీవు లేని నేను లేనే లేనులే" అంటూ ఉంటాడు కదా! "నీవని నేనని తలచితివా నీవే నేనని తెలిసితిరా" అదంతా అదే. నువ్వు దేని యందు అలాంటి అనురక్తి పెంచుకుంటే అదే అయిపోతావు. అంచేత, ఆరునెలలు సావాసం చేస్తే వారు వీరవుతారు అనాలా అట్లా! ఈ భావన చేత అంతలాగ నువ్వు దానితో అనుసంధానం చెందడం చేత నువ్వు అది అయిపోవడం జరుగుతుంది. ఏం సందేహం లేదు. ఇతర భయ భావాలేం లేవు. అలా సర్వమూ శివముగా దర్శనం చేస్తూ, చేస్తూ, చేస్తూ, లోపలా బయటా శివుడినే దర్శనం చేస్తూ ఉంటే ఏమయ్యిందంటే ఈయన లేక శివుడే ఉన్నాడు. అలా పరిస్థితి వచ్చేసింది. శివరూపం అయిపోయాడండి.

అలా అయిపోయే సందర్భానికి సరిగ్గా ఇంక... మామూలుగా మనకి ఒక సృష్టి program ఉంటుంది కదా! దాన్ని కచ్చితంగా నిర్వర్తింపచేసేటటువంటివాడిని యముడు అంటారు. యముడు అంటే యమము అని అర్థం. యమము నియమము. ఆ సృష్టి నియమం ప్రకారం అతడిని దేహం నుంచి విముక్తి కలిగించేటటువంటి కార్యక్రమం జరగాలప్పుడు. అంచేత, కథ ఏం చెప్తుందంటే, మృత్యు దేవతలు వస్తారు. వచ్చి చూస్తారు మార్కండేయుడిని. మనకి మామూలుగా సినిమాల్లో చూపించినట్టు, కథల్లో చెప్పినట్టు, అట్లా ఒక శివలింగాన్ని వాటేసుకుని కూర్చోరు ఎవరూను. అది తెలియని వాళ్ళు అట్లా చెప్తూ ఉంటారు పురాణాలు చెప్పే వాళ్ళు. గట్టిగా పట్టుకుని కూర్చున్నాడంటారు. అబ్బా! ఎంత గట్టిగా పట్టుకున్నాడో అనుకుంటారు వినేవాళ్ళు. అట్లా పట్టుకుని కూర్చుంటే? పట్టు లోపల ఉండాలి. అది ఒక్కటేనా శివలింగం? నువ్వు పెట్టుకున్న లింగమా శివుడు? పక్కవాడి ఇంట్లో లింగం మాటేంటి? గుళ్ళో లింగం మాటేంటి? అంతటా నిండి ఉన్నవాడు తనంతా కూడా నిండి ఉన్నప్పుడు, తాను దానియందు ఇమిడి పోయాడంతే. దానితో కలిసిపోయాడు. అలాంటి వాడికి పాశం వేస్తే, పాశానికి అతీతమైన తత్త్వం అక్కడుంది కదా! ఇలా వేస్తే అదలా వచ్చేసింది. అక్కడికి వెళ్ళలేదు. తిరిగి వచ్చేసింది. మళ్ళీ వేసారు. మళ్ళీ వచ్చేసింది. అక్కడి నుంచి ఏదో ఒక అదృశ్యము, అవ్యక్తమైన శక్తి పాశాన్ని ఇలా వెనక్కి కొట్టినట్టుగా పడిపోయింది. పడిపోతే, ఇదేమిటి అనుకున్నారు. మళ్ళీ కాసేపు అయిన తర్వాత ప్రయత్నం చేసారు. మళ్ళీ అదే జరిగింది. మళ్ళీ ప్రయత్నం చేసారు. మళ్ళీ అదే జరిగింది. అమ్మో! ఇదేదో మనకి అతీతమైన విషయం ఉంది ఇక్కడ. అంచేత, మనం వెళ్ళి report ఇచ్చేద్దాం అని వెళ్ళి head office లో report ఇచ్చేసారు. అయ్యా! ఈ రోజు agenda

లో ఉన్న ప్రాణుల్లో వీడిని తేలేకపోయాము, మిగతా వాళ్ళంతా బుద్ధిగా వచ్చేసారు. అంటే, ఏమిటో చూడమని యమకింకరుల తర్వాత మృత్యుదేవత వెళ్తుంది. మృత్యుదేవతకీ అదే పరిస్థితి.

మృత్యుదేవతకీ అదే పరిస్థితి అయితే అప్పుడు యముడికి ఆశ్చర్యం వేస్తుంది. ఇలాంటి సన్నివేసాలు రావు కదా! అది emergency. అందుకని, అసలేమిటో చూద్దామని, మనమే వెళ్దామని, ఎందుకయినా మంచిదని, సర్వ సమర్థుడై వాహనం ఎక్కి వెళ్తాడు. వెళ్తే, అక్కడ ఉన్నటువంటి వాడికి అంతా శివమే. మార్కండేయుడు యముడిని చూస్తాడు. అప్పుడింకా గట్టిగా పట్టుకుని ఎక్కువగా శివ శివ శివ అన్నాడు, అట్లా ఉండదు. అట్లా ఉండడానికి వీల్లేదు అసలు. అంతటా శివుడిని దర్శనం చేసినప్పుడు యముడు కూడా శివుడుగానే దర్శనం కనిపిస్తాడు. ఏం సందేహం లేదు. పుణ్యాత్ములకు యముడు విష్ణుమూర్తిలాగా దర్శనం ఇస్తాడటండి. పాపాత్ములకు యముడు భయంకరంగా కనిపిస్తాడట. వీడిని బట్టి! అక్కడుండేది ఒకటే. అది ఒక విష్ణుస్వరూపమే. ఒక దిక్పాలకుడు ఆయన. మహాకారుణ్యమూర్తి, దాక్షిణ్యమూర్తి యముడు. దక్షిణంలో ఉంటాడు. సరే యముడి గురించి క్రిందటేడాది కూడా కొంచెం చెప్పుకున్నాం. యముడంటే భయం అక్కర్లేదు. If you are self-regulated and self-disciplined, the Lord Pluto is your friend. నీకు ఊళ్ళో పోలీసులని చూసి ఎందుకు భయపడతావు? దొంగ అయితే భయపడతావు కదా! Tax officer ని చూస్తే భయం ఎవరికి వస్తుంది? Black money ఉన్నవాడికి వస్తుంది భయం. లేకపోతే ఎందుకు వస్తుంది భయం? బొత్తిగా ఏ రూపాయి లేనివాడి దగ్గరకు నేను income tax officer ని అని వెళ్ళాడనుకోండి, అయితే ఏమిటి అనుకుంటాడు కదా! ఇంట్లో black money పెట్టుకుని కూర్చున్నవాడి ఇంటికి వెళ్ళాడనుకోండి income tax officer. ఆ పని మీద వెళ్ళలేదు, ఏదో పని మీద వెళ్ళాడు. వాడిని చూడగానే వీడికి చాలా వణుకు వచ్చేస్తుంది కదా! ఎందుకని? మన లోపల ఉండేటటువంటి ఒక లోటు వలన మనం బయట మనుషులని చూసినప్పుడు భయం వచ్చేస్తుంది. అంతే!

అంచేత, వచ్చినవాడు యముడు కాబట్టి మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కావలించుకున్నాడు ఇవన్నీ పురాణాల్లో సరదాగా చెప్తూ ఉంటారు. యోగపరంగా అట్లా చెప్పకూడదు. ఎంచేత అంటే, తపస్సు చేసినవాడికి సమస్తమూ దైవముగానే గోచరిస్తుంది. యముడు కూడా శివుడుగానే గోచరిస్తాడు. ఇట్లా ఒకడు వేరేగా వచ్చాడు, ఇలాంటివేవీ ఉండవు. కాకపోతే తన ప్రజ్ఞ శివప్రజ్ఞలో మిళితం అవ్వడం చేత, శివప్రజ్ఞ అక్కడున్నప్పుడు, యముడంతటి వాడు తాను ప్రత్యేకంగా ఒక పని మీద రావడం జరిగినప్పుడు, తాను దైవాన్ని మరిచి అక్కడుండేటటువంటి మార్కండేయుడిని చూస్తాడు. మార్కండేయ రూపంలో శివుడున్నాడని చూడడు. ఎంచేత? నిన్న చెప్పుకున్నాం కదా పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ! దానితో మనం ముడిపడి మనముంటేనే దర్శనం అవుతూ ఉంటుంది. అతడే నేను అనేటటువంటి ఒక ముడి ఉంటే, అంటే సాయుధ్య స్థితిలో ఉంటే దర్శనం అవుతూ ఉంటుంది. సాయుధ్య స్థితిలో లేక వేరేగా వచ్చేసాం అనుకోండి మనకా దర్శనం ఆగిపోతుంది. ఆ vision ఉండదు. అక్కడుండేటటువంటి special situation లో యముడికా vision లేక, పాశం వేస్తే ఆ పాశం వచ్చి కొట్టేస్తుంది. కొట్టేస్తే, మళ్ళీ పాశం వేస్తే మళ్ళీ వచ్చి కొట్టేస్తుంది. మళ్ళీ పాశం వేస్తాడు. బుద్ధి ఉండక్కర్లేదా అన్నట్టుగా ఉంటుంది శివుడికి. అంచేత, ఈసారి పాశం వేస్తే అలా ఒక శూలం వచ్చి యముడి కంఠం దగ్గర నిలబడేసరికి అప్పుడు తెలుస్తుంది. అమ్మో! boss ఉన్నారు ఇక్కడ అని. ఇక్కడున్నది శివుడు. ఇదేమిటి మనమేమీ

చూడలేకపోతిమి, ఇంత జ్ఞానము, ఇంత అనుభవమూ ఏమయిపోయిందా అని బాధపడతాడండి యముడు. అప్పుడొకసారి కళ్ళు తెరిచి చూస్తాడు యముడు. చూస్తే, శివుడే కనిపిస్తాడు. చూడండి ఎలా ఉందో? మార్కండేయుడికి యముడు శివుడిగా ఉన్నాడు. యముడికి శివుడు మార్కండేయుడుగా కనిపించాడు. Inversions ఎలా వచ్చేసాయో చూడండి. ఎలాంటి inversion అది? ఎవరికైనా inversion రావచ్చు. నిన్న చెప్పానుగా, నారదుడైన సరే inversion లో పడ్డాడని. మాయ కమ్ముతుందని చెప్పాను కదా!

అంచేత, inversion లో పడ్డ యముడు వెంటనే inversion reverse చేసుకున్నాడు. అదేమిటి అలా ఎలా పొరపాటు చేసామా అని వెంటనే చూస్తే, తన ప్రభువే అక్కడ ఉన్నాడు. సాష్టాంగ నమస్కారం చేసాడు. ఏమిటి స్వామీ, ఇది నాకు అర్థం కాలేదు అని. ఇలా నువ్వు ఉన్నావేంటి అని. అంటే అప్పుడు చెప్తాడు శివుడు, ఇతడు నా రూపం అయిపోయాడు. అతడి రూపంలో నేనే ఉంటున్నాను, నీకు ఏమయినా అభ్యంతరమా అని. మనకి తెలియలేదు గాని, అభ్యంతరం ఎందుకు ఉంటుంది? స్వామి ఎక్కడైనా ఎట్లాగయినా ఉండొచ్చు. ఇలా ఉందామనుకుంటున్నాడు అంటే వీలు లేదంటాడా? అనలేదు. మరి మనం పెట్టుకున్నటువంటి కొన్ని ధర్మాలు ఉన్నాయి కదా, దాన్ని అనుసరించే కదా స్వామీ నేనీ కార్యక్రమానికి పూనుకున్నాను. ఇప్పుడు మరేం చెయ్యాలి నేను అని అడుగుతాడు. ఇది ఇలా ఉంటే, మనం పెట్టుకున్నటువంటి నియతి, నియమములు, ధర్మములు, "*జాతస్య మరణ ధృవం*" ఇటువంటివన్నీ ఉన్నాయి కదా! పుట్టినటువంటి వాడు చచ్చిపోతాడు ఇవన్నీ ఉన్నాయి కదా! మరి వీటి సంగతేంటి, కొంచెం నాకు, question చెయ్యడం లేదు గాని, clarification అడిగాడు. ఎందుకంటే, యముడు పరమ శివ భక్తుడు, ఇంతా అంతా కాదు. అడిగితే, శివుడు అంటాడు ఒక్కటి గుర్తు పెట్టుకో, మాములుగా ఆమ్ ఆద్మీ ఉంటారుగా, సామాన్యులు, వారందరికీ ధర్మాలు అలా వర్తిస్తూ ఉంటాయి. కాని కొన్నికొన్ని చోట్ల విశేష ధర్మాలు ఉంటాయి. విశేషమైన సన్నివేశంలో విశేషమైన ధర్మం ఒకటి ఉండకపోతే అసలు ధర్మానికి అర్థమే ఉండదు అని చెప్తాడు శివుడు. భీష్ముడిని చంపి నిన్ను రక్షిస్తానంటూ కృష్ణుడు రథంమీంచి ఎగిరి, సుదర్శన చక్రాన్ని ఆహ్వానిస్తున్నప్పుడు ఒక మంచి పద్యం రాస్తారు భాగవతంలో. నన్ను నమ్మినవాడు, వీడిని రక్షించుకోవడం మహాధర్మం కాబట్టి నేను చక్రం పట్టుకున్నాను. చక్రం పట్టను, ఆయుధం పట్టను అన్నటువంటి కృష్ణుడు అర్జునుడి కోసం ఆయుధం పడతాడు కదా! అది మహాధర్మం. వాలిని చెట్టుచాటునుంచి సంహరిస్తాడు రాముడు. అది విశేష ధర్మం. అంటే, ధర్మాలు కొన్ని ఉండగా, అత్యవసర పరిస్థితుల్లో కొన్ని విశేష ధర్మాలు ఉంటాయి. అలాంటి విశేష ధర్మం ఒకటి ఇక్కడ ఉన్నది. అంటే, అప్పటికి ఆ కథలు ఇంకా జరగలేదు. మార్కండేయుడు కథ చాలా పాతది. రామాయణం తర్వాత వచ్చింది. కృష్ణ కథ మరీ తర్వాత వచ్చింది కదా! ఇదో విశేష ధర్మం ఒకటి వర్తిస్తూ ఉంటుంది గుర్తుపెట్టుకో అన్నాడు శివుడు. ఏమిటది అని అడుగుతాడు యముడు. అప్పుడు శివుడు చెప్తాడు, నా భక్తుడైనటువంటివాడు, అంటే నా భక్తుడేనా? దైవభక్తుడు. అంతేగాని, విష్ణు భక్తుడు కాదు, నా భక్తుడే అని చెప్పడు. ఈ వినాయకుడు, వీళ్ళెవరూ కాదు, నేనే, అట్లా ఉండదు. ఎందుకంటే, అంతర్యామి తత్త్వం అది.

అంతర్యామి తత్త్వమే ఒకొక్క రోజు ఒక్కొక్క రూపంలో ఒక్కొక్క పేరుతో భావన చేసుకుంటూ ఉంటాము. అలా లేకపోతే అది ఋషిమార్గంలో చేస్తున్నటువంటి పూజ కాదు. వీళ్ళంతా వేరువేరుగా ఉన్నారనుకుంటే నీకేం తెలియదని

అర్థం. ఒకడే ఉన్నాడు. వాడిని ఈ రోజు ఈ రూపంలో పూజ చేస్తున్నాను. ఒకడే ఉన్నాడు, వాడిని ఇంకో రోజు ఇంకో రూపంలో పూజ చేస్తున్నాను. పొద్దున్న గణపతిపూజ చేసాం, అంతా నువ్వే అన్నాము కదా! తర్వాత శివపూజ చేసాం, అంతా నువ్వే అన్నాం మళ్ళీ. అదేంటి, అబద్ధాలు ఆడుతున్నామా? కాదు. సత్యమే పలుకుతూ ఉంటాము. ఏమిటి? అక్కడ కాసేపు గణపతిగా చూస్తాం, కాసేపు శివుడిగా చూస్తాం, రేపు విష్ణువుగా చూస్తాం, ఏదో మనకి రకరకాల varieties. దాంట్లో ఒక రుచి ఉన్నది. వైవిధ్యంలో వల్ల రుచి కలుగుతుందని ఈ విధంగా పెట్టుకున్నారు తప్ప ఒకటే ఉన్నది అని చెప్పారు ఋషులు. మనం అదే గుర్తుపెట్టుకుని చెయ్యాలి ఆరాధనలన్నీ. అంచేత, దైవస్మరణ చేస్తున్నటువంటివాడు దానికి కూడా ఆ స్మరణలో, జీవన ప్రయోజనం ఒకటి నిర్వర్తించుకునే ఒక కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నవాడు... జీవించడానికి ఒక ప్రయోజనం ఉండాలి. ఏమిటి ప్రయోజనం? స్వప్రయోజనం కాదు. ముందు చెప్పానుగా, లోకహితార్థము, లోకోపకారము. "*లోకోపకారము ఇదమ్ శరీరమ్*" అన్నారు. ఎందుకిచ్చారు ఇది? ఏదో పదిమందికి మంచి చేసి పోవడానికి ఇచ్చారు. అలా జీవించడం ఒక ధ్యేయంగా పెట్టుకున్నటువంటి వాడికి, నన్ను స్మరిస్తూ ఉన్నవాడికి ఈ రోజునుంచి ఒక నియమం ఇస్తున్నాను, గుర్తుపెట్టుకో అన్నాడు శివుడు. చెప్పండి స్వామీ అన్నాడు యముడు. అప్పుడు శివుడు చెప్పాడు, ఇలా ఉన్నటువంటి వాడికి వాడి ప్రయోజనం నిర్వర్తింపబడేంతవరకూ నువ్వు వాడి జోలికి పోక. వాడికున్న ఉన్నతోన్నతమైన ఆశయం నెరవేరేవరకూ అతడి జోలికి నువ్వు పోక అని చెప్తాడు శివుడు.

రెండోది, ఇలా జీవించేవాడికి వాడి ప్రయోజనం వాడు నిర్వర్తించిన తర్వాత వాడికే ఇష్టం ఉండదు ఉండడానికి. చక్కని సంస్కారం కలిగినవాడికి వాడి ప్రయోజనం వాడు నిర్వర్తించిన తర్వాత వాడికే ఇష్టం ఉండదు ఉండడానికి. చక్కని సంస్కారం కలిగినవారు అవసరం లేనిచోట ఒక్క క్షణం ఉంటాడాండి? అవసరం లేనిచోట అట్లా ఊరుకునే కూర్చుని సోది కొడతాడా? ఎంచేత? అతడికి కాలమే దైవము. అప్రమత్తుడై తన పనులు తన చేసుకునేటటువంటి వాడు ఎక్కడా ఊరికే అలా ఉండదు కదండి! Over staying అనేటటువంటిది సంస్కారవంతుని దగ్గర ఉండదు. ఎప్పుడు ఎక్కడ ఎంత అవసరమో అప్పుడు అక్కడ అంత మాత్రమే ఉంటాడు. అందుకనే చెప్పారు ఋషుల గురించి, గోధోహన మాత్ర వేళ ఉంటారట వాళ్ళు ఒకచోట. అలా అంటే ఇప్పుడు తెలుగు, సంస్కృతం అన్నీ మర్చిపోయిన రోజులు కదా! గోధోహనం అంటే గోవు పాలు ఇచ్చేంతసేపు. గోవు పాలు ఇస్తున్నంతసేపు ఎంత ఉంటుందండి? ఏంచెప్తాం సమాధానం? ఏమయినా చూసామా పెట్టామా? Booth పాలు తప్ప, గోవు పాలు ఎక్కడ చూసామండి? చూడలేదు కదా! ఊరు బయటకి వెళ్ళాలి, పిల్లలికి చూపించాలి. లేకపోతే పాలు ఎక్కడినుంచి వస్తాయంటే booth నుంచి వస్తాయని చెప్తారు. అంతే కదా! పాలు ఇట్లా వస్తాయని చూపిస్తే, ఓహో! ఇలా వస్తాయి కదా అనుకుంటారు! ఏం తెలియదు మనవాళ్లకి. ఒక తిరగలి తెలియదు, ఒక రుబ్బురోలు తెలియదు, ఒక ఆవు పాలు పితకడం తెలియదు. మేకకి కూడా పాలు వస్తాయి, ఇలాంటివేవి తెలియదు కదా!

అంచేత, గోధోహన వేళ మాత్రం ఉంటారట ఋషులు. అంతకన్నా ఉండరట వాళ్ళు. వాళ్ళకి సమయం అంత విలువైనది. వాళ్లకి పనిలేని చోట ఎందుకుంటారు వాళ్ళు? ఉండరుగా! అంచేత, వాడి ప్రయోజనం నెరవేరడం అంటే ఎలా ఉంటుందో చెప్పానుగా, ప్రయోజనం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి, తాను దేహం వహించి నిర్వర్తించవలసిన

కర్తవ్యములన్నీ పరిపూర్ణంగా నిర్వర్తించడం. అది ఒకటి. రెండోది, తాను దేహం ధరించినవాడు కాబట్టి ఈ దేహం నుంచి తానుగా స్వచ్ఛందంగా బయటకి వెళ్ళే మార్గం తెలుసుకోవడం రెండు. ఇది అయ్యేంతవరకూ నువ్వు ఆగాలిసిందే అని చెప్పాడు శివుడు. అది మార్కండేయుడు లోకానికి చేసిన ఉపకారం. ఎవరయితే ఒక లోకోత్తరమైన కార్యం కోసం పని చేస్తూ ఉంటారో వారి కార్యం పూర్తి అయ్యేంతవరకూ... ఇప్పుడు మహాత్మాగాంధీ ఉన్నారు. 1947 ఆగష్టులో స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరిలో వెళ్ళిపోయాడు కదా! ఇంకా ఉన్నామనుకోండి, బరువే మిగతావాళ్ళకి. ఎందుకంటే, ఆయన కొన్ని సిద్ధాంతాలు స్వాతంత్ర్య సమరం వరకే valid. ఆ తర్వాత కూడా మనం proceed అయితే, ఎక్కువ దూరం వెళ్ళలేము. అప్పటికే, ఆ ఆరు నెలల్లోనే ఆ ముసలాయనతో ఎట్లాగా అని ఆలోచించడం మొదలు పెట్టారు మిగతా నాయకులు. అది గమనించే గాంధీగారు కూడా మనకెందుకువచ్చిన గోల, మనం కొంచెం దూరంగా ఉందామని, సబర్మతి ఆశ్రమంలో ఉండిపోయారాయన. ఇవన్నీ విజ్ఞత కలిగినవాళ్ళు తప్పుకుంటారు. మనకి ఇక్కడ ఏమాత్రం అవసరం లేదనుకోండి, మనం ఇక్కడ ఎందుకు ఉంటాం? ఎందుకు ఉన్నావు? చేతకాక ఉన్నావు. ఎట్లా వెళ్ళాలో తెలియక ఉన్నావు. అందుకని, అది తెలుసుకోవడం కూడా ఒక ప్రయోజనం. ఈ రెండూ ప్రయోజనాలు నెరవేరిచే వరకూ దైవభక్తులని... దైవభక్తులై ఉండాలి, ఒకటి. రెండవది, ఒక దివ్యప్రయోజనం కోసం జీవిస్తూ ఉండాలి. మూడవది, తాను నిర్గమించే మార్గం కోసం ప్రయతిస్తూ ఉండాలి. ఈ మూడు ప్రయత్నాలు సాగుతున్నంతసేపూ నువ్వు ముట్టుకోడానికి వీలులేదు, ఇది నీకు నేను rules కి ఒక exception కింద పెడుతున్నాను అని శివుడు చెప్తాడు. ఈ exception ని నువ్వు జాగ్రత్తగా follow అయిపో అన్నాడు శివుడు.

ఆ మొత్తం చెప్పబడినటువంటి విషయాన్నే ఒక చక్కగా మంత్రంగా ఇచ్చి, మనకి మార్కండేయ మహర్షి ద్వారా వచ్చిందని చెప్తారు. ఏమిటది? దోసతీగ నుండి పుట్టినటువంటి దోసపండు, ఆ దోసపండు బాగా పండి... మనం దాన్ని పీకక్కర్లేదు. ఎంత పండాలంటే... మనం తొందర కదా, పప్పు చేసుకోవాలి కాబట్టి పీకేస్తాం! తీగకి అట్లాగే ఉంటుంది అది, నువ్వు ఇట్లా చెయ్యి పెడితే, ఇట్లా చేతిలోకి వచ్చేస్తుంది, ఏ పండు అయినా. దోసపండు ఒక ఉదాహరణగా చెప్తారు. అది ఏ పండు అయినా అంతే, దోసపండే కాదు. అది మామిడిపండు అయినా అంతే. బాగా పండిపోతే అదే రాలిపోతుంది. బాగా పండితే ఆకు కూడా రాలిపోతుంది కదా! ఎందుకనో మరి, మార్కండేయుడుకి దోసపండు ప్రీతో ఏమిటో మనకి తెలియదు! అంచేత, దోసపండు చెప్పారు. కాకపోతే అందరూ మామిడిపండే చెప్తారు. మనం దోసపండు చెప్దామని అనుకున్నాడో. మా గురువుగారికి కాకరకాయ ఇష్టం. ఆయనే అయితే కాకరకాయ చెప్పేవారేమో! అదయినా రాలిపోతుంది. పండిన తర్వాత తీగకి అంటి పెట్టుకుని పండు ఉండదు కదా! అలా దోసతీగ నుండి, ఒక తీగనుండి పండిన పండు ఏ విధంగా రాలిపోతుందో, ఏ విధంగా తనంతట తాను స్వచ్ఛందంగా విడిపోతుందో తీగనుంచి, ఆలా విడిపోయేంతవరకూ నన్ను శరీరంలో ఉంచు అని మనం చేస్తున్నాం ఆ మంత్రం ద్వారా ప్రార్థన. "*మృత్యోర్ముక్షీయ*" మృత్యువు నుంచి విడదీసి, "*మా అమృతాత్*" నన్ను అమృతత్వంలోకి ప్రవేశింపచెయ్యి. మృత్యువు నుంచి విడదీసి మమల్ని అమృతత్వంలోకి నడిపించు అని కోరే మంత్రం అది. అది ఎలాగా అంటే, దోసపండు ఏ విధంగా దోసతీగ నుంచి పూర్తిగా పండినప్పటికీ దాన్ని అంటీ అంటనట్టుగా ఉంటుంది గాని, అంటి ఉండదు దానికి. అలా ముట్టుకోగానే చేతిలోకి వచ్చేస్తుంది. అదీ "*ఉర్వారుక మివ*"

అంటే బాగా పండిన దోసపండులాగా అనడానికి. "*ఉర్వారుక మివబంధనాన్*" అంటే దోసపండుకి బంధం ఉందా తీగతో? లేదు. తీగకి బంధం ఉందా దోసపండుతో? లేదు. దోసపండు జీవుడు. తీగ శరీరం. ఈ శరీరంలోంచే కదా ఆ పండు వచ్చింది? అందులోంచి అది బయటకు దానంతట అది స్వచ్ఛందంగా వచ్చేంతవరకూ అని చెప్పడానికి "*ఉర్వారుక మివబంధనాన్*". ఆ విధంగా "*మృత్యోర్ముక్షీయ*" ఆ ముడి మాత్రం తీసెయ్యి. దేహంతో మనకున్న ముడి విడిపోవాలి. ముడి తీసేస్తే దాంట్లో కూర్చుంటే తప్పేముంది? ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లిపోవచ్చు. అదీ యోగం. ముడి విప్పుకుని అందులోనే కూర్చుంటాడండి. పనులన్నీ చూస్తుంటాడండి. పనులన్నీ అయిపోతే వెళ్ళిపోతాడండి, ముడి లేదుగా.

పనులు అయిపోయిన తర్వాత వెళ్ళలేని వాళ్ళు చాలామంది ఉంటారు. మంచి పనులు చేస్తూ, వెళ్ళలేక, వెళ్ళలేక, వెళ్ళిపోయిన వాళ్ళుంటారు. వెళ్ళలేక వెళ్ళలేక వెళ్తున్నా అని ఉంటుంది కదా! అలా వెళ్ళలేక వెళ్ళవలసిన దరిద్రం ఏం ఉంది? అది చెప్పేది యోగం. అందుకనే, శ్రీకృష్ణుడు చెప్తాడు అర్జునుడికి, "*యోగీభవ అర్జునా*" అంటాడు. నువ్వు తపస్సు చెయ్యి, "*తపస్విభ్యో మునిభ్యో జ్ఞానిభ్యో*", ఈ వీళ్ళందరికన్నా  యోగే గొప్పవాడు, నువ్వు యోగివి అవ్వు అని చెప్తాడు. అంటే ఏమిటి? నువ్వు తపస్సు చేసినా, ఈ ఫలం నీకు దక్కాలి. అప్పుడు నువ్వు యోగివి. ఆ ఫలం నీకెలా దక్కింది? నువ్వు చేస్తున్న స్మరణ వల్ల, అనన్య చింతన వల్ల దక్కింది. యోగవిద్య కారణ విద్య అన్నారు. అంటే ఈ విధంగా నీకు దేహం నుంచి తరింపు ఇస్తుంది, లోకం నుంచి తరింపు ఇస్తుంది. అందుకనే, ఏదయినా విద్యంటూ నేర్చుకుందామంటే, time waste చేసుకోకుండా ముందు కారణ విద్య నేర్చుకోమన్నారు. కారణ విద్యని యోగవిద్య అంటారు. యోగం అంటే దైవంతో యోగం చెందడం వలన ఈ ముడి క్రమంగా విడిపోతుంది. అలా విడదీసుకుని అక్కడే ఉంటాడు. ఎప్పుడు జరగాలట ఇదంతా? "*ఓం త్రయంబకం*" అంటే మూడు కన్నులు కలవాడా, "*యజామహే*" అంటే నిన్ను భజన చేస్తున్నాను, ఆరాధన చేస్తున్నాను, నిన్ను గూర్చి తపస్సు చేస్తున్నాము అని. మన మంత్రాలన్నీ collective prayers. Individual prayer ఏం లేదు అసలు. గాయత్రి అయినా అంటే. "*ధియః యోనః ప్రచోదయాత్*" అంటే మా బుద్ధులని ప్రేరేపించమని. ఇట్లా ఇంట్లో కూర్చుని, దోసల్లో వేలుపెట్టి, గొణుక్కోవడం కాదు గాయత్రి. "గాయతే ఇతి త్రాయతి". గానం అంటే గొణుక్కుంటావా? గానం చెయ్యాలి. "*ధియః యోనః ప్రచోదయాత్*" అంటే పదిమందితో కలిసి చెయ్యాలి గానం. గాయత్రి గానం ఉంది, గాయత్రి జపం ఉంది, గాయత్రి ధ్యానం ఉంది. అంచేత, కలిసి చేసుకునే మంత్రం. మా బుద్ధులంటే? మనమంతా కలిసి చేసుకుంటాం కదా! అందరి బుద్ధులు ప్రచోదనం చెయ్యి, నాకేం కొంచెం extra అక్కర్లేదని అడగడం. నాకని extra ఉంటే నీకు రోగం ఉన్నట్టే. అందరికీ చెయ్యి, నాకు కొంచెం extra, మరి నా సంగతి కొంచెం చూడు అన్నట్టుగా ఉండకూడదు. నిజమైన సంస్కారవంతుడు అందరికీ చేసిన తర్వాత నాకు చెయ్యి అంటాడు. అలా అడిగే వాడినే ముందు చూస్తాడు. అంతా reverse లో ఉంటాయండి. అందరి సంగతీ చూసేవాడి సంగతి ముందు చూస్తాడు దేవుడు. తన సంగతి తన చూసుకునే వాడిని అసలు చూడనే చూడడు కదా!

అంచేత, "*యజామహే సుగంధిం పుష్టివర్ధనం*" అంటే శరీరంలో బాగా పుష్టి. పుష్టి రావడం అంటే లోటు లేకపోవడమే పుష్టి రావడం. నాకు ఇది లేదు అనే భావన లేకుండా పరిపూర్ణమైనటువంటి సంతుష్టితో జీవిస్తున్నటువంటి స్థితికి రావాలి. ముందు అదీ! "పుష్టి వర్ధనం" అంటే బాగా పుష్టి పెంచు. నాకు లేనిదంటూ ఉండకూడదు. అంటే నాకు

ఇహా కోరికల దరిద్రం ఉండకూడదు. అంత పరితృప్తుడై పోవాలి. "సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు, సంతోషికి ఎప్పుడూ కలుగు శుభము, సంతోషి కాకుండ సంసార హేతువు" అంటాడు వామనుడు. అడగరా ఏదయినా ఇస్తాను అంటే బలి, ఎందుకు అడగాలయ్యా, నాకేం అక్కర్లేదు అంటాడు. ఏమీ అక్కర్లేని వాడు రాజుకన్నా గొప్పవాడు కదా! ఏదయినా కావాలంటే కదా రాజుగారు కావాలి! ఏమీ అక్కర్లేని వాడికి రాజుగారేందుకు? అలా వామనుడికి ఏమీ అవసరం లేదు. అలా కాదు అడగమంటాడు బలి. లేదు, నాకేం అక్కర్లేదు, హాయిగా ఉన్నాను కదా, నాకేం అక్కర్లేదు అంటాడు. చివరికి బలి చక్రవర్తి బాబు, బాబు అడగవా అని అడిగేటట్టు చేస్తాడు కదా వామనుడు! ఇదంతా psychology మళ్ళీ కదా! ఇప్పుడు psychology అంటున్నాము, అప్పుడు common sense అనేవారు. అంచేత, ఆ విధమైనటువంటి పరితృప్తి కలగాలి నాకు. ఎదో సరిపెట్టుకోవడం అక్కర్లేదు నాకు. పరిపుష్టి కావాలి. అది ఎలా ఉండాలంటే సుగంధములు వ్యాప్తి చెందేటట్టుగా ఉండాలటండి జీవితం. అంటే ఆయన చూస్తే బావుండును, ఆయన మాట్లాడితే వింటే బావుటుంది, ఆయన ఏం చేసినా బావుంటుంది, ఇట్లా తయారు చేసై నన్ను. చూడండి ఎంత ఉందో? "*సుగంధిం పుష్టి వర్ధనం, ఉర్వారుక మివబంధనాన్ మృత్యోర్ముక్షీయ మామృతాత్*" అనేటటువంటిది అప్పటినుంచి మృత్యువును జయించే మంత్రంగా మనకి ఇచ్చారు. అది ఊరికే మనం నమిలేస్తే, నువిలేస్తే అవ్వదు. ఇందాక చెప్పినవన్నీ చెయ్యాలి. మనకి భయం వచ్చినప్పుడల్లా మృతుంజయ మంత్రం అనుకుంటూ ఉంటాం కదా! కాస్త ఒంట్లో బావుండకపోతే మృత్యుంజయ మంత్రం అంటాం కదా! చేసుకో మంచిదే. కానీ సమస్తమునందు లోపలా బయటా ఆరాధన శివుడిని దర్శనం చేస్తూ నువ్వు చేసుకున్నావనుకో, అప్పుడు నిన్ను యముడు ముట్టుకోడు. ఎందుకంటే నీకు ఒక ప్రయోజనం ఉంది, ఒకటి. రెండు, నీకుగా నువ్వు స్వచ్ఛందంగా వచ్చేద్దామనుకుంటున్నావు, ఇంక నీకు మరణం ఎందుకు? చంపడమేందుకు? తనంతట తానే వచ్చి report చేస్తానంటే వాడిని లాక్కెళ్ళడమెందుకు?

పని అయిపోయిన తర్వాత నేనే వచ్చేస్తానంటే పులి అంతటిది వదిలేసింది పులీ–ఆవు కథలో కదా! పులి నోట పడ్డదండి ఆవు. ఆవు అంది సంతోషం, నీకూ ఆహారం కావాలి కదా మరి. నా ఆహరం కోసం నేను అడవికి వచ్చాను. ఎదో గడ్డి తింటున్నాను. నీ ఆహారం కోసం నన్ను తినడానికి వచ్చావు. సంతోషం, నీకు తప్పకుండా ఆహార్యం అవ్వాలి నేను. గోవు కాబట్టి అలా మాట్లాడింది. మనమయితే ఇంకోటేదో మాట్లాడుతాం. కానీ ఇంకోటి ఆహారం కావలసినది ఇంట్లో ఒకటుంది, నా దూడ. నాలో పడ్డ ఈ పాలు నీకు అక్కర్లేదు కదా! నువ్వు పాలు తాగవు కదా! పులి ఆవు పాలు తాగదు. మనమే పాలు తాగట్లేదు! అంచేత, పాలు దానికిచ్చేసి, దానికి ఆహారం ఇచ్చేసి, నేను నీకు ఆహారంగా వచ్చేస్తాను అన్న అవుని పులే చంపలేదండి. చంపిందా? చిన్నప్పుడే చెప్పారు ఈ కథలన్నీ. మరి వీట్లో ఎంత తత్త్వం ఉందండి!

స్వచ్ఛందంగా తాను ఒక ధర్మానికి లోబడేటటువంటివాడిని యముడేం చెయ్యడు. యముడు పేరే యమధర్మరాజు కదండి. ధర్మాలన్నీ ఒక నియమం ప్రకారం నిర్వర్తిస్తున్నవాడిని యమధర్మరాజు ఏం చెయ్యడు. ధర్మం తప్పినవాళ్ళకే శిక్ష. అంచేత, నీకు ఈ విధంగా ప్రవర్తిస్తున్న వాళ్లున్నారే, వీళ్ళని కొంచెం special category గా పెట్టుకోమని చెప్తాడు శివుడు యమధర్మరాజుకి. ఊళ్ళో traffic signals అవీ మాములుగా automatic గా, electronic గా పడిపోతూ ఉంటాయి కదా! Prime minister దిగాడు ఊళ్ళో. ఆయన బయలుదేరి వస్తుంటే ఆయనకి

కూడా traffic signals వేస్తారా? వెయ్యరు కదా! ఎందుకు వెయ్యరు? ఆయన యొక్క ప్రాముఖ్యత అలాంటిది కాబట్టి. ముందొకడు బుయ్యమని horn కొట్టుకుంటూ వెళ్తే, వెనక speed గా ఇవి పడుతూ ఉంటాయి. ఎరుపు వస్తుంటుంది. ఆకుపచ్చ వస్తుంటుంది, orange వస్తుంటుంది. అవి ఏం అనుకోవాలి? ఇదేంటి మన్ని పట్టించుకోవట్లేదు అనుకుంటుంది కాసేపు! అంచేత, ప్రత్యేక సన్నివేశాలు గుర్తుపెట్టుకో అన్నాడు శివుడు యమధర్మరాజుతో. అలాంటి వాడు వీడు. తన కోసం లోపల ఎక్కడ వెదికి చూసినా లేదు, తల్లిదండ్రుల కోసం అది. కాబట్టి నువ్వు ఇతడిని ముట్టుకోడానికి వీలులేదు. ఇది ఎప్పటికీ ఒక శాసనంగా నువ్వు తీసుకో అని చెప్తాడు శివుడు. అది మలుపు సృష్టి కథలో. అంటే, మరణం విషయంలో ఒక మలుపు ఇచ్చారు, ఒక exception ఇచ్చారు. మనకి కూడా బాగా rules strict గా ఉండి, కఠినంగా ఉండి బాధ పెడుతూ ఉంటే, మనం representation చేస్తూ ఉంటాం ప్రభుత్వానికి. మహాప్రభో! ఆ rule మమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టేస్తోంది అంటే, వాడు amendment చేసి, ఒక exception క్రింద పడేస్తాడు. Not withstanding the above అంటూ ఒకటి ఇచ్చేస్తాడు.

ఇలా exception మొత్తం మానవజాతికి పట్టుకొచ్చినటువంటి వాడు మార్కండేయుడు. అంచేత, మార్కండేయుడు మనకి ఆరాధ్యనియ్యుడయ్యాడు. అప్పటినుంచి ఇప్పటివరకూ ఉన్నాడు. ఉన్నాడంటే ఆ శరీరంలోనే ఉంటాడా? ఉండడు. అది తెలియాలి. చిరంజీవి అయి ఉన్నాట్ట అంటే తానెవరో తానెరిగి, చొక్కాలు మార్చినట్టు దేహాలు మార్చుకుంటూ ఉంటాడు. ఆ దేహంలో ఆ తల్లిదండ్రులకి పరిపూర్ణంగా సేవ చేసి, వారికి ఉత్తమగతులు కల్పించిన తర్వాత కొన్నాళ్ళు ఉండి మరి కొంత తపస్సు చేస్తాడు. ఈసారి ఏం చేస్తాడంటే తపస్సు, అసలు ఈ సృష్టి మాయ అంటే ఏమిటి? పెద్దపెద్దవాళ్ళే మాయలో పడిపోయారు కదా! అంచేత, ఈ మాయా స్వరూపం నాకు దర్శనం కావాలని మళ్ళీ తపస్సు చేస్తాడు. అది రేపు చేస్తాడు. ఇవ్వాళ్ళింక మరి మనకి ప్రార్థన సమయం. ఆయన పొద్దున్న తపస్సులోకి పంపించి మనం బయటకొచ్చేసాము. ఇప్పుడు మళ్ళీ ఇంకో తపస్సులోకి పంపించేసి, మళ్ళీ మనం బయటకొచ్చి బుద్ధిగా ప్రార్థన చేసుకుందాం. రేపు మార్కండేయుడు నుంచి వచ్చినటువంటి మిగతా విషయాలు కొన్ని చెప్తాను. బాగా చదువుకుందామంటే మహాభారతంలో అరణ్యపర్వంలో మార్కండేయ మహర్షి ధర్మరాజుకి ఎన్నో సందేహాలు తీరుస్తాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు వచ్చి మార్కండేయుడికి చెప్తాడు, ఈ విషయం బాగా చెప్పు అని. Direction ఇచ్చి వెళ్ళిపోతాడు కృష్ణుడు. ఈ కృష్ణుడినే నేను ఇదివరకూ చూసానని మార్కండేయుడు చెప్తాడు. ఏది? ఇప్పుడు కాదు. కొన్ని వందల వేల యుగాల క్రితం ఈ కృష్ణుడిని చూసాను, మళ్ళీ ఇప్పుడు కనిపించాడు నాకు అని. అంటే కృష్ణుడు dimension ఎంతటిదండి? ఎప్పటి వాడు కృష్ణుడు? ఎప్పటి కృష్ణుడు? అలాంటివి కొన్ని ఉన్నాయి. అవి రేపు చెప్పుకుందాం.

--- స్వస్తి

# మార్కండేయ ఉపాఖ్యానము

## July 13, 2014 ఉదయం – ప్రవచనం #5

సోదరబృందానికి హృదయపూర్వకమైనటువంటి నమస్కారములు. గురుపూర్ణిమా సందర్భంగా భాగ్యనగరంలో ఏర్పరుచుకున్నటువంటి ఈ గురుపూజా మహోత్సవములలో యోగపరమైన విషయములను మనం ప్రస్తావన చేసుకుంటూ ఉన్నాము. అందులో భాగంగా మార్కండేయ మహర్షి యొక్క దివ్య చరితము వివరించుకుంటూ ఉన్నాం. యోగాపరమైన దృష్టితో మహాత్ముల కథలు, ఇతిహాసములు, పురాణములు, భగవద్గీత, ఉపనిషత్తులు, మనం అధ్యయనం చేస్తూ ఉంటే ఒక దర్శన జ్ఞానం ఒకటి లభిస్తూ ఉంటుంది. శాస్త్ర అధ్యయనం మాత్రమే చేస్తుంటే శాస్త్ర జ్ఞానం కలుగుతుంది తప్ప దర్శన జ్ఞానం కలగదు. శాస్త్ర జ్ఞానం అంతా కూడా మనకి పరోక్షంగా కనిపిస్తూ ఉంటుంది. యోగ దృష్టితో, భక్తి దృష్టితో మనం అవే గ్రంథములను అధ్యయనం చేస్తూ ఉంటే గ్రంథముల యందు చెప్పబడిన విషయముల ఆధారంగా మనకి దర్శనం కలుగుతూ ఉంటుంది. అందుచేత అది దర్శన జ్ఞానం అవుతుంది. దర్శన జ్ఞానం వేరు, అధ్యయన జ్ఞానం వేరు. ఎంత అధ్యయనం చేసినా అధ్యయనం మనసుతో చేస్తాడు గానీ మరొక విధమైన పనిముట్టు లేదు మనిషికి. యోగపరమైనటువంటి దృక్పథంతో మనం యోగసాధన చేసుకుంటూ అధ్యయనం చేసినట్టయితే మనసుకి మూలమైనటువంటి బుద్ధి, ఆత్మ గ్రంథస్తమైన విషయమందు అనురక్తి చెంది, గ్రంథము దర్శనం ఇస్తుంది. దర్శనం ఇచ్చి, ఉన్న కథలోంచి లోతైన కథలు చూపిస్తూ ఉంటుంది. అంచేత, గ్రంథము ఆధారంగా అధ్యయనం చేసేటటువంటి విద్యార్థి, అతని యందు ఉన్నటువంటి సంస్కారముల యందు పరిపక్వతను బట్టి గ్రంథములోని విషయములు గోచరిస్తూ ఉంటాయి. అంచేత, అధ్యయనం కూడా ఒక ధ్యానంలా నడుస్తూ ఉంటుంది. దినచర్య అంతా ఒక ధ్యానంగా నడుస్తూ ఉంటుంది. ఎంచేత అంటే, దినచర్య నిండా గుర్తిస్తున్నది ఒకడినే. ప్రార్థన యందు గుర్తుస్తున్నది ఒకే తత్వాన్ని. ఒకే తత్వాన్ని దినచర్య యందు, అదే తత్వాన్ని అంతరంగమందు దర్శిస్తూ ఉండడమనేటటువంటిది ఒక నిత్యమగు యోగసాధన అది. ఇందులో భక్తి ప్రధానంగా ఉంటుంది. యోగం జరుగుతూ ఉంటుంది. అంటే, అనుసంధానం జరుగుతూ ఉంటుంది. ప్రార్థన అంటే సంధాన ప్రక్రియే.

మనలోని ఈశ్వరుడితో మనం అనుసంధానం చెందుతూ ఉంటే క్రమంగా ఈశ్వరుడే మనంగా ఉన్నామని తెలుస్తూ ఉంటుంది. అదే ఈశ్వరుడు ఇందరి రూపాల్లో కూడా ఉపస్థితుడై ఉన్నాడు. గుణములకి అవతల మనమందరమూ ఈశ్వరులమే. గుణములకి ఈవల మనమంతా జీవులము. ఇంతే తేడా! అంతా మంచి నీరే. ఆ మంచి నీరు ఎవరెవరి refrigerator లో వారి వారి ice ముక్కలుగా తయారుచేసుకుంటే, బోల్డు ice ముక్కలు వస్తూ ఉంటాయి కదా! మనం ఎన్ని రకాలుగా designs పెట్టుకుంటే మనసులో అన్ని రకాలుగా, designs గా మనకి జీవితం గోచరిస్తూ ఉంటుంది కదా! ఆలాగే మనం ice తయారుచేసేటటువంటి, మంచు తయారుచేసేటటువంటి పళ్ళెం design బట్టి ice ముక్కలు వస్తాయి కదా! గుండ్రంగాను వస్తాయి, నలుపలకలుగాను వస్తాయి, పొడుగ్గాను వస్తాయి. ఎలా కావాలంటే అలా ice

తయారవుతుంది. ఎందుచేత? అది నీరే కాబట్టి. అంతకుముందు దానికి రూపం లేదు. అంచేత, మనసు ఈ విధంగా ప్రతిదాని వైవిధ్యాన్ని పట్టుకొచ్చి, ఆ వైవిధ్యంలో అనుభూతిని మనకిస్తుంది. అనుభూతి ఇవ్వడమే కాకుండా దాంట్లో ఉండే అపాయమేమిటంటే వేర్పాటు ఒకటి ఉంటుంది. దీనికన్నా అది వేరు అనేటటువంటిది. స్వ, పర బేధం ఏర్పడుతుంది. తర తమ బేధం ఏర్పడుతుంది. ఈ బేధము మనసులో ఉన్నంతసేపూ ఉంటుంది. అంచేత, మనసుతో మనం గ్రంథము చదివామనుకోండి. గ్రంథం మనసుతో చదివితే, విడివిడి ముక్కలుగా కనిపిస్తూ ఉంటాయి అన్నీ. దేనికీ దేనికీ పొంతన ఉన్నట్టుగా ఉండదు. ఏ కథ ఆ కథ వేరుగా ఉంటుంది. కాని ఎన్ని కథలు చెప్పినా ఒకటే కథ చెప్తూ ఉంటారు. పురాణాల్లోగాని, భగవద్గీతలోగాని, భాగవతంలోగాని, రామాయణంలోగాని ఒకటే కథ. ఒకే తత్త్వము ఎన్ని రకాలుగా దిగి ఏ విధంగా నిర్వర్తింపబడుతోంది, అందులో జీవుడు ఏ విధంగా ఈ వివిధత్వంలో ఉండే ఏకత్వంతో అనుసంధానం చెంది, ఆ ఏకత్వాన్ని తన యందు, తన పరిసరముల యందు అఖండంగా అనుభూతి చెందుతూ, అమితానందంతో, ఇంత ఘర్షణలతో కనబడుతున్న సృష్టి యందు, ఏ ఘర్షణా లేకుండా జీవించడమనే ఒక స్థితిలోకి తాను రావచ్చు. అలా రావడమే వైకుంఠపాళిలో పడడమనేటువంటిది. వైకుంఠపాళిలో పడడం అంటే ఆ పైకెళ్ళి కూర్చుంటే ఇంక పని లేదనుకుంటాం. కాదు. అలా పైకెళ్ళినవాడు మళ్ళీ లోపల ఇన్ని గళ్లలోనూ తిరుగుతున్నా, వాడికి అంతకుముందు ఉండే పాములూ ఉండవు, నిచ్చెనలూ ఉండవు, మిగతా రాక్షసులూ ఉండరు, దేవతలూ ఉండరు, ఎవరూ ఉండరు. అందరూ ఉంటారు గాని ఇది వరకటిలా ఉండదు. దృక్పథం మారిపోతుంది. అంచేత, బాగా అనుసంధానం చేసుకోవడం ముఖ్యం.

సంధానం అంటూ ముందు జరిగితే ఆ తర్వాత అనుసంధానం జరుగుతుంది. పదములు మనం వాడుతూ ఉంటాంగాని, వాటిని చక్కగా పరిశీలించి చూస్తే సంధానమే లేనప్పుడు అనుసంధానం ఉండదు. సంధానం అంటే నేను జీవుడను, నా యందు ఈశ్వరుడు ఉన్నాడు. నేను ఈశ్వరుడితో సంధానం చెందుతాను. అలా నిజంగా సంధానం జరిగితే అదే ఈశ్వరుడు అందరిలో ఆ విధంగా ఉన్నాడు అని తెలుస్తుంది. ఈ తెలియడం ప్రతిక్షణం మనకుందనుకోండి, దాన్ని అనుసంధానం అంటారు. ఆ "అను" అన్న పదంలో చాలా విపరీతమైనటువంటి భావన ఉన్నది. విపరీతమంటే గంభీరమైన భావన. "అను" అంటే continous అని అర్థం. అంచేత, అనుసంధానం అంటే దేన్ని చూసినా అందులో మూలాన్ని చూసే ప్రయత్నం సాగుతూ ఉండాలి. అలా సాగకపోతే, ఎదో కొన్నికొన్నిచోట్ల కనిపిస్తుంది, కొన్నికొన్నిచోట్ల కనిపించదు. కనిపించకపోవడం నీవల్ల తప్ప అక్కడ అదే ఉంది. వేరే ఏమీ లేదు. కానీ నువ్వు మనసు నుంచి చూస్తే వేరుగా కనిపిస్తుంది. దానిపై కక్ష్యలోంచి చూస్తే వేరుగా కనిపిస్తుంది. ఇన్ని మంచుగడ్డలూ ఒకే నీరు నుంచి వచ్చాయి అనుకుంటే, అది గుర్తు ఉంటే, ఇది మంచి నీరే ఇలా తయారయ్యింది అని గుర్తు ఉంటుంది. చూడండి మనవాళ్ళు పంచదార పాకం నుంచి అనేకానేకమైనటువంటి బొమ్మలు తయారు చేసి, వాటికి రంగులు పూసి, వాటిని చక్కగా మనకి పళ్ళాల్లో పెట్టి, ఈ ఉత్సవాలు చేసుకున్నప్పుడు, పండగలు చేసుకున్నప్పుడు, లేకపోతే పెళ్ళిళ్ళు చేసుకున్నప్పుడు, రకరకాల బొమ్మలు తయారు చెయ్యరూ? పంచదార చిలుకలంటావు, తినేస్తావు కదా! మామూలు చిలకలు తినలేవు కదా! ఇట్లా చిలకలు చేస్తారు, మనుషులు చేస్తారు. మనుషులని కూడా తినేస్తాం కదా! ఎందుకని? మూలవస్తువు ఒకటే కాబట్టి. అలా మూలవస్తువు ఒకటని తెలుస్తున్నకొద్దీ మనస్సు బుద్ధిలోకి కరిగిపోతూ ఉంటుంది. మూలవస్తువు ఒకటే అని తెలియనప్పుడు

అన్ని విషయముల యందు స్థిరమైన భావములు కలిగి ఉంటాము. నేననుకున్నదే, ఇదే correct, ఇంక మిగతా వాళ్ళందరూ తప్పు అనిపిస్తూ ఉంటుంది. అందరూ అట్లాగే మాట్లాడతాము కదా! ఇదే correct, మిగతాదంతా పెద్ద correct కాదు అంటాం. ప్రతివాడికి వాడనుకున్నటువంటిది correct. అట్లా అందరికీ వాళ్ళకున్నటువంటి బోల్డు right లు ఉంటాయి. ఇన్ని right లు ఉండవు కదా! ఒకటే right ఉంటుంది. చాలా సత్యాలు ఉన్నాయట అంటే అది అబద్ధం అని చెప్పారు. ఒకటే సత్యం ఇన్ని రకాలుగా ఉంది. అది తెలియడానికి అనుసంధానం.

ఒకటే రకరకాలుగా ఏర్పడితే, మంచుగడ్డ నీరయితే మంచుగడ్డ చచ్చిపోయిందా? అంతకుముందున్న స్థితిలోకి వెళ్ళిపోయింది అది. నీరు ఆవిరి అయితే నీరు చచ్చిపోయిందా? ఆవిరి క్రమంగా వాయువుగా మారిపోయి ఆకాశాన్ని చేరితే? ఇవన్నీ ఏమిటి? స్థితి బేధాలు. ఈ స్థితి బేధంలో ఒక లోకంనుంచి ఇంకో లోకం వెళ్ళినప్పుడు, ఆ లోకంలో ఉండకపోవడం వల్ల, నీవు లేవు అనేటటువంటి ఒక భావన ఇతరులకి కలుగుతూ ఉంటుంది. ఆయన లేడండి అంటూ ఉంటాం కదా! భగవద్గీతలో ఉన్నవాళ్ళు ఎప్పుడూ ఎక్కడికీ పోరు, ఉంటారు ఎప్పుడూ అని శ్రీకృష్ణుడు చెప్తాడు. ఉన్నవాళ్ళు అందరూ ఎప్పుడూ ఉంటారు. ఒక్కొక్కసారి ఒక్కొక్క లోకంలో ఉంటూ ఉంటారు. ఇప్పుడు మనం లేరని భావించే వాళ్ళంతా ఇంకో లోకంలో ఉన్నారు. మనం ఎవరయితే లేరని భావిస్తూ ఉంటామో వారంతా ఇంకో లోకంలో ఉన్నారు. జీవులు లోకాలు మారుతూ ఉంటారు తప్ప, ఏది సత్యలోకం నుంచి భూలోకం వరకూ, ఇంకా అధోలోకాల్లోకి కూడా జీవులు వ్యాప్తి చెంది ఉంటారు, వారివారికుండేటటువంటి ప్రజ్ఞ యొక్క పరిణామం బట్టి. అంచేత, ఎవరూ లేరనుకోవడానికి లేదు. అందరూ ఉన్నారు. అందుకని, ఎవ్వరూ పోరు, అందరూ ఉంటారు. ఉన్నవారు పోరు, లేనివారు రారు అంటాడు రెండో అధ్యాయంలో. ఇట్లా మొట్టమొదటే అంతంత పెద్ద విషయాలు చెప్తే మనకి అర్థం కాక, ఎవరూ రెండో అధ్యాయం చదువుకోరు భగవద్గీతలో. పైగా చాల సుదీర్ఘమైనటువంటి అధ్యాయం. చిట్టచివర అధ్యాయం అంత ఉంటుంది, డబ్బైరెండు శ్లోకాలు ఉంటాయి. ఎందుకొచ్చింది, మనకి అర్థమయ్యేదా పెట్టేదా అని మూడో అధ్యాయం నుంచి మొదలు పెడుతూ ఉంటారు. ఎందుకంటే, మూడో అధ్యాయమే కీలకం మనిషికి. తన కోసం బతికేవాడు తన కోసం కాక పదిమంది కోసం బతకడం అనేటటువంటిది మూడో అధ్యాయం. పదిమంది కోసం అనేటటువంటిది జరుగుతూ ఉంటే తన నుంచి విపరీతంగా అనేకానేకమైనటువంటి యజ్ఞములు నిర్వర్తింపబడడం నాలుగొవ అధ్యాయం. అంటే, తన శరీరం ఇతరులకి ఉపయోగపడేటట్టుగా చూడడం. తన ఇంద్రియములు ఇతరులకి ఉపయోగపడేటట్టుగా చూడడం. తన మనస్సు, భావములు ఇతరులకి ఉపయోగపడేటట్టుగా చూడడం. ఆ మనసుని అట్లా వాడడం. తనకుండే బుద్ధి ఇతరులకి వినియోగించేటట్టుగా వాడడం. తననే ఇతరులకి వినియోగించేటట్టుగా వాడడం. తనకున్న ఆనందం, అనుభూతి కూడా ఇతరులకి పంచడం. అన్నీ ఇతరులకి పంచడం కోసమే అనేది నాలగవ అధ్యాయం. మూడూ, నాలుగూ అధ్యాయాలు చాలా ముఖ్యం. అది కాకుండా మిగతావి చదువుకున్నా ఊరికే మనస్సుకి ఏదో అందుతూ ఉంటుంది. మనస్సుకి మర్చిపోవడం కూడా ఉంటుంది.

మనసుకి ఉండేటటువంటి మహత్తరమైన గుణం ఏమిటంటే చాలా విషయాలు మర్చిపోతూ ఉంటుంది. కాబట్టి హాయిగా ఉన్నాం. ఎందుకని? అక్కర్లేనివన్నీ గుర్తు చేస్తూ ఉంటుంది మనస్సు. కావలసినవి గుర్తు చెయ్యకుండా, అంటే,

నిన్నా, మొన్నా, అటుమొన్నా, లేకపోతే ప్రవచనాలు ద్వారా విన్నవి, లేకపోతే మనం చదువుకున్నవి, అవేం గుర్తుచెయ్యదు మామూలుగా ఉంటే మనసు. వాడి గురించి, వీడి గురించి, ఈ రాజకీయాల గురించి, సినిమాల గురించి, క్రీడాకారుల గురించి, ఇవేగా గుర్తు వస్తుంటాయి! Advertisements, discounts ఇవేగా గుర్తు వస్తుంటాయి! మామూలుగా మనసుని వదిలేస్తే ఇదివరకూ నేర్చుకున్న మంచి విషయాలన్నీ గుర్తు చేస్తుంటుందా? చేస్తే ఆ మనసు బుద్ధితో అనుసంధానం చేసిన మనసయ్యి ఉంటుంది. Filtered mind అది. Filter లేని mind కి ఏమవుతుందంటే మనకి ఏమయితే పనికిరావో అవన్నీ గుర్తు చేస్తూ ఉంటుంది. మనకి పనికొచ్చేవన్నీ మరుపొచ్చేస్తుంది. అంచేత, మనసుకి చావు అనేది తప్పదు. గట్టిగా నిన్న మధ్యాహ్నం ఏం తిన్నావో చెప్పు అంటే చెప్పలేడు ఎవడూ. చాలా ఆలోచించాలి కదా! అంచేత, ఇదిలా మరుపు తెప్పించేస్తుంటే, ఎప్పుడూ కొత్త విషయాల మీద పడిపోతూ ఉంటుంది, పాత విషయాలు మర్చిపోతూ ఉంటుంది. ఏమయింది? పాతవి మర్చిపోతూ, కొత్తవి ఇవ్వాళ్ళ నేర్చుకుంటే, మళ్ళీ రేపు మర్చిపోతాము. ఇట్లా తిప్పుతూ ఉంటుంది మనస్సు. ఇలాంటి మనసుతో గ్రంథాలు చదివితే ఎంతసేపు ఉంటుంది? Literacy is not education అన్నారు కదా! చదువులు వేరు, విద్యలు వేరు. అంచేత, literacy ఉన్నంత మాత్రాన, కేవలం నీకు మనసు ఉన్నంత మాత్రాన నీకు సమస్తమైన విషయాలు అవగాహన కావు. నీ మనసుకి ఒక శిక్షణ ఉండాలి. శిక్షణ ఇవ్వని మనస్సు శిక్షణ లేని పశువులాగా ఉంటుంది. నువ్వు ఎంతో శిక్షణ ఇస్తే పశువు నువ్వు చెప్పిన పద్ధతుల్లో ప్రవర్తిస్తుంది కదా! అలాగే నీ మనస్సు కూడా! అది ఏదేదో మాట్లాడుతూ ఉంటుంది, ఏమిటేమిటో ఆలోచిస్తూ ఉంటుంది, ఏవేవో పనులు మనచేత ప్రోత్సహిస్తూ ఉంటుంది. దాని పనే అది.

అంచేత, మనస్సు ఉంటే చాలదు. దానికి శిక్షణ కావాలి. దానికి ABCD నేర్పడం వల్ల శిక్షణ ఇచ్చామనుకోబోకండి. ABCD లు నేర్చుకోవడం వల్ల ఏ శిక్షణా ఉండదు. అఆఇఈ లు నేర్పినా అంతే. రాయడం వచ్చేసరికి అహంకారం వస్తుంది తప్ప, వినయం ఏది? అది విద్య అవుతుందా? ఎక్కువ మనకి అవీ ఇవీ రాయడం, లెక్కలు, ఇవన్నీ నేర్చుకున్నావనుకో, నేర్చుకుంటే నీలో వినయం పెరుగుతోందా? విద్య యొక్క ప్రధాన లక్షణం వినయం. అది లేని చోట అది విద్య కానేకాదు. విద్య నేర్చుకుంటే వినయం పెరగాలి. అది విద్య. అంచేత, వినయం లేనటువంటి విద్యలు ఎన్ని నేర్చుకున్నా ఏం లాభం? వినయం అంటే ఏమిటి? మెత్తపడిన మనస్సు అది. మెత్తబడినటువంటి మనసు బుద్ధినుంచి గ్రహించడానికి వలసినటువంటి లక్షణం ఏర్పడుతుంది. అందుకని, విద్య వలన వచ్చేది వినయం. వినయం వలన వచ్చేటటువంటిది బుద్ధిగ్రాహ్యమైనటువంటి విషయాలు. మనోగ్రాహ్యంగా ఏం ఉండదు. బుద్ధిగ్రాహ్యం అన్నారు భగవద్గీతలో. బుద్ధి చేత తెలియవలసిందే తప్ప మనసు వల్ల ఏం తెలియదు. మనసు ఊరికే బయట పనులు చేసుకోవడానికి నీకు ఉపయోగపడేటటువంటి విషయం. మనసు బుద్ధితో అనుసంధానం చెందితే తప్ప అసలు విషయాలు తెలియవు. ఘర్షణ లేని జీవనం ఏ విధంగా జీవించాలో తెలియదు. ప్రశ్నలు వెయ్యడమే తెలుస్తుంది. ఎందుకిలా చేసాడు? ఇంతకన్నా బాగా చేయొచ్చు కదా అని మాట్లాడేవాళ్ళు కూడా ఉన్నారు. భగవంతుడు ఈ సృష్టి ఇంత భయంకరంగా ఎందుకు చేసాడు అనేవాళ్ళు లేరు? భయంకరంగా నువ్వు చేసుకున్నావు. ఎంచేత అంటే నీకు అన్నీ ఇస్తే, నువ్వు దాన్ని దుర్వినియోగం చేసుకోవడం వల్ల అలా అవుతుంది. అంచేత, మనస్సుతో సాధన జరగదు. మనస్సు బాగా మెత్తబడాలి.

మెత్తపడడానికి పెద్దలు ఏం చేసారంటే, ముందు కొంత శిక్షణ పెట్టారు. శిక్షణ పెట్టి దివ్యమైన విషయములయందు ఆసక్తి పెరిగేంతవరకూ... ఏర్పరచినప్పుడు నువ్వు వినయమైనటువంటి దృష్టితో నువ్వు దివ్యమైన విషయములు, నీలో ఉన్నటువంటి విషయంతో నువ్వు అనుసంధానం చెందుతూ ఉంటే, అటువంటి సమయంలో నీకు పఠనం, అధ్యయనం ఇచ్చారు. అంతవరకూ అధ్యయనం లేదు. పుస్తకాలు ఊరికినే ప్రపంచం నిండా పంచేసారు. దానితో ప్రతివాడూ ఎదో చదువుతాడు. అదొక వికారమైనటువంటి ఒక మనోతత్వం ఏర్పరుచుకుని, ఎందుకూ పనికి రాకుండా అయిపోతుంటాడు.

అహింస, సత్యము, బ్రహ్మచర్యము, ఆస్తేయము లేక దొంగ బుద్ధి లేకుండుట, అపరిగ్రహము – ఊరికే ఏం పుచ్చుకోపోవడం. ఊరికే వస్తే ఎంతయినా మనం ready కదా! బాహ్య శుచి, అంతః శుచి, సహజమైనటువంటి సంతోషము, ఈ ఎనిమిది లక్షణాలు ఎవరిలో ఉంటాయో, వాళ్లకి మాత్రమే సద్గురువులు అధ్యయనం అనేటటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసారు. హింసాత్మక బుద్ధి కలిగి గ్రంథాలు చదువుకుంటే గ్రంథాలు బొత్తిగా నీకు ఏం చెప్పవు. అందులో లోపాలు ఎన్నడమే నీకు తెలుస్తుంది. రాముడు ఎందుకు ఇట్లా చేసాడు? రాముడు ఎందుకు అట్లా చేసాడో తెలుసుకోడానికి ముందు నువ్వు పశువు నుంచి కొంత మనిషి అవ్వాలి. అప్పుడు తెలుస్తుంది. కృష్ణుడెందుకు అలా చేసాడో బుద్ధి లోకాల్లో ఉన్నవాళ్లకే అర్థమవ్వలేదు. ఇంకా పైకి వెళ్ళాలి. అంచేత, మనకి మన equipment సరిగ్గా మనం తయారు చేసుకోకుండా, మనం దానికి సంబంధించినటువంటి ఎటువంటి పరికరంతో ఈ విద్య నేర్చుకోవాలో ఆ పరికరం మనం తయారుచేసుకోకుండా, మనం విద్యని అభ్యసించేటటువంటి ఒక ఆశలో పడి ఉండడంచేత మనకేమీ అందక, అట్లా ఏడిపిస్తూ ఉంటుంది సాధన. అంతే! ఇవ్వాళ్ళ మనం వెళ్ళి, వాడిని రాకెట్లో తీసుకెళ్ళారు కదా, నేను కూడా వెళ్తానంటే వెళ్ళలేవు కదా! ఓ రాకెట్లో అంతరిక్షంలోకి వెళ్ళాలంటే నీకు ఎంత శిక్షణ కావాలి? నేనెందుకు వెళ్ళకూడదంటే, వెళ్ళవచ్చు. కాని దానికి సంబంధించిన శిక్షణ తీసుకోవాలి. వాడెవడో తాడు మీద నడిచాడని తప్పట్లు కొట్టి, medals ఇచ్చి, ఒక కోటి రూపాయలు ఇచ్చారనుకోండి. నాకు కూడా ఎందుకు ఇవ్వకూడదు కోటి రూపాయలు అని చూస్తాడు తప్ప, ఆ తాడుమీద నడిచేవాడు చేసిన సాధన నువ్వేం చేసావు? చెయ్యలేదుగా!

అంచేత, మనలని ఈ విధంగా మలుచుకోవడమే ఈ కథంతా. మన్ని ఏం మలుచుకోకుండా, మనం అట్లాగే ఉంటూ, అట్లాగే మాట్లాడుతూ, అట్లాగే అంటూ, అట్లాగే తిరుగుతూ, అట్లాగే ప్రవర్తిస్తూ, చాలా కాలం ఇందులో ఉన్నామనే ఒక feeling లో బతుకుతున్నామనుకోండి. అదొకటి extra మనకి! ప్రతివాడు నేను ముప్పైయేళ్ల నుంచి ఇందులో ఉన్నానంటాడు. ముప్పైయేళ్ల ఉంటే ఏమిటి? మూడు వందల ఏళ్ళు ఉంటే ఏమిటి? అన్నీ ఒకటే. నీ యందు ఎలాంటి పరిపక్వత ఏర్పడిందనేది లెక్క. పరిపక్వత దేనికి? మనసుకి. మనసు దిక్కులు చూస్తూ, బాధ్యతలు మర్చిపోయిన మనసు కదా! బయట కలి కూడా fundamental rights నేర్పుతున్నాడు తప్ప fundamental responsibilities ఎవడికీ నేర్పడం లేదు కదా! ప్రపంచవ్యాప్తంగా అగ్రరాజ్యాలు చేసింది ఏమిటి? ప్రతివాడికి వాడి హక్కులు తెలుసు. హక్కులా కావలసినది? ఆర్యులు చెప్పింది బాధ్యతలు, హక్కులు కాదు. అందుకనే, ఏ పదవిలో ఎవడు కూర్చున్నా, బంట్రోతు పదవి నుంచి పై పదవి వరకూ, వాడి హక్కులే వాడికి తెలుసు తప్ప, వాడి బాధ్యతలు వాడికి తెలియవు. ఆర్యులు బాధ్యతలు నేర్పారు. ఆ బాధ్యతల నుండి పెరగమన్నారు. హక్కులు నుండి ఎవరూ పెరగలేరు. నేను ఫలానా అనుకునేవాడు

ఉపయోగం లేదు. నిన్ను మర్చిపోయేటట్టు ఉండవలసిన మార్గంలో నిన్ను ఎక్కువగా పెంచుకునేటట్టుగా కలి తయారు చేస్తుంటాడు. **Fundamental rights** అనేటటువంటిది కలి ప్రేరణే. అంతకన్నా ఏం సందేహం లేదు. అంచేత, ప్రతివాడు వాడి హక్కుల గురించి చూస్తున్నాడు తప్ప, వాడి బాధ్యతలని చూడడం లేదు. ప్రతీది జన్మ హక్కుగా భావిస్తూ ఉంటే, ఇంక బాధ్యత ఏం ఉంటుంది? వాడు గాడిదయిపోతూ ఉంటాడు కదా! అంచేత, ఈ హక్కుల పోరాటంలో మనం వెనక్కి వెళ్ళిపోతూ ఉంటాం. ఇది మనసు చేసే పద్ధతి.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ఆ మనసు కరిగితే తప్ప దర్శన జ్ఞానం లేదు. మనసుతో పుస్తకాలు చదువుకుంటే ఏం తెలియదు. ఏం సందేహం లేదు. పుస్తకాలు చదువుకుంటే నిన్న చెప్పినట్లు ఆ శివలింగాన్ని గట్టిగా కావలించుకుని కూర్చున్నాడు అన్నట్టుగా అనిపిస్తుంది. యముడు పాశం వేస్తే ఎంత గట్టిగా కావలించుకుంటే ఏమిటండి? గట్టిగా ఎక్కడ కావలించుకున్నాడు? లోపల. మనస్సుతో అంతరంగంలో ఉండేటటువంటి తత్వంతో తాను అనుసంధానం చెందాడు. మనసు, బుద్ధి, తాను, అంతా కలిపి తనలో శివుడితో తాను అనుసంధానం చెందడం వలన క్రమంగా తాను శివుడై, శివుడు తానై అట్లా ఒక అవినాభావ సంబంధం. అంటే, తాను శివుడికన్నా వేరు కాదనే స్థితిలోకి అతడు చేరడం వల్ల, శివుడే తానై ఉన్నటువంటి పరిస్థితి. శివుడే తానై ఉన్నటువంటి పరిస్థితిలో శివుడికి పాశం పడదు కదా! అంచేత, యముడు వేసే పాశాలు మార్కండేయుడు అనుకుని శివుడి మీద వేసాడు కదా! అక్కడ శివుడైపోయిన మార్కండేయుడు ఉన్నాడు. తపస్సు లేక ధ్యానము అనేటటువంటిది జరుగుతున్నప్పుడు ఇది జరుగుతూ ఉంటుంది, నువ్వు ఉండవు కాసేపు, నువ్వు దేని గురించి ధ్యానం చేస్తున్నావో అది ఉంటుంది. కానీ బాగా తపస్సు చేసినప్పుడు కాసేపు మనం ఉండకపోవడం కాకుండా, కాసేపు అది ఉండకపోవడం జరుగుతుంది. ఎప్పుడూ అదే ఉంటుంది. "సమాధినుష్ఠులు గరిష్ఠులు" అని అంటూ ఉంటాం చూసారా, వారందరూ అదే తాముగా ఉంటారు. మాస్టారు అని పిలిస్తే బయటకొస్తారు. మాస్టారని పిలవకపోతే దానితో ఉంటారు. పరిసరములతో సంబంధం పెట్టుకుని ఉండరు. అది ఒక స్థితి. అలాంటి స్థితిలో మార్కండేయుడు పరిసరములు మరిచి సమస్తమూ శివుడే – బయటా శివుడే, లోపలా శివుడే, వచ్చిన యముడూ శివుడే, అంతా శివుడే. యముడు రాగానే భయపడి గట్టిగా కావలించుకున్నాడు అని చెప్పారనుకోండి, అలా ఉంటుందా? అలా ఉండదు. అన్యం లేని స్థితిలో అనన్యమైన స్థితిలో ఉన్నదాన్ని, అన్నీ దాన్నుంచే వచ్చాయి కాబట్టి, దాన్ని ఎవరూ ముట్టుకోలేరు. దాన్నెవరూ వశం చేసుకోలేరు. దానికే అందరూ వశులవ్వాలి. అలాంటి తత్వం ఒకటుండడం చేత, అది యమునికి కాకతాళీయంగా ఉన్నప్పుడు కనబడలేదు.

అంత దృష్టి పెట్టి చూడలేదోయ్ అంటూ ఉంటారు పెద్దలు అప్పుడప్పుడూ. ఎందుకని? ఏదో లోకవ్యవహారంలో ఉన్నప్పుడు ప్రతీది దృష్టి పెట్టి చూడరు. కాని దృష్టి పెట్టి చూస్తే పెద్దలకి కనిపిస్తుంది. మనం కూడా దృష్టి పెట్టి చూడాలి అందరిలో ఉండేటటువంటి ఈశ్వరుడిని. లేకపోతే మనకి మాములుగా మనుషులే కనిపిస్తూ ఉంటారు, వాళ్ళ గురించి మనకుండే అభిప్రాయాలు, అవే కనిపిస్తూ ఉంటాయి. దృష్టి పెట్టి చూస్తే దైవమే కనిపిస్తుంది. ప్రతివాడు తత్వ స్వరూపుడే. ఆ తత్వమే అక్కడ ప్రకృతి పురుషులుగా ఉంటుంది. ఆ ప్రకృతికి మూడు గుణాలు ఉంటాయి. ఆ మూడు గుణాల్లోంచి ఈ దిగి వచ్చినవాడు ప్రవర్తిస్తూ ఉంటాడు. ఇంక వాడికి పంచభూతాలు ఉన్నాయి. మూడు గుణాలు, ఐదు భూతాలు, ప్రకృతి,

పురుషుడు – మొత్తం పది. ప్రతివాడు ఒక పది, number ten. కేవలం టెండూల్కరుకే అనుకోబోకండి, మనకి కూడా number ten. వాడికేవరో చెప్పుంటారు, number ten పెట్టుకోరా మంచిది అని. Number of fulfilment అది. Number ten – ప్రకృతి, పురుషుడు, త్రిగుణములు, పంచ భూతములు – మొత్తం పది. అంతే అందరం! వాటి combination లో తేడా. ప్రకృతి పురుషుల combination ఒకటే, basic. త్రిగుణములు తేడా, దాని వలన పంచభూతములు తేడా. అందుకని, ప్రతివాడు కొంచెం తేడాగా ఉంటూ ఉంటాడు కదా! సాధకుడికి ఏం ఉండాలి? వాడి తేడాతో నీకేం సంబంధం? ఎవడి తేడా వాడిని బాధపెడుతూ ఉంటుంది తప్ప, మన తేడా మన్ని బాధపెడుతూనే ఉంది ఎట్లాను! తేడా చూడకుండా ఉండడానికి ప్రయత్నం చెయ్యడమనే సాధన జరుగుతూ ఉండాలి. ఆ సాధనలో ఉండేటటువంటి ఒకే తత్వాన్ని చూడడం అనేదాంట్లో నీకు కలిగేటటువంటి పరిపక్వతబట్టే ఈ gradations అన్నీను.

అంచేత, యమధర్మరాజు ముందు దృష్టి పెట్టి చూడలేదు. ఏదో బోల్డుమంది జీవులని రోజూ పట్టుకోస్తుంటారు కదా! అప్పుడప్పుడూ కొన్ని కేసుల్లో కొంచెం ముఖ్యమైనటువంటి వాళ్ళని పంపిస్తూ ఉంటాడు. కొన్నికొన్ని సందర్భాల్లో ఏం జరుగుతుందంటే అప్పటికే ఓ జీవుడి గురించి బాగా మంచి report ఉందనుకోండి. Reports ఉంటాయి కదా! Akashic records, చిత్రగుప్తుడు, వాటిలో ఉండేవాటిబట్టి మరీ ప్రముఖమైతే కొంచెం ముఖ్యమైన వాళ్ళని పంపిస్తాడు. అత్యవసర సన్నివేశాల్లో తాను వస్తాడు కదా! మార్కండేయుడు అనుకుని వచ్చాడు. దృష్టి పెట్టుకు చూస్తే శివుడు కనిపించాడు. యముడిని తక్కువ చెయ్యకూడదు. యమధర్మరాజంటే ఆయన అనుగ్రహం కలిగితే ఇంక బ్రహ్మమే నీకు, బ్రహ్మ జ్ఞానమే. ఆయన్ని దాటి ఎవరూ పోలేరు. సూర్యుడికే ఆయన పరిధి ఏర్పరిచాడు. ఈ సూర్యమండలం దాటి సూర్యుని కాంతి వెళ్ళదు. He creates circumference. ఒక పరిధి ఏర్పరుస్తాడు. This is the mark. I mark the circle. With that you may shine forth. అంతటి వాడు యముడు. ఈ సృష్టిలో పరిధులు ఏర్పరిచే తత్వాన్ని యముడు అంటారు. మనం మన పరిధిలోనే జీవించడం కూడా నియమంతో జీవిస్తునట్టు అర్థం. అడ్డగోలుగా ప్రవర్తించకుండా, మన పరిధులు దాటి మనం జీవించక, మన పరిధుల్లో మనం జీవించేటట్లుగా చూస్తాడు. పరిధులు దాటితే తదనుగుణమైనటువంటి ఫలితాలు మనకి ఇస్తూ ఉంటాడు. అదీ యమధర్మరాజు పని. మన్ని నియమంలో ఉంచడానికి యముడున్నాడు సృష్టిలో. పరిధులు దాటడానికి ఎవరికీ వీలు లేదు. "తమ తమ నెలవులు తప్పినా తమ మిత్రులే శత్రువులవ్వడం తథ్యము సుమతీ" అన్నారు. అంచేత, అందరికీ పరిధులు, పరిమితులు ఉన్నాయి. అట్లా మొత్తం సూర్య మండలానికే ఒక పరిధి. ఊరికే చిన్నచిన్న పరిధులు దగ్గరనుంచి పెద్దపెద్ద పరిధులు వరకూ అన్నీ ధర్మాని అనుసరించి వర్తింపచేసేటట్లుగా ఉండేటటువంటి ధర్మమూర్తి యముడు. ఆయన పేర్లు అన్నీ క్రిందటి సారి వివరించాను మీకు గుర్తుంటే.

అంచేత, యమధర్మరాజు దృష్టి పెట్టి చూస్తే శివుడు కనిపించాడు. అంటే, మార్కండేయుడా? శివుడా? గురువా, దైవమా అనే ప్రశ్న వస్తూ ఉంటుంది ప్రతివాడికి. అనుసంధానం చెంది ఉంటే గురువు దైవమే. అలా కాకుండా ఏదో సరదాగా, ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నాడనుకోండి. అప్పుడు కొంచెం తెరగా వచ్చి, సరదాగా మాట్లాడుతూ ఉంటాడు. ఎందుకంటే, అందులో ఉంటే అట్లా మాట్లాడడు. ఆయన అనుసంధానం చెంది ఉన్నాడనుకోండి, అప్పుడు

వేరేగా ఉంటుంది. అనుసంధానంలోనే ఉండిపోయాడనుకోండి. మార్కండేయుడు పరిస్థితి ఏమిటంటే, అతడే తాను అనే స్థితిలో ఉన్నాడు. ఈ అతడే తానుగా ఉండడం అనేటటువంటిదే ఈ ప్రయత్నం అంతా. మీరు ఎన్ని పుస్తకాలు చదువుకోండి, ఎంతోమంది ఎన్నో రకాల సాధనలు చెప్పండి, దినచర్యలో ఈ అనుసంధానం జరగకపోతే ఏమీ జరగదు. దీనికి పుస్తకాలు అక్కర్లేదు. పెద్దల దగ్గర విని, అట్లా సాధన చేసుకుని ఋషులు, బ్రహ్మర్షులు అయిపోయారు. ఈ printing press లు, ఈ బుక్కులు ఇవన్నీ ఏం లేవు.

అంచేత, యముడికి ఆ విధంగా శివ దర్శనం జరిగింది. గురువులో దైవదర్శనం అట్లా అవుతుంది. ఓహో! ఇక్కడ శివ తత్త్వం వ్యాప్తి చెంది ఉంది అని తెలుసుకుని, శివుని ద్వారా ఉపదేశం పొందాడు యముడు. ఏమని? ఇలాంటి పరిస్థితుల్లో ఉండే వాడికి ఇంక rules ఎందుకురా అని. ఇలా ఉండే వాళ్లకి rules apply చెయ్యం కదా! అంచేత, మాములుగా మనం పెట్టుకున్నటువంటి సృష్టి ధర్మాలు ఇలాంటి పరిస్థితుల్లో నీవు నిర్వర్తించక్కర్లేదు అని చెప్పాడు శివుడు. ఎవరయితే పరతత్వంతో అనుసంధానం చెంది... పరతత్వం అంటే పరిధి లేని తత్త్వం. పరిధి లేని తత్వంతో పరిధిలో ఉన్నవాడు అనుసంధానం చెందితే వాడూ ఆ పరిధి దాటేస్తాడు. అంటే, పరిధి దాటేసిన వాడికి నువ్వేం చెయ్యాలి? ఏం చెయ్యనక్కర్లేదు కదా! అంచేత, వారి ప్రయోజనములను, వారి ధర్మములను వారు పరిపూర్ణంగా నిర్వర్తించేవరకూ వారి జోలికి నువ్వు వెళ్ళకు అని చెప్తాడు శివుడు. వాళ్ళని exception కింద వేసేసుకో. మిగతా వాళ్ళంటావా, వాళ్ళ కర్మానుసారం వాళ్ళని తీసుకెళ్ళు. అంచేత, పరతత్వంతో అనుసంధానం చెందడమే శివతత్వం అంటారు. శివుడన్నా, నారాయణుడన్నా, అమ్మవారన్నా, ఏదన్నా, పేర్లేనేన్నయినా పెట్టండి. ఆ పరతత్వంతో అనుసంధానం చెంది ఉన్నటువంటి జీవుడు, వాడి వల్ల ఏ ఇబ్బంది ఎవరికీ లేదు. అటువంటివాడు ఈ శరీరంతో లోకంలో పనులు చెయ్యడానికి ఎంత కాలం అవసరం ఉంటుందో అంత కాలం ఉంటాడు. ఆ తర్వాత నువ్వు ఉండమన్నా ఒక క్షణం ఉండడు అందులో.

ఇప్పుడు వివేకానందుడు ఉన్నాడు. ఏ పని మీద వచ్చాడో ఆ పని పూర్తయిపోయింది. అంతే, మూడు రోజుల్లో, ఇహ నేను వెళ్తున్నాను, సమాధి కట్టండి అన్నాడు. అందులోకి వెళ్ళి కూర్చున్నాడండి. మూడో పడిలోనే కదా! ఉంటాడా? ఉంటే extra లు చాలా అంటుకుంటాయి. అవసరం లేకుండా ఎక్కడున్నా అంతే. మనకి అవసరం లేనిచోట ఉంటే మనకి కూడా బోల్డు అంటుకుంటూ ఉంటాయి. అంచేత, అవసరం ఉన్నచోట అవసరం వరకూ ఉండడం అనేటటువంటిది సంస్కారం. అందరూ అంటూ ఉంటారు కదా, ఇక్కడ కొన్నాళ్లుండండి గురువుగారు అంటూ ఉంటారు కదా! అంటే, అంటుకుంటాయేమోనని భయం చేత ఉండక పోవడం కాదు, ఎక్కడ అవసరమో అక్కడ ఉండాలి. ఎక్కడ కర్తవ్యమో అక్కడ ఉండాలి. కర్తవ్యములు లేని చోట ఉండకపోవడం అనేటటువంటిది మనం పెద్దల వద్ద నేర్చుకుంటూ ఉండాలి. కర్తవ్యం ఉన్నచోట ఎలాంటి చోట అయినా ఉండాలి. అక్కడెందుకండీ, waste అంటూ ఉంటారు కొంతమంది. అక్కడేముంది అంటే, అంతటా ఉన్నదే అక్కడా ఉంది. ఆ ఊరేందుకు వెళ్తారు, అక్కడెందుకు చేస్తారు, ఇట్లా అంటూ ఉంటారు కదా! అంచేత, ఒకే ఒక తత్త్వం. ఆ తత్వంతో అనుసంధానం చెంది జీవించేటటువంటి వాడికి వాడి పని వాడికి తెలుసు, వాడి పనవగానే వాడుండడు కాబట్టి వాడి శరీరం గురించి... పాశం వేసి తియాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది? ఇందులోనే శాశ్వతంగా ఉండిపోదామనే తత్త్వం ఉండేవాడికి. అంచేత, ఆ పని చేయ్యబోక అని శివుడు

యమధర్మరాజుకి చెప్పడం జరిగింది. పని అయ్యిన తర్వాత వాడే వదిలేస్తాడు, అది gurantee. పని అయ్యిన తర్వాత ఇంకా ఇందులో ఉందాం, ఇంకా extra గా ఉందాం, ఇలాంటి బాధలు అసురులకి ఉంటాయి తప్ప యోగులకి ఉండవు. అంచేత, అసురులెవ్వరూ పాపం ఉండలేకపోయారు, మరణం దాటలేకపోయారు. యోగులే దాటారు కదా! మరణం లేకుండా ఉండడానికి వరంగా పోందడానికి వాళ్ళు ఎంతగా ప్రయత్నం చేసినా ఆ మరణం వాళ్ళకి వచ్చేసింది. యోగులకి మరణం రాలేదు. అది యోగవిద్యలో గొప్పదనం. మరణించక దేహాన్ని వదిలేసి శాశ్వతంగా నిలిచిపోయారు. ఈ విధమైన బోధ అయ్యింది. యమధర్మరాజు అర్థం చేసుకున్నాడు. అది ఆయన manual లో ఎక్కించేసాడు. అంటే, సైన్యం ఉంటారు కదా. సైన్యం అంతా వెళ్ళి పనులు చూసుకోవాలి కదా! అందుకని, ఆ manual లో పెట్టేసాడు. ఇలా ఉండే వాళ్ళని కొంచెం మీరు జాగ్రత్తగా చూసుకోండి అని. అంచేత, extensions ఉంటాయి.

"*జాతస్య మరణం ధృవం*" అని ఉన్నప్పటికీ మరణం ఫలానా అని రాసి ఉన్నప్పటికీ, నీ యొక్క ప్రవర్తన exceptional గా ఉందనుకో, నీ అవసరం, జీవన ప్రయోజనం ఇంకా కొనసాగుతుందనుకో, అప్పుడు మరణం దాటిస్తారు. అందుచేతనే, అది తెలిసే సద్గురువులు ఏం చెప్తారంతే, నన్ను అనుసరించిన వాడికి వాడి యోగసాధన ఈ జన్మకి ఎంతవరకూ పరిపూర్ణం అవ్వచ్చో అంతవరకూ అది అయ్యేవరకూ మరణం ముట్టుకోదు, నేనే ప్రమాణం అని చెప్తాడు ప్రతి సద్గురువు. అంటే, సాధన అని లోపల అనుసంధానం చెందుతూ, బయట కేవలం లోకహితం కోసమే జీవిస్తున్నారనుకోండి, ఒక సద్గురువుని అనుసరించి, ఆ సద్గురువు దగ్గర ఈ facility ఉంటుంది. అంచేతే, వాళ్ళు ధైర్యంగా చెప్తారు, వీడు ఫరవాలేదు, వీడు దాటతాడు అని. ఇప్పుడేం కాదని చెప్తారు, ఇప్పుడు కాదు, ఇంకా time ఉందని. ఎక్కడ కాదు, ఎక్కడ అవునో కూడా చెప్తారు. అందుకనే, కొంతమంది అడిగితే ఫరవాలేదు నీకేం భయం లేదు, దాటేస్తావు అని ధైర్యం ఇస్తాడు. కొంతమంది కొన్నికొన్నిసార్లు చెప్తుంటే మౌనంగా విని ఊరుకుంటాడు. ఎంచేత? అవతల సంధాన ప్రక్రియ ఎంతదాకా ఉందో దాన్నిబట్టి, ఒకటి. వాడు తన కోసం బతకడానికి ప్రయత్నమా, లోకశ్రేయస్సు కోసం బతకడానికి ప్రయత్నమా? ఇటువంటి ప్రయత్నాలు చూస్తూ ఉంటాడు సద్గురువు. సద్గురువుకి ఆ రెండే ముఖ్యం. ఇంక మిగతావన్నీ ఏవో చెప్తూ ఉంటారు, వింటూ ఉంటాడే తప్ప, ఒకటే – వీడు అనుసంధానం చెందుతున్నాడా లేదా? అది వాడి ప్రవర్తనలో తెలుస్తుంది. రెండు, స్వహితమా, పరహితమా? అదీ తెలుస్తూనే ఉంటుంది. ప్రవర్తనే రెండిటికీ అద్దం పట్టినట్టు ఉంటుంది. మన మాట, మన చేత అద్దం పట్టినట్టు ఉంటుంది మనం సాధన చేస్తున్నామా, హితము చేస్తున్నామా అనే దానికి. ఈ రెండూ కాకుండా మూడో తరగతి కూడా ఉంది. ఏమిటయ్యా అది అంటే ఆసక్తి. ఆసక్తి పెరిగిన తర్వాత ఆచరణలోకి దిగుతాడు. అంతే కదా! ఇదేదో చాలా బావుంది అనిపిస్తుంది. ఒకటికి పదిసార్లు వినేసరికి, అమ్మో! ఇది బావుంది కదా అనిపిస్తుంది. వాడికే అనిపించి వాడు మొదలు పెడతాడు. అందుకని, ఆసక్తి ఉన్నచోట, సంధానము ఉన్నచోట, హిత కార్యములు నిర్వర్తిస్తున్నచోట, extensions అనేటటువంటివి ఏర్పాటు మార్కండేయ మహర్షి అప్పటినుంచి మొదలయ్యాయండి. అంటే, Mark. ఏదయితే death mark ఒకటుంటుంది. ఆ death mark ని మాటిమాటికి rubber పెట్టి చెరిపేసి ఇంకోచోట గీస్తూ ఉంటారు. ఇంకొంచెం పెంచుతూ ఉంటారు. అంచేత, ఎవరెవరికి ఎంతవరకూ ఆ దేహంలో సాధన... అన్ని దేహాలు పరిపూర్ణతకి పనికిరావు. ఎందుకంటే, అసలు బట్టే బాగా ముతక

అనుకోండి, fabric చాలా ముతకగా ఉండనుకోండి, కొంత వరకూ refine చేస్తారు. ఇంక అంతకన్నా refine చేస్తే చచ్చిపోతారు. ఆ refined body తో మళ్ళీ వస్తాడు. అక్కడి నుంచి సాధన చేస్తే ఇంకో వందరెట్లు refinement. అంటే, తమస్సు నుంచి రజస్సులోకి, రజస్సులోంచి సత్వంలోకి రావాలి. అంత ముతక కాని బట్టలు, చాలా తేలిక బట్టలు వస్తే అంత తేలికైనటువంటి, సత్వ ప్రధానమైనటువంటి fabric లోంచి వస్తుంది వెలుగు శరీరం. ముతక బట్టలోంచి సరాసారి రాదు, చచ్చిపోతాడు. అంచేత, చక్కగా అలా refine చేసుకుంటూ వస్తాడు. Refinement ఎలా వస్తుంది? ప్రవర్తన ద్వారానే వస్తుంది. భావము, భాష, వర్తనము, ఈ మూడిటిలోంచి పట్టుకొచ్చేస్తాడు. అంచేత, క్రమంగా refinement. అది చూసుకుంటూ ఉంటాడు. ఎందుకంటే, బట్ట చిరిగి పోకూడదు. బట్ట చిరిగితే ఏముంది? పనయిపోతుంది. చిరిగిన బట్ట వేసుకోం కదా! అంచేత, ఈ refinement తమస్సు నుంచి రజస్సులోకి, రజస్సు నుంచి సత్వంలోకి, సత్వం నుంచి నిత్యసత్వంలోకి. నిత్యసత్వం నుంచి వెలుగు కలిగేటటువంటి, కాంతి కలిగేటటువంటి శరీరం. ఇట్లా ఏర్పరుచుకుంటూ జరుగుతూ ఉంటుంది ఈ అనుసంధానం వలన. అనుసంధానం అన్న పదం మనకి అలవాటయిపోయి వాడుతున్నాం తప్ప సంధానమే. సంధానం అనుసంధానం అయినప్పుడు లోపల ఇవన్నీ జరిగిపోతాయి.

అంచేత, మధ్యమధ్యలో శరీరం మారుతున్నప్పటికీ వాడికి సాధన కోనసాగుతుందని వాగ్ధానం ఒకటుంది భగవద్గీత ఆరో అధ్యాయంలో. ఏం ఫరవాలేదు, ఇది మొదలు పెట్టిన వాడు తెములుతాడు. అప్పటికి ఎంత వీలుంటుందో అంతవరకూ చేస్తాడు. ఆ తర్వాత better form, better equipment. అన్నీ మానవ రూపాలుగానే ఉన్నా కూడా they are not equally responsive to subtle energies. అంచేత, కొంతమంది బాగా నిద్రపోవడం యందు ఆసక్తి కలిగి ఉంటారు. విముఖత ఉంటుంది చాలా, ప్రతిదానికీ విముఖత కదా! మంచి విషయాలు వినబడుతుంటే విముఖత, ఎదో రకరకాల తత్త్వం, ఎదో logic, తన్ని తాను సమర్ధించుకోవడం, ఇలాంటివన్నీ. Indifference is the keynote of inertia. ఎక్కడ మనం indifferent, వైముఖ్యముందో అక్కడ మనకేమిటంటే అర్థం వాడికి తమస్సు అని. ప్రతీది "ఆ!" అంటాడు గేదల్లే. వాడు తమస్సులో ఉన్నాడు. వాడిని మనం ఎందుకు ఇబ్బంది పెట్టాలి. అలాంటి వాళ్ళు నిద్రపోతేనే మనకి మంచిది. కొంతమందిని నిద్ర నుంచి లేపడం వల్ల ఇబ్బంది కదా! నిద్రపోయేవాళ్ళనెవరినీ లేపకు అని చెప్పాడు శ్రీకృష్ణుడు. Do not distrub the simple minded అని. ఎదో తిని పడుకునేవాడు, వాడేదో బానే ఉన్నాడు కదా వాడి వరకూ! వాడిని ఇబ్బంది పెట్టక. కొంచెం అక్కడినుంచి రజస్సులోకి. ఎందుకంటే, తమస్సు కన్నా రజస్సు, రజస్సు కన్నా సత్వం, సత్వం కన్నా నిత్యసత్వం. అంటే ఏమిటి? Even poise. In anything he does there is poise in it. ఈ వస్తువు ఇక్కడినుంచి అక్కడ పెట్టడంలో poise. ఇది తీసి అక్కడ పెట్టేలోపల చెయ్యిజారే వాళ్ళు బోల్డుమంది ఉన్నారు కదా! చేయ్యిజారే వాళ్ళు, పగలగొట్టే వాళ్ళు, పాడుచేసే వాళ్ళు, వీళ్ళలో తమస్సు, రజస్సు బాగా ఉండడం వల్ల అలా జరుగుతూ ఉంటుంది. కొంతమంది చేతిలో ఏదీ పాడవదు. అన్నీ నాణ్యత పొందుతూ ఉంటాయి. అప్పచెప్పినవి అంతకన్నా బావున్నట్టు ఉంటాయి. అది సత్వం. ఇచ్చినదల్లా పాడుచేసుకునే వాడికి ఎందుకండి? ఏమి ఇచ్చినా పాడుచేసుకుంటాడు. అంచేత, ఇవన్నీ చూస్తుంటాడు సద్గురువు. అలా అని ఎవరి యందూ విముఖత ఉండదు. అందరి యందూ వాత్సల్యమే ఉంటుంది. వారివారి పరిస్థితులని గమనించి, అక్కడినుంచి తర్వాత మెట్టుకి

ప్రోత్సహిస్తూ ఉంటాడు. ఎవడినీ నువ్వు లాభం లేదు అనడు. లాభం లేకపోవడమేమిటి? లోపల వాడున్నాడు కదా! ఎవడిలో లేడు?

అదేగా మనకి ఇవ్వాళ్టికి కూడా చెప్పుకుంటూ ఉంటాం మహానుభావుడు శంకరాచార్యుల వారి గురించి. పొరపాటున అయ్యిందిరా, ఇన్ని వేల సంవత్సరాలు కూడా మీరు ఇంకా గుర్తుపెట్టుకుని, అది ఒక్కటే చెప్పుకుంటున్నారు తప్ప, నేను చెప్పిన తత్త్వం, నేను చేసినటువంటి కార్యక్రమం చెప్పుకోకుండా, ఆ ఒక్కటీ మిగిల్చారు మీరు అనుకుంటూ ఉంటాడు. ఏమిటది? ఎవడినో ఒకడిని చూసాడట. బోల్డు మంది కనిపిస్తూ ఉంటారు. మొత్తం సృష్టిలో వాడిని అలా ఏడిపించేసాడు శివుడు. ఏరా! ఇందులో లేదా అని అడిగాడు. కాబట్టి ఎందులో లేదు? అన్నిటిలోనూ అదే కాబట్టి సద్గురువు దగ్గరికి ఎవరయినా రావచ్చు. వాడినెందుకు రానిస్తున్నారు గురువుగారు అంటూ ఉంటారు మిగతావాళ్ళు. వాడు చాలా పెద్ద దొంగ కదా అని! దొంగేమిటి? వాడిలో ఈశ్వరుడున్నాడు కదా! వాడు చాలా black marketer కదా! Smuggler కదా! బందిపోటు కదా! హింసాత్ముకుడు కదా! అయితే ఏమిటి? ఈశ్వరుడున్నాడు. సద్గురువుకి అన్నిట్లోనూ ఈశ్వరుడుంటాడు. మిగతావి ఉండవు. మిగతా వాటినన్నిటినీ సంస్కరిస్తాడు. ఆ ఈశ్వరత్వాన్ని బాగా వ్యక్తపరుస్తాడు. వెలిగి వచ్చేటట్టుగా చూస్తాడు. సద్గురువంటే మహాశని! అబ్బో! ఎంత ఓపికో బాబోయ్!

అంచేత, అలా పరిధులు దాటడం అనేటటువంటిది సాధన. మార్కండేయుడు ఆ సాధన చేస్తూ ఉంటాడు ఇంకా. గుర్తుపెట్టుకోండి, అంతటితో అయిపోలేదు మార్కండేయుడి కథ. ఈ మరణం దాటాం కాబట్టి ప్రస్తుతానికి extension ఇచ్చారు కదా! పదహారేళ్ళకి మనం పోము, గురువుగారు కాపాడేసారు, అయిపోయింది. సరే, ఏం చెయ్యాలి? ఎందుకిచ్చారు extension? అది మర్చిపోతే కష్టం కదా! ఏం చెయ్యాలి? తల్లిదండ్రులకి సేవ చెయ్యాలి. తల్లిదండ్రుల సేవ చేసుకుంటూ ఉన్నాడు. అధ్యయనం చేస్తూ ఉన్నాడు. ఇంకా ఏం చెయ్యాలి? "*ప్రజాతంతుం మామ్ వ్యవచ్ఛేత్సీః*" అన్నారు. గృహస్థు కావాలి. తన తండ్రి గృహస్థు, తన తాత గృహస్థు, తన ముత్తాత గృహస్థు, ముత్తాత తండ్రి గృహస్థు. ఆయన పెట్టాడు rule, అందరూ గృహస్థులై ఉండాలి అని. ఆ వర్గంలో పుట్టుకొచ్చాడీయన. ప్రజాపతులకి పుట్టినవాడు కదా! తోకచుక్కలు కావు కదా! తోకచుక్కల్లాంటి నలుగురు వచ్చారు ముందు. నలుగురు కుమారులు. సృష్టిలో బాగా బాధ్యత పడ్డారు. వాళ్ళకన్నా బాధ్యత ఎవరికీ లేదు. వాళ్ళే నాలుగు స్తంభాలు సృష్టికి. సనక సనంద సనత్కుమార సనత్సుజాతులు – నాలుగు వ్యూహాలు లేక నాలుగు స్థితులు, నాలుగు ముఖములు, నాలుగు భుజములు. "*చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః, చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేద విదేకపాత్*" అంటూ ఉంటారు కదా! అట్లా నాలుగుగా ఏర్పడిపోయారండి. వాళ్ళది చాలా పెద్ద బాధ్యత. ఈ సంతానం కనడం పెద్ద point కాదు నాన్నా, ఇంకా దానికి చాలామంది ఉన్నారు, మేము ఈ పనికి వచ్చాము అని చెప్పారు వాళ్ళు.

వాళ్ళలా ఉండగా, ఈ ప్రజాపతులు సంతానం కనవలసినటువంటి వర్గంలో ఉన్నటువంటి వాళ్ళు కాబట్టి గృహస్థు అవుతాడు మార్కండేయుడు. అవ్వాలి. గృహస్థు ధర్మాన్ని నిర్వర్తిస్తూ, తల్లిదండ్రులకి సేవ చేసుకుంటూ, తన సంధానం చెందుతూ, ముందుకు సాగుతూ, అనేకానేకమైన విద్యలు నేర్చుకోవడం జరుగుతుంది. అన్ని విద్యల యందూ

పరిపూర్ణుడు అవుతాడు. ఎంచేత? సంధానం ఉండడం వల్ల విద్యలు సులభంగా వాటంతట అవి వికసించి కనిపిస్తాయి. అదే చెప్పా, ఇదేదో మొదలు పెట్టడమే మనకి దర్శన జ్ఞానం అని వచ్చింది. దర్శన జ్ఞానం ఉన్నప్పుడు, ఇంక తెలియడానికేముందండి? అన్నీ fresh గా తెలుస్తాయి. వాడు రాసాడని, వీడు రాసాడని, ఈ గోల ఉండదు. నీకే direct గా తెలుస్తూ ఉంటాయి. ఆనందిస్తూ ఉంటాడు. అమితానందం కలుగుతూ ఉంటుంది. ఎంచేత అంటే, అలా వేడివేడిగా, అప్పటికప్పుడు దోసలు వేసినట్టు, fresh గా ఉంటాయి. ఏదో ఇదివరకూ వేసిన దోసలు ఇప్పుడు మనం చూసి బావుందని ఆనందం చెందడానికి, ఇవ్వాళ్టికి ఇవ్వాళ్ళ తీసి ఇచ్చారనుకోండి ఎట్లా ఉంటుంది అది? చాలా బావుంటుంది. అలాంటి ఆనందం, అధ్యయనం, తెలుస్తూ ఉంటుంది, వికాసం కలుగుతూ ఉంటుంది. ఇవన్నీ ఎంత జరుగుతున్నా, ఇటు గృహస్తు జీవనం అంటే పోషించాలి కదా! దానికేదో కొంత ఉపాధి కావాలి, ఒక వృత్తో కావాలి. అది నిర్వర్తించుకోవడం, తల్లిదండ్రులకి సేవ చెయ్యడం. ఇలా చేస్తున్నప్పుడు, నువ్వు సంధానం చెంది ఉన్నప్పటికీ, అప్పుడు ఈ మరణాన్ని దాటడానికి నీకు ఉండేటటువంటి crisis లో నీకేర్పడినంత సంధానం మామూలు time లో ఉండదు. తన లోపల దైవంతో అనుసంధానం చెంది, బయట పనులు చేస్తున్నప్పుడు అంతలాగ ఎప్పుడూ పరముతో ముడిపడి పని చెయ్యడం కష్టం కదా! మధ్యమధ్యలో అవీ ఇవీ ఏవేవో వస్తుంటాయి. వచ్చినప్పుడు మర్చిపోతూ ఉంటాం. ఎందుకిలా మరుపొస్తోందని ప్రశ్న రావాలి. మనకైనా, మార్కండేయుడికైనా అదే మార్గం. అంతకన్నా ఏమీ మార్గం లేదు. మాటిమాటికీ ఇలా మాయ కమ్మడం. మాయ అంటే మరుపు. మరుపు రావడమే మాయ. మరుపెందుకు వస్తోంది అని ప్రశ్న వేసుకుని బాగా సంధానం పెంచుకుంటూ ఉన్నా, అప్పుడప్పుడూ మరుపు వస్తూనే ఉంటుంది. అది చూడండి! ఇదేంటి ఇట్లా మరుపు వస్తోందంటే, ఫరవాలేదు నీకే కాదు, చాలామందికి మరుపు వచ్చింది అని కొంత ఉపశమనం. ఎవరెవరికి, ఎంతెంత, ఎప్పుడెప్పుడు మహాత్ములకి ఎలా మరుపు వచ్చినాయో ఆ కథలన్నీ చదువుకొని కొంత ఉపశమనం పొందుతూ ఉంటారు. ఎంత జ్ఞానికైనా మరుపు రావచ్చు. మహామాయలో పడొచ్చు. తల్లి పని మరి అది కదా! “*జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హిసా, బలాదాకృష్య మోహాయ మహా మాయా ప్రయచ్ఛతి*” అన్నారు.

అంటే, నారదాదులకే మరుపు వచ్చింది. మనం దాటేసాం కదా గురువుగారు అన్నాడు నారదుడు. అనంగానే మాయ వచ్చేసింది కదా! అదే కదా మనకి మొదటొచ్చిన కథ. చతుర్ముఖ బ్రహ్మకీ మాయ వచ్చింది. రాలేదా? చాలాసార్లు వచ్చింది. చిట్టచివరికి ఈ మధ్య ద్వాపరయుగంలో కూడా మాయలో పడ్డాడాయన. సృష్టి అంటే మన్నుంచే జరగాలి కదా అనుకున్నాడు. మన్నుంచి చేస్తున్నాడు తప్ప, మన్నుంచి జరగాలనేముంది? కావాలంటే ఆయనే direct గా చేసుకోగలడు అని చూపించాడు శ్రీకృష్ణుడు. ఈయన ఆవులని, పిల్లలని, అందరినీ దాచేస్తాడు కదా! ఏం చేస్తాడో చూద్దాం అని. దాచేస్తే, అంతకన్నా శుభ్రంగా, వాళ్ళనే ఇంకొంచెం ఎక్కువ మురికి తీసేసి, అదే రూపాలు తయారుచేసి ఇచ్చాడు. ఇలా సంవత్సరం పాటు నడిపించేసాడు. ఆవులూ ఉన్నాయి, దూడలూ ఉన్నాయి, పిల్లలూ ఉన్నారు. అంతా యథాతథంగా నడుస్తోంది. ఈ లోపల ఆ గుహలో దాచేసిన వాళ్ళందరినీ బ్రహ్మ పోషించుకోవాల్సివచ్చింది కదా! మంచి పద్యం ఉంటుంది. ఆ పద్యం మీద ఎన్ని రాసానో మన నావాణిలో. “*వచింపన్ పనిలేదు బ్రహ్మకున్*” అని చెప్పి ఒక పద్యం ఉంటుంది. అక్కర్లేని పని చేసాడు బ్రహ్మ. ఎందుకు అవసరం లేని పని? సృష్టిలో అంతా తన నుంచే జరగాలి కదా! ఇప్పుడు తనకి తెలియకుండా

దేవుడు వచ్చేసాడు సృష్టిలోకి. అదీ తమాషా! మనకి చెప్పి వస్తాడండి? అంటే, మన permission కావాలి మన పైవాడికి అనుకోవడంలో అంతకన్నా మూర్ఖత్వం ఇంకోటి లేదు. వాడికి మన permission ఎందుకు? నీలాంటి ఇంకో పదిమందిని సృష్టించుకుంటాడు కావాలనుకుంటే. నావల్లే ఆయనకి, లేకపోతే ఏంలేదు అనుకోకూడదు.

అంచేత, ఈ మోహంలో బ్రహ్మ దేవుడు కూడా పడ్డాడు. త్రిమూర్తులలో శివుడు, విష్ణువు, బ్రహ్మ, ముగ్గురూ మాయకి గురి అయ్యారు. ఎందుకంటే, త్రిమూర్తులకన్నా అతీతమైన తత్త్వం అమ్మ తత్త్వం. ఆయన వెలుగు ఆమె. ఆ వెలుగే మాయ. అమ్మ అన్నా మాయ అన్నా ఒకటే. ఆ వెలుగులోంచే ఇవన్నీ తయారు చేసింది. కాబట్టి ఆ వెలుగుని అధిష్ఠించి ఉండరు. ఆ వెలుగులోంచి దిగితే ఆవిడకి లోబడే ఉండాలి. వెలుగు దాటి కూర్చున్నవాడు సృష్టి దాటి కూర్చున్నవాడవుతాడు. అంటే, వాడికి సృష్టితో పనిలేదు ఇంక. సృష్టితో పని ఉందని దిగిన ప్రతివాడు అమ్మకి దణ్ణం పెట్టకుండా పని అవ్వదు. నువ్వు ఎంత శివుడిని పట్టుకుని కూర్చున్నా మళ్ళీ దిగితే నేనేరా అంటుంది. నువ్వు ప్రార్థన నుంచి బయటకొస్తే ఉండేది నేనే నీకు. నా పొరల్లోంచి వాడిని నువ్వు చూసుకుంటూ ఉండొచ్చు. వాళ్ళాయన కదా ఆయన! అంచేత, ఈ మాయ కమ్మడం అనేది ఎవరికైనా, ఎంతటి వారికైనా తప్పదు. అంచేతే ఆ శ్లోకం రాసేసారు. ఎంత మహత్తరమైన జ్ఞానులైనప్పటికీ కూడా బలంగా ఈడ్చుకుని పోయినట్టుగా మాయ. అట్లు మోహం కలిపించేసి లాగేస్తూ ఉంటుంది ఎంతటి వాళ్ళనైనా. అందుకనే తల్లీ, నీ మాయకి మేమెంతటి వాళ్ళం అని దణ్ణం పెట్టుకోవాలి జ్ఞాని. లేకపోతే మరుక్షణంలో పడిపోతారు.

ఇలాంటిది మార్కండేయుడు కూడా కొన్ని అనుభవాలు జరిగినాయి. అట్లా జరగడం చేతనే ఆయన మాయాస్వరూపం తెలుసుకుందామనేటువంటి మరో ప్రయత్నం మొదలుపెడతాడు. అన్నీ రాయరు కదండి. కొన్ని రాస్తారు. లేకపోతే, మాయాస్వరూపం తెలుసుకోవాలనేటువంటి ప్రయత్నం, ఈ మొదట శివారాధన అంతటి ప్రయత్నం చేస్తాడు మార్కండేయుడు. ఎందుకలా చెయ్యవలసి వచ్చింది? మాటిమాటికీ మాయలో పడి, మళ్ళీ బయటపడి, మళ్ళీ మాయలో పడి, బయటపడి జరుగుతూ ఉంటుంది. అంచేత, ఈ మాయలో పడడం అనేది ఎంతవరకూ ఉంటుంది? నువ్వు నవమ ప్రకృతితో కాకుండా అ దశమంతో అనుసంధానం చెంది, ఇటు తిరగకుండా ఉండాలి. ఇటు తిరగకుండా ఉండడం అంటే మరి జీవన ప్రయోజనానికి తిరగాలి కదా! అంచేతే, మనం ఎప్పుడు పూజలు చేసినా ప్రకృతి పురుషులు ఇద్దరికీ చేయాలి పూజ. పురుషుడికి చేసి ప్రకృతిని వదిలేసి, ప్రకృతికి చేసి పురుషుడిని వదిలేసి చేసి లాభం లేదు. అంటే, ఒక పురుషసూక్తం చదివితే ఓ శ్రీసూక్తం చదవాలి. ఓ లక్ష్మీ అష్టోత్తరం చదివితే విష్ణు సూక్తం చదవాలి. ఒక అమ్మవారి స్తోత్రం చదివితే ఒక అయ్యవారి స్తోత్రం చదవాలి. దీని తర్వాత దానికా, దాని తర్వాత ఇదా అన్న ప్రశ్న వస్తూ ఉంటుంది. ఎవరు ముందు, ఎవరు వెనక? ఇటునుంచి వెళ్తే ముందు అమ్మ తగులుతుంది, తర్వాత అయ్య. అటునుంచి నువ్వు రాలేవు కదా! అంచేత, కొంతమంది ముందు అమ్మవారు, తర్వాత అయ్యవారు అన్నారు. నీకు, అటునుంచి దిగివచ్చే క్రమంలో ముందు అయ్యవారు తర్వాత అమ్మవారు. ఇవన్నీ ఎందుకు హాయిగా కృష్ణపక్షంలో ముందు అయ్యవారు తర్వాత అమ్మవారిని చదువుకోండి. ఎలాగూ అమ్మవారు తగ్గిపోతూ వస్తుంటుంది. శుక్లపక్షంలో ముందు అమ్మవారు తర్వాత అయ్యవారు చదువుకోండి. ఎందుకంటే, శుక్లపక్షంలో కాంతి పెరుతుతూ ఉంటుంది. కాంతి అంటే అమ్మవారే. అందుకని,

అయ్యవారిని చూడడం అంటూ ఏం లేదు, అమ్మవారిని చూడడమే. అయ్యవారితో చేరొచ్చు, అప్పుడు నువ్వు ఉండవు. అందుకని, అయ్యవారిని చూసామని ఎవరూ అనలేరు. అమ్మవారే అయ్యవారిగా కనిపిస్తుంది. అమ్మవారిలో అయ్యవారు ఎప్పుడూ ఉంటారు. వెలుగులో విద్యుత్తు ఎప్పుడూ ఉన్నట్టుగా.

ఆ విధంగా ఉన్నటువంటి తత్వాన్ని అవగాహన చేసుకోవడానికి ఒక సంకల్పం వచ్చింది మార్కండేయుడుకి. ఏమిటా సంకల్పం అంటే హరిని గూర్చి మొదలు పెడతాడు. అంటే, శివుడి గురించి చెయ్యకూడదా? హరిని గురించి చేయ్యడమేమిటి? ఒకే పిండి ఒకటి పూరీ అయితే రెండోది చపాతి అంతే. రుచిలో తేడా. కానీ రెండూ గోధుమ పిండే కదా! అంటే, ఒకే ఒక తత్వాన్ని మాయాస్వరూపంతో ఉండేటటువంటి దాన్ని హరిమాయ అంటారు. హరిమాయ అని ఎందుకు అన్నారండి? హరమాయ అని ఎందుకు అనలేదు? ఎక్కడ హరుడు ఉంటాడో అక్కడ మాయ ఉండదు. ఎందుకంటే, అంతా హరించేస్తాడు, మాయని కూడా హరించేస్తాడు. హర అంటే నశించేది. ఇంకేం ఉండదు, అదే ఉంటుంది. అది హర. అందుకనే, హరహరహర మహాదేవ అంటూ ఉంటాం. ఎందుకంటే, అక్కడుండేటటువంటి అజ్ఞానం అంతా హరించేసెయ్యి, వీలుంటే నన్ను కూడా హరించేసెయ్యి అని. మనం కూడా హరింపబడితే ఏం జరుగుతుందండి? శివుడై ఉంటాము. అందుకనే, "*శివోహం శివోహం*" అన్న మంత్రం. "*సోహం*" లాంటిదే "*శివోహం*" కూడా. శివోహం అంటే శివ అహం కదా! శివుడే నేను అనుకున్నవాడికి క్రమంగా అది జ్ఞాతమవుతుంటే శివుడే ఇది అంతా అని concurrent గా తెలుస్తుంది. నేను ఒక్కడినే శివుడు అనుకోకూడదు.

ఒకాయన మా ఊళ్ళో తాను శివుడే అని ఒక రోజున గభాలున గుర్తు వచ్చేసింది. అప్పటినుంచి నేను శివుడిని అనడం మొదలుపెట్టాడు. సరే, ఏదో కొంతమందికి బావుంది, కొంతమందికి బాలేదు. కొంతమంది నువ్వు college lecturer వి, నువ్వు శివుడేంటి అనడం మొదలుపెట్టారు. కొంతమంది పుస్తకాలూ అవీ జ్ఞానం ఉన్నవాళ్ళు, తెలిసినవాళ్ళు, అందరూ శివుడే కదా, ఆయనా శివుడే అన్నారు. ఆయన ఒప్పుకోలేదు. నేనే కదా శివుడు, వీళ్ళందరూ ఒప్పుకోరేంటి అంటాడు. చిన్న ముదురు, శివుడు గోల. ఏదో కొంత కొన్నికొన్ని జరగడం మొదలుపెట్టాయి. అతన్ని ముట్టుకుంటే జబ్బులు తగ్గిపోవడం, దానివల్ల touch healer అని పేరు వచ్చింది. ఆయనకి ఊళ్ళో కృష్ణమాచార్యులు అని ఒకాయన ఉన్నారని తెలిసింది. ఆ కృష్ణమాచార్యులుగారితో మనకెలా పరిచయం అనుకుని అడిగితే... నేను ఆ శివుడి గారికి auditor ని. అంతకన్నా ఏం కావాలి? శివుడికే auditor మనం! అంచేత, నా దగ్గరికి వచ్చి, మీకు కృష్ణమాచార్యులుగారు బాగా తెలుసు కదా, నాకు పరిచయం ఇస్తారా అన్నారు. మాస్టరుగారితో చెప్పాను ఇలా అడుగుతున్నాడని. దానికి ఆయన, అలాగే దానిదేముంది, మీ ఆఫీసులోనే పెట్టు అన్నారాయన. సౌదామినికి మాస్టరుగారు వచ్చారు, ఆయనా వచ్చాడు. అప్పుడే బాగా పూజ చేసుకుని... అంటే తన స్వరూపాన్నే పూజ చేసుకుంటూ ఉండేవాడు. తనే శివుడు కదా, ఇంక వేరే బొమ్మ ఎందుకండి? అవన్నీ నేను చూసాను. తప్పేముందిలెండి? అవన్నీ ఉన్నాయి మనకి మార్గాలు. అంచేత, తాను శివుడు కదా! అంచేత, మాస్టరుగారి దగ్గరకి వచ్చి ఆయన చేత అనిపించుకుంటే ఒక stamp వేసినట్టు ఉంటుంది, మాస్టరు EK గారు కూడా ఒప్పుకున్నారు నేను శివుడిని అని చెప్పుకోవచ్చు అని వచ్చాడు. సరే వచ్చాడు, కూర్చున్నాడు. నన్ను చూస్తుంటే మీకేమనిపిస్తోందని అడిగాడు ఆయన మాస్టారిని. ఏమనిపిస్తోందని అనాలి? మాములుగా మాస్టారు

సరదాగా ఉంటే ఎదో అనేసేవారు. వాడేదో కొంచెం వచ్చిపోయే తెలివిలో ఉన్నాడు, పాపం తంటాలు పడుతున్నాడని, నీలో శివుడు కనిపిస్తున్నాడు అన్నారు. అనంగానే ఇంక మరి ఇలా ఉబ్బిపోయాడండి మనిషి. అలా ఉబ్బిపోవడం చూసి, నీలో శివుడే, నాలోనూ, ఈ కుమార్ లోను, ఈ గోడలోను, ఈ table లోనూ ఉన్నాడన్నారు. అంటే, అంత బాగా పెంచిన బోరుకి అలా పెట్టారు. మీలో ఉన్న శివుడే, నాలోనూ, ఈ పక్కన కూర్చున్న కుమార్ లోను, ఆ table, ఆ కుర్చీ, ఆ కిటికి, వీటన్నిటిలో కూడా ఉన్నాడు అన్నారు. అంటే, ఆయన మొహం చిన్నబోయింది. అంటే, అప్పుడు చెప్పారు మాస్టరుగారు, అంతటా ఉన్న శివుడు కొన్నిచోట్ల ఉండకపోవడం, కొన్నిట్లో ఉండడం ఉండదు. మీలో మీకు శివుడు కనిపించడం మీరు చేసుకున్న పూర్వపుణ్యం అన్నారు. అదే శివుడు అందరిలో కనిపిచడం అనేటటువంటిది ఇంకా పుణ్యం చేసుకుంటే కనిపిస్తుంది అన్నారు. లేకపోతే ఏమవుతుంది? నేనే శివుడిని అనుకుంటూ అక్కర్లేని పనులు చేసి బోల్తా పడిపోతాము కదా!

ప్రతివాడికి కాస్త ప్రార్థన చేసేవాడిని ఆ ప్రార్థన చెయ్యనివాడిని చూస్తే ఒక చిన్న చూపు ఉంటుంది కదా! మనం గట్టిగా అభిషేకం దంచేసి, ఇంటికెళ్ళేసరికి ఇంట్లో వీటి మీద బొత్తిగా ఏమాత్రం interest లేనివాళ్ళు కనిపిస్తారు. మన ఇంట్లోనే ఉంటారు మనకి శివుడు. రాంగానే వీళ్ళంతా ఎదో కొద్దిగా దీనము, హీనము అయిన జీవులుగా కనిపించారనుకో నీకు, అప్పుడు నువ్వు చేసిన శివపూజ effect అంతా పోతుంది. ఎందుచేతంటే అక్కడ శివుడున్నాడు. నేను ఇట్లా ఉన్నానుగా ఇక్కడ చూడు అంటాడు. బాగా పూజలవీ చేసి వచ్చినవాళ్ళు, యాత్రలవీ చేసిన వచ్చినవాళ్ళు, రకరకాల దీక్షలు చేసినవాళ్ళు, అవయిపోయిన తర్వాత ఇంటికొస్తే, పరిసరాల్లోకి వస్తే అక్కడ మాములుగా ఉండేవాళ్ళు, ఎప్పుడూ కనిపించేవాళ్ళు, ఏమీ చెయ్యనివాళ్ళూ ఉంటారు కదా! మరి వాళ్ళలో ఎవడున్నాడండి? అందుకని, వాళ్ళని మనం అదో మాదిరిగా చూసామనుకోండి. చూస్తాంగా! మన ఇంట్లోనే పొద్దున్న ఏడున్నరకిగాని నిద్రలేవని ఉన్నవాళ్ళు ఉన్నారనుకోండి, మనం పొద్దున్నే ఐదింటికి లేస్తుంటే మనకి ఏమనిపిస్తుంది? వీళ్ళు ఎప్పుడు బాగుపడతారని అనిపిస్తుంది. అదేంటది? నువ్వు ఇప్పుడేగా బాగుపడ్డావు! వాడి time వచ్చినప్పుడు వాడూ బాగుపడతాడు. నిన్నటివరకూ నువ్వూ కూడా పడుకునేవాడివి కదా! ఇప్పుడు కూడా భయంచేత లేస్తున్నావుగాని భక్తిచేత కాదు. లేవకపోతే ఏమిటో అని కంగారుగా లేవడం కదా! అంచేత, నీలో శివుడు మేల్కొన్నప్పుడు నువ్వు లేస్తున్నావు. వాడిలో శివుడు వచ్చినప్పుడు వాడూ లేస్తాడు. అందరినీ వాడు చూసుకుంటాడు, తల్లిదండ్రులు చూసుకుంటారు, నువ్వు చూడక్కర్లేదు. మనం వీళ్ళందరినీ బాగా ఉద్ధరించుకోవాలి అనేది పెద్ద వ్యామోహం. ఏం లేదు. నీ చాకిరీ నీచేత చేయిస్తాడంతే! అందరికీ ఒకటే – service. నీ ద్వారా చేయించేది నువ్వు చేస్తూ ఉండు, వాడి ద్వారా వాడికేం జరగాలో నేను చూసుకుంటాను. అంచేత, ఈ లోకాన్ని ఉద్ధరించేస్తాను నేను అనడానికి వీలులేదు. ఒక్కడే! ఒకే తల్లిదండ్రులున్నారు లోకాన్ని ఉద్ధరించడానికి. అందుకని, ఈ ప్రపంచాన్ని ఉద్ధరిద్దాం, అది ఎట్లా ఉద్ధరిద్దాం, ఇది ఎట్లా ఉద్ధరిద్దాం. నీ పరిధిలో నీకేం చేతనయితే ఆ కాస్తా చేసుకుని మిగతా అప్పుడు... అంటే మొత్తం బాగుచేసుకోడానికి వేరే ఉన్నారు. ఊరంతా నేనే బాగు చెయ్యాలనుకునేవాడు మూర్ఖుడు. అంచేత, శివుడు అందరిలోనూ ఉన్నాడండి.

ఆ తర్వాత ఈ శివుడుగారు నేనొక దివ్యప్రయోజనానికి దిగివచ్చినట్టుగా అనిపిస్తోందన్నాడండి మాస్టరుగారితో. దాని కోసం నేను ఢిల్లీ వెళ్ళాలి. మరి నేను వెళ్ళిన పని అవుతుందా అవ్వదా అని అడిగాడండి మాస్టరుగారిని. శివుడయితే

ఆయనకే తెలియాలి కదా! ఇంకో శివుడిని అడిగాడన్నమాట! ఈ శివుడు ఆ శివుడిని అడగడం మొదలుపెట్టాడంటే ఇది రెండో రకం శివుడే కదా! అవుతుందా అవ్వదా అన్నాడు. అంటే, మాస్టరుగారు ఇట్లా పైనుంచి క్రిందకి చూసారు. మామూలుగా అయితే ఆయనకి నవ్వు వచ్చేస్తుంది, లేకపోతే ఏదో ఒకటి అనేస్తారు కూడా. ఆయనేం ఊరుకోలేరు. మరి ఆయన మహాసర్వంసహా చక్రవర్తి. ఎవరినైనా ఏదయినా అనేయ్యగలరు. కానీ ఆయన ఆపుకుని ఒకలా చూసారు. చూసి మళ్ళీ చూసి, ఒక విధంగా అయితే మీరనుకున్న పని అవుతుంది, ఒక విధంగా అనుకుంటే మీరనుకున్న పని అవ్వదు అని చెప్పారు. అంటే అప్పుడు అదేమిటి అన్నారు. అప్పుడు మాస్టరుగారు అన్నారు, అదే మరి! నీకోసమనుకుంటే అవ్వదు, లోకం కోసం అనుకుంటే అవుతుంది అని చెప్పారు. మీరు శివుడని ప్రపంచానికి తెలియాలనే ఉద్దేశ్యంతో మీరు ఢిల్లీ వెళ్ళి ప్రయత్నం చేస్తే ఏం అవ్వదు, అవమానం పాలవుతారు. మీరనుకున్న పని లోకానికి సంబంధించి, లోక శ్రేయస్సుకి సంబంధించి, మీ గురించి కాక లోకం గురించి అనుకున్నట్టయితే అవుతుంది అని చెప్పారు. అలా అంటే ఇంతెందుకని, మరీ national level లో ఎందుకని, local level కి వచ్చేసాడాయన. వచ్చేసి, ఇక్కడ ఒక భవనం ఉంది. ఈ భవనం కొన్ని ఇబ్బందుల్లో పడ్డది. దాన్నుంచి ఆ భవనాన్ని రక్షించి, ఆ యజమాన్ని రక్షించడానికి వీలుపడుతుందా అని అడిగాడు. అదేంటండి? అది ఎక్కడ ఇది ఎక్కడ? అంటే, గురువుగారు చూసారంటే X-ray అది. ఆ భవనం ఇబ్బందుల్లో తప్పించి తనది చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడాయన. యజమానిని రక్షించడం లేదు. యజమాన్ని కూడా తన వానిగా చేసుకోవాలని ఉన్నాయి ఆయన కార్యక్రమాలు. అంటే, చెప్పేసారు plain గా. ఒకటే సూత్రం దేనికయినా అన్నారు. నీకోసం అంటే ఏం పని జరగదు. ఎందుకంటే శివుడు ఎప్పుడూ తన కోసం అంటూ ఏం చెయ్యలేదు అని చెప్పారు. నువ్వు శివుడా కాదా నువ్వు తేల్చుకో. మొత్తం శివలీలలు విన్నా, శివ కథలు విన్నా, తన కోసం ఏం చేసుకున్నాడండి శివుడు? ఎదుటివాళ్ళ కోసం విషం తాగినవాడు కదా! శివుడు కన్నా మించిన పరహితం ఏం ఉన్నది? ఏంలేదు. దేనికయినా ready నే, అట్లా ఉంటాడు శివుడు. మరి నువ్వు శివుడు అనుకున్నప్పుడు నువ్వు ఇతరుల కోసం బతికేటట్టయితే బతుకుతావురా, లేకపోతే నాశనం అయిపోతావు అని చెప్పారు మాస్టరుగారు. ఆయనకి అర్థం కాలేదు. వస్తానన్నారు మాస్టరుగారు, ఒకటి వెలిగించారు. ఆయనకి ఇదొకటి ఉండేది. అలా హాయిగా gold flak సిగరెట్టు తీసారంటే, king అయిపోతారు ఆయన. అంచేత, అలా ఒకటి వెలిగించారు, వస్తానన్నారు, వెళ్ళిపోయారు. ఈయన పాపం అలా ఉండిపోయాడు, తికమక కదా! ఏమిటండి గురువుగారు ఏం చెప్పారు అని అడిగాడు నన్ను! ఏం చెప్పారని చెప్తాం! ఒక్కటేనండి, ఆయన చెప్పినట్టే మీ కోసం ఇంక బతకొద్దు అని చెప్పాను. మీ కోసం బతకకుండా పదిమంది కోసం బతకండి. అప్పుడు మీరు కచ్చితంగా శివుడుగా కాపురం అయిపోతారు. మీ కోసం బతికితే అంతే సంగతులు అని చెప్పాను.

అంచేత, ఈ విధంగా మనకి, ఒక్క చిన్న దర్శనం అయితే మాయలో పడిపోతాం. చిన్న దర్శనం, చిన్న అనుభూతి చాలు. అబ్బో! అప్పటికే మన గురించి చాలా feeling వచ్చేస్తుంది కదా! ఎంత feeling ఓ బాబోయ్! ఒక్కొక్కడిదీ feeling చూస్తే ఈ hall అంత ఉంటుంది. బుర్ర ఇంతుంటుంది పిల్లి బుర్రంత. వాడి feeling ఏమో ఈ hall అంత ఉంటుంది. వాడు వస్తూ ఉంటేనే, అమ్మో! అనిపిస్తుంది. అంత feeling ప్రతివాడికి వాడి గురించి, దేవుడి గురించి కాదు,

వాడి గురించి. అంత feeling దేవుడి గురించి ఉంటే మంచి aura కనిపిస్తుంది, వెలుగు కనిపిస్తుంది. ఈ feeling grey matter గా కనిపిస్తుంది. ఓరి బాబోయ్! ఇంత పిల్లి బుర్రలో ఇంత పెట్టుకున్నాడా వీడు, వీడి గురించి అని! తనని తాను మర్చిపోయే మార్గంలో ప్రవేశించి, తననే తాను ఎక్కువ గుర్తుచేసుకునే అంత మాయలో పడిపోతారండి మార్గంలో. అంతకన్నా ఇంక మాయ ఏం కావాలి? ఇప్పుడు ఇంతమంది ఇన్ని రకాలుగా నన్ను ప్రశంసిస్తూ, నాకు మర్యాద చేస్తూ, కాలు క్రింద పెట్టనివ్వకుండా, సంచి కూడా పట్టుకోనీకుండా, ఒక అవిటివాడిగా నన్ను తయారు చేస్తున్నప్పుడు, నేను ఏమనుకోవాలి నా గురించి? ఎరా! రోజురోజుకీ అవిటివాడివి అయిపోతున్నావా అనుకోవాలా? ఓహో! వాడు రాలేదు, వీడు రాలేదు, ఇంకా ఎవడూ పట్టుకోలేదు అనుకున్నామనుకోండి. అనుకోవచ్చుగా! ఏదయినా అనుకోవచ్చు. నీబట్టే అది! అంచేత, నీ గురించి మర్చిపోయే మార్గంలో నీకు కొంచెం చిన్నచిన్న అనుభూతులు అవుతుంటే ఇంక నీ గురించి నీకు ఎంత వచ్చేస్తుందండి? మరి మనమే ఇలా అనుకుంటే, మార్కండేయుడు శివానుగ్రహం చేత యముని మెప్పుపొంది తిరిగివచ్చినవాడు ఎంత అనుకుని ఉండాలండి? అంత అనుకోవడం వల్ల ఎంత అనుసంధానం చేసుకున్నా మధ్యమధ్యలో నేనది కదా, నేనిది కదా అని గుర్తువస్తూ ఉంటే మాయే కదా! నువ్వు ఎంత లోపల పెరుగుతుంటే నిన్ను అంత మాయ కమ్మడానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

చిన్నమాయ, పెనుమాయ కదా! పాటుంది కదా! అటు నేనే, ఇటు నేనే, అది మాయ, ఇది మాయ. చినమాయకు పెనుమాయ అన్నాడు కదా! ఏం సామాన్యమైన విషయాలు కాదవి. వాడు ఘటోత్కచుడే పెద్ద మాయగాడు కదా! వాడేదయినా అలా చేసెయ్యగలడు. మనబోటి వాళ్ళు కొరకారు వాడికి. పాండవులే ఎవరూ కొరకాదు వాడి ముందు. అంతటి మాయ చెయ్యగలడు. మరి ఆ మాయకి ఆ మాయ వచ్చి తగిలింది కదా! అందుకని ఏమన్నాడు? చినమాయకు పెనమాయ అన్నాడు. నీది చిన్నదిరా నా మాయ ముందు అన్నాడు.

అంచేత, మాయ మన్ని ఎలాగయినా ఏడిపించెయ్యగలదు. అంచేత, మాయకు దణ్ణం పెట్టుకుంటే? తల్లీ నీ అనుగ్రహం చేత బతుకుతున్నాను, నేనేం పెద్ద గొప్పవాడిని కాదు. అంతా నువ్వు చేస్తున్నావు. సృష్టిలో అంతా అధిష్ఠానం అమ్మదే. అమ్మని కాదని ఎవడూ ముందుకు పోలేడు. అంచేత, ఈ మాయలో పడిపోకుండా నువ్వే కాపాడుతుంటే నేనేదో అడుగులేస్తుంటాను. ఈ అడుగులేస్తున్నట్టుగా మోహం కూడా నువ్వు కలిపించేదని చెప్పుకోవడమే. ప్రతీది చెప్పుకోవాలి లోపల. అందుకనే, అడుగడుకీ దండాలు పెట్టారు. అడుగడుకీ దండాలంటే, మనకేవో కోరికలు పెట్టుకుని ప్రతిమెట్టుకి పూసుకెళ్తే కాదు కదా! మెట్లన్నీ పాడయిపోతాయి. ఈ గుడి మెట్లు నిండా పూసేస్తాం కదా! మనకేవో లోపల కోరికలు. అవన్నీ అయితే ప్రతిమెట్టుకీ పూసుకుని వెళ్తారు, ఇవన్నీ పెట్టుకుంటాం కదా! అంటే, నువ్వు వెళ్తున్నానే కదా feeling. నేను ఉండకూడదు కదా! అసలు కథంతా నేను పోవాలి ఇక్కడినుంచి. నేనందులోకి వెళ్లిపోవాలి. అది ఒక్కడే ఉండాలి. అప్పుడు వాడేం చేస్తాడు? నిన్ను పెంచుతూ ఉంటాడు. నువ్వే పెరుగుతుంటే? Cut చేసేస్తాడు. నువ్వు పెరిగితే అమ్మ తగ్గిస్తుంది. ఏం భయం లేదు. వాడు పెరుగుతుంటే అమ్మకి అభ్యతంరం లేదు. ఎంత బావుందండి? ఇంతకన్నా suspense movie ఏముందండి life లో? మనం పెరుగుతున్నామా? మనలో దైవం పెరుగుతున్నాడా? అంటే, దైవం పేరు చెప్పుకుని మన్ని పెంచుకుంటూ ఉంటాం మనం. చాలా మోసం! నిజంగా మన్ని చూస్తే మనకి డోకు పుడుతుంది. ఇంత ఉందిరా నీ

గురించి నీకు అని తెలుస్తుంది. పేరు వాడిది, నోరు నీది. అంతే కదా! గురువుగారని అవీ ఇవీ తెచ్చిపెడితే, మనం ఇంకా అది తేలేదే, ఇది తేలేదే అని అడిగాం అనుకోండి. ఎవరికని తెచ్చిపెడుతున్నారండి పెట్టే వాళ్ళు? వాడు నమ్మిన గురువుకి పెడుతున్నారు. నీకు ఇవ్వాళ్ళ ఇది పెడుతున్నారు అని మనం చెప్పుకోవాలి. ఇవన్నీ నీవే, నావి కాదు అని తెలిసి ఉండాలి. భరతుడు రాజ్యం నాది కాదన్నయ్యా, నీదే అని చెప్పాడు. ఎన్నడూ దాని జోలికి పోలేదు. సింహాసనం మీద పాదుకలు పెట్టి, he remained a trustee all through. Never had even an iota of thought that he should be the king. కోసినా లేదు. అలా ఉండాలి. దైవ ప్రతినిధి. అంతా దైవానికి సంబంధించినది. అందరూ దైవమునకు చెందినవారే. వారు చేసేటటువంటి పూజలు, సేవలు, ఆరాధనలు, తనకు చేస్తున్నప్పటికీ కూడా, తనలో దైవానికి సమర్పణ చేస్తే, వాడు గురువు అవుతాడు. తానే పుచ్చుకుని, వాటినన్నిటినీ చూసుకుంటూ, ఏమిటి ఇలాంటివి ఇచ్చారు, అలాంటివి ఇచ్చారని అనుకుంటూ ఉన్నామనుకోండి, ఇంక వాడి కొట్టు మూసేస్తారు. ఎక్కడోక్కడ పడిపోతాడు.

అంచేత, ఈ మార్కండేయుడి కథలో ఆయనకి మాయ మాటిమాటికీ తారసిల్లుతూ వచ్చింది. ఏమిటి ఈ మాయ మనకి, ఎంత సాధన చేసినా మాయని దాటలేకపోతున్నాను అని అనిపించింది. మాయని దాటుతామని అనుకోవద్దని కృష్ణుడు తర్వాత భగవద్గీతలో మనకి చెప్పడం వల్ల, మనకి మార్కండేయుడంత పరిస్థితి కూడా లేదు కాబట్టి, అందులోనే పడి ఉన్నాం. అది వేరే సంగతి. కాని ఒక విషయం సత్యం – మాయని ఎవ్వరూ దాటలేరు. మాయా స్వరూపుణి ఆయన ప్రకృతే ఈ మాయని దాటించగలదు, ఒకటి. లేదూ, ఈ మాయకి ఆధారమైన ఆ తత్త్వం దాటించగలదు. వీళ్ళిద్దరికే! మాయని తీసేటటువంటి అధికారం మాయకి ఉన్నది, మాయకి అధిష్ఠానమైన తత్త్వానికి ఉన్నది. అంచేత, మాయ అధిష్ఠానంగా ఉన్నటువంటి తత్త్వాన్ని ఆరాధన చెయ్యడం మొదలుపెట్టాడు మార్కండేయుడు. అందుకని హరిపూజ చేసాడు. హరి అంటే దిగి వచ్చేవాడండి. హరుడంటే దిగడు. దిగి వస్తే హరి అవుతాడు. దిగి రాకపోతే హరుడు. ఆయనకి అసలు సృష్టితో పని లేదు. Emergency లో తన అంశలను పంపిస్తూ ఉంటాడు. హరి దిగుతాడు. దిగుతాడు కాబట్టి హరి అన్నారు. తత్త్వానికి దిగితే హరి. ఆ పదాల్లో అట్లా ఉంది. “హ” “ర” – “హ” “రి”. “ఇ” శబ్దం ఉంటుంది. “అ” శబ్దంతో “ఇ” శబ్దం చేరితే, “ఈ” అమ్మ. “*తామ్ పద్మినీమ్ ఈమ్ శరణమ్ అహం ప్రపద్యే*” అంటాం కదా! శరణమ్ ఎవరికి? “ఈమ్” కి. అందుకని, హరి అంటే మాయతో కూడినటువంటి దేవుడు. హర అంటే మాయకి అతీతమైన దేవుడు. ఈ బొమ్మల్లో ఇరుక్కుపోకండి. శివుడంటే మనకి ఒక బొమ్మ. మెడలో పాము ఉంటేగాని ఒప్పుకోము. విష్ణువు అంటే ఒక బొమ్మ – చేతిలో చక్రం ఉంటే అదే! ఎవరు ఏదయినా పట్టుకోవచ్చు కదా! మనకి ఈ బొమ్మలు mind అలా fix చేసేసింది. Waste అండి. అంచేత, దిగితే హరి, దిగకపోతే హరుడు – అదే తత్త్వం. హర హరి అయ్యిందిట అంటే మాయతో కూడాడు అని అర్థం. అందుచేత, మాయతో కూడిన వాడిని ప్రార్థన చేసాడండి. అంతేగాని అది వేరు, ఇది వేరు, ఈ పిచ్చి గోలలన్నీ ఎప్పటికీ తెమలవు. అలా అనుకునే వాళ్ళు అక్కడే ఉంటారు బయట. అంచేత, హరుడే హరి అయిపోతుంది. దిగితే హరి, దిగకపోతే హరుడు. అంచేత, దిగిన వాడిని పట్టుకున్నాడు. దిగిన వాడితో కూడా ఆమె సఖ్యతతోనే ఉంటుంది. అందుకనే మన పెద్దలు హరిమాయ అన్నారు తప్ప హరమాయ అనలేదు. ఎందుకట్లా అనలేదు? హరుడు దగ్గర మాయ ఉండదు. హరి దగ్గర మాయ ఉంటుంది. ఆయనకి అవసరం కూడా!

అంచేత, హరి మాయని గూర్చి తెలుసుకోవడం కోసం హరిని గూర్చి తపస్సు చేసాడు. అలా తపస్సు చేస్తుంటే క్రమంగా మాయా స్వరూపం అంటే తెలియడానికి కొంచెం మాయ కమ్ముతున్నప్పుడే ఆహా! ఇది మాయ అని తెలియడం మొదలుపెట్టింది. కమ్మేస్తే ఏం ఉంది? కమ్మేస్తే twist అయిపోతాము. మార్గం నుంచి తప్పుకుంటాం. కొన్నాళ్ళ తర్వాత తెలుస్తూ ఉంటుంది, ఓహో! మాయలో పడ్డాం అనుకుని మళ్ళీ వస్తుంటాము. అట్లా అలా twist అవుతుండగానే తెలియడం మొదలుపెట్టింది. ఇప్పుడు విశ్వామిత్రుడు కథలో బ్రహ్మర్షి అవ్వాలని ఆయన మొదలుపెడితే మాటిమాటికి పక్కకి వెళ్ళిపోయాడు కదా! చిన్నచిన్నవాటికి లొంగలేదనుకోండి, పెద్దపెద్దవి వచ్చేసాయి, లొంగిపోయాడు. ఓహో! ఇది మాయ అనుకున్నాడు. Time waste కదా! కొన్ని జన్మలు వెళ్లిపోవచ్చు అట్లా. జింకను పెంచుకున్నటువంటి భరతుడు జింక మీద వ్యామోహం మీద మళ్ళీ జింకగా జన్మ ఎత్తాల్సివచ్చిందని చెప్తారు కదా! మనకెన్ని వ్యామోహాలు ఉన్నాయో! మనకన్నీ వ్యామోహాలే! ఇల్లు వ్యామోహం, ఇంట్లో మనం పెంచుకునే వాటిమీద వ్యామోహం, మనం పెంచుకునే జంతువుల మీద వ్యామోహం. ఒక ఆవుని పెంచామనుకోండి, దాని మీద వ్యామోహం. మొన్న నాకు ఒక mail వచ్చింది. ఒక full పేజీ ఉంది. తర్వాత చూద్దాంలే, తీరిక లేదనుకుని వదిలేసా. తర్వాత తెల్లవారుఝామున లేచి ఒక రోజు, సరే ఎదో చూద్దాం ఈ mail అని చూస్తే, ఆ mail లో ఉంది – ఆవిడ పిల్లి చచ్చిపోతోందట! ఆ పిల్లి తనతోపాటు పదేళ్ళు ఉందిట. ఆ పిల్లి గుణగణాలంతా నాకు వివరించుకుంటూ వచ్చింది. ఇప్పుడీ పిల్లి చచ్చిపోతోందిట. కాబట్టి నేనేం చెయ్యాలని ఒక పేజీ రాసిందండి! ఆవిడ పిల్లి వ్యామోహం అంతా అందులో ఉంది. ఉంటుంది. ఎందుకంటే సాంగత్యం వల్ల ఏర్పడుతూ ఉంటుంది. ఆవిడకి ఏర్పడడంలో తప్పేముంది పదేళ్ళు పిల్లిని పెంచినప్పుడు? జింకని పెంచితే జఢభరతుడే... జరఢుడు ఆయన. ఆయనకే వచ్చినప్పుడు వ్యామోహం? దేనిమీదయినా పూసుకున్నకొద్దీ వ్యామోహం వస్తుంది. అందులో తత్త్వం చూడకుండా ఏదయినా పూసుకుంటే దానిమీద వ్యామోహం.

అలా వ్యామోహం వచ్చి అందులో ఇరుక్కుపోయి, దుఃఖపడి, మళ్ళీ బయటకు రావడం కన్నా, వ్యామోహం కలుగుతున్నప్పుడే తెలియడం మొదలుపెట్టింది మార్కండేయుడికి. ఓహో! ఇలా కూడా ఉంటుందా అని తెలిసింది. అంటే, ఎన్ని రకాలుగా ఉంటుందో మనకి తెలియదు. ఎన్ని రకాలుగానైనా ఉండొచ్చు. అంచేత, వ్యామోహం కలగగానే హరికి దణ్ణం పెట్టుకునే వాడు. అలా చేసుకుంటూ ఉంటే, మొత్తానికి ఒక రోజు హరి దర్శనం అయ్యింది మళ్ళీ. మళ్ళీ ఏమిటి? వాళ్ళ నాన్నకి హరి దర్శనం అయ్యింది అంతకుముందు కదా! ఆయనే కదా చెప్పాడు, నువ్వేమిటిరా, కుర్రాడిని కోరావు, కాని వాడికి ఆయుర్థాయం కోరలేదన్నాడు కదా! ఆయుర్థాయం సంపాదించుకున్నాడుగా ఎట్లాగో అట్లా! అందుకని హరి దర్శనం అయ్యింది. చాలా ఆనందం వేసింది. హరి మంగళ స్వరూపం అంటే మనం ఊహించలేము. అందానికి అదే. ఇంక అంతకన్నా అందం లేదు. సృష్టిలో అందం అంటే విష్ణువే. దిగి వచ్చిన దైవం. ఆ అందం చూడు. అబ్బో! భయంకరమైన వ్యామోహం కలిగింది. నవ్వాడు విష్ణువు. నవ్వుతాడు కదా! నవ్వే వాడే విష్ణువు. అంచేత, ఆయన నవ్వులోంచి బోల్డు మాయ వచ్చేస్తుంది. అలా చూస్తూ ఉండిపోయాడు. చూస్తూ ఉండిపోతే, అప్పుడు విష్ణువు గమనించి, ఏమిటి విషయం అని అడుగుతాడు. ఎందుకంటే, ఈ దైవ దర్శనం జరిగినవాళ్లకి ఇంక నోరు పెగలడం ఏమీ ఉండదు. అట్లా ఉండిపోతారంతే. మనం చూడండి, నాలుక వెళ్ళబెట్టి చొంగలు కారుస్తూ చూస్తూ ఉంటాము. అట్లా ఆ ప్రక్రియ

ఉండదుగాని, ఆ జీవుడు అట్లా అనుసంధానం చెంది ఉంటాడు. తను ఉండడు. మళ్ళీ వాళ్ళ వల్ల తన బయటకి వస్తాడు. ఏమిటి విషయం అని అడిగితే, నీ మాయా స్వరూపం నాకు అనుగ్రహించి, దానియొక్క దర్శనం చేయిస్తావా అని అడిగాడండి మార్కండేయుడు. అలా అడిగిన వాళ్ళు ఎక్కువమంది ఎక్కడా లేరు. మార్కండేయుడి speciality అది. అది ఆయన mark. అట్లా చాలా mark లు ఆయన ఏర్పాటు చేసాడు. అంటే, distinguished mark, అందుకని మార్కండేయుడు. అంటే, అలాగే తప్పకుండా అంటాడు విష్ణువు. నువ్వు అలాగే చేసుకుంటూ ఉండు, సమయం వచ్చినప్పుడు చూపిస్తాను అన్నాడు.

ఈ లోపల ఈయన కార్యక్రమాలన్నీ పూర్తయిపోయినాయి. గృహస్తు ధర్మాలు అయిపోయినాయి, తల్లిదండ్రులూ వెళ్ళిపోయారు. వాళ్లకి ఉత్తర క్రియలన్నీ అయిపోయినాయి. తన పిల్లలు అందరూ కూడా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. పొందవలసిన జ్ఞానం పొందాడు. హర దర్శనం, యమ దర్శనం, హరి దర్శనం అన్నీ అయ్యాయి. ఇప్పుడేం చెయ్యాలి? ఇంక మాయని చూడాలంతే కదా! అదొక్కటే మిగిలింది. అంచేత ఏం జరిగింది? ఇంక చాల్లే, చూపిస్తానన్నాడు కదా భగవంతుడు, తన వచ్చిన పని అయ్యింది అనుకున్నాడు. అందుకని, ఇప్పుడు ఇంక మనం శరీరం వదిలెయ్యచ్చు అనుకున్నాడు. శరీరం వదలడం అనే విద్య తనకి ఈ లోపల సంధాన ప్రక్రియ వల్ల ఏర్పడుతూ ఉంటుంది అది. ప్రతినిత్యం ఈ సంధానం ఎప్పుడూ వదలలేదు ఆయన.

సంధానం అంటే ఏమిటి? నీ మనస్సు నీ శ్వాసతో సంధానం చెందాలి. నీ శ్వాస అంటే నీ ప్రాణం, అది నీ ప్రాణస్పందనం చేరాలి. అప్పుడు నువ్వు ప్రాణమందున్న ప్రజ్ఞగా ఉంటావు. నిజానికి సత్యమేమిటంటే ప్రజ్ఞ యందు ప్రాణముంది. ప్రజ్ఞ నుండి ప్రాణం దిగి వస్తూ ఉంటుంది. ఆత్మ యందు ప్రజ్ఞా, ప్రాణము రెండూ ఉంటాయి. నీవు ప్రజ్ఞవు. నీ ప్రాణము నీ నుంచి ఈ శరీరాన్ని తయారు చేసి, దాన్ని నడిపిస్తూ ఉంటే, నువ్వు ప్రజ్ఞా స్వరూపుడిగా నువ్వు చెయ్యవలసిన కార్యక్రములన్నీ చేస్తూ ఉంటావు. అంటే, రెండు streams మనమే. ఆత్మ రెండు streams గా నడుస్తూ ఉంటుంది – ఒకటి ప్రజ్ఞా సూత్రము, మరొకటి ప్రాణ సూత్రము. ప్రాణ సూత్రము దీన్నంతా నడిపిస్తూ ఉంటుంది – ఈ శరీరాన్ని, దానికి ఆహార స్వీకరణ, అవన్నీ ఏర్పాటు చేస్తుంది. ప్రజ్ఞ బుద్ధి ద్వారా మనస్సు, ఇంద్రియములు, శరీరం ద్వారా పని చేస్తూ ఉంటుంది. మనం దిగి వచ్చేటప్పుడు ప్రజ్ఞ వచ్చి, అందునుంచి ప్రాణం ఏర్పడుతుంది. అట్లా హృదయమందు ఒక కేంద్రము, ఆజ్ఞ యందు ఒక కేంద్రము ప్రధాన కేంద్రములుగా ఉంటాయి మనలో. అంచేత, ఈ ప్రాణ కేంద్రము దగ్గర మనకి మనస్సు పని చేస్తుంది. హృదయము నందు ఈ ప్రాణము పంచ ప్రాణములుగా మనలో పని చేస్తూ ఉంటాయి. మనం మనసులోకి వచ్చి పనిచేస్తూ ఉంటాము. అంటే, అన్నీ అజ్ఞా కేంద్రము నుంచి దిగి వస్తాయి. అంచేత, ఈ దిగి వచ్చిన వాటిలో ఏ విధంగా మనం విప్పుకుంటూ వచ్చేసామో, మళ్ళీ అట్లానే మడుచుకుంటూ రావాలి వెనక్కి.

అంతే కదా! పొద్దున్నే చొక్కా తీసాం వేసుకుందామని. అన్ని మడతలు తీసాం. తీరా తీస్తే దానికి గుండీ లేదనుకోండి, మరి ఇంకో చొక్కా వేసుకోవాలంటే ఏం చేస్తావు? బుద్ధిమంతుడివయితే దాన్ని మళ్ళీ మడత పెట్టేస్తావు. మడత పెట్టేసి, లోపల పెట్టేసి, మళ్ళీ ఇంకోటి తీసుకుంటావు. బుద్ధిమంతుడు కాకపోతే అక్కడే వదిలేస్తాడు, ఎవడో ఒకడు

మడతపెడతాడని. మన పని ఇంకోడు చెయ్యాలని అనుకోవడంలోనే ఉంది రోగం అంతా. మన పని మనమే చెయ్యాలి. యోగికి అది ప్రధానమైన నియమం. నీ పని నువ్వు చేసుకుంటే, ఎవరయినా సహకారం చేస్తే అది వేరే సంగతి. సహకారం అందిస్తే, వాడు చెయ్యడం అలవాటయిపోతే నీకు, వాడి మీద ఆధారపడడం మొదలు పెడతావు. అందుకని, ఎప్పుడూ ఉద్యుక్తుడై ఉండాలి తన పని తాను చెయ్యడానికి. తన luggage తనే మోసుకోడానికి ఉద్యుక్తుడై ఉండాలి. వాడొస్తాడా, వీడొస్తాడా అని చూడకూడదు. ఇంకా వాళ్ళు రాలేదేంటి అనుకోకూడదు. అలా భావన వచ్చిందంటే నువ్వు యోగివి కాదు. నీ పని నీదే. ఇంకోళ్ళు నీకు సహకరించడమనేది దైవ కృప. ఏదో అలా వచ్చిన వాడిని, ఏరా! ఇంత late గా వచ్చావు అని కోప్పడకూడదు. నీ training కోసమే అట్లా వచ్చాను అన్నాడనుకోండి వాడు? వాడు అనడు ఎందుకంటే వాడిలో ఈశ్వరుడు అలా చూస్తాడు. మన భాషలో అర్థం చేసుకోవాలి. అసలంటూ వచ్చాను కదా వీడికి మోయ్యడానికి, మళ్ళీ ప్రశ్నలేంటి అన్నాడనుకోండి. అంచేత, మన పని మనమే చేసుకోవాలి. ఈ పని కూడా అంతే. మన పని మనమే చేసుకోవాలి. ఎవడో చేస్తాడనుకోబోకండి. అన్నీ ఆయనే (గురువుగారే) చేసేస్తాడు అనుకుంటూ ఉంటారు. నువ్వు చేస్తే అయన సహకారం ఇస్తాడు. నువ్వు చేసుకుంటూ ఉంటే ఆయన తన బలాన్ని నీకిస్తాడు. నువ్వు అసలు చెయ్యకపోతే ఏ బలం ఇవ్వడు. నేను చెయ్యమన్నది నువ్వు చేసుకుంటూ ఉంటే, నీకు చెయ్యాల్సినది నేను చేస్తానంటాడు. నేనేం చెయ్యను, చూద్దాం ఎట్లా చేస్తాడో అంటే? అట్లా ఉంటారు కొంతమంది.

ఒకాయనకి అసలు జీవితమే నడవడం లేదు. కుటుంబం ఉంది. సరే, బాధపడుతున్నాడు కదా అని నేనన్నాను, పోనీ నెలకి ఇంత చొప్పున ఇస్తానులెండి అన్నాను. ఎప్పుడో దశాబ్దాలు అయిపోయింది. సరే పుచ్చుకుంటున్నాడు. Comfortable గానే ఉంది పుచ్చుకోవడం. బతికేస్తున్నాడు. ఒక రోజు నాకు తెలిసినాయనతో అన్నాట్ట, ఎన్నాళ్ళు ఇస్తాడో చూస్తాను అని. అదా! అంటే ఏమిటి? Irresponsible. అంతే కదా! నువ్వు ఏదో కష్టంలో ఉన్నావు, నువ్వు బాగుపడేంత వరకూ సహాయం అంటే, నేను బాగుపడను, వాడే నన్ను పోషించాలి అనేటటువంటి స్థితికి వచ్చేసాడు. Next month వస్తారు కదా, వస్తే ఇవ్వాళ నుంచి ఏమీ లేదని చెప్పాను. అదేమిటి అన్నాడు. ఇవ్వాళ్ళ నుంచి you take care of yourself అన్నాను. అలా అంటే ఎలా, మరి ఈ నెల ఎలా అన్నాడు. కనీసం నెలయినా ఉండాలి కదా అన్నాడు. అందుకనే, ఆ మాట చెప్పి ఇప్పుడు ఇస్తున్నాను ఈ నెలకి అని చెప్పి ఇచ్చేసాను, ఇంక నీ మీద నువ్వు బతుకు అని. అట్లా మనం సాయం చేస్తే ఎవడికోసం చేస్తానన్నట్టుగా ఉన్నాడనుకోండి, సాయం చెయ్యకూడదు వాడికి.

సద్గురువు నిన్ను తనంతట వాడిగా చేస్తానంటూ ఉంటే, వాడు ఎట్లా చేస్తాడో చూస్తాను, వాగ్దానం చేసాడు కదా అంటే? తప్పు కదా! మనమే ప్రయత్నం. మనస్సు శ్వాస మీద పెట్టండి. ఎన్ని సార్లు చెప్పుకోలేదు, ఎన్ని చోట్ల రాసుకోలేదు! అది first step. అంటే, ఈ పేక ఇలా విడదీస్తూ ఉంటాం, మళ్ళీ మడిచేస్తూ ఉంటాం. ఈ విప్పదీస్తే, విచ్చుకుని బయటకొస్తూ ఉంటాం. ముడుచుకుని లోపలకి వెళ్తూ ఉండాలి. మనసు లోపలకి వెళ్ళాలంటే శ్వాస మీద పెట్టాలి. తప్పదు. శ్వాస ముడుచుకుంటే స్పందనం మీద ఉంటుంది. స్పందనం ముడుచుకుపోతూ ఉంటుంది. ముడుచుకుపోవడం అంటే అది అలా పుట్టింటికి... ప్రతివాడూ పుట్టింటికి వెళ్ళిపోవాలండి. అదీ ప్రయత్నం ఈ సాధనలో. మనసుకి పుట్టిల్లు శ్వాస. శ్వాసకి పుట్టిల్లు స్పందనం. అసలు మనసుకి, శ్వాసకి పుట్టిల్లు స్పందనం – అది ఎక్కువ సత్యం. ఎందుకంటే, స్పందనం

నుంచే రెండూ బయటకు వస్తాయి. అందుకని స్పందనంలోకి వెళ్తే, శ్వాస, మనసు రెండూ స్పందనంలోకి చేరిపోతాయి. ఈ స్పందనానికి సహజమైనటువంటి లక్షణం ఏమిటంటే అది ఊర్ధ్వగతి చెందడం. నువ్వు ఇట్లా ప్రజ్ఞతో బయట తిరుగుతూ ఉంటే, అది నీకు ప్రాణాపానములుగా పని చేస్తూ ఉంటుంది. నువ్వు ఎప్పుడయితే లోపలకి వెళ్తావో, ప్రాణాపానములు రెండూ కూడా సమానమైపోతాయి. అప్పుడు సమాన వాయువు నిన్ను తీసుకెళ్ళి ఉదాన వాయువుని అట్లా ఊర్ధ్వముఖం వెళ్ళే వాయువుకి అప్పచెప్పేస్తుంది. ప్రజ్ఞనే! మనసులో ఉండే ప్రజ్ఞ స్పందనంలోకి వెళ్తే అక్కడనుంచి ఊర్ధ్వగతి చెందుతూ ఉంటుంది ప్రజ్ఞ. ఉదాన వాయువు ఆధారంగా వ్యాన వాయువు కేంద్రంగా మనం భ్రూమధ్యం చేరి, అక్కడినుంచి ఆజ్ఞని చేరతాం. ఇలా మళ్ళీ తిరుగుదారి ఉంది.

ఈ తిరుగుదారి సాధన అనునిత్యం గంటల తరబడి చేసుకుంటూ ఉండేవాడు మార్కండేయుడు. అలా చేసుకుంటే ఏం జరుగుతుందంటే ఎదో ఒక రోజు నీకు సాధనలో నీ బొడ్డు, నాభి క్రింది భాగంలో... నాభికి రెండు వేళ్ళు క్రింద అంటారు. నాభికి రెండు వేళ్ళు క్రింద అంటే ఎవరి వేళ్ళని ప్రశ్న అడగకండి! మీ వేళ్ళే. ఎంచేత అంటే, ఒక్కొక్కడి వేలు సన్నగా ఉంటుంది. ఇంకోడి వేలు బండగా ఉంటుంది. ఎవడి వేలు ప్రకారం వాడు బొడ్డు క్రింద పెట్టుకుని చూసుకుంటే అక్కడ ఒక కేంద్రం ఉంటుంది. ఈ కేంద్రం దగ్గిరే జీవుడు దేహంతో ముడి వెయ్యబడి ఉంటాడు. అది యోగికి ఏం జరుగుతుందంటే ఈ విధంగా సాధన చేస్తూ, ఊర్ధముఖంగా తాను వ్యాపనం చెంది ఆజ్ఞ యందు అలా చిరకాలం కూర్చోవడం రోజూ సాధన చేస్తుంటే, ఒక రోజున అతడికి ఈ కేంద్రంలో ఒక చప్పుడు వినిపిస్తుంది – టక్ అని. అలా చప్పుడు వినిపిస్తే ఏమిటంటే **hydrogen ballon** ఏ విధంగా దాన్ని క్రింద **base** కి కట్టినది ఊడదీస్తే పైకి వెళ్ళిపోతుందో అలా వచ్చేస్తుంది ఇక్కడ ముడి. ఇక్కడి అపాన వాయువుతో దేహానికి ముడి ఉంటుంది. అపాన వాయువు శరీరంతో సంబంధం ఏర్పరిచి ఉంటుంది. అందుకని, ఈ అపాన వాయువుని శరీరానికి అప్పచెప్పి, ప్రాణ వాయువుని తీసుకుని ఊర్ధ్వముఖంగా వెళ్ళిపోతాడు ఇది తెలిసిన జీవుడు. తెలియని వాడికి మరణం ప్రక్రియ మరో రకంగా జరుగుతుంది. అది బలవంతంగా, బాధ కలిగించేటట్టుగా విడదీయడం ఉంటుంది. అందుకని, ఆ బాధ చాలా ఎక్కువ. ఆ బంధం లేకుండా ఈ సాధన ద్వారా, ఈ ముడి విడదీసుకున్నవాడు, శరీరంలో ఉంటూ, బంధం లేకుండా జీవిస్తూ ఉంటాడండి. శరీరంలోంచి బయటకి కూడా వస్తూ ఉంటాడు. బయటకి వచ్చి, తన్ని తాను దర్శిస్తూ ఉంటాడు. ఇలా సాధన జరుగుతుంది. ఎప్పుడు? రోజూ నిష్ఠగా ఈ విధంగా ఆజ్ఞ యందు ఉన్న ప్రజ్ఞతో అనుసంధానం చెందుతూ ఉంటే. అదీ యోగం. అందుకనే, ఈ లోపలకి వెళ్ళడానికి ముందు ప్రాణాయామము, తర్వాత లోపల ఊర్ధ్వముఖం చెందడం అంటారు. ఇలా ఊర్ధ్వముఖం చెందడాన్నే ప్రత్యాహారము అంటారు.

ప్రత్యాహారము అంటే **absorption** అని అర్థం. అంటే నిన్ను నీలోకి నువ్వు **absorob** చేసుకుంటున్నావు. విచ్చుకుపోయావు కదా అట్లా, పరుచుకుపోయావు, అన్నీ పరిచేసావు. ఈ పరచుకున్న మనసుని తీసుకొచ్చి శ్వాసతో కలిపి, స్పందనంలోకి చేర్చి, స్పందనం ఆధారంగా దాన్ని ఉదాన వాయువు ద్వారా, నువ్వు ఊర్ధ్వముఖంగా వెళ్ళి, అక్కడ అలా ఉండడం బాగా అలవాటు అయిపోతూ ఉంటే, అక్కడే కూర్చుంటూ ఉంటే, నువ్వు చేసే పనులన్నీ కూడా బంధాలు లేని పనులుగా చేసుకుంటూ ఉంటే, ఇంక కర్మ ఏం ఉండదు. నీ వ్యక్తిగత కర్మ అంతా అయిపోతుంది. అంచేత, బయట

obligations ఉండవు. పరహితమే ఉంటుంది. ఇలా బయట జీవనం తయారవుతుంటే, లోపల ఈ విధంగా సాధన జరుగుతుంటే ఎదో ఒక శుభముహుర్తంనాడు అది విడిపోతుంది. విడిపోతే, అందులోనే free గా ఉంటాడు. ఎట్లా ఉంటాడు అంటే, నేను చెప్తూ ఉంటాను కదా, వేరుశనగ పప్పు, వేరుశనగ కాయలో విడిపోయినట్టుగా ఉంటాడు. గుడ్డులో పక్షి తయారయ్యి పగిలినా తన ఉంటుంది కదా! ముందయితే చచ్చిపోతుంది. గుడ్డులో పక్షి తయారవ్వకుండా గుడ్డు కొట్టారనుకోండి, omlette వేసుకుంటే అది చచ్చిపోయినట్టే. దాన్ని చంపి మనం తింటాం, omlette అంటాం. సరే అది వేరే కథ.

గుడ్డు పగలకుండా పిట్ట బయటకొచ్చింది అంటే అదే అర్థం. అట్లాగే ఇది పగలకుండా అది బయటకు రావాలి. ఇది పగిలితే కథ లేదు. పప్పు వేరుశనగ తొక్క నుంచి వేరు కాకుండా మనం దాన్ని ఇలా తీసామనుకోండి, మొత్తం అదీ ఇదీ కలిసిపోయి ఉంటాయి కదా! అంచేత, పప్పు తినడానికి ఏం రాదు. తిన్నా ఏం బావుండదు కదా! అంచేత, ఈ శరీరంలో తాను వేరుగా ఏర్పడతాడు. ఎట్లా ఏర్పడతాడు? ఈ చేసేటటువంటి సాధనలో ఈ ధాతువులన్నీ కూడా నువ్వు చేస్తున్నటువంటి ఈ సంధాన క్రియలో... దాన్నే ప్రార్థన అంటాము మనం మన భాషలో. ధ్యానం అనొచ్చు, ఏదయినా అనొచ్చు, meditation అని style గా ఇంగ్లీషులో అనొచ్చు. ఏది ఏమన్నప్పటికీ కూడా నువ్వు ఆజ్ఞ యందు అలా స్థిరంగా కూర్చుని ఉంటే అక్కడ నువ్వు పొందుతున్న వెలుగు యొక్క సాంగత్యంలో నీలో ఉండేటటువంటి సప్త ధాతువుల్లోంచి ఇంకో ధాతువు ఏర్పడుతుంది. సప్త ధాతువులు నీ నుంచే ఏర్పడ్డాయి. నీ శుక్రం నుంచే నీ మిగతా ఆరు ధాతువులు ఏర్పడతాయి. అన్నిటికన్నా శుక్రం తేజోమంతమైనది. అంతకన్నా తేజోవంతమైన ధాతువు ఈ ఏడు ధాతువుల్లోంచి మళ్ళీ ఏర్పడుతుంది. దాన్నే ఓజస్సు అంటారు. నీవు తేజస్సుని దర్శిస్తూ ఉండడం చేత, నీకు ఆ ఓజస్సు ఏర్పడి, ఓజస్సు అష్టమ ధాతువుగా తయారయ్యి నీ శరీరం అంతా కూడా ఈ ధాతువుతో నిర్మాణం చెయ్యబడి మరొక శరీరం ఏర్పడుతుంది. అలా ఏర్పడడం చేత, ఆ శరీరంలోకి నువ్వు వెళ్ళి, ఈ శరీరంలో ఉంటూ ఉంటావు. అందుకనే, చిన్నప్పుడు మనకి బొమ్మలు ఇచ్చేవారు. ఏమిటి? అలా తీస్తే, అది కూడా మధ్యలోనే తీసేటట్టు ఉంటుంది. తలకాయ తీసేటట్టుగా ఉంటే మిగతావి బయటకి రావు కదా! అది కూడా ఈ నాభి స్థానంలోనే బొమ్మ పైది తీసేస్తే లోపల ఇంకో బొమ్మ ఉంటుంది కదా! మళ్ళీ ఆ బొమ్మని ఇలా తీస్తే లోపల ఇంకో బొమ్మ ఉంటుంది కదా! దాన్ని అలా తీస్తే మళ్ళీ ఇంకో బొమ్మ ఉంటుంది. తెలిసినవాళ్ళయితే మొత్తం నాలుగు బొమ్మల్లు ఏర్పాటు చేస్తారు. ఇంకా బాగా చేద్దామని పదిహేను పెట్టారనుకోండి అట్లా, అది తెలియని వాళ్ళు చేసిన పని. ఇట్లా చేసి ఇచ్చేవారు చిన్నప్పుడు. ఇట్లా తీస్తే ఇంకోటి ఉండేది. ఏమిటర్థం? ఇప్పుడు తెలుస్తుంది. అప్పుడు తెలియదు కదా! ఓహో! మన లోపల ఇంకో మనంగా ఉన్నాము, దాని లోపల మనంగా ఇంకోడు ఉండొచ్చు, దాని లోపల ఇంకొకళ్ళు మనంగా ఉండొచ్చు. ఇట్లా లోలోపల లోలోపల లోలోపల మూడు దేహాలు మనకి ఉండొచ్చని తెలుస్తుంది. అంచేత, ఇలా దానికి ఇదొక్కటే మార్గం. దానికి time లేదు మనకి. కూర్చోవాలి దానికి.

కూర్చుని దాని నిర్మాణం చేసుకుంటూ ఉండడం, రోజంతా పరహిత కార్యాలు చేసుకుంటూ ఇలా ఉండే మార్కండేయుడుకి ఆ విధంగా బయటకొచ్చేసాడు, చూసుకున్నాడు. ఇంక మరి పనులు కూడా అయిపోయినాయి.

ఇంకెందుకు బయటది? అంచేత, ఆ శరీరం... చాలా సార్లు శరీరం వదిలేస్తుంటారు గానీ, ఆయన మార్కండేయుడిగా గుర్తింపబడుతూనే ఉంటాడు. జన్మజన్మల్లో జరిగిన కథంతా ఒక కథగా ఇచ్చేస్తారు. ఒకే శరీరంలో జరిగిన కథ కాదది. అజామయుడు అప్పుడికప్పుడు మోక్షం పొందినట్టుగా చెప్తారు కదా! అప్పటికప్పుడు పొందడు. ఆ జన్మలో "నార" అంటాడు. పిలవడానికి "నారాయణ అనుచో ఆత్మనందున్ పిలవున్" అంటాం కదా! అప్పుడు ఆ శబ్దం వలన ఇంకొంచెం ఉత్తమ జన్మ కలిగి, అక్కడినుంచి ఇంకో ఉత్తమ జన్మ కలిగి, అక్కడి నుంచి ఇంకో ఉత్తమ జన్మ కలిగి, అట్లా సాధన చేసుకుంటూ, కొన్ని జన్మలకి అజాయముడు నారాయణుడు అయినప్పటికీ, ఏ రోజు సాధనలో జరిగాడో ఆ రోజునుంచీ ఆ పేరుతోనే పిలుస్తారు వాడిని. గుర్తుకి అట్లా పెట్టుకుంటారు పేర్లు. చిరంజీవులంతా అంతే. లోకోపకారార్థం రకరకాల దేహాలు ధరిస్తూ ఉంటారు. అయినప్పటికీ ఈ పేరే వాళ్లకి పై లోకాల్లో గుర్తింపుగా ఉంటుంది.

అట్లా మార్కండేయుడు ఆ విధంగా ఆ శరీరాన్ని వదిలేసాడు. ఎప్పుడు వదిలేసాడు ఈ విధంగా? యుగాంతానికి వదిలేసాడు. ఎవరూ తీసేయ్యాల్సిన పరిస్థితి రాలేదు. ఎవరో వచ్చి తీసేసే లోపల మనమే ఆ పని అప్పచేప్పేస్తే అయిపోతుంది. అప్పచెప్పేసాడు. అప్ప చెప్పేస్తే, ఆ యుగాంతానికేముంది అన్నీ వెళ్ళిపోయినాయి లోపలలికి. ఏమీ ఉండవు కదా! ఆయన ఉన్నాడు. ఎట్లా ఉన్నాడు? ప్రజ్ఞా స్వరూపుడిగా, దివ్య దేహంతో ఉన్నాడు. అలా చూస్తుంటే అన్నీ నీళ్ళే, అన్ని పక్కలా నీళ్ళే. తను ఉన్నాడు. అన్నీ నీళ్ళు ఉన్నాయి. అలా తిరుగుతూ ఉంటాడు. తిరుగుతూ ఉంటే ఒకచోట ఒక చిన్న ఆకు మీద, చిన్న బాలుడు నీలం రంగులో అట్లా ఆడుకుంటూ ఉన్నాడటండి. ఆయన వర్ణించినదే మనకి ఈ బొమ్మలు తయారు చేసి ఇస్తుంటారు వటపత్రసాయి అని. ఓ వటపత్రం మీద, ఓ మఱ్ఱి ఆకు మీద ఈ బొటన వేలు అట్లా నోట్లో పెట్టుకుని... అదొక ఆసనం! మనకి ఇప్పుడు పడదు కదా! మీ కాలి బోటని వేలుని మీ నోట్లో పెట్టుకోడానికి ప్రయత్నం చెయ్యండి ఎలా ఉంటుందో? అలా నోట్లో పెట్టుకుని, రెండో చెయ్యి ఇంకెక్కడో పెట్టుకుని అలా కిలాకిలా నవ్వుతున్నాడటండి చిన్నపిల్లవాడిలాగా.

అన్నీ మునిగిపోతే వీడొకడు మిగిలాడేంటి అనిపించిది మార్కండేయుడుకి. అన్నీ మునిగిపోతే, ఈ మఱ్ఱి ఆకేంటి, వీడేంటి అనిపించింది. అనిపిస్తుంది కదా! అంటే, అన్నీ మునిగిపోయినా తను ఉన్నాడు. ఎవరూ లేకుండా తను ఉన్నాడండి. అలాంటి దర్శనం అయ్యింది. అలా ఉండడం చేత, అక్కడ చూస్తుంటే, మనమే కాకుండా ఇంకోడున్నాడు. అది బాగోదు కదా! మనం ఒక్కళ్ళకే first దర్శనం అన్నారనుకోండి. తర్వాత మిగతావాళ్ళందరూ వస్తారు అన్నారనుకోండి. తీరా మనం వెళ్లేసరికి, మనకన్నా ముందు ముగ్గురున్నారనుకోండి ఎట్లా ఉంటుంది? అంచేత, చూడగానే ఆశ్చర్యం వేసింది. వీడేమిటి, పిల్లవాడున్నాడు ఇక్కడ అని. అప్పుడింకా కృష్ణుడు పుట్టలేదు కదండి? మన కృష్ణుడు కథ ఈ మధ్యే కదా మనం చూసాం! ఎప్పటి కృష్ణుడు? కృష్ణుడని తెలియదు. ఎదో కుర్రాడు, పడుకుని ఉన్నాడు. కిలాకిలా నవ్వుతూ ఉన్నాడు. వాడు ప్రళయంలో మునిగిపోలేదు. మాయ కదా! సరే, దగ్గరకి వెళ్ళి చూసాడు. చూస్తే, "వత్సా, మార్కండేయా, బావున్నావా" అని అడిగాడు వాడు. చిన్నపిల్లవాడు మార్కండేయుడిని పట్టుకుని వత్సా అన్నాడండి. వత్సా అంటే వీడికేలా ఉంటుందండి?

ఇప్పుడు ఇక్కడ చిన్నపిల్లలు ఆడుకుంటుంన్నారు కదా! అందులో ఒకడు వచ్చి, ఏరా! కుమార్, ఎట్లా ఉన్నావురా అంటే ఎట్లా ఉంటుంది? అలా పిలిపించుకోవడం మనకి అలవాటు లేదు కదా! ఏ పిలవకూడదా? చెప్పలేం పిలవొచ్చు. ఎవడయినా, ఎప్పుడయినా, ఏదయినా అనొచ్చు. ఇటువంటి విషయాల్లో కొన్నికొన్ని చిన్నపిల్లలోంచి దైవము బాగా పలుకుతూ ఉంటాడు అప్పుడప్పుడూ. ఏం నీకే ఎందుకేసారు దండ, నాకెందుకు వెయ్యలేదని అడిగాడు ఒకసారి. నాకు కూడా వెయ్యమను వాళ్ళచేత అన్నాడు. నీ గుమ్మానికే కట్టారు దండ, నా గుమ్మానికెందుకు కట్టలేదు దండ అని అడిగాడు. ఇప్పుడు అడగడు, పెద్దవాడయిపోయాడు కదా! అంటే, ఇప్పుడు లోకంలోకి వచ్చేసాడు. అప్పుడు లోకంలో లేదు కదా! అలాగే ఇప్పుడు ఎవరో ఒక చిన్నపిల్లవాడు, ఏరా! కుమార్, బావున్నావురా అంటే ఎట్లా ఉంటుంది మనకి?

మార్కండేయుడు అప్పటికే మహర్షి. బోల్డు విజ్ఞానం అన్నీ ఉన్నాయి. పైగా అంతా మునిగిపోయినా మనం ఒక్కళ్ళం తేలుతూ ఉన్నాం. ఓ feeling ఉంటుంది కదండి. అంతటి వాడిని పట్టుకుని ఆ కర్రవెధవ... విశాఖపట్నం వాళ్ళయితే గుంటవెధవ అంటూ ఉంటాము. గుంటడు. ఆ గుంటడు అలా అన్నాడండి. "వత్సా, బావున్నావా" అని. అంటే, ఈయనకి అర్థం కాలేదు. ఎవడు వీడు, నన్ను వత్సా అని పిలుస్తాడేంటి? నేను వీడిని వత్సా అని పిలవాలి కదా! అటునుంచి ఇటయిపోయిందే అనుకున్నాడు. అనుకుని, అటూ ఇటూ చూస్తుంటాడు. ఇంకా ఎవరయినా ఉన్నారేమో అని. ఎవరూ లేరు. ఈయనే ఉన్నాడు. అంతవరకూ సంతోషించాడు. ఇంకో పదిమంది ఉన్నారనుకోండి వెనకాల. మనం ఒక్కళ్ళమే కాదని తెలిస్తే, అప్పుడు కొంత తగ్గుతూ ఉంటుంది. మనం ఒక్కళ్ళమే అనుకుంటే చాలా ఎక్కువుగా ఉంటుంది కదా! ఎవరూ లేరు, ఈయనే ఉన్నాడు. అప్పుడు, మళ్ళీ ఆ పిల్లవాడు పలుకుతాడు. "నాయనా, నిన్నే పిలుస్తున్నానురా" అంటాడు. "రా" అంటే ఎట్లాగండి? అంటే, వస్తాడు. వచ్చిన తర్వాత నోరు తెరుస్తాడు బాలుడు. నోరు తెరిచి బాగా గాలి పీలుస్తాడు. గాలి పీలిస్తే ఆ గాలికి ఈయన లోపలకెళ్ళిపోతాడు. లోపలకెళ్తే, ఏమీ లేవనుకున్నచోట, మళ్ళీ అంతా ఉంటుందక్కడ. ఇందాక లేవనుకున్నాడు కదా! ఇప్పుడు అవన్నీ ఉన్నాయి లోపల. వీడే బయట ఉన్నాడు. మిగతావాళ్ళందరూ లోపల ఉన్నారు. ఇప్పుడు లోపలకెళ్తే కనిపించారు. అందరూ హాయిగా ఉన్నారు. అప్పుడు మళ్ళీ బయటకి నిశ్వాస, వీడొక్కడే వచ్చేటట్టు. మనకి ఏదయినా వస్తే మొత్తం వచ్చేస్తుందండి బయటకి! దోకేమయినా వస్తే మొత్తం వచ్చెయ్యాలి కదా! ఒక్కడిని పంపించేసాడట అంతమందిలో. మిగతావాళ్ళందరినీ ఉంచేసి మార్కండేయుడు బయటకొచ్చేసాడు. లోపల అంతమందిని పెట్టుకుని వీడేంటి ఇంతున్నాడు అని ఆశ్చర్యపోయాడు మార్కండేయుడు. అప్పుడు చెప్పాడు, చూసావా నా మాయ అని. నా మాయని చూస్తునావు కదా! మీరందరూ నా లోపలుండే వాళ్ళే. మళ్ళీ నాలోంచి బయటకొస్తారు. మళ్ళీ లోపలకెళ్తారు, మళ్ళీ బయటకొస్తారు. యుగాల తరబడి ఇదే కథ జరుగుతోంది. నువ్వు చూస్తానన్నావు కాబట్టి నీకు చూపించాను అని చెప్తాడు.

అట్లా చూపిస్తాడండి శ్రీకృష్ణుడు. మనమెరిగిన కృష్ణుడు అప్పటికి లేడు కదా! మరెప్పటి వాడండి ఆ కృష్ణుడు? అందుకనే, "శ్రీకృష్ణ కమలానాథో వాసుదేవః సనాతనః". సనాతనుడు, ఇంక అంతకుముందు ఎవరూ లేరు. అంటే, ఏమిటంటే తత్త్వం. తత్వమే బాలుడిగా ఏర్పడి, ఓ వటపత్రం మీద శయనించి ఉన్నట్టు, అందరినీ అలా తనలో తీసుకున్నట్టు, అందులోంచి తన్ని వదిలేసినట్టు చూపించాడు. అంటే, తత్త్వం కనబడదు కాబట్టి కృష్ణుడు. కృష్ణుడు అనే

పదానికి కనబడనిది అని అర్థం. కృష్ణా అంటే కనబడనిది. కృష్ణా అని పిలవాలంటే అక్కడ విగ్రహం ఉండక్కర్లేదు. ఈ ఏమీ లేనట్టుగా కనబడేదంతా కృష్ణుడే. ఏదయినా ఉన్నట్టుగా కనబడితే అది మాయ. అదీ కృష్ణ తత్త్వం. అది మనం ముట్టుకోకూడదు. ప్రతివాడూ కృష్ణుడిని ముట్టుకుంటాడు, ఆయన ఒప్పుకుంటాడు కాబట్టి. కాని తత్త్వం... మార్కండేయుడు చూస్తాడండి కృష్ణ తత్త్వం. ఓ! ఇది ఏమీ లేదు. ఏమీ లేనిదే అంతా అని తెలుస్తుంది. కాబట్టి, ఆయన మాయలో ఈ ప్రపంచం అంతా ఏర్పడుతూ ఉన్నది. ఈ ఏర్పడుతున్న ప్రపంచంలో ఆయన నిండి ఉన్నాడు. ఈ ప్రపంచం లేకపోయినా ఆయన ఉన్నాడు. ఆయన అందరినీ లోపల పెట్టుకుంటాడు. బయట పడేస్తుంటాడు. "ఒక పరి జగములు వెలినెడి ఒక పరి లోపలి గొనుచు, ఉభయములు తానై సకలార్థ సాక్షియగునై అకలంకుని ఆత్మమూలు అర్థింతున్" అంటాడు గజేంద్రుడు. అంచేత, లోపల పెట్టుకుంటూ ఉంటాడు, బయట పెడతాడు, ఎట్లాగయినా ఆడుతుంటాడు. ఇంత ఆటా ఆడిస్తుంటాడు, మూసేస్తూ ఉంటాడు, ఆడిస్తూ ఉంటాడు, మూసేస్తూ ఉంటాడు.

అంటే, ఒక చదరంగంలాగ నడిపిస్తూ ఉంటాడు. ఒకే చెక్క నుంచి చదరంగం బల్ల తయారు చేస్తారు. ఆ చెక్క నుంచే రాజు, మంత్రి, ఒంటె, గుర్రం, ఎడం పక్క, కుడి పక్క ఏనుగు, ముందు సిపాయులు కదా! ఆ చక్క మీదే ఇరవైనాలుగు గదులు గీసుకుంటారు — ఒక తెల్ల గడి, ఒక నల్ల గడి కదా! ఈ రాజు, మంత్రి, ఒంటె, గుర్రం, ఏనుగు, సిపాయులు తెల్లగా ఉండేవాళ్ళు ఉంటారు, నల్లగా ఉండేవాళ్ళు ఉంటారు కదా! వీళ్ళందరికీ ఏనుగయితే ఇట్లా నడవాలి నిలువుగాను, అడ్డంగాను. ఒంటె అయితే మూలగా నడవాలి. గుర్రం అయితే గెంతుకుంటూ నడవాలి, అది కూడా ఎక్కువ గెంతడానికి లేదు కదా! సిపాయులు పాపం అలా ముందెళ్ళిపోయి, ఒకొక్క గడీ జరుగుతూ ఉంటారు. ఇట్లా rules పెట్టి చదరంగం ఆడేసి, తర్వాత... అన్నీ చెక్క నుంచి తయారు చేసినవనే కదా! ఆ చెక్క నుంచి తయారుచేసినవన్నీ అలా ఏర్పాటు చేసుకుని, ఆట అయ్యిన తర్వాత మొత్తం మళ్ళీ కలిపేస్తాం కదా! కలిపేసిన చదరంగం, అది ఏం చేస్తాము? అది అట్లా మడిచేస్తాము. ఈ చదరంగం చెక్క, బల్ల, ఆ సిపాయులు, ఇంక అందరినీ కలిపేస్తారు అక్కడ. మేము తెల్ల వాళ్ళం, వాళ్ళు నల్లవాళ్ళు అనడానికేమి లేదు కదా! చిన్నపిల్లాళ్ళు ఆడుకున్నప్పుడు అన్నీ కలిపెయ్యరండి? కలిపేసిన తర్వాత ఇవన్నీ కలిపి ఇంకో చెక్క పెట్లో పెట్టేస్తారు. అంతా చెక్కే కదా! అట్లా ఒకే తత్త్వం ఇన్ని రకాలుగా ఏర్పరిచి, ఇన్ని ధర్మాలుగా... ఒంటె ధర్మం ప్రకారం అది అలా వెళ్తూ ఉంటుంది. ఏనుగుకి ఏనుకు ధర్మం. గుర్రానికి ఒక ధర్మం. రాజు బద్ధకస్తుడు, ఒకే గడి కదులుతాడు. సిపాయి, రాజు ఒకే రకం. కాకపోతే, రాజు అన్నిరకాలుగాను జరగగలడు. ఒక గడే కదా! ఎవరండీ ఏర్పరిచారు ఈ rules అన్నీ? రాజు ఎందుకు జరగకూడదు పది గడులు అని అడిగాడనుకోండి కుర్రాడు, నువ్వేం చెప్తావు? జరగకూడదంటావు. గుర్రం ఇట్లాగే ఎందుకు గెంతాలని అడుగుతాడు. అట్లాగే గెంతాలి. ఎందుకు? ఎందుకంటే అది ఆట కాబట్టి. ఇదీ అంతే. అట్లా ప్రతివాళ్లకి ధర్మాలు ఏర్పరిచారు. మానవునికి ఇవి ధర్మములు, జంతువులకి ఇవి ధర్మములు, వృక్షములకి ఇవి ధర్మములు, పదార్థానికి ఇవి ధర్మాములు అని ఉన్నాయి కదా! జలానికి ధర్మం ఉంది, అగ్నికి ధర్మం ఉంది, వాయువుకి ధర్మం ఉంది, ఆకాశానికి ధర్మం ఉంది. అన్నిటికీ! గ్రహగోళాదులకీ ధర్మాలు ఉన్నాయి. అష్టదిక్పాలకులకీ ధర్మాలు ఉన్నాయి. ఈ ధర్మాలన్నీ ఇది ఉన్నంత సేపూ ఉంటాయి. ఎంతసేపు చదరంగం ఆట ఆడుతుంటే అంతసేపు rules ఎట్లా ఉన్నాయో, అట్లా ఉంటాయి. అన్నీ చెక్క నుంచి వచ్చినవే. అది నల్ల రాజయినా, తెల్ల

రాజయినా, రెండూ చెక్కే కదా! అదీ చెక్కతో చేస్తారు, నలుపు రంగు పూసారు, వీడికి తెలుపు రంగు పూసారు. పై పొరల్లో తేడా తప్ప లోపలంతా ఒక్కటే.

అంచేత, మూల వస్తువు, దాన్నుంచి రకరకాలుగా తయారు చేసేటటువంటి ప్రకృతి, ఈ రెండూ తెలుస్తాయి మార్కండేయుడుకి. మూలము, అది ఆధారంగా ప్రకృతి ఏర్పాటు చేసే విన్యాసము, అది తెలిసింది. ప్రకృతి, పురుషుడిని ఇద్దరినీ కూడా రెండు కళ్ళతో చూస్తూ మూడో కన్నుతో దానికి అతీతమైన తత్వంతో అనుసంధానం చెంది ఉండడం నేర్చుకున్నాడు. మూడు కళ్ళు కదా! ఒక కన్నుతో ప్రకృతిని, ఒక కన్నుతో పురుషుడిని, మరొక కన్నుతో ప్రకృతి–పురుషులకి ఆధారమైనటువంటి తత్త్వము. దాన్నుంచి ముందేమొచ్చింది అన్న ప్రశ్న లేదు. రెండూ ఒకసారే వస్తాయి. ఆ రహస్యం తెలియాలంటే లలితా సహస్రనామాలు బాగా అర్థం చేసుకోవాలి. ముందు అయ్యవారొచ్చి, అయ్యవారిలోంచి అమ్మవారు వచ్చిందని చెప్తే అది శుద్ధ తప్పు. వస్తే ఇద్దరూ వస్తారు. వెళ్ళిపోతే ఇద్దరూ వెళ్ళిపోతారు లోపలకి. దిగడమే రెండుగా దిగుతాయి. ఒకటుంటుంది, రెండోది దాని చుట్టూ అల్లేస్తూ ఉంటుంది. ఒకటి ఉండడం దాని సహజమైనటువంటి స్థితి. పురుషుడు ఉంటాడు. అంతటా వ్యాప్తి చెందుతూ ఉంటాడు. దాని చుట్టూ ప్రకృతి రకరకాల లోకాలు అల్లుతూ ఉంటుంది. ఆ లోకాలని బట్టి అక్కడుండేటటువంటి పురుష ప్రజ్ఞ అట్లా కనిపిస్తూ ఉంటుంది. పురుషుడికి బంధం లేదు. ప్రకృతి బంధమే పురుషుడిని అల్లుకుంటూ ఉంటుంది. పురుషుడు ఆధారంగా అల్లుతూ ఉంటుంది అంతా. చూడండి మల్లెపందిరి ఎట్లా అల్లుతారు. పందిరి ఆధారంగా మల్లె తీగ అట్లా పాకి రకరకాలుగా ఏర్పడుతూ ఉంటుంది కదా! పాకేదంతా ప్రకృతే. ఉండేది పురుషుడు. ఉండేది రాట. దాన్నల్లుకుంటూ, అట్లా పెరుగుతూ ఉంటుంది కదా తీగ! పాతిన రాట పెరగదు కదా! అందుకని, అసలు తత్వానికి పెరుగుదల లేదు, తరుగుదల లేదు. ఎప్పుడూ ఉండేది అది. దాంట్లో పెరగడం, తగ్గడం, ఉండడం, లేకపోవడం ఇలాంటివన్నీ ఆడించేది ప్రకృతి. వేరే ఒకటి ఉన్నట్టుగా ఏర్పడడం ఏం లేదు, ఒకటే ఉంది. దాంట్లోంచి ఇది ఇలా అల్లుతూ ఉంటుంది. రెండూ కలిపితే ఒకటే సత్యం.

ఇలాంటి దర్శనాలన్నీ రకరకాలుగా బోల్డు అయిపోయినాయి మార్కండేయుడికి. అయిపోయిన తర్వాత, ఎలాగూ తను కావాలంటే దేహం తీసుకోవచ్చు, అక్కర్లేదంటే వదిలేస్తూ ఉండొచ్చు. అట్లా ఉండిపోయాడండి అప్పటి నుంచి ఇప్పటివరకూ. ఇంకా ఉన్నాడు. ఎప్పటినుంచో మొదలయ్యిన కథ ఇప్పటికి కూడా ఉంది. ఆ మహర్షి ఇంకా ఉన్నారు. ఉండడమే కాదు, కోరిన వారికి ఈ విధమైనటువంటి జ్ఞానాన్ని అందించగలినటువంటి ఒక దృక్పథంతో ఒక ఉన్ముఖత్వంతో ఉన్నారు. అంచేత, ఆయన చరిత్ర మనం చెప్పుకోవడం అనేటటువంటిది కూడా ఆయన అనుగ్రహంగా భావించాలి. మరొక విధంగా, special గా చెప్పించుకున్నట్టే కదా! తనకి తానుగా చెప్పించుకున్నట్టే కదా! అంచేత, మనకి ఇవన్నీ పుస్తకాల్లో ఇంత ఉండదు. ఎదో ఉంటాయి. ఇలా ఎందుకు చెప్తున్నానంటే నేను, ఒక మహర్షి ఎప్పుడూ నిత్యనూతనుడిగా ఉంటాడు. శరీరధారణ చేసి ఉంటారు మహర్షులంతా గుర్తుపెట్టుకోండి. వెలుగు శరీరాలతో ఎక్కడో ఉన్నారనుకోబోకండి. సర్వమూ తన ప్రజ్ఞ కలిగి, స్మరణ మాత్రము చేత తన సన్నిధి ఇచ్చేటట్టుగా ఉంటారు, ఒకటి. రెండు, ఈ భౌతిక శరీరాల్లో కూడా వాళ్ళు ఉన్నారు. అలా ఉన్నచోట వాళ్ళెవరో తెలియదు. ఈయన మార్కండేయుడు అని తెలియదు. మార్కండేయుడిగా దర్శనం ఇచ్చేటటువంటి వారికి ఆయన ఎక్కడున్నారో తెలియదు. ఎందుకంటే,

మార్కండేయుడని తెలిస్తే రోజూ వెళ్ళి distrub చేస్తాం కదా! అందుకని, ఎక్కడుంటాడో చెప్పడు. తాను మార్కండేయుడిగా తెలిసినటువంటి వారికి తాను ఎక్కడుంటాడో తెలియపరచడు. తాను ఉన్నచోట తాను మార్కండేయుడని ఆ చుట్టుప్రక్కల ఎవరికీ తెలియదు. అట్లా ఉన్నాడు. అది ఒక సౌకర్యం వాళ్ళకి. మన్ని ఏడిపిద్దామని కాదు! మనకి సహాయపడుతూ, మన చేత ఇబ్బంది పడకుండా ఉంటారు. అట్లా చిరంజీవులందరూ ఉన్నారు. అలా ఎంతోమంది చిరంజీవులు మన భూమి మీద ఉండబట్టి మనకి ఎప్పటికప్పుడు వారి యొక్క స్మరణచేత వారి యొక్క అనుగ్రహం, సాన్నిధ్యం లభించడం, వారి కథలు చదువుకోవడం చేత మనలో కొంత కల్మషం హరింపబడడం, మనకి నూతమైన ఒక ఉత్సాహం కలగడం, ఒక ప్రేరణ లభించడం, మనం కూడా వారి వల్లే సాధన చెయ్యడానికి వారి యొక్క ఆశీర్వచనం అందుకుని, ఆ మార్గంలో పయనించడానికి ప్రయత్నం చెయ్యడం, ఇలాంటివన్నీ జరగడానికి వాళ్ళందరూ మనకి ఉపయుక్తమై ఉన్నారు, వినియోగపడుతూ ఉన్నారు. భూమి మీదే ఉన్నారు. వాళ్ళు ఏ లోకంలోనైనా ఉండగలిగినవాళ్ళు, అయినప్పటికీ కూడా భూమి మీద ఉన్నారండి మహర్షులు. ఎక్కడ వాళ్ళ యొక్క త్యాగం ఉందంటే, ఎక్కడ వారి యొక్క అనుగ్రహం ఉందంటే, వారు వేరే వెలుగు లోకాల్లో ఎక్కడయినా ఉండగలరు, సత్యలోకంలో ఉండగలరు. హాయిగా సత్యలోకంలో ఉండొచ్చు కదయ్యా అంటే, మా వాళ్ళ సంగతేం చెయ్యమంటావు అంటారు. ఎందుచేత? భగవంతుడే అంతటా వ్యాప్తి చెంది ఉన్నప్పుడు, నాకు వేరే ఇక్కడుంటాను, అక్కడుంటాను అని reservations ఎందుకు? అంచేత, నేను ఏదో ఇక్కడుండి, ఈ విషయం తెలుసుకుందామనే ఆసక్తి కలిగిన వారి కోసం నేను ఇక్కడ జీవిస్తూ ఉంటానులెండి, ఫరవాలేదు, ఎక్కడుంటే మాత్రం మీతో అనుసంధానం ఉందిగా అనుకుంటారు! అలా ఉన్నారు సప్తఋషులందరూ, అలా ఉన్నాడు మార్కండేయుడు, అలా ఉన్నాడు ఆంజనేయుడు, అలా ఉన్నాడు గణపతి. వీళ్ళందరూ ఈ భూమి మీద అలా ఉన్నారండి. ఎప్పుడొచ్చారో!

ఈ యుగంలో, ఈ కల్పంలో, ఇలా చిరంజీవిగా యుగయుగముల నుండీ ఉన్నటువంటి మార్కండేయుడిని దర్శించేటువంటి అదృష్టం ధర్మరాజుకి పడుతుంది. రాముడు దర్శించాడు మార్కండేయుడిని వనాలకి వెళ్ళినప్పుడు. రాముడితో మార్కండేయుడు సంభాషణ జరుగుతుంది. ధర్మరాజు దర్శించాడు. ఎన్నో విధమైనటువంటి విషయములు మార్కండేయుడి ద్వారా ధర్మరాజు తెలుసుకుంటాడు. మార్కండేయుడిని ధర్మరాజు దర్శించినప్పుడు అదే సమయంలో కృష్ణుడు అక్కడికి వస్తాడు. పిలవని పేరటంగా కృష్ణుడు మార్కండేయుడి దగ్గరకి వస్తాడు. ఎలా ఉంటుంది మార్కండేయుడికి? అంటే, ఎప్పటి కృష్ణ దర్శనం? మళ్ళీ ఇప్పుడు కృష్ణ దర్శనం. అట్లా కృష్ణుడు ఎప్పుడొస్తాడో తెలియదు, ఎందుకొస్తాడో తెలియదు. వచ్చి, ఈ ధర్మరాజుకి ఏం చెప్పాలో మార్కండేయుడికి చెప్పి వెళ్ళిపోతాడు. అంటే, ప్రస్తుతం జీవన ప్రయోజానికి ఏం పనికొస్తుందో అదే చెప్పాలి. అక్కర్లేనివన్నీ చెప్తే పెడదారి పట్టేస్తుంది కదా! అంచేత, ధర్మరాజుకి ఏం చెప్పాలో మార్కండేయుడికి చెప్పేసి వెళ్ళిపోతే, ఈ కృష్ణుడు ఇప్పటివాడు కాదు అంటాడు మార్కండేయుడు. వాళ్ళూ చూస్తారుగా కృష్ణుడిని. వాళ్ళకి కృష్ణుడంటే ఏముంది? వాళ్ళ అత్తయ్య కొడుకు కదా! అంతకన్నా ఏముంది? వాళ్ళ అత్తయ్య కొడుకు, వాడికేదో కొన్ని విద్యలు వచ్చు అని అనుకుంటూ ఉంటారు. అప్పుడప్పుడూ కొంచెం doubt వస్తుంది, పోనీ ఏమయినా దేవుడేమో అని. పెద్ద ఎక్కువగా పట్టించుకున్నదేమీ లేదు పాండవులు. తర్వాత, తర్వాత ఎక్కువ తెలిసింది.

అంచేత, కృష్ణుడు వస్తే మార్కండేయుడు చెప్తాడు, ఈ కృష్ణుడు ఇప్పటి వాడు కాదు, ఈయన ఎప్పటివాడో. కృష్ణుడికి పుట్టుక లేదు. అలాంటి వాడు అన్నీ మునిగిపోయినప్పుడు నాకిలా దర్శనం ఇచ్చాడు, వాడే వీడు అని చెప్తే, అప్పుడు కొంచెం ధర్మరాజుకి, మిగతా నలుగురు brothers కి కొంచెం ఒకరవ్వ వెలుగుతుంది. ఎదో చిన్నచిన్నగా వెలిగింది, పెద్ద గొప్పగా ఏం వెలగలేదు. ఉన్నవాళ్ళలో ధర్మరాజుకి కొంచెం బాగా అందించుకున్నవాడు కృష్ణ తత్వాన్ని. అంటీ అంటనట్టుగా అర్జునుడు నడిపించాడు. పేరు బాగా సంపాదించాడు. ఆయనకి పేరు రావడానికి కేవలం కృష్ణుడే కారణం, కృష్ణుడికి ఆయన యందు వాత్సల్యం ఉండడం చేత. సొంతగా అంత పెద్ద ధర్మరాజుకన్నా పరిపక్వత ఉన్నట్టుగా అనిపించదు కథలు చదువుకుంటే. ఏమిటిరా! నా గురించి అట్లా మాట్లాడుతున్నావు అనకుండా అర్జునుడు, అలా రాసారు నీ గురించి అని చెప్తున్నాను!

అంచేత, ఎప్పటి కృష్ణుడు? అప్పుడు చెప్తాడు ధర్మరాజుకి, ఎదో మీ అత్తయ్య కొడుకు, ఇట్లా పిచ్చిపిచ్చి ఆలోచనలు తీసెయ్యి. అతడు సనాతనుడు. మీరు ఇంకా చదువుకుందామనుకుంటే మార్కండేయుడు ధర్మారాజుకి చేసిన బోధంతా కూడా అరణ్యపర్వంలో కనిపిస్తుంది, చదువుకోండి, ఒకటి. రెండోది, మార్కండేయ పురాణము. ఈ మార్కండేయ పురాణం ఎలా వచ్చిందంటే జైమిని అనే మహర్షి వేదవ్యాసుని శిష్యుడు. మార్కండేయుడి శిష్యులు పక్షుల రూపంలో ఉంటారండి కొంతమంది. వాళ్ళు ఈ జైమినికి తత్వ రహస్యం అంతా బోధిస్తారు. సృష్టి పరిజ్ఞానము – దైవము, ఆ దైవము అనేటటువంటి తత్త్వము సృష్టికి అతీతంగా ఎలా ఉంటుంది, సృష్టిలో ఎలా ఉంటుంది, ఉన్నది దైవమే, ఇతరమంతా మాయ, ఇలా చాలా విషయాలు తెలియపరుస్తారు. ఎందుకని జైమిని వీళ్ళ దగ్గర తెలుసుకోవాల్సి వచ్చిందంటే, వేదవ్యాసుడు దగ్గర సమస్త విద్యలూ నేర్చుకున్న జైమినికి, ఆయన దగ్గర అంతా విన్న తర్వాత ఒకే అవగాహన మిగులుతుంది. అదేమిటో విచిత్రం. ఈ కార్యకారణ సంబంధంగా సృష్టి అంతా నడుస్తోంది తప్ప ప్రత్యేకంగా దేవుడంటూ ఎవడూ లేడని ఒక సిద్ధాంతానికి వచ్చేస్తాడు జైమిని. ఒక్కొక్కడికి ఒక్కో వికారం వస్తూ ఉంటుంది మరీ చదువుకున్న తర్వాత, తెలుసుకున్న తర్వాత. సద్గురువులు దగ్గర చాలా కాలం ఉన్న తర్వాత వారి వారి జీవ లక్షణం ప్రకారం అట్లా వస్తూ ఉంటుంది కొంతమందికి. వచ్చి, ఈ వ్యాసుని శిష్యులకే, దైవమంటూ ఏం లేదు, మనం చేసే పనులబట్టే, బాగా చేస్తే బావుంటుంది, బాగా చెయ్యకపోతే బావుండదు, ఇంక ఇంతకన్నా దేవుడు, అవన్నీ లేవు అని ఒక వితండవాదం. అలా పెట్టుకుంటూ ఉంటే, వ్యాసుడికి చాలా బాధ కలుగుతుంది. వీడేమిటి ఇట్లా తయారయ్యాడని. అంటే, ఒక గురువుగారి దగ్గర చాలా కాలం అన్ని విద్యలూ నేర్చుకుని, వికారంగా ఒకడు తయారయ్యాడనుకోండి, ఎట్లా ఉంటుంది గురువుగారికి? వీడేమిటిరా ఇట్లా అయిపోయాడని అనిపిస్తుంది. మిగతా శిష్యులకి అనిపిస్తుంది ఏమిటి ఇట్లా అయిపోయాడు అని. బాధ పడతారు. బాధ పడితే ఒక రోజు వేదవ్యాసునితోనే కర్మ సిద్ధాంతము, దైవము, ఎదో ఏర్పాటు మనకి ఒక comfort అన్నట్టుగా మాట్లాడేడండి. మతం అనేది must అని Carl Marx అన్నట్టుగా. అట్లా ఈ దైవమనేటటువంటిది ఏర్పాటు చేసుకున్నారు వినయంగా పడి ఉండడానికిఅంటాడు జైమిని వ్యాసుడితో. ఏవో పెట్టాడు సిద్ధాంతాలు. చదువుకోవచ్చు తర్వాత కావాలంటే. అలా పెడితే, ఈ జైమిని సిద్ధాంతం ప్రపంచానికి చాలా హానికరం, పైగా వీడు నా శిష్యుడు అనుకుంటాడు వ్యాసుడు. అది చూడండి! ఎవరయితే సమస్తము భగవంతుడేనని పురాణాలు రాసి,

భగవద్గీత రాసి, వేదాలని సంస్కరించి, నానాబాధా పడ్డాడో, వాడి దగ్గర ఒకడు ఇలా తయారయ్యాడు అహంకారం వల్ల. తయారయితే, వ్యాసుడన్నాడు, నా ముఖం ఇహ నీకు చూపించను, వెళ్ళిపోమంటాడు జైమినిని. వెళ్ళిపోమంటే, జైమిని వెళ్ళిపోతాడు. వాడికేం పెద్ద నష్టంగా feel అవ్వలేదు. కర్మజ్ఞానం కదా! అంటే, వాళ్ళకి నచ్చలేదు మనం ఇట్లా మాట్లాడితే, వెళ్ళిపోమ్మన్నారు అనుకున్నాడు. అక్కడినుంచి వెళ్ళిపోయాడండి. కొన్నాళ్ళు బానే ఉంటుంది. ఎందుకంటే మన నిర్ణయం మనకి బానే ఉందనిపిస్తుంది కదా! కొన్నాళ్ళు పోయిన తర్వాత నెమ్మదిగా లోపల నుంచి ఏమిటి ఇలా చేసుకున్నాము మన గురువుగారితో అనిపిస్తుంది. ఎంత చెప్పినా ఆయన వాత్సల్యం వేరు కదా! ఆయన చూపించిన అనుగ్రహం వేరు. ఆయన వీడి మీద ఎంతో ప్రేమతో, ఎన్నో విధాలుగా ఎలాంటి ఉపకారాలు చేసిపెట్టాడో గుర్తు వస్తుంటే, గురువుగారు బాగా గుర్తు వచ్చేస్తారు. చూడడానికి వీలు లేదు కదా! చూడాలని ఉంది, చూస్తే ఏమవుతుందో అని. చూడనన్నాడు కదా! అలా అనుకుంటూ తిరుగుతూ ఉంటాడు. తిరుగుతుంటే ఎవరో చెప్తారు మార్కండేయ మహర్షి దగ్గరకి వెళ్ళు అని. ఆయనకు నీకుండేటటువంటి అపరికత్వతను పరిపూర్ణం చేస్తాడు అని. అంచేత, మార్కండేయ మహర్షి దగ్గరకు వెళ్తాడండి జైమిని. మార్కండేయుడి దగ్గరకి వెళ్తే, మార్కండేయుడు చూస్తాడు. నాకిప్పుడు వేరే పనులున్నాయి. నేను వేరే పని మీద ఉన్నాను. ఫలానా చోట కొన్ని పక్షులు ఉన్నాయి. వాటిని నువ్వు అడిగితే, నీవు అడిగిన వాటికన్నీ అవి తీరికగా సమాధానం చెప్తాయి. ఎందుకంటే, ఇప్పుడు కూర్చుని వీడితో తర్కంలో దిగడం ఇష్టం లేదాయనకి. ఒకసారి తత్వజ్ఞానం కలిగినటువంటి వాడికి ఈ తర్కంలో ఉండిపోయే వాడితో మాట్లాడడానికి అంత మనస్కరించదు. ఎందుకంటే, ఒకటి చెప్తే, ఇంకోటి అడుగుతాడు. ఇంకోటి చెప్తే, ఇంకోటి అడుగుతాడు. అడుగుతూనే ఉంటాడు. ప్రశ్న అడిగేవాడికి ఎప్పటికీ తెమలదు. కొంచెం సమయం అవుతోంది, ఫరవాలేదు, మంచి విషయం కదా! అలా ప్రశ్నలు ఉంటూనే ఉంటాయి కదా! మనసులో ఏవో ప్రశ్నలు ఉంటాయి.

అందుకనే బుద్ధుడు దగ్గరకి ఎవరయినా వెళ్తే ప్రశ్నలతో, కూర్చో అనేవాడు. రెండేళ్ళు మౌనంగా ఉంటే నా దగ్గర, ఆ తర్వాత నువ్వు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్తానంటాడు. ఒకడు వెళ్తాడు. అన్నీ ప్రశ్నలే. మహా మేధస్సు. దాన్నిండా ప్రశ్నలే. చూస్తాడు బుద్ధుడు. వీడితో మనకి time waste అనుకున్నాడు. ఎందుకంటే, ఒకటి చెప్తే ఇంకోటి అడుగుతాడు. అది చెప్తే ఇంకోటి అడుగుతాడు. అది చెప్తే ఇంకోటి అడుగుతాడు. ఇంక ఆ మేధస్సుకి అంతు లేదు, పిచ్చి జ్ఞానం అంతా. అంచేత, బుద్ధుడు ఏమన్నాడంటే వెళ్ళంగానే, నీ ప్రశ్నలన్నిటికీ రెండేళ్ళ తర్వాత సమాధానం చెప్తాను. ఈ రెండేళ్ళు నువ్వు ఇక్కడ కూర్చో. ఇక్కడే ఉండు, నా పరిసరాల్లో ఉండు, ఈ సంఘంలోనే ఉండు, మౌనంగా ఉండు, కళ్ళు మూసుకో, కూర్చో, తిను, పడుకో, మిగతా time లో కళ్ళు మూసుకుని కూర్చో, మాట్లాడకు. అని చెప్తుంటే అక్కడ ఇంకో శిష్యుడు నవ్వుతాడు పకపకా. నవ్వితే వీడు చూస్తాడు. బుద్ధుడేం మాట్లాడడు. సరే, బుద్ధుడితో interview అయిపోతుంది. వాడి దగ్గరకి వెళ్తాడు. మరి నవ్వాడు కదా! ఎందుకురా అట్లా నవ్వావు అంటే, నీ senior ని నేను, నేనూ ఇలానే వచ్చాను ఆయన దగ్గరకి. నన్ను కూడా కూర్చో పెట్టాడు రెండేళ్ళు. రెండేళ్ళయిన తర్వాత ప్రశ్నలు లేవు నాకు అని చెప్పాడు. ప్రశ్నలేం లేవు, మౌనంగానే అంతా చెప్పేసాడు బుద్ధుడు. నా మౌనంలోనే నాకు అన్ని సమాధానాలు వచ్చేసాయి, ఇంక ప్రశ్నలు అన్నీ అయిపోయాయిరా, నీకు కూడా అదే dose వేసాడాయన అని చెప్పాడు. Same dose! కూర్చో, మాట్లాడక, నేను

నీకు proof అని చెప్పాడు. కావాలంటే చూడు అని చెప్పాడు. వాడు కూడా ఇంకొంచెం ఎక్కువ ఆసక్తితో అనుకుంటాడు, చూద్దాం ఎలా అవుతుందో అని. వాడికీ అయిపోయింది. వాడే ఈ కథ చెప్పాడు బయటకొచ్చి. మౌనంగా కూర్చుంటే అయిపోతుంది, అన్ని సమాధానాలు అంతరాత్మ నుంచి వచ్చేస్తాయి. మనం అదృష్టం కొద్దీ పది నిమిషాలకు మించి కూర్చోము కదా! ప్రశ్నలు ఉండిపోతాయి. అలా సంవత్సరాల తరబడి కూర్చున్న వాడికి అన్ని ప్రశ్నలూ పోతాయండి. ఏమీ ప్రశ్న ఉండదు.

అట్లా ఈ జైమిని వచ్చినప్పుడు చూసాడు మార్కండేయుడు, ఓరి బాబోయ్! వీడితో ఇప్పుడు మనకి... ఈయనకి ఇంకా వేరే కార్యక్రమాలు ఉన్నాయి అప్పుడు. ఆ time లో వెళ్ళాడు. సార్, మీతో కూర్చోవాలండి పది నిమిషాలు అని ఎవడన్నా వచ్చి అంటే, బుద్ధిమంతుడేం చేస్తాడంటే, మళ్ళీ కలుద్దాం అంటాడు. వాడు మళ్ళీ ఎలాగూ రాడు. మార్కండేయుడు ఏం చెప్పాడంటే అక్కడ ఉన్నాయి పక్షులు, వాటికన్నీ తెలుసు, వాటికి తెలియనిదేం లేదు, చాలా గొప్పవి అని. నీకుండేటటువంటి ప్రశ్నలన్నీ నాకు తెలుసు, కానీ వాళ్ళని అడగమంటాడు. అంటే జైమిని వెళ్తాడు. వెళ్ళి ఆ పక్షుల దగ్గర కూర్చుంటే, ఆ పక్షి సమూహాలు వీడు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్తాయి. ఆ తత్వవాదం అంతా ఒక పురాణంగా ఏర్పడిందండి. అదే మార్కండేయ పురాణం. ఆ పక్షులు చిట్టచివరికి ఏం చెప్తాయో తెలుసా? ఇంతకీ ఇంత జ్ఞానం మీరు ఎలా సంపాదించారు అని అడుగుతాడు జైమిని. అడిగితే అప్పుడు చెప్తాయి, మార్కండేయ మహర్షి మా గురువుగారు, ఆయనిచ్చిన జ్ఞానం ఇది. అంచేత, మేము ఈ విధంగా ఇక్కడ అజ్ఞాతంగా, దైవంతో అనుసంధానం చెంది ఉన్నాము అని తెలిపి, దైవం ఎలా ఉన్నాడో, ఆ జైమిని మహర్షికి అర్థమయ్యేటట్టు తెలియపరుస్తాయి. కాని మార్కండేయ మహర్షి వాళ్ళు నా శిష్యులు అని చెప్పడు. అది తమాషా. వాళ్ళు చెప్తారు. ఎందుచేతంటే, ఈయన శిష్యుల దగ్గిరకి పంపించాడు నన్ను అనుకుంటాడు. అసలే ego లో ఉన్నాడు కదా! వీడినడిగితే వీడి శిష్యుడి దగ్గరకి పంపించాడు అనుకోకుండా. వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు చెప్పకుండా పంపిస్తే, వాళ్ళు చెప్పిన తర్వాత ఈయనకి పరిష్కారం వచ్చిన తర్వాత అప్పుడు చెప్తారు వాళ్ళు, ఆయనే నిన్ను పంపించాడు మా దగ్గరికి, మాకు తెలుసు అని. మాకంతకు ముందే శాసనం అయ్యింది, నీకు చెప్పమని, అందుకని చెప్తున్నాము అని అంటారు. అది మార్కండేయ పురాణంగా వచ్చింది. మనకి time లేదుగాని, లేకపోతే ఇవన్నీ చదువుకోవచ్చు. బావుంటాయి.

ఈ background మీద మరి భారతంలో వనపర్వంలో... అది వనపర్వం అని ఎందుకన్నారంటే అరణ్యం అంటే మృగాలు ఉండేది. తేళ్లు ఉంటాయి కదా, పాములుంటాయి కదా, తోడేళ్ళు ఉంటాయి కదా అని భావించేవాడికి అది అరణ్యం. అక్కడ ఋషులుంటారు కదా అనుకుంటే అది వనం అయ్యింది. ఇప్పుడు రాముడికి అది వనమే. అమ్మవారికి అది వనం. లక్ష్మణుడికి అది వనం అవుతుంది. ధర్మరాజు ప్రవేశించినది అరణ్యంలోకి, కనిపించింది వనం. అంచేత, అది వనపర్వమా, అరణ్యపర్వమా అని పోట్లాడుకుంటూ ఉంటారు సరదాకి. నీ దృష్టినిబట్టి అది వనం అవుతుంది. లేకపోతే అది అరణ్యం అవుతుంది. అంచేత, ఈ వనపర్వంలో... మీకు కొన్ని పుస్తకాల్లో వనపర్వం అని పెడతారు, కొన్ని పుస్తకాల్లో అరణ్యపర్వం అని పెడతారు. ఈ వనపర్వంలో ఈ కథ ఉన్నది – ఏది, ధర్మరాజు మార్కండేయుడితో చేసినటువంటి ప్రసంగములు, లేక సంవాదములు – ఈయన అడగడం, ఆయన చెప్పడం. అలాగే మార్కండేయ మహర్షి ఇచ్చిన

బోధంతా కూడా అతని శిష్యుల ద్వారా జైమినికి చెప్పబడింది. అది మార్కండేయ పురాణంగా ఉంది. ఈ రెండు పుస్తకాలు చదువుకోవచ్చు. బావుంటాయి.

ఈ విధంగా మనం ఈ గురుపూర్ణిమ సందర్భంగా ఒక మహాత్ముని యొక్క చరితము, అంటే ఎలా జీవించాడు, ఎలా వర్తించాడు, ఏ విధమైనటువంటి వికాసాన్ని మనందరికీ కలిగించడానికి ఆయన జీవితం శాశ్వతంగా వినియోగపడుతుంది అనేటటువంటి విషయములు గురుసాన్నిధ్యంలో మనం ప్రవచనంగా చెప్పుకున్నాము. అటుపైన ఎవరెవరి స్ఫూర్తినిబట్టి, ఎవరెవరికుండే ఆకలినిబట్టి, రుచినిబట్టి వారు వారు దీన్ని గూర్చి, ఈ మూడు రోజుల ప్రవచనముల విషయముల గూర్చి, వాటి సాధనలను గూర్చి, మీమీ యొక్క ఆసక్తినిబట్టి నిర్వర్తించుకుందురుగాక. అందరికీ ఈ సంవత్సరాంతము మళ్ళీ గురుపూర్ణిమలో కలిసేంతవరకూ సద్గురువు చక్కని రక్షణను కల్పించి, మార్గం నుంచి మీరు అటూ ఇటూ పరిగెత్తకుండా అందులోనే ఉండేటట్టుగా యమించి, రక్షించాలనేటటువంటి భావన చేస్తూ, ఈ ప్రవచనాన్ని పరిపూర్ణం చేస్తున్నాను.

––– స్వస్తి